# వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సంపుటి : 7 సంచిక : 9 హైదరాబాద్ 98 సెప్టెంబర్ 2009 పేజీలు : 60 రు. 10

- ఫోకస్ : మహిళా ఉద్యోగుల సమస్యలు
- సహకార సేద్యం ఎవరికోసం?
- ఖైదీల విడుదలలో జాప్యం
- ఓపెన్‌కాస్ట్ - బంగ్లాదేశ్ అనుభవం
- పేదరిక నిర్మూలనపై ప్రపంచబ్యాంక్
- చూపున్న బిమల్‌రాయ్ సినిమాలు

## వీక్షణంకు మీరు చందాదారులు కారా?
## మీ కాపీ మీరు బైట పత్రికల దుకాణంలో కొనుక్కుంటారా?

# ఐతే ఈ విజ్ఞప్తి మీకే!

*వీక్షణం పాఠకులలో సగం మంది చందాదారులు కాగా, మిగిలిన సగం మంది ప్రతి నెలా తమ వీక్షణం కాపీని బైట పుస్తకాల దుకాణంలో కొనుక్కుంటుంటారు. అలా వీక్షణం కాపీలను రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేసే ఏజన్సీ ఎప్పటికప్పుడు పద్ధతి ప్రకారం అమ్మకాలు - మిగులు కాపీల లెక్కలు చెప్పకుండా ఉండడంతో, సరిగ్గా బిల్లులు చెల్లించకపోవడంతో, అమ్మకాల బకాయిలు పేరుకుపోతూ ఉన్నాయి. వీక్షణం నష్టాలు పెరిగిపోతున్నాయి. క్రమం తప్పకుండా పాఠకులకు వీక్షణాన్ని అందించాలనే మా ఆకాంక్ష వల్ల ఆ ఏజెన్సీకే కాపీలు అందిస్తూ, బకాయిలు ఇంకా ఇంకా పెంచుకుంటూ పోవడం జరుగుతున్నది. ఇది ఇలా ఎక్కువ కాలం సాగే అవకాశం లేదు గనుక ఏ నెల అయినా వీక్షణం మీరు కొనుక్కునే దుకాణానికి చేరకపోవచ్చు. వీక్షణం మీ అభిమానాన్ని చూరగొన్నదనీ, మీరు వీక్షణం క్రమం తప్పకుండా చదవదలచుకున్నారనీ మాకు తెలుసు. కాని వేలాది రూపాయల నష్టాన్ని భరిస్తూ ఏజెన్సీని కొనసాగించడం మాకు ఆర్థికంగా భారమవుతోంది.*

ఈ పరిస్థితి నుంచి బయటపడడానికి, వీక్షణంను క్రమం తప్పకుండా పొందడానికి

- ❖ మీరు స్వయంగా చందాదారుగా చేరవచ్చు. ప్రతినెలా ఒకటో తేదీకల్లా వీక్షణం నేరుగా మీ ఇంటికి చేరుతుంది!
- ❖ మీ పట్టణంలో / గ్రామంలో నమ్మకస్తులయిన పత్రికల దుకాణదారులను ఏజెంట్లుగా చేర్చి, వారు అమ్మకాల బిల్లులు సక్రమంగా చెల్లిస్తున్నారా లేదా కనుక్కుంటూ సహాయ పడవచ్చు!!

**వీక్షణం మీ పత్రిక, వీక్షణం ప్రజల పత్రిక!**

**వీక్షణం పదికాలాలపాటు నిలబడేలా చూడవలసిన బాధ్యత మీదే!!**

ప్రతులకు, వివరాలకు:

**వీక్షణం**

మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3 హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495,
ఇమెయిల్ : veekshanam2003@gmail.com, reachcdrc@yahoo.com
సర్క్యులేషన్ మేనేజర్ : 9949391028

# వీక్షణం 98

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సెప్టెంబర్ 2009
సంపుటి : 7
సంచిక : 9

సమతా పబ్లికేషన్స్, సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రిసర్చ్ అండ్ కమ్యూనికేషన్ ప్రచురణ





**వీక్షణం చందా వివరాలు**

| | |
|---|---|
| సంవత్సర చందా | రు. 120 |
| 3 సంవత్సరాల చందా | రు. 350 |
| 5 సంవత్సరాల చందా | రు. 550 |
| 10 సంవత్సరాల చందా | రు. 1000 |

**'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, డి.డి లు పంపాల్సిన చిరునామా**



**వీక్షణం**
రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక
మైత్రి రెసిడెన్సీ, 3-6-394,
స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029.
ఫాక్స్, ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com
reachcdrc@yahoo.com



డిస్ట్రిబ్యూటర్స్
**ఆనంద్ ఏజన్సీస్, హైదరాబాద్.**
ఫోన్ : 98484 28516
98482 49695

ప్రింటర్స్
**చరితా ఇంప్రెషన్స్,**
ఆజామాబాద్, హైదరాబాద్
ఫోన్ : 040 - 27678411


**సంపాదకీయం**

## ఎవరికోసం సహకార వ్యవసాయం?

పేదప్రజల భూములను కొల్లగొట్టి, బహుళజాతిసంస్థలకు, పెత్తందారులకు కట్టబెట్టడానికి రాష్ట్రప్రభుత్వం ఒక కొత్త ఎత్తుగడ ఎత్తుతున్నది. 'సహకార వ్యవసాయం' అనే ఆకర్షణీయమైన పేరుతో కొత్త పథకాన్ని రచిస్తున్నది. కమతాలు చిన్నవయిపోతున్న నేపథ్యంలో చిన్న, సన్నకారు రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోలేకపోతున్నారనీ, వ్యవసాయ ఖర్చులు పెరిగిపోయి రైతుల బతుకు దుర్భరమైపోతున్నదనీ, వారిని గట్టెక్కించే మార్గం సహకార వ్యవసాయమేననీ ప్రభుత్వం హోరెత్తిపోయే ప్రచారం చేస్తున్నది. చిన్నకమతాల ఉత్పాదకత గురించి పాలకుల మాటలకు విశ్వసనీయత లేదు గాని, ప్రస్తుత పరిస్థితులలో వ్యవసాయం సక్రమంగా సాగడం లేదనీ, రైతులు బతకలేని స్థితి వచ్చిందనీ అన్నంతవరకు సమస్య నిజమైనదే. కాని ఆ సమస్య ఇవాళ్టికివాళ రాలేదు. పాలకులు దశాబ్దాల తరబడి చూపించిన నిర్లక్ష్యం, అమలు చేసిన అపసవ్య విధానాల వల్ల ఈ దుస్థితి తయారయింది. కనుక ఆ సమస్య గురించి మాట్లాడేటప్పుడు ప్రభుత్వాలు విస్మరించిన సంక్షేమ బాధ్యతల గురించి మాట్లాడాలి. భూసంబంధాలలో ప్రగతిశీలమైన మార్పులు తేవడం, వ్యవసాయం జీవనోపాధిగా ఉన్నవారికే భూయాజమాన్యం కలిపించడం, నీటిపారుదల సౌకర్యాలు, పశుసంపద, వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు, ఎరువులు, పండిన పంటకు గిట్టుబాటుధరలు, మార్కెట్లు, నిలువ సౌకర్యాలు వంటి రంగాలలో ప్రతి ఒక్కదానిలోనూ ప్రభుత్వం చేయవలసిన పనులు చేయలేదు. భూస్వాముల, వ్యాపారుల ఆధిపత్యానికీ, లాభాపేక్షకూ, అక్రమాలకూ వీలు కల్పించింది. అలా తామే సృష్టించిన సమస్యను ప్రస్తావిస్తూనే, ఆ సమస్యకు ఉండగల పరిష్కారాలన్నిటినీ, ప్రత్యామ్నాయాలన్నిటినీ అన్వేషించే బాధ్యతను కూడ ప్రస్తుత పాలకులు విస్మరిస్తున్నారు. ఏకైక పరిష్కారంగా ఒక దుర్మార్గమైన విధానాన్ని ప్రకటిస్తున్నారు. ఒక నిజమైన సమస్యను చూపి, తప్పుడు పరిష్కారాలను ప్రతిపాదించి, అవి అనివార్యమైనవిగా నమ్మించే కుటిలనీతిలో భాగమే ఈ సహకార వ్యవసాయ ప్రతిపాదన. సహకార వ్యవసాయం అన్నది రైతుల స్వచ్ఛంద, సమాన, గౌరవనీయ, సామూహిక భాగస్వామ్యం ఉన్నప్పుడు, ఆ సహకార ప్రయత్నం సామాజిక శ్రేయస్సు కోసం జరిగినప్పుడు తప్పనిసరిగా ప్రశంసనీయమే. కాని రైతులకు మరేమార్గం లేకుండా చేసి, వారిని బలవంతపెట్టి, వారి భూమిని తిరిగి ఇవ్వని విధంగా ఆక్రమించుకుని, వారిని భూమిని బట్టి వాటాదారులుగా మార్చి, తమ భూములలో తామే కూలీలుగానో, ఏ పనీ లేకుండానో ఉండే పథకాన్ని తయారుచేసి దానికి సహకార వ్యవసాయం అని పేరుపెట్టడం భాషకే అవమానం. ఇది సహకార వ్యవసాయం కాదు. ఇప్పటికే గాయపడిఉన్న వ్యవసాయదారుల గాయాలమీద కారం అద్దడం. రెండోసారి అధికారానికి వచ్చి, తిరుగులేదని అనుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఈ చర్య చేపట్టడం వెనుక ఎన్నో దురాలోచనలు కనబడుతున్నాయి. చంద్రబాబు నాయుడు ప్రారంభించిన ప్రపంచబ్యాంకు అనుకూల విధానాలను విమర్శిస్తూనే, తాము అధికారంలోకి రాగానే ఆ విధానాలనే ఇంకా ఎక్కువగా అమలుచేసినట్టుగా, కుప్పంలో అమలయిన కార్పొరేట్ వ్యవసాయాన్నే ఇవాళ రాజశేఖర రెడ్డి ప్రభుత్వం సహకార వ్యవసాయం పేరుమీద రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయబోతున్నది. మొదట పెద్ద ఎత్తున అమలు చేయడానికి పథకాలు రచించి, ప్రతిఘటనను చూసి ప్రస్తుతం దాన్ని ప్రయోగాత్మక స్థాయికి కుదించారు. ప్రతి జిల్లాలో ఒకటి రెండు గ్రామాలలో సహకార వ్యవసాయ క్షేత్రాలను అమలు చేస్తామని, ఈ ప్రతిపాదనమీద వెనక్కి పోయేది లేదని ప్రభుత్వం ప్రకటిస్తున్నది. భారతదేశంలోని వ్యవసాయ భూములను ఆక్రమించాలని జాతీయ, అంతర్జాతీయ వాణిజ్య వ్యవసాయ కంపెనీలకు, రియల్ ఎస్టేట్ కంపెనీలకు, వ్యవసాయోత్పత్తుల బహుళజాతి కంపెనీలకు, సంపన్నులకు కలిగిన భూదాహాన్ని తీర్చేందుకు పాలకులు చేస్తున్న ప్రయత్నాలు ఇవి. ఈ ప్రయత్నం మొదట బహుళజాతిసంస్థల అవసరాలకోసం, మార్కెట్లకోసం టమాటాలు, బంగాళాదుంపలు, చిన్న మక్కలు, గెర్కిన్లు, పూలు, పళ్లు, వగైరా పండించే వందలాది ఎకరాల క్షేత్రాలుగా మొదలయ్యాయి. ఆతర్వాత పరిశ్రమలు, సేవారంగ సంస్థలు అని పేరుపెట్టుకుని ప్రత్యేక ఆర్థిక మండలాలుగా వేలాది ఎకరాలను ఆక్రమించాయి. ఇప్పుడు గ్రామాలకు గ్రామాలనే కబళించబోతున్నాయి. ఈ ప్రయత్నం భూసంస్కరణలకు వ్యతిరేకం. రైతుల ఆత్మగౌరవానికి, స్వావలంబనకు వ్యతిరేకం. భారత వ్యవసాయరంగంలో సమస్యలు ఉన్నాయి, వాటిని తక్షణమే పరిష్కరించవలసి ఉంది. కాని ఈ సహకార వ్యవసాయం ఆ సమస్యలను ఇంకా పెంచుతుంది గాని తగ్గించదు.

వీ

## కరువు నివారణ అసాధ్యమా?

ఒక్క సంవత్సరం వర్షాలు సరిగ్గా కురవకపోగానే దేశ వ్యవసాయరంగం అల్లకల్లోలమయి పోతున్నదంటే, అనేక రాష్ట్రాలలో కరువు తాండవిస్తున్నదని ప్రభుత్వం స్వయంగా ప్రకటిస్తున్నదంటే, మన పాలనావిధానాల అసమంజసత్వానికి ఇంతకన్న నిదర్శనం కావాలా? వరుసగా ఐదు సంవత్సరాలు వర్షాలు బాగానే కురిసి, ఈ సంవత్సరం మాత్రమే జూన్ మొదటివారంలో ప్రారంభం కావలసిన వర్షాలు ఆగస్ట్ చివరివారానికి కూడ రావలసినంతగా రాలేదు. నాలుగు నెలల వర్షాకాలంలో రెండున్నర నెలలు వర్షాలు లేకుండానే గడిచిపోయాయి. ఇలా వర్షాకాలం అనిశ్చితంగా ఉండడానికి పర్యావరణ, వాతావరణ మార్పులు ఎలా కారణమవుతున్నాయో, ఏ విధంగా సామ్రాజ్యవాద శాస్త్ర ప్రయోగాలు, అరాచక ఉత్పత్తి విధానాలు, అడవుల నరికివేత వంటివి ఈ వాతావరణ మార్పులకు కారణమవుతున్నాయో చర్చించవచ్చు. కాని ఆ దీర్ఘకాలిక అంశాల చర్చ లేకుండానే, తాత్కాలిక, మధ్యంతర కాలవ్యవధిలో పాలక విధానాలు సక్రమంగా ఉండి ఉంటే కరువు ఇంత భయంకరంగా ప్రజాజీవితం మీద విరుచుకుపడి ఉండేదేనా అని ప్రశ్నించుకోవలసి ఉంది. పూర్తిగా వర్షాధార వ్యవసాయం కొనసాగే రోజులలో కూడ వర్షాలు కురవని సంవత్సరాలు ఉన్నప్పటికీ, అంతకుముందరి సంవత్సరాల దిగుబడులతో జీవితాలు పెద్ద ఇబ్బందిలేకుండానే గడిచిపోయేవి. మరి ఆధునిక వ్యవసాయంలో నీటిని నిలువచేసి వాడుకునే సౌకర్యాలు, భూగర్భ జల వనరులను వాడుకునే పద్ధతులు ఏర్పడి, ఉత్పాదకత పెరిగిన తర్వాత కూడ ఒక్క సంవత్సరం వర్షాభావం ఇంత గందరగోళాన్ని ఎందుకు సృష్టిస్తున్నది? గత అరవై సంవత్సరాలలో గద్దెనెక్కిన అన్ని రాజకీయ పక్షాలూ వ్యవసాయరంగ అభివృద్ధికి అవసరమయిన చర్యలు చేపట్టకపోవడం ఈ దుస్థితికి కారణం. దున్నేవారికే భూమి, వ్యవసాయం జీవనోపాధిగా గలవారికే భూమి కల్పించడం, అనుపస్థిత భూస్వామ్యాన్ని రద్దుచేయడం, భూయాజమాన్యంలో కేంద్రీకరణను తొలగించడం, గ్రామీణ ప్రాంతాలలో భూస్వాముల, అగ్రవర్ణాల, పెత్తందారుల ఆధిపత్యాన్ని తొలగించడం వంటి వ్యవస్థాగత మార్పులను ఈ పాలకులు చేస్తారని ఆశించడం అత్యాశే అవుతుంది. కాని జాతీయోద్యమ ఆదర్శాలవల్ల పాలకులు అరవై సంవత్సరాలుగా ఈ నినాదాలను వల్లిస్తూనే ఉన్నారు. వ్యవస్థాగత మార్పులు అలా ఉంచి, దేశంలోని అన్ని జలవనరులను వాడుకోవడం, నదీజలాలను వ్యవసాయ వినియోగంలోకి తెచ్చేలా ఆనకట్టలు నిర్మించి కాలువలు తవ్వడం లాంటి పని అయినా పాలకులు అరవై సంవత్సరాలలో చేయలేకపోయారు. ఇప్పటికీ దేశంలోని సాగుకు లాయకయిన భూమిలో సగానికి కూడ రక్షిత నీటిపారుదల సౌకర్యంలేదు. దేశంలోని నదీజలాల సంపూర్ణ వినియోగం కాదు గదా, సగం కూడ జరగడం లేదు. వ్యవసాయ అభివృద్ధికి అవసరమయిన ఇతర చిన్న పనులను కూడ ప్రభుత్వాలు సక్రమంగా చేయలేకపోయాయి. నూతన ఆర్థిక విధానాలు మన వ్యవసాయరంగంపై పెనుభారాన్ని మోపాయి. ఈ సంక్లిష్ట చరిత్ర నేపథ్యంలోనే ఒక్క వర్షాకాలం విఫలమయితే లోకమే తలకిందులయ్యే పరిస్థితి తలెత్తుతోంది. అందుకే వ్యవసాయం వర్షాధారంగా ఉన్నప్పుడు కూడ, వర్షాభావస్థితిలో ఎప్పుడూ నిరాశపడని, ప్రతి ఏటా రాతిమీద రాజనాలు పండించిన రైతులు, పూర్తిగా వర్షాధారం కాని ప్రస్తుత ఆధునిక, హరిత విప్లవానంతర వ్యవసాయంలో ఎప్పటికప్పుడు నిరాశకు లోనవుతున్నారు. మరణమే శరణ్యమనుకుంటున్నారు. నూతన ఆర్థిక విధానాలు మొదలయినప్పటినుంచీ పెరిగిన రైతుల ఆత్మహత్యలు ఈ సంవత్సరం కరువుతో మరింతగా పెరగనున్నాయని ఇప్పటికే సూచనలు కనబడుతున్నాయి. పాలకులు అనుసరిస్తున్న రాజకీయార్థిక విధానాలు ఈదేశ సాధారణ ప్రజానీకపు సమస్యలకు కనీసమైన పరిష్కారాలు కూడ చూపలేవని ఈ సారి కరువు మరొకసారి నిరూపిస్తోంది.

## బలోచిస్తాన్ లో ఏం జరుగుతోంది?

భారత, పాకిస్తాన్ ప్రధానమంత్రులు ఇటీవల చేసిన సంయుక్త ప్రకటనలో బలోచిస్తాన్ ప్రస్తావన వివాదాస్పదంగా మారింది. బలోచిస్తాన్‌లో సమస్యకు ఆజ్యం పోస్తున్నది భారత ప్రభుత్వమేనని పాకిస్తాన్ చాల కాలంగా చేస్తున్న ఆరోపణను ఆ ప్రస్తావన బలపరచేలా ఉంది. ఆ సంయుక్త ప్రకటనమీద, అందులో బలోచిస్తాన్ ప్రస్తావన మీద భారత పార్లమెంటులో పెద్ద రగడ జరిగింది. ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ప్రభుత్వం మాత్రం గందరగోళంగా, సమన్వయంలేకుండా, అస్పష్టంగా స్పందించింది. ఆ ప్రకటన, అందులో బలోచిస్తాన్ ప్రస్తావన సరయినదా కాదా అనే గందరగోళంలో అసలు బలోచిస్తాన్ సమస్య మరుగున పడిపోయింది. కోటికి పైగా ప్రజలు సాగిస్తున్న ఉద్యమం చర్చకు రాకుండా, ఒక ప్రకటనలోని ఒక వాక్యం గురించి రచ్చ జరుగుతోంది. ఇవాళ్టి పాకిస్తాన్, ఇరాన్, అఫ్ఘనిస్తాన్ సరిహద్దులతో ముక్కలయిన, బలూచ్ జాతి ప్రజల ఆకాంక్షలు భారత-పాకిస్తాన్ రాజకీయ చదరంగంలో పావులయ్యాయి. బ్రిటిష్ పాలకుల కుటిలనీతి వల్ల పందొమ్మిదో శతాబ్దం చివర చెల్లాచెదరయిన బలోచ్ జాతి స్వేచ్ఛాకాంక్ష ఇప్పటికి వంద సంవత్సరాలుగా ఉద్యమంగా సాగుతూనే ఉంది. వలసవాదులు వెళ్లిపోయినతర్వాత స్వాతంత్ర్యం ప్రకటించుకున్న బలోచిస్తాన్ పై 1948లో పాకిస్తాన్ సైనిక చర్య జరిపి ఆక్రమించుకుంది. గత అరవై సంవత్సరాలుగా బలోచి జాతి ఉద్యమకారులు పాకిస్తాన్ పాలకుల మీద సాయుధ పోరాటం సాగిస్తున్నారు. స్వాతంత్ర్యాన్ని కోరుకుంటున్నారు. పాకిస్తాన్ లో ఒక రాష్ట్రంగా ఉన్న బలోచిస్తాన్ ఆ దేశ విస్తీర్ణంలో సగభాగాన్ని ఆక్రమించినా, జనాభాలో మాత్రం ఐదు శాతానికే ఆశ్రయమిస్తోంది. అంటే అది పెద్దగా జనావాసానికి అనుకూలమయిన ప్రాంతం కాదు. అక్కడి కొండ ప్రాంతం పెద్దగా వ్యవసాయయోగ్యమైనది కూడ కాదు. కాని అక్కడ విస్తృతంగా చమురు, సహజవాయువు, రాగి వంటి సహజ సంపదలు ఉన్నందువల్ల ఆ ప్రాంతాన్ని వదులుకోవడం పాకిస్తాన్ ఆర్థిక ప్రయోజనాలకు భంగకరం. అది భౌగోళికంగా, వ్యూహాత్మకంగా కీలకమైన ఇరాన్‌కు, అఫ్ఘనిస్తాన్‌కు పొరుగున ఉండడం వల్ల పాకిస్తాన్‌కు గాని, అమెరికాకు గాని ఆ ప్రాంతాన్ని వదులుకోవడం రాజకీయంగా అంగీకారం కాదు. అందువల్లనే పాకిస్తాన్ పాలకులు, వారికి మద్దతు ఇస్తున్న అమెరికా, బ్రిటిష్ పాలకులు బలోచ్‌జాతి ఉద్యమకారుల మీద తీవ్రవాదులుగా ముద్రవేసి, నిషేధించి, అమానుషమైన అణచివేత చర్యలు చేపడుతున్నారు. బలోచ్ జాతి ప్రజల న్యాయమైన, సమర్థనీయమైన ప్రజాఉద్యమాన్ని సమర్థించే నైతిక అర్హత భారత ప్రభుత్వానికి లేదు గాని, శత్రువుకు శత్రువు మిత్రుడు అనే రాజకీయ ఎత్తుగడతో భారత ప్రభుత్వం బలోచ్ ఉద్యమకారులను సమర్థిస్తోంది. ఆర్థిక, సైనిక సహకారం అందిస్తున్నదనే ఆరోపణలు ఉన్నాయి. భారత ప్రభుత్వపు గూఢచార సంస్థ రిసర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్ (రా) బలోచిస్తాన్ లో ఐదువేలమంది ఏజెంట్లను ప్రవేశ పెట్టిందని పాకిస్తాన్ చాలకాలంగా ఆరోపిస్తోంది. ఇప్పుడు సంయుక్త ప్రకటన ఆ ఆరోపణను నిర్ధారిస్తుందేమోననే ఆందోళనే తప్ప ప్రస్తుతం జరుగుతున్న గందరగోళంలో బలోచీల స్వాతంత్ర్యాకాంక్ష, వారిమీద జరుగుతున్న దమనకాండ మరుగున పడిపోతున్నాయి. ఒక న్యాయమైన ప్రజాపోరాటం కూడ అంతర్జాతీయ రాజకీయ చదరంగంలో పావుగా మారిపోతుందనడానికి బలోచ్ ఉద్యమమే నిదర్శనం. వీ

# లోపలి పేజీల్లో...

## ఫోకస్ : మహిళా ఉద్యోగుల సమస్యలు

సమస్యల తీవ్రతలో తరతమ భేదాలున్నప్పటికీ, అన్ని వర్గాల ప్రజలకు సమస్యలున్నాయి. అందులో స్త్రీలకు మరీ ఎక్కువ. అందరి సమస్యలకు మూలం ఒక్కటే. అది ఈ దోపిడీ వ్యవస్థ. విడివిడిగా సాగుతున్న కార్మిక, కర్షక, ఉద్యోగ పోరాటాలు ఐక్యం కావాలి. అనేక సమస్యలతో సతమతమయ్యే స్త్రీలకు పోరాడితే పోయేదేమీలేదు సమస్యలు తప్ప. అన్నివర్గాల స్త్రీల సంఘటిత ఉద్యమంలో ఉద్యోగ స్త్రీలు కూడా భాగమై, ఉద్యమించినప్పడే సమస్యలు పరిష్కారమై నిజమైన విముక్తి లభిస్తుంది.



'వీక్షణం'లో అచ్చువుతున్న రచనలలో వ్యక్తమైన అభిప్రాయాలన్నిటితో సంపాదకులకు ఏకీభావం ఉండనవసరం లేదు. 'వీక్షణం'ను నిజమైన ప్రజాపక్ష రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణా వేదికగా తీర్చిదిద్దడంలో అన్నిరకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాల ఛాయలకు స్థానం కల్పించాలని సంపాదక వర్గం భావిస్తోంది.

### రచయితలకు సూచన

ఏ పత్రికయినా తాను అచ్చువేసే రచనలు తనకే ప్రత్యేకంగా ఉండాలని కోరుకుంటుంది. 'వీక్షణం' కూడా అలానే భావిస్తోంది. ఇటీవల కొందరు రచయితలు తమ రచనలను ఒకేసారి అనేక పత్రికలకు పరిశీలన కోసం పంపుతున్నారు. 'వీక్షణం' పరిశీలనలో ఉన్న రచనలు, రాబోయే సంచికలలో అచ్చుకోసం ఎంపిక చేసి పెట్టుకున్న రచనలు ఇతర దినపత్రికలలోనో, వార పత్రికలలోనో వెలువడడం మా దృష్టికి వస్తోంది. ఇతర పత్రికలకు పంపిన రచనలను 'వీక్షణం'కు పంపించగూడదని రచయితలకు విజ్ఞప్తి చేస్తున్నాము.


\- సంపాదకులు

### చందాదారులకు విజ్ఞప్తి!

ఇటీవల కొంతమంది చందాదారులకు వీక్షణం సక్రమంగా అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. వీక్షణం ప్రతినెల 29వ తేదీన మరుసటి నెల సంచిక పోస్ట్ అవుతుంది. ఏ కారణం చేతనైనా మీకు వీక్షణం మొదటివారంలోపు అందనట్లయితే, వెంటనే ఆ విషయం మాకు తెలపగలరు.


మీ చిరునామా వివరంగా రాయండి. పిన్‌కోడ్ రాయడం మరిచిపోకండి. పత్రిక వచ్చిందా రాలేదా పోస్ట్‌మాన్‌తో నిర్ధారించుకోగలరు.


\- సర్క్యులేషన్ మేనేజర్
9949391028






















- **నవతరం తెలుగు కథ** – 1998–2008 – వారధి రచయితల సహకార వేదిక – 287 పేజీలు, 1/8 డెమీ, రు.60, ప్రతులకు : 24 మంది కథకుల వద్ద; మంచికంటి, 4–179, దిబ్బలరోడ్, సత్యనారాయణపురం, ఒంగోలు – 2; సెల్ : 9949535695; ఇమెయిల్ : manchikanti64@yahoo.co.in
- **కవిత 2008** – సంపాదకులు : డా. పాపినేని శివశంకర్, దర్భశయనం శ్రీనివాసాచార్య – సాహితీమిత్రులు ప్రచురణ – 158 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు : నవోదయ పబ్లిషర్స్, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ – 520 002, ఫోన్ : 0866–2573500, నవోదయ బుక్‌హౌస్, ప్రజాశక్తి బుక్‌హౌస్
- **దళిత సాహిత్యం – మాదిగ దృక్పథం** – డా. దార్ల వెంకటేశ్వరరావు – సొసైటీ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ప్రచురణ – 95 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు : ఎం. మంజుశ్రీ, ఇ.నెం. 4–8–89, ఆలమపల్లి, వికారాబాద్, రంగారెడ్డి జిల్లా; డా. దార్ల రవికుమార్, చెయ్యేరు అగ్రహారం, వయా అనంతవరం (ఎస్.ఒ.), తూర్పు గోదావరి – 533 222; సమాంతర బుక్‌హౌస్, ప్రజాశక్తి బుక్‌హౌస్, విశాలాంధ్ర బుక్‌హౌస్, నవోదయ బుక్‌హౌస్
- **ఉదయగానం** – కవిత్వం – సంగ్రామ్ – జాబిలి ప్రచురణలు – 64 పేజీలు, 1/8 డెమీ, రు. 30, ప్రతులకు: జాబిలి ప్రచురణలు, సి–66, ఎస్.వి.ఎన్. కాలనీ, గుంటూరు – 6, ఫోన్ : 0863 2357103; ప్రముఖ పుస్తక కేంద్రాలలో
- **ఒక సెక్స్ వర్కర్ ఆత్మకథ** – నళినీ జమీలా – తెలుగు అనువాదం కాత్యాయని – హైదరాబాద్ బుక్ ట్రస్ట్ ప్రచురణ – 121 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు : హైదరాబాద్ బుక్ ట్రస్ట్, ప్లాట్ నెం. 85, బాలాజీనగర్, గుడిమల్కాపూర్, హైదరాబాద్ – 500 067, ఫోన్ : 23521849
- **రెండు భాగాలు** – కవిత – వి. ప్రతిమ – 84 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు : సాహిత్య పబ్లికేషన్స్, వెస్ట్ స్ట్రీట్, నాయుడుపేట – 524 126, సెల్ : 98485 41485, 98484 09949; ప్రముఖ పుస్తక కేంద్రాలలో
- **ఫోర్ క్లాసిక్స్ ఆఫ్ తెలుగు ఫిక్షన్** – సంపాదకులు : కాకాని చక్రపాణి – ద్రవిడియన్ యూనివర్సిటీ – 391 పేజీలు, 1/8 డెమీ, సాదా ప్రతి రు. 250, గ్రంథాలయాలకు రు. 350, ప్రతులకు: రిజిస్ట్రార్, ద్రవిడ విశ్వవిద్యాలయం, కుప్పం – 517 425
- **చేనేత ఆత్మహత్యలకు కారణం ఎవరు?** – సురవరం సుధాకరరెడ్డి – చేనేత విజ్ఞాన విధాన కేంద్రం (చిప్) – 43 పేజీలు, 1/8 డెమీ, వెల లేదు, ప్రతులకు : చేనేత విజ్ఞాన విధాన కేంద్రం (చిప్), ఇ.నెం. 6–20, పాత సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్ దగ్గర, బేర్‌పేట, రామకృష్ణాపురం, చీరాల – 523 155, ఫోన్ : 08594 237167, Email : chip.handloom@yahoo.com, chip.handloom@gmail.com
- **సిపిఎం – తెలంగాణ – యాంత్రిక వ్యతిరేకత – ఒక విశ్లేషణ** – టంకశాల అశోక్ – తెలంగాణ రచయితల వేదిక – 31 పేజీలు, 1/8 డెమీ, రు. 10, ప్రతులకు : ప్రముఖ పుస్తక కేంద్రాలలో
- **సెజ్‌లు, కోస్టల్ కారిడార్‌లను ప్రతిఘటిద్దాం** – సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ప్రచురణ – 46 పేజీలు, 1/8 డెమీ, రు. 10, ప్రతులకు: మార్క్స్ భవన్, 7వ లైన్, విద్యానగర్, హైదరాబాద్ – 500 044



'వీక్షణం' ఆగస్ట్ 2009 సంచికలో అచ్చయిన పి.సి. జోషి వ్యాసం (క్షేత్రపరిశోధన అనువాదం – పునస్సమీక్ష) చాలా బాగుంది. భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా 1940లలో పనిచేసిన పి.సి. జోషి గురించి విన్నాం గాని, కమ్యూనిస్టు ఉద్యమ ప్రభావంతో అర్థశాస్త్రవేత్తగా ఎదిగిన ఈ వ్యాస రచయిత పి.సి. జోషి గురించి ఇక్కడే మొదటిసారి చూశాం. మంచి వ్యాసం ప్రచురించినందుకు అభినందనలు. అలాగే పిట్టల రవీందర్ వ్యాసం సింగరేణి – పరిణామాలు, పర్యవసానాలు చాలా వివరంగా సమస్యను అర్థం చేయించింది. ఇదివరకు తెలియని, పూర్తిగా తెలియని చాలా విషయాలు తెలిశాయి. సోమరాజు వ్యాసం (సింగరేణి బొగ్గు గనులు – నాటి స్థితి) 1956లో రాసినది అయినా అందులో 1995 ఉత్పత్తి అని ఒక అంకె ఇచ్చారు. అచ్చు తప్పు అయి ఉంటుంది. సవరించండి.

**– సి.ఎస్.ఆర్. ప్రసాద్**
గుంటూరు

సింగరేణి ఓపెన్ కాస్ట్ మైనింగ్ వల్ల జరిగే విధ్వంసం ప్రజలపై ఎటువంటి ప్రభావం వేస్తుందో క్షేత్రపరిశోధన అనుభవంగా సి. వనజ రాసిన వ్యాసం (వీక్షణం ఆగస్ట్ సంచిక) బాగుంది. అంతకుముందు సంచికలలో మణిపూర్‌లో స్త్రీలపై నిర్బంధకాండ గురించి రాసిన రిపోర్ట్ కూడా బాగుంది. ఇటువంటి ప్రత్యక్ష అనుభవ నివేదికలు ప్రచురించండి.

**– కె. నరేంద్రమోహన్**
మెల్‌బోర్న్, ఆస్ట్రేలియా

వీక్షణం ఆగస్ట్ సంచికలో సింగరేణి బొగ్గు గనులపై ప్రచురించిన నాలుగు వ్యాసాలు చాలా బాగున్నాయి. ఆరు దశాబ్దాల కింద సింగరేణి బొగ్గు గని కార్మికుల పని పరిస్థితులూ, జీవన పరిస్థితులూ ఎలా ఉండేవో చెప్పిన వ్యాసం హైలైట్.

**– శ్రీధర్ దేశ్‌పాండే**
హైదరాబాద్

పి.సి.జోషి క్షేత్రపరిశోధనపై రాసిన వ్యాసం చాలా బాగుంది. ముప్పై ఏళ్లకింద వెలువడిన వ్యాసమయినా ఇంతవరకు ఎవరూ తెలుగులో ప్రస్తావించకపోవడం ఆశ్చర్యకరం. అసలు రచయిత, అర్థశాస్త్రవేత్త పి.సి.జోషి గురించి తెలిసిన వాళ్లే చాలా తక్కువ మంది ఉన్నారు. ఒకవైపు సైద్ధాంతిక దృక్పథం మరోవైపు అనుభవవాద దృక్పథం ఒకదానికొకటి సంబంధం లేకుండా సాగుతున్న పరిస్థితిలో ఈ వ్యాసానికి చాలా ప్రాధాన్యత ఉంది. ఇటువంటి వ్యాసాలు విరివిగా ప్రచురించండి.

**– పి. భరత్**
గుంటూరు

క్షేత్రపరిశోధన మీద వచ్చిన పి.సి. జోషి వ్యాసం విద్యార్థులకూ, కొత్తగా క్షేత్రపరిశోధన చేసేవాళ్లకూ ఒక ప్రామాణిక గ్రంథంలాగా ఉపయోగపడుతుంది. ఇలాంటి బోధనా వ్యాసాల వల్ల కొత్త విషయాలు నేర్చుకునేందుకు వీలుంటుంది. వ్యాసాలు కొద్దిగా సరళంగా, ఉదాహరణలతో వస్తే బాగుంటుంది.

**– నాగరాజు**
హైదరాబాద్

'పర్యావరణం–జాతుల వైవిధ్యం' కొడవటిగంటి రోహిణీప్రసాద్ గారి వ్యాసం చాలా బాగుంది. మనుషుల్లో రకాలు, జాతుల వైవిధ్యం, ప్రాంతాల వారిగా మనుషుల్లో ఉండే తేడాల గురించి వివరాల తెలియవచ్చాయి. మనుషుల్లోనే కాక జీవజాతులలో ఉండే వైరుధ్యాల గురించి, పరిస్థితుల గురించి వ్యాసాలు వస్తే పాఠకులకు ఉపయోగకరంగా ఉంటుంది. రోహిణీప్రసాద్ గారు రాస్తున్న వ్యాసాలు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, శాస్త్రీయంగా సమాజాన్ని అర్థం చేసుకోవాలనుకునే వారికి ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి.

**– భానుప్రసాద్**
మిర్యాలగూడ, నల్లగొండ

## వీక్షణానికి చేయూత...

పత్రికను తాను చదవడమే కాక, నలుగురి చేతా చదివించాలనే ఉద్దేశంతో కడప జిల్లాలోని ఆరు కాలేజీ గ్రంథాలయాలకు స్వయంగా చందాలుకట్టి ఇటు వీక్షణాన్ని ప్రోత్సహించి, అటు పాఠకులకు పత్రికను పరిచయం చేసి మాకు సహకరించిన **వి. వెంకట్‌రెడ్డి** (ఇంటేపల్లె, కడప జిల్లా) గారికి కృతజ్ఞతలు. – సం.

## అంతటా వర్షాభావం

రాష్ట్రంలోని కోస్తా, రాయలసీమ, తెలంగాణ ఇలా అన్ని చోట్ల సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయింది. రాష్ట్రంలో జూన్ 1 నుంచి ఆగస్ట్ 12 దాకా సాధారణ, కురిసిన వర్షపాతంలలోని తేడా చూస్తే సగటున 55 శాతం తక్కువ వర్షపాతం నమోదయింది. దేశవ్యాప్తంగా చూస్తే 27 శాతం తక్కువ వర్షపాతం నమోదయింది. రాష్ట్రంలో 974 మండలాలలో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. తాగునీరు, సాగునీరే కాక పశువులకు గడ్డి కూడా దొరక్క ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోయి తాగునీటి సమస్య మరింత జటిలమవుతోంది. నిరాశతో రైతుల ఆత్మహత్యలు పెరిగిపోయాయి.

## జైళ్లలో పెరుగుతున్న మరణాలు

రాష్ట్రంలోని జైళ్లలో ఖైదీల మరణాల్లో 233 శాతం పెరుగుదల ఉంది. గత సంవత్సరం 123 మంది ఖైదీలు మరణించారు. వీరిలో 75 శాతం ఖైదీలు విచారణను ఎదుర్కొంటున్న వారే. గత పదేళ్లలో రాష్ట్రంలోని ఖైదీల సంఖ్య జైళ్ల పరిమాణం కన్నా 73 శాతం ఎక్కువగా ఉందంటూ మానవహక్కుల వేదిక తెలిపింది. ఖైదీల మరణాలకు దారితీస్తున్న పరిస్థితులను మానవ హక్కుల వేదిక ప్రధాన కార్యదర్శి కె. బాలగోపాల్, మురళీ వివరించారు. జైళ్లలోని ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత, సబ్‌జైళ్లకు సకాలంలో ప్రభుత్వ వైద్యులు వెళ్లకపోవడం, రోగ నిర్ధారణ చేసే పరికరాలు అందుబాటులో లేకపోవడం ఖైదీల మరణాలకు కారణాలుగా పేర్కొన్నారు.

## సంక్షోభంలో సాఫ్ట్‌వేర్

ఆర్థిక మాంద్యం కారణంగా సాఫ్ట్‌వేర్ రంగంలో వేలాది మంది ఉద్యోగాలు కోల్పోతున్నారు. సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్.టి.పి.ఐ.) హైదరాబాద్ కేంద్రం లెక్కల ప్రకారం రాష్ట్రంలో సుమారు వెయ్యి సాఫ్ట్‌వేర్, బి.పి.ఒ. కంపెనీలు రిజిష్టరై ఉన్నాయి. మార్చ్ నెలాఖరు నాటికి వీటిలో 2,57,786 మంది పనిచేస్తున్నారు. ఎస్.టి.పి.ఐ. కింద రిజిస్టర్ కాని ఎస్.ఎం.ఇ.లు మరో వెయ్యికి పైగా ఉన్నాయి. వీటిలో మరో లక్షమంది పనిచేస్తున్నారు. మాంద్యం కారణంగా ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న కంపెనీల సంఖ్య ఐదు వందల వరకు ఉంటుందని హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పోర్ట్ అసోసియేషన్‌కు చెందిన ప్రముఖులు చెబుతున్నారు.

## గిరిజన ప్రాంతాల మరణాలపై నివేదిక

గిరిజన ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలి ఎంతో మంది అకాల మరణానికి గురవుతుండడంపై రాష్ట్ర మానవ హక్కుల సంఘం ఆందోళన వ్యక్తంచేసింది. దీనిపై నాలుగు వారాల్లోగా నివేదిక సమర్పించాలని కమిషన్ చైర్మన్ జస్టిస్ సుభాషన్‌రెడ్డి గిరిజన సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించారు. విషజ్వరాలు, అంటువ్యాధులతో గత రెండు నెలల్లో సుమారు 150 మంది గిరిజనులు చనిపోయారని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం ఆగస్ట్ 5న రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సంఘం నేతలు చెప్పారు. వ్యాధులను అరికట్టేందుకు సత్వర చర్యలు చేపట్టేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని వారు కోరారు.

## పాత్రికేయులపై మంత్రి దాడి

జర్నలిస్టులపై అనుచితంగా ప్రవర్తించి, అనుచరులతో కలిసి దాడులకు పాల్పడిన మంత్రి పార్థసారథిని బర్తరఫ్ చేయాలని జర్నలిస్టులు డిమాండ్ చేశారు. మంత్రి చర్యను నిరసిస్తూ, జూలై 23న రాష్ట్ర వ్యాప్తంగా పాత్రికేయులు ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో ర్యాలీలు, ధర్నాలు నిర్వహించి తమ నిరసనను తెలియజేసారు. మంత్రిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ముఖ్యమంత్రికి ఎపియుడబ్ల్యుజె బృందం వినతి పత్రం సమర్పించింది.

## అవకాశవాదమే నేటి రాజకీయం!

రాష్ట్రంలో ఆకర్ష్, వికర్ష్, స్వగృహల పేరిట అవకాశవాద రాజకీయాల సందడి కొనసాగుతోంది. ప్రజల మనోభావాలతో సంబంధం లేకుండా నిన్నటి ఎన్నికలలో ఓడిన, గెలిచిన నాయకులు తమ బలాలు పెంచుకోవడానికి, భవిష్యత్తు కోసం పార్టీలు మారుతున్నారు. అసమ్మతి నాయకులు రోడ్లకెక్కుతున్నారు. అధికార దాహంతో, సొంత లాభం కోసం పదరాని పాట్లు పడుతున్నారు. కప్పలతక్కెడ రాజకీయం నడుస్తోంది. ప్రధానంగా ప్రజారాజ్యం, తెలంగాణ రాష్ట్ర సమితి, లోక్‌సత్తా పార్టీలు ఈ తాకిడికి గురయ్యాయి.

## నిషేధం కొనసాగింపు

సిపిఐ (మావోయిస్ట్) పార్టీతోపాటు మరో ఆరు విప్లవ సంస్థలపై నిషేధాన్ని మరో ఏడాదికి పొడిగిస్తూ ఆగస్ట్ 10న రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాది ఆగస్ట్ 16 వరకు ఈ నిషేధం వర్తిస్తుందని స్పష్టం చేసింది. నిషేధిత జాబితాలో మావోయిస్ట్ పార్టీతో పాటు రాడికల్ యూత్ లీగ్, రైతు కూలీ సంఘం, రాడికల్ స్టూడెంట్స్ యూనియన్, సింగరేణి కార్మిక సమాఖ్య, విప్లవ కార్మిక సమాఖ్య, అఖిల భారత విప్లవ విద్యార్థి సమాఖ్యలు ఉన్నాయి.

## వినోదం మాటున విషాదం

ప్రేక్షకులకు వినోదాన్ని పంచాల్సిన సినిమా థియేటర్లు ప్రమాదాలకు నిలయాలుగా మారిపోయాయి. ఆగస్ట్ 8 రాత్రి కాజీపేట లోని ఒక థియేటర్‌లో ఇద్దరు, ఆగస్ట్ 9న విజయనగరం జిల్లా సాలూరు పట్టణంలో ఐదుగురు విద్యుద్ఘాతానికి మరణించారు. మూడేళ్ల కిందట హైకోర్టు ఆదేశాల మేరకు థియేటర్ల పరిస్థితిపై వివరాల సేకరణ జరిగింది. రాష్ట్రంలో 2,158 సినిమా హాళ్లు సురక్షితంగా లేవని వెల్లడయింది. థియేటర్ యాజమాన్యాలకు వ్యాపార లాభమే తప్ప ప్రేక్షకుల భద్రత పట్టడం లేదు. వీ

*సహకార సేద్యం పేరిట వచ్చిన ప్రభుత్వ ప్రతిపాదనలలో పొంచి ఉన్న ప్రమాదాలను వివరిస్తూ, ప్రత్యామ్నాయాలను సూచిస్తున్నారు* **డా. జి.వి. రామాంజనేయులు**

# సహకార సేద్యం ప్రతిపాదనలు - విశ్లేషణ

సంక్షోభంలో ఉన్న రైతాంగాన్ని ఆదుకోవడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈసారి ఇంకొక కొత్త ప్రతిపాదన తీసుకువచ్చింది. ఈ సంక్షోభానికి మూలకారణం చిన్న కమతాల వ్యవసాయం, గిట్టుబాటు కాని వ్యవసాయం అని తేల్చి, ప్రత్యామ్నాయంగా చిన్న చిన్న కమతాలను ఒకే పెద్ద వ్యవసాయ క్షేత్రంగా మార్చటానికి, అందులో యాంత్రికీకరణ, పశుపాలన, గ్రామస్థాయి ప్రాసెసింగ్, ఇతరత్రా పనులు చేపట్టడం ఈ ప్రతిపాదన ముఖ్య ఉద్దేశం. దీనికోసం ప్రభుత్వం గ్రామం ఒక యూనిట్‌గా రైతుల సహకార సంఘాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదిస్తోంది. ఈ ప్రతిపాదనలో కీలకమైన అంశాలు:

- గ్రామస్థాయిలో రైతులందరు కలిసి ఒక సంస్థని ఏర్పాటు చేసుకుంటారు. ఈ సంస్థ రూపం సహకార సంఘం / సొసైటీ / కంపెనీల రూపంలో ఉండవచ్చు.
- గ్రామంలో రైతులందరు సంయుక్తంగా ఏర్పాటు చేసుకున్న సంస్థకు తమ భూముల్ని నిర్దిష్ట ధరకు అమ్మాలి. ఈ ధర మార్కెట్ ధర లేదా ఏకాభిప్రాయంతో నిర్ణయించిన ధర అయి ఉంటుంది.
- భూమివిలువ, అందులో ఉన్న ఇతర సదుపాయాలను పరిగణనలోకి తీసుకొని అందుకు తగ్గట్టుగా రైతులకు షేర్లు అందజేస్తారు. ఇలా లభించిన షేర్ల ఆధారంగా వారి ఓటువిలువ నిర్ణయమవుతుంది.
- ప్రతి రైతుకి అతడి పొలంలో గడచిన ఐదేళ్లలో అత్యధికంగా పండిన పంటను కొలబద్దగా తీసుకొని, ఆ మేరకు ఏటా ఆదాయం ఉండేలా సంస్థ గ్యారెంటీ ఇస్తుంది.
- పంట ప్రణాళికలు, గ్రామాభివృద్ధి ప్రణాళికలు తయారుచేసి ఈ సంస్థ అమలు చేస్తుంది.
- సంస్థ నుంచి వైదొలగాలని రైతులు భావిస్తే తన షేర్‌ని ఆ సంస్థలోని ఇతర షేర్‌హోల్డర్‌లకుగాని, సంస్థలకుగాని అమ్ముకునే వీలుంటుంది. భూమి వెనక్కి తీసుకునే అవకాశం ఉండదు.
- మొత్తం క్షేత్రం విలువకి సరిసమానమైన డబ్బును మూలధనంగా ఐదేళ్లలో ఉపయోగించుకునేందుకు వీలుగా సంస్థకు ప్రభుత్వం అందజేస్తుంది. మిగిలిన పెట్టుబడిని బ్యాంకుల ద్వారా రుణం అందజేస్తారు.

### పెద్ద కమతాల వ్యవసాయం

పెద్ద కమతాలలో ఉన్న నష్టాలు ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు విదితమే. పెద్ద యంత్రాల వాడకం, రసాయనిక ఎరువులు, పురుగుల మందుల వాడకం వలన అనేక పర్యావరణ సమస్యలతో పాటు, ఆర్థికంగా నడవలేని పరిస్థితికి వచ్చాయి. అమెరికా, యూరప్ దేశాలలో ఇటువంటి కమతాలు ఎకరానికి రెండు – మూడు లక్షల రూపాయల కంటె ఎక్కువ పరిమాణంలో సబ్సిడీలు (చాలా సందర్భాలలో ఉత్పత్తి వ్యయం కంటే ఎక్కువగా) అందిస్తేనే నడిచే పరిస్థితులలో ఉన్నాయి. ఆహారంలో రసాయనాల కలుషితాల సమస్య అందరికి తెలిసిందే. దీనికి తోడు అధికంగా యంత్రాలు, విద్యుత్ వాడటం వలన వెలువడే గ్రీన్ హౌస్ వాయువుల వలన పర్యావరణ మార్పు చూస్తున్నాం. చిన్న కమతాలతో పోల్చుకుంటే పెద్ద కమతాల ఎనర్జీ ఎఫిషియన్సీ కూడా చాలా తక్కువ.

ఇటీవలనే ప్రపంచవ్యాప్తంగా నాలుగు వందల మంది వ్యవసాయ, సామాజిక శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో యునైటెడ్ నేషన్స్ సహకారంతో నాలుగు సంవత్సరాల పాటు జరిగిన ఒక అధ్యయనం (ఐఎఎఎస్‌టిడి – ఇంటర్నేషనల్ అసెస్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ సైన్స్, టెక్నాలజీ అండ్ డెవలప్‌మెంట్, 2008)లో చిన్న కమతాల వ్యవసాయమే మేలైందని, అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఉన్న చిన్న కమతాలు భవిష్యత్‌లో ప్రపంచ ఆహార భద్రతకు ఆధారం అని తేల్చి చెప్పింది.

### చిన్న కమతాల వ్యవసాయం

చిన్న కమతాల వ్యవసాయం గురించి ప్రభుత్వం మాట్లాడుతున్న దాంట్లో నిజం కొంచెమే ఉంది. ఉన్న పొలం చిన్నదైనప్పుడు అందులో పండే పంట ఉత్పత్తి తక్కువ ఉండడం, అందువలన ఆదాయం తక్కువ ఉండడం జరుగుతుంది. అయితే చిన్న కమతాలకు అనువైన పద్ధతులు వాడక, ఆధునికీకరణ పేరుతో బయట వనరుల మీద ఆధారపడి చేసే వ్యవసాయం ఎక్కువ కావడం వలన ఖర్చులు పెరిగి, ప్రభుత్వ విధానాల వలన సరైన సహకారం (సాంకేతికంగా, ఆర్థికంగా) అందివ్వకపోవడం, గిట్టుబాటు ధరలు లభించకపోవడం వలన రైతులు నష్టపోవడం జరుగుతోంది. దీనికి తోడు ప్రభుత్వం అనేక ప్రాథమిక రంగాల నుంచి (విద్య, ఆరోగ్యం, నీరు మొదలైనవి) తప్పుకోవడం వలన జీవన వ్యయం పెరిగి సంక్షోభానికి దారితీస్తోంది. అంతేగాని కేవలం చిన్న కమతాలలో ఆధునిక వ్యవసాయ పద్ధతులని అవలంబించలేక కాదు. నిజానికి చిన్న కమతాలలో బహుపంటల విధానం, సేంద్రియ పద్ధతులను పాటించడం

ద్వారా ఉత్పత్తి ఖర్చులు తగ్గడంతో పాటు ప్రతి కమతం ఉత్పాదకత పెంచవచ్చు. చిన్న కమతాలకు అనువైన చిన్నయంత్రాల వాడకం, గ్రామస్థాయిలో అన్ని కమతాలకి కనీస వసతులు కల్పించడం, ఉత్పత్తులను గ్రామస్థాయిలో పోగుచేసి, కలిసి ప్రాసెస్ చేసి, అమ్ముకునే విధానాలు అవలంబించి లాభాలు పొందుతున్న అనేక ఉదాహరణలు మనముందున్నాయి.

ఈ నేపథ్యంలో పెద్ద వ్యవసాయ క్షేత్రాలు సృష్టించడానికి చిన్న చిన్న కమతాలను కలిపివేయాలనుకోవడం అర్థంలేని ఆలోచన. పొలం గట్లు కేవలం పొలాలను వేరు చేయడానికి మాత్రమే కాదు. వీటి మీద పెరిగే మొక్కలు, చెట్లు, రైతుల అనేక దైనందిన అవసరాలు తీరుస్తాయి. ఆకు కూరలు – కూరగాయలతో పాటు, పండ్ల చెట్లు, పశువులకి ఆహారం వంటివి లభించడంతో పాటు గట్ల మీద పెరిగే చెట్లు నేల కోతకి గురికాకుండా, గాలికి అడ్డుకట్ట వేయడానికి ఉపయోగపడతాయి. అలాగే నీటిని, నేలను పరిరక్షించుకోవడం కోసం గట్లు వేయడం తప్పనిసరి. నిజానికి ఈరోజు దేశంలో ఉండే జీవనవైవిధ్యతలో కనీసం మూడోవంతు పొలం గట్లపైనే ఉంది.

చిన్న రైతుల వ్యవసాయం లాభసాటిగా నడవాలంటే ప్రభుత్వం కొన్ని పనులు చేపట్టవచ్చు –

- రైతులందరికి, అన్ని పొలాలకి కనీస వనరులు కల్పించడం – నేల, నీరు, విత్తనాలు సంరక్షించుకోవడానికి వసతులు కల్పించడం
- వర్షాధార పరిస్థితులలో పంట రక్షించుకోవడానికి ఒకటి–రెండు తడులు పెట్టే అవకాశం
- చిన్న రైతులకి, చిన్న కమతాలకి ఉపయోగపడే పనిముట్లు, యంత్రాలు అందరికి అందుబాటులో ఉండేలా వసతి కల్పించడం
- పంట దిగుబడి వచ్చిన తర్వాత దానిని నిల్వ ఉంచుకోవడానికి వసతులు, పంట కోతల వెంటనే అమ్ముకోవాల్సిన పరిస్థితి లేకుండా ఆర్థిక సహాయం అందించడం
- గ్రామస్థాయిలోనే ప్రాసెసింగ్ చేయడానికి చిన్న పరిశ్రమలు వ్యవసాయంతో పాటు అనుబంధంగా స్థానిక పరిస్థితులకు అనువైన ఇతర పరిశ్రమలు స్థాపించడం

ఇప్పటివరకు మన రాష్ట్రంలో ముల్కనూరు, అంకాపూర్ వంటి సహకార సంఘాలు మినహాయించి మిగితావన్నీ మూతపడడం కాని, నామమాత్రంగా నడవడం కాని చేస్తున్నాయి. ఇందుకు ముఖ్యకారణం 1964 సహకార చట్టం ప్రకారం ఇందులో ప్రభుత్వ జోక్యం ఎక్కువ కావడం, పెద్ద రైతులు, రాజకీయ నాయకులు, అధికారులు తమ స్వలాభాల కోసం వీటిని దుర్వినియోగం చేయడం జరుగుతోంది. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 1995లో కొత్తగా ఆంధ్రప్రదేశ్ పరస్పర సహకార సంఘాల చట్టం తీసుకువచ్చింది. దీనిలో ప్రభుత్వ జోక్యం తక్కువ. దీనికిందనే అనేక మహిళా సంఘాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే ప్రభుత్వ నియంత్రణ కొరవడడంతో ఈ చట్టం కింద ఏర్పాటైన సంఘాలు చాలా చోట్ల అక్రమాలకు పాల్పడ్డాయి. అనేక పాల ఉత్పత్తిదారుల సంఘాలు, అర్బన్ బ్యాంకులు ఇందుకు ఉదాహరణలు. విప్లవాత్మక మార్పుగా మనం చెప్పుకుంటున్న మహిళా సంఘాల విషయంలోనూ అధికార పార్టీ, ప్రభుత్వ అధికారులు, సంఘంలో పనిచేసే ఉద్యోగుల అవినీతి, అక్రమాలు మనం చూస్తునే ఉన్నాం. ఈ పరిస్థితులలో రైతులు తమ పొలాలను సహకార సంఘానికి అప్పచెబితే ఏమవుతుందనేది అందరి ప్రశ్న.

సంస్థకి పొలాలు అమ్మి షేర్ హోల్డర్లుగా మారిన తర్వాత మరి రైతులు ఏమి చేయాలి? చిన్న చిన్న కమతాలలో పనిచేసే వారి అనుభవం కాని, విజ్ఞానం కాని, నైపుణ్యం కాని పెద్ద కమతాలకు పనికి రాదు. యాంత్రికీకరణ వలన చేయడానికి పనులు కూడా పెద్దగా ఉండవు. వీరంతా ప్రత్యామ్నాయ ఉపాధులు వెతుక్కోవాలి. ప్రభుత్వం ఇప్పుడు చెపుతున్న దాన్నిబట్టి చూస్తే పొలాలు (పట్టాలు) ఉన్న వారినే రైతులుగా గుర్తిస్తున్నట్టు కనబడుతోంది. చాలా గ్రామాలలో ఇప్పుడు కౌలు రైతుల సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. గోదావరి జిల్లాలలో అయితే ఇది 70 శాతం వరకూ ఉంది. మరి ఈ సంఘాలలో వీరి పాత్ర ఏంటి? పొలం ఉండదు కాబట్టి ప్రభుత్వం చెబుతున్న షేర్లు రావు. మరి వీరి జీవనోపాధి ఏంటి? వ్యవసాయ సంక్షోభంతో ఉపాధులు కోల్పోయి ఇప్పటికే కష్టాలు పడుతున్న వ్యవసాయ కూలీల పరిస్థితి ఏంటి? ఈ పెద్ద క్షేత్రాలలో అంతా యాంత్రికీకరణ చేసే పరిస్థితులలో ఉపాధి అవకాశాలు ఎక్కడ ఉంటాయి? పెద్ద రైతులు, చిన్న రైతులు ఉండే ఈ సహకార సంఘాలలో భూమి ఆధారంగా ఓట్లు నిర్ణయించినప్పుడు చిన్న, సన్నకారు రైతుల పరిస్థితి ఏంటి? సొసైటీ వ్యవసాయం చేస్తుంది అంటున్నారు మరి వీరికి సాంకేతిక సహకారం ఎవరు అందిస్తారు? ఇప్పటిదాకా మన వ్యవసాయ అధికారులకి కాని, వ్యవసాయ శాస్త్రవేత్తలకి కాని ఇటువంటి అనుభవం లేదు కాబట్టి కంపెనీల సహాయం తీసుకుంటారా? ప్రభుత్వం ముందు ఈ ప్రశ్నలకి సమాధానం చెప్పాలి.

ఈ వివాదాలు ఇలా ఉండగానే ప్రభుత్వం 26 జూలై 2009న అన్ని దినపత్రికలలో 'చిన్న చిన్న కమతాలను ఒకే పెద్ద వ్యవసాయ క్షేత్రంగా మార్చడానికి సహకరించండి' అంటూ గ్రామ సభలలో తీర్మానాలు చేసి పంపవలసిందిగా రైతులకు విజ్ఞప్తి చేస్తూ ప్రకటనలు ఇచ్చింది. ప్రభుత్వం ఎవరితో చర్చిస్తుందో, చర్చించిన వారు ఏమి సలహాలు ఇచ్చారో కూడా తెలియదు. అన్ని రైతు సంఘాలు తమ వ్యతిరేకతను తెలియజేశాయి. అలాగే రాజకీయ పార్టీలు కూడా అసంతృప్తి వ్యక్తం చేశాయి. అసెంబ్లీలో చర్చలేదు, బిల్లు లేదు. మరి ఇంత తొందర ఎందుకు?

ఆర్గనైజ్డ్ సెక్టార్ ప్రతి రంగాన్ని హస్తగతం చేసుకున్నట్టే వ్యవసాయ రంగాన్ని కూడా హస్తగతం చేసుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలలో భాగంగా ఇలాంటి ప్రతిపాదనలు వస్తున్నాయి. వ్యక్తిగతంగా వ్యవసాయం చేసుకునే పరిస్థితి రైతులకి, ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులకి నేడు నిజానికి లేదు. అందుకని ఇటువంటి రైతులందరిని సంఘటితం చేసి వారి సహకార సంఘాల ఆధ్వర్యంలో వ్యవసాయం చేసుకోవడం, ప్రాసెసింగ్ చేసుకోవడం వంటివి చేస్తున్న సంఘాలు ఉన్నాయి. ప్రభుత్వం వీటి నుంచి నేర్చుకోవచ్చు. వీటికి ప్రభుత్వం మద్దత్తు ఇస్తే ఇవి మంచి ప్రత్యామ్నాయాలుగా రూపుదిద్దుకుంటాయి.

సుస్థిర వ్యవసాయ కేంద్రం సహకారంతో ప్రస్తుతం ఆరు రైతు సహకార సంఘాలు, ఒక వినియోగదారుల సంఘం నడుస్తున్నాయి. సహజ ఆహారం పేరుతో రైతులు నేరుగా వినియోగదారులకి

*రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా, ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా శిక్షాకాలం పూర్తయి కూడా యేళ్ల తరబడి జైళ్లలో మగ్గుతున్న జీవిత ఖైదీలను వెంటనే విడుదల చేయాలంటున్నారు* **వరవరరావు**

# ఖైదు - విడుదల దాగుడుమూతలాట

ఏడు సంవత్సరాలు సత్ప్రవర్తనతో జీవితఖైదు శిక్షపూర్తి చేసిన ఖైదీలకు విముక్తి లభించకుండానే 2009 ఆగస్ట్ 15 కూడా గడచిపోయింది. వీళ్లంతా తమ హక్కుగా 2005 ఆగస్ట్ 15న విడుదల కావల్సి ఉండినవారు. అంటే ఇప్పటికే నాలుగు సంవత్సరాలు అదనంగా జైళ్లలో మగ్గుతున్నారు. ఈ నాలుగు సంవత్సరాలలో ప్రతిసంవత్సరం మళ్లీ కొత్తగా ఏడు సంవత్సరాల శిక్ష పూర్తి చేసిన సత్ప్రవర్తన కలిగిన జీవిత ఖైదీలు వచ్చి చేరుతున్నారు. వాళ్లూ విడుదల కోసం నిరీక్షిస్తూనే ఉన్నారు. తాజాగా ఈ ఆగస్ట్ 15న ఏడు సంవత్సరాల శిక్షపూర్తి చేసినవాళ్లు కూడా ఆగస్ట్ 24 దాకా తమ నాలుగేళ్ల సీనియర్లతోపాటు కొత్తగా తమ ముందు ఏర్పడుతున్న ఎండమావి ప్రయాణంలో చేరిపోయారు. ఆగస్ట్ 24న సుప్రీంకోర్టు తన ముందు ఉన్న వ్యాజ్యాన్ని విచారణకు స్వీకరించి లేదా తిరస్కరించి ఒక అనుకూలమైన ముగింపు పలికితే తప్ప జీవిత ఖైదీలకిది గేట్లు తెరచుకోని ఎత్తైన జైలుగోడల వర్తులాకారపు లోపలి దారుల్లో ఎడతెగని ప్రయాణం. బయల్దేరిన చోటికే చేర్చే గానుగెద్దు చంక్రమణం.

ఎందుకిట్లా జరుగుతున్నది?

2004 ఆగస్ట్ 15న వెయ్యిమంది దాకా జీవిత ఖైదీలు విడుదల అయ్యారు అది కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినాక వచ్చిన మొదటి ఆగస్ట్ 15. వై.ఎస్. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా, కె. జానారెడ్డి హోంమంత్రిగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నక్సలైట్లతో చర్చలకు సానుకూల పరిస్థితులు ఏర్పడిన సందర్భం. అప్పటికి గాలింపు చర్యలు, ఎన్‌కౌంటర్లు ఆగిపోయి, పీపుల్స్‌వార్ పై నిషేధం తొలగిపోయి, ఇంకా చర్చలకొక ప్రాతిపదిక ఏర్పడుతున్న కాలం. అప్పటికెప్పుడో ఏడు సంవత్సరాల శిక్షాకాలం పూర్తిచేసి జైలు నుంచి తప్పించుకున్న కేసులో కూడా ఉన్నందున విడుదల ఆగిపోయిన ఒకే ఒక్క జీవితఖైదీ బండిప్రకాశ్ కూడ ఆ సంవత్సరం విడుదలయ్యారు.

ప్రభుత్వం వైపు నుంచి కూడా ఈ అనుకూల వైఖరి 2005 జనవరి నాటికే మారిపోవడం ప్రారంభమైంది. 2005 ఆగస్ట్ 15కు విడుదల కావడానికి సిద్ధమైన జీవితఖైదీల జాబితాలో ముఖ్యమంత్రికి అనుకూలురైన ఒకరిద్దరు ఉన్నారు గనుకనే 10 సంవత్సరాల శిక్ష పడి

---

అమ్ముకోగలుగుతున్నారు. నల్గొండ, వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాల లోను, హైదరాబాద్ నగరంలోను సహజ ఆహారం దుకాణాలని కూడా నడుపుతున్నారు. ఈ సహకార సంఘాల ఆధ్వర్యంలోనే మిరప, పసుపు, పప్పుధాన్యాలు, ప్రాసెసింగ్‌తో పాటు ఖమ్మం, కరీంనగర్ జిల్లాలలో పత్తి విత్తనాల నుంచి బట్ట నేసే వరకు ప్రాసెసింగ్ వ్యవస్థ నడుస్తోంది.

అలాగే అనంతపూర్ జిల్లాలో అనంతపూర్ పర్యావరణ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పదమూడు సహకార సంఘాలు, టింబక్టు కలెక్టివ్ సహకారంతో ఆదిశక్తి ధరణి రైతు సహకార సంఘం, మెదక్ జిల్లాలో డి.డి.ఎస్. సంఘాలు కూడా ఇటువంటివే. ప్రభుత్వం వీటినుంచి అనుభవాలు తీసుకోవాలి.

చిన్నకమతాలను పెద్దకమతాలుగా మార్చే విధానాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలి. ఇప్పుడు ప్రభుత్వం ప్రతిపాదించినట్టుగా ఒకే పద్ధతి కాకుండా రెండు – మూడు విధానాలను ప్రయత్నించాలి. గ్రామంలో వ్యవసాయం చేసే రైతులందరి సహకార సంఘం ఏర్పాటు చేసి వారికి కావలసిన వనరులు, ప్రాసెసింగ్ పరిశ్రమలు మొదలైనవి స్థాపించడానికి సహాయం చేయాలి. ఇప్పుడు ఉన్న మహిళా సంఘాల తరహాలోనే చిన్న సంఘాలు ఏర్పాటు చేసి, వాటి ఫెడరేషన్‌గా పెద్ద సంఘాలను, వాటి ఆధ్వర్యంలో వ్యవసాయం నడిపించడం చేయవచ్చు. ఈ మహిళా సంఘాల ద్వారా గత ఐదు సంవత్సరాలుగా నడుస్తున్న 'సుస్థిర వ్యవసాయ కార్యక్రమం' ఇప్పుడు దాదాపు మూడు వేల గ్రామాలలో ఇరవై లక్షల ఎకరాలలో నడుస్తోంది. ఈ గ్రామాలలో ఇతర వసతులు కల్పించి, వ్యవసాయ సహకార సంఘాలు స్థాపించాలి.

పెద్ద క్షేత్రాల వ్యవసాయం ఇప్పటి వరకు మన రాష్ట్రంలో ఎక్కడా అమలు కాలేదు. అనుభవం లేదు కాబట్టి, వ్యవసాయ విశ్వవిద్యాలయాల ఆధ్వర్యంలో పరిశోధనా స్థానాలలో ముందు అమలు చేసి, లాభనష్టాలు నిష్పాక్షికంగా బేరీజు వేసి లాభముంటుంది అనుకుంటే అప్పుడు అమలు చేయవచ్చు. దీని పర్యవేక్షణకు ఒక ప్రజాకమిటీని నియమించవచ్చు. వీటికి కూడా ప్రస్తుతం ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న తరహాలోనే సహాయం అందించవచ్చు. అలాగే పెద్దక్షేత్రాల కోసం ప్రభుత్వం పెట్టే నియమ నిబంధనలే అమలు చేయవచ్చు. రెండు – మూడు సంవత్సరాల తరువాత సమీక్షించి ఏ విధానం బాగుంటే దానిని అమలు చేయవచ్చు.

ప్రస్తుతం ప్రతిపాదనలు యథాతథంగా అమలు చేయడానికి ప్రయత్నం చేస్తే మాత్రం తీవ్రమైన సమస్యలను అటు రైతులు, ఇటు ప్రభుత్వం ఎదుర్కోవలసి వస్తుంది. వీ

సత్ప్రవర్తన కలిగినవాళ్లు, జీవితఖైదు పడి ఏడు సంవత్సరాల సత్ప్రవర్తన కాలం పూర్తిచేసిన వాళ్లు – విడుదల కాకుండా సుప్రీంకోర్టులో ఒక న్యాయవాది ప్రజాప్రయోజన వ్యాజ్యం వేసి స్టే తెచ్చాడు. తెలుగుదేశం పార్టీ, రెండు దిన పత్రికలు ఈ వాదాన్ని విస్తృతంగా ప్రచారం చేశాయి.

ఇంకా విడమరచి చెప్పుకోవాలంటే నంద్యాలకు చెందిన గౌరు వెంకటరెడ్డికి ఒక హత్యకేసులో జీవితఖైదు శిక్షపడింది. అది హైకోర్టులోను ఖరారయింది. ఆయన సుప్రీంకోర్టుకు వెళ్లి ఆ శిక్షను పది సంవత్సరాల శిక్షగా తగ్గించుకున్నాడు.

అది ప్రభుత్వం ఇచ్చిన రాయితీకాదు. సుప్రీంకోర్టు ఆదేశించిన తగ్గింపు. అందుకు తప్పుపడితే సుప్రీంకోర్టును తప్పుపట్టాలి. సుప్రీంకోర్టు నుంచి అటువంటి న్యాయాన్ని పొందగలిగే అవకాశాలను తప్పుపట్టాలి.

చూసేవాళ్లకు కూడా ఈ అభ్యంతరం ఎందుకు సబబని పిస్తుందంటే ఈ శిక్ష అనుభవిస్తున్న కాలంలో స్వయాన ముఖ్యమంత్రి వై.ఎస్.ఆర్. వెళ్లి తన మిత్రుడు గౌరు వెంకటరెడ్డిని జైల్లో కలిసారు. ఆయన భార్య గౌరు చరితను ఎం.ఎల్.ఎ. చేసారు. నామినేటెడ్ పదవి కాదు గనుక టికెట్టు ఇవ్వడం వరకే ఆయన చేసారు, ప్రజలే ఎన్నుకున్నారని కూడా ఈ అభ్యంతరాన్ని కొట్టి పారేయవచ్చు.

2005 ఆగస్ట్ 15 నాటికి జైలు అధికారులు, హోంశాఖ వగైరా అందరు కుమ్మక్కయి సహకరించారనుకున్నా ఆ తర్వాత ఆగస్ట్ 15కైనా ఆయనను ఆపడం పద్ధతి ప్రకారం కూడా సాధ్యమై ఉండేదికాదు. పదేళ్ల శిక్ష పడినవాళ్లు జైలు రెమిషన్‌తో విడుదల కావడానికి ఐదేళ్ల శిక్షాకాలం చాలు.

నిజంగా జరిగిన నష్టమేమిటంటే ఆ ఆగస్ట్ 15న విడుదల కావల్సి ఉండిన పదేళ్ల శిక్ష పూర్తిచేసిన సత్ప్రవర్తన కలిగిన ఖైదీలు అందరూ ఆగిపోయారు. ఆ తర్వాత ఆగస్ట్ 15కు సుప్రీంకోర్టు పదేళ్ల శిక్ష పడిన వారి విషయంలో స్టే ఎత్తివేసినందున గౌరువెంకటరెడ్డి కూడా విడుదలయ్యాడు.

ఇంక జీవితఖైదీల విషయంలో స్టే ఉండిపోయింది. అంటే ఈ వ్యాజ్యం దృష్టిలో జీవిత ఖైదీ మద్దెల చెరువు సూర్యనారాయణ రెడ్డిని దృష్టిలో పెట్టుకొని వచ్చిన జి.ఓ.పై స్టే ఉండిపోయింది.

2009 జనవరి 27న సుప్రీంకోర్టు ఈ స్టేను ఎత్తివేయడమే కాకుండా ఖైదీలకు క్షమాభిక్ష పెట్టే విషయంలో గవర్నర్‌కు ఉండే విచక్షణాధికారాన్ని గుర్తించింది. అంటే రాష్ట్ర ప్రభుత్వం జీవిత ఖైదీలకు సంబంధించిన మార్గదర్శకాలను రూపొందించి సత్ప్రవర్తన కలిగిన ఖైదీలకు క్షమాభిక్ష పెట్టే విషయంలో ఏ నిర్ణయమైనా తీసుకునే విచక్షణాధికారాన్ని తిరిగి పొందింది. ఇటువంటి విచక్షణకు గతంలో ఏమైనా మార్గదర్శకాలు ఉన్నాయా? అంటే చట్టాల్లో ఉన్నాయి. చారిత్రకంగా వస్తున్న అనూచాన సంప్రదాయంలో ఉన్నాయి. మౌలికంగా జైళ్లు సంస్కరణా నిలయాలు అనే భావనలో ఉన్నాయి.

భారత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు, ఆ ఆదేశిక సూత్రాలకు ఒక ప్రేరణ అయిన గాంధీజీ ఆలోచనలు ఈ సంస్కరణ భావనకు ప్రాతిపదిక. నేరస్తుణ్ని కాదు, నేరాన్ని శిక్షించాలి. సమాజం మానవతా దృక్పథంతో ప్రవర్తించినప్పుడు ఎంతటి నేరం చేసినవాడయినా పశ్చాత్తాపానికి గురయి ఐదేళ్లలో పూర్తిగా మనిషిగా మారిపోతారు – కనుక ఎంతటి నేరానికైనా అయిదేళ్లకు మించిన శిక్ష ఉండకూడదని గాంధీజీ భావించాడు. తనను కాల్చిన గాడ్సేను కూడా క్షమించి వదిలేయమని చెప్పాడు.

అలహాబాదు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా చేసి పోలీసు సంస్కరణలు, జైలు సంస్కరణలపై విస్తృతమైన అధ్యయనం చేసి ప్రామాణికమైన నివేదిక రూపొందించిన జస్టిస్ ముల్లా తన సిఫార్సులు అన్నిటికీ గాంధీజీ భావాలనే ఆలంబనగా చేసుకొని జైళ్లు సంస్కరణా లయాలు కావాలన్నాడు. నేరస్తుని పశ్చాత్తాపానికి, మార్పుకు ఐదు సంవత్సరాల కాలవ్యవధి చాలునన్నాడు.

తమకు క్షమాభిక్ష పెట్టాలని కోరుతూ జీవితఖైదీలు రాసే ప్రతి విన్నపంలోనూ గాంధీజీ, జస్టిస్ ముల్లాలను ప్రస్తావించడం మనం అనివార్యంగా చూడొచ్చు. ఇదంతా ఇంతకూ వాళ్లు నిజంగా నేరస్తులయితేనే. మనదేశంలో, ఆమాటకొస్తే అసమ సమాజంలో, ఆస్తి సంబంధాలు, ఉత్పత్తి సంబంధాలు, నేరస్వభావాన్ని నిర్వచించే చట్టాల ముందు నేరం చేసిన వాళ్లే జైలుకుపోతున్నారా, జైళ్లలో మగ్గుతున్న వాళ్లు ఎంతమంది నిజంగా నేరాలకు పాల్పడ్డవాళ్లు, బయట ఉన్న వాళ్లంతా ఏ నేరం చేయని వాళ్లేనా – అనే ప్రశ్న ఎవరికి వారు గుండెల మీద చేతులు వేసుకుని నిర్భయంగా జవాబు చెప్పలేని భేతాళప్రశ్న.

పాపి, పతిత, అమాయకమైన మేకపిల్ల పక్షం వహించిన జీసస్ క్రైస్తు, 'పతితులార, భ్రష్టులార, బాధాసర్పదష్టులార, చెరసాలలు, ఉరికొయ్యలు, కాలువలో ఆత్మహత్య! దగాపడిన తమ్ములారా! మీ బాధలు నేనెరుగుదు' అనీ 'నిరపరాధులై దురదృష్టంచే చిక్కేవాళ్లు' అనీ ఆశ్వాసం పలికిన శ్రీశ్రీ, నోరున్నవాళ్లు నోరులేని, పేరులేని పేదల, పీడితుల పక్షం వహించాలన్న రావిశాస్త్రి నేరం వ్యవస్థకు సంబంధించిన లక్షణం కాని, వ్యక్తికి సంబంధించింది కాదని భావించినవాళ్లే.

ముఖ్యంగా భారతదేశంలో జైళ్లలో శిక్షలుపడిగానీ, ముద్దాయిగా గానీ మగ్గుతున్న వాళ్లలో నూటికి తొంభైతొమ్మిది మంది ఆస్తి సంబంధమైన, ఉత్పత్తి సంబంధమైన అసమానతల వల్ల, పీడన, అణచివేత, దోపిడీ వల్ల జైలుకు వెళ్లినవాళ్లే. వాళ్లలో ఆస్తిహక్కును కాపాడే చట్ట ప్రకారం న్యాయంగా విచారించినా నేరం చేయని వాళ్లే ఎక్కువ. ఆ ఆస్తి సంబంధమైన, అధికార సంబంధమైన వనరులు, అవకాశాలు లేక తమ నిర్దోషిత్వాన్ని రుజువు చేసుకోలేనివాళ్లే. లైంగిక సంబంధమైన నేరాలు, క్షణికావేశంలో చేసిన నేరాలు, ఈ వ్యవస్థ వల్ల అలవడిన నేర ప్రవృత్తితో చేసిన నేరాలు కూడ ఉంటే ఉండవచ్చు.

చట్టప్రకారమే జీవిత ఖైదు అంటే ఇరవై ఏళ్లు. జైల్లో సత్ప్రవర్తన వల్ల లభించే రెమిషన్‌తో ఇది పద్నాలుగు సంవత్సరాలకే పూర్తవుతుంది. అంటే చట్టప్రకారం చూసినా ఏ జీవిత ఖైదీ కూడా పద్నాలుగు సంవత్సరాలకు మించి జైల్లో ఉండడానికి వీలులేదు.

బ్రిటిష్ కాలంలో కూడ ఇటువంటి నిబంధన, నిర్వచనం ఉన్నందు వల్లనే జీవితకాలమంతా ఖైదీగా ఉంచాలనుకునేవాళ్లను అండమాన్ ద్వీపానికి ప్రవాసం పంపేవాళ్లు. లేదా దేశంలోనే 'కాలాపానీ' అనే శిక్ష విధించేవాళ్లు. హైదరాబాద్ సంస్థానంలో పాఖాల అడవులకు 'కాలాపానీ' శిక్షవేసి పంపించేవాళ్లు. అంటే సాధారణ జైళ్లలో ఉండేవాళ్లు పద్నాలుగేళ్లకే విడుదలవుతారని విస్పష్టమైన అవగాహన.

జీవిత ఖైదీలు జైల్లో తమ సత్ప్రవర్తన వల్ల ఈ పద్నాలుగేళ్లను సంప్రదాయికంగా (కన్వెన్షనల్‌గా) ఏడేళ్లుగా మార్చుకున్న వైనాన్ని మనం హైదరాబాద్ రాష్ట్రంలో, 1975లో ఎమర్జెన్సీ విధించేదాకా ఆంధ్రప్రదేశ్ జైళ్లలో చూడవచ్చు.

నేను 1973లో మొదటిసారి జైలుకు వెళ్లినపుడు ఒక లైఫర్‌ను ఇరవై ఏళ్లు ఏడేళ్లు ఎట్లా అవుతాయి అని అడిగాను. ఇరవయ్యేళ్లు రెమిషన్‌తో పద్నాలుగేళ్లు కదా. పద్నాలుగంటే ఏడు రెండ్లుకదా – అన్నాడు. అంతే అన్నాను. పద్నాలుగేళ్లు చుక్క (అంటే కచ్చితంగా) కొయ్యాలి కదా – జైల్లో దినమూ, రాత్రీ తేడా ఏముంది. దినమంతా పనిచేస్తాం, రాత్రి అంతా చుక్కకెదురు చూసినట్లు చూస్తూ కన్ను పొడుచుకుని రేపటిలోకి చూస్తుంటాం – అన్నాడు. ఆకాశంలో చుక్కలు, ఈ మాటలు చెప్తున్న ఖైదీనోట్లో బీడీ చివరన నిరాశ బూడిద దులిపిన నిప్పు – అట్లే మిణుకు మిణుకుమంటుంటాయి. ఈ ఖైదీల భావనకు, ఆకాంక్షకు అనుకూలమైన ఆచరణయే హైదరాబాద్ రాష్ట్రంలోను, ఆంధ్రప్రదేశ్‌లోను 1975 దాకా కొనసాగింది.

హైదరాబాద్ రాష్ట్రంలో (నైజాం కాలం నుంచి కూడ) జైళ్లకు అడ్వయిజరీ బోర్డులుండేవి. అందులో కలెక్టర్, జిల్లా పోలీసు అధికారి, జైలు సూపరింటెండెంట్‌తో పాటు ఒక ప్రొబేషనరీ అధికారి, సమాజంలో అందరి మన్ననలు పొందిన పెద్ద మనుషులు ఉండేవాళ్లు. హైదరాబాద్‌లో గోపాలరావు ఎక్బొటే వంటి వాళ్లు, వరంగల్‌లో కాళోజీ రామేశ్వర్‌రావు వంటి వాళ్లు. ప్రొబేషనరీ ఆఫీసర్ జైళ్లకు సంబంధించిన సివిల్ అధికారి. అతడు జైల్లో ఖైదీ సత్ప్రవర్తనను, బయట అతని / ఆమె గ్రామం, ప్రాంతంలో ప్రజలకు అతని / ఆమె పట్ల కాలం గడుస్తూ ఉంటే మారుతున్న వైఖరులను బేరీజు వేసేవాడు.

ఇటువంటి సలహామండలి ఆరున్నర ఏళ్లకు ఒకసారి తప్పకుండా జీవిత ఖైదీల విడుదల గురించే సమావేశమయ్యేది. అందులో కేవలం సత్ప్రవర్తనయే గీటురాయిగా జీవితఖైదీలను విడుదల చేసేవారు. ఈ సత్ప్రవర్తన జైలు సూపరింటెండెంట్, ప్రొబేషనరీ అధికారి, సామాజిక ప్రతినిధుల సిఫార్సులపైననే నిర్ణయింపబడేది.

ఇటీవల జీవితఖైదీల విడుదల గురించి, రాజకీయ ఖైదీల విడుదల గురించి ఏర్పడిన కమిటీ తరఫున మేము ముఖ్యమంత్రిని కలిసినపుడు కన్నబిరాన్ ఆయనకదే గుర్తుచేసారు. జీవిత ఖైదీల విడుదలకు సత్ప్రవర్తన గీటురాయి కావాలి కాని శిక్షాస్మృతిలో సెక్షన్లు కాదు అని.

గవర్నర్, అంటే ప్రభుత్వం క్షమాభిక్ష పెడుతున్నది ఎందుకు! పశ్చాత్తాపం పొంది సత్ప్రవర్తనాపరులైనందుకు. ఇంక నేరము – శిక్షతో ఏ సంబంధముంది! ఎటువంటి నేరానికి పడిన శిక్ష అని విచారించడానికి – ఇది న్యాయస్థానం కాదు. సత్ప్రవర్తన కోసం క్షమాభిక్ష పెట్టదలుచుకున్న ప్రభుత్వం. అది కూడ పెద్దమనసుతో ఆగస్ట్ 15, అక్టోబర్ 2, జనవరి 26 సందర్భాల్లో.

ఈ సంప్రదాయం, సంప్రదాయాన్ని గౌరవించిన చట్టం హైదరాబాద్ సంస్థానంలో, రాష్ట్రంలో 1956 దాకా, ఆంధ్రప్రదేశ్‌లో 1975దాకా కొనసాగి ఆరున్నర సంవత్సరాలు సత్ప్రవర్తన శిక్ష పూర్తిచేసిన జీవితఖైదీలు ఒక ఆనవాయితీ ప్రకారం మినహాయింపు లేకుండా విడుదలయ్యేవాళ్లు.

1975లో ఎమర్జెన్సీలో ముఖ్యమంత్రిగా వెంగళరావు ఏడేళ్లు గడచినా సలహా మండలిని సమావేశపరచలేదు. జీవిత ఖైదీలను విడుదల చేయలేదు. జీవించే హక్కు తప్ప అన్ని హక్కులూ రద్దయిన కాలం అది. అయినా జీవిత ఖైదీలు వందలాదిగా హైకోర్టులో, సుప్రీంకోర్టులో తమ హక్కు సాధించుకోవడానికి పోరాడారు. అటువంటి వందలాది పిటిషన్లను కన్నబిరాన్ హైకోర్టులో, సుప్రీంకోర్టులో వాదించారు.

సుప్రీంకోర్టు 'లైఫంటే లైఫే కదా' ని ఆశనిపాతం వంటి తీర్పు ఇచ్చింది. న్యాయమూర్తులంటే (ఇంగ్లిష్ పదానికి తగ్గట్లు) తీర్పులు చెప్పే వాళ్లని, జైల్లో ఉండేవాళ్లంటే నేరస్తులని భావించే నిర్హేతుక అహంభావం నుంచి ఇచ్చిన తీర్పు ఇది.

ఈ స్థితి ప్రభుత్వ దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి 1995 మార్చ్ వరకు కొనసాగింది. 1994 డిసెంబర్‌లో ఎన్.టి.ఆర్. నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చిన సందర్భంలో ఆంధ్రప్రదేశ్ జైళ్లలో ఉన్న జీవితఖైదీలు, నక్సలైటు ఖైదీలు సమష్టిగా చరిత్రాత్మకమైన జైలుపోరాటం నిర్వహించారు. ఆ పోరాట డిమాండులలో జైలు సదుపాయాలు, భావస్వేచ్ఛ వంటి అంశాలతోపాటు ఆరున్నర సంవత్సరాలు శిక్షాకాలం పూర్తిచేసిన, సత్ప్రవర్తన కలిగిన జీవిత ఖైదీలను విడుదల చేయాలన్నది అతి ముఖ్యమైనది. వెంటనే ఫలించింది కూడా అదే. ప్రభుత్వం తరఫున హోంమంత్రిత్వ శాఖ, ఖైదీల తరఫున, ఖైదీల సంఘీభావ కమిటీ తరఫున ప్రతినిధులు సమష్టిగా చేసిన ఒప్పందం ప్రకారం నాలుగు వందల మందికి పైగా జీవితఖైదీలు విడుదలయ్యారు.

ఈ సంప్రదాయం, చట్టం, ఒప్పందం, జమిలిగా 1995 నుంచి 2004 ఆగస్ట్ దాకా కొనసాగినవి. అయితే కేంద్ర ప్రభుత్వ చట్టాలు, పేలుడు పదార్థాల నిరోధక చట్టం, ఆయుధాల చట్టం వంటివి మినహాయించడం వల్ల నక్సలైటు ఖైదీలకే ప్రతిబంధకం ఏర్పడింది.

నక్సలైటు ఖైదీలు పార్వతీపురం కుట్రకేసులోనయితే అండర్ ట్రయల్స్ ఖైదీలుగానే 1969 నుంచి 1976 దాకా అంటే ఏడేళ్లు జైళ్లలోనే ఉన్నారు. జైలు పోరాటానికి నాయకత్వం వహించిన పటేల్ సుధాకర్ రెడ్డి, శాకమూరి అప్పారావు, మోడెం బాలకృష్ణ ఏడేళ్లకు పైగానే అండర్ ట్రయల్స్‌గానే జైల్లో ఉన్నారు. బెయిలురాకపోవడం, బెయిలు వచ్చినా జమానత్ ఇవ్వకుండా పోలీసులు బయటివారిని బెదిరించడం, ఈ రెండింటినీ అధిగమించి విడుదలయితే మళ్లా జైలు బయటనే అరెస్టు చేసి కొత్తకేసులు పెట్టడం, లేదా జైల్లో ఉండగానే కొత్త వారంటులు పంపడం వంటి కారణాల వల్ల నక్సలైటు ఖైదీలు (జైళ్లలో శిక్షలు పడిన నక్సలైటు ఖైదీలు వేళ్లమీద లెక్కపెట్టదగినంత మందే ఉంటారు) జీవిత ఖైదీల వలె సుదీర్ఘకాలం జైళ్లలోనే మగ్గుతుంటారు. ('ఎన్‌కౌంటర్' వంటి సర్వసాధారణమైన మరణశిక్షలను పరిస్థితులు, పరిసరాలవల్ల తప్పించుకున్న వాళ్లు, ఆ బారిన అదృష్టవశాత్తు పడనివాళ్లు).

అందువల్లనే జీవితఖైదీల విషయంలో వలె కాకుండా రాజకీయ ఖైదీల విషయంలో విడుదల కోసం పోరాటం చరిత్రలో చిరకాలంగా సాగుతున్నది. బ్రిటిష్ ప్రభుత్వకాలంలో తెల్లవాళ్ల పరిపాలనను ప్రతిఘటిస్తూ పోరాడిన అన్ని రాజకీయ పార్టీలు, సంస్థలు, స్థూలంగా మనం చెప్పుకుంటున్న జాతీయోద్యమంలో పాల్గొన్న వాళ్లంతా రాజకీయ ఖైదీలే.

అందుకే ప్రభుత్వం చేసిన నేరారోపణతో సంబంధం లేకుండా తిలక్‌ను మాండలే జైలు నుంచి విడుదల చేయాలని, భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల ఉరిశిక్షలు రద్దుకావాలని, కాకోరీ, మీరట్, లాహోర్ కుట్రకేసుల వంటివి ఎత్తివేయాలని ఆ రోజుల్లో దేశవ్యాప్తమైన ఉద్యమాలు నడిచినవి.

గాంధీ, నెహ్రూ వంటి నాయకులను ఎప్పుడు ఎందుకు అరెస్టు చేసినా, వాళ్లపై రాజద్రోహం వంటి నేరం మోపినా, వాళ్లను విడుదల చేయాలనే డిమాండ్‌తో ఉద్యమాలు సాగేవి. ముఖ్యంగా భగత్‌సింగ్, అరవిందఘోష్ వంటి వాళ్లను బ్రిటిష్ ప్రభుత్వం టెర్రరిస్టులనే పిలిచి ఉండవచ్చు. వాళ్లపై బాంబులు చేసిన, వేసిన కేసులే పెట్టి ఉండవచ్చు. బ్రిటిష్ ప్రభుత్వం దృష్టిలో ప్రభుత్వాలను కూల్చే కుట్ర చేసిన 'దేశద్రోహుల'ందరు ప్రజల దృష్టిలో ప్రజా ఉద్యమాలు నడిపిన దేశభక్తులే. భారతశిక్షా స్మృతిలోని 120 నుంచి 128 వరకు ఉన్న సెక్షన్లు, ప్రివెంటివ్ డిటెన్షన్‌లు వర్తించే అందరూ రాజకీయ ఖైదీలేనని స్థూలంగా భావించవచ్చునని గతంలో హోంమంత్రి జానారెడ్డిగారి ముందు కన్నబిరాన్ వాదించారు. వీటికితోడు సమాజంలో పరస్పర ద్వేషాలు రెచ్చగొట్టే నేరం పేరుతో పెట్టే సెక్షన్లు, టాడా, పోటా, ప్రజాభద్రతా చట్టం, యుఎపిఎ (అన్‌లాఫుల్ యాక్టివిటీస్ ప్రివెంటివ్ ఆక్టు) వంటివన్నీ రాజకీయ ప్రత్యర్థులపై ప్రయోగించేవే. ఈ అప్రజాస్వామిక చట్టాలు, భారత శిక్షాస్మృతిలోని పైన పేర్కొన్న సెక్షన్ల కింద జైళ్లలో మగ్గుతున్న వాళ్లంతా రాజకీయ ఖైదీలని స్థూలంగా పేర్కొనవచ్చు.

జైళ్లకు, ఎస్కార్టు వాళ్లకు, కింది కోర్టులకు కూడా అర్థమయ్యే భాషలో చెప్పాలంటే ఎన్ఎక్స్ఎల్. వారంటులోను, కేసు డాకెట్ పైన రాసి ఉన్న ప్రతి ఖైదీ, ఐఎస్ఐ అని వారంటుపైన, కేసు డాకెట్ పైన మాత్రమే కాకుండా చెర్లపల్లి జైలువంటి జైళ్లలో ప్రత్యేకించి ఏర్పాటు చేసిన బ్యారక్‌లలోనూ ఉన్నవాళ్లంతా రాజకీయ ఖైదీలే. వీళ్లమీద తప్పకుండా 120 బి – చట్టబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాన్ని సాయుధంగా కూల్చాలని చేసిన కుట్ర, 124 ఎ – రాజద్రోహం నేరం మాత్రమే కాకుండా పేలుడు పదార్థాల నిరోధక చట్టం, చట్టవ్యతిరేకంగా ఆయుధాలు కలిగి ఉన్న చట్టం, హత్యాప్రయత్నం, హత్యానేరాలు పెడతారు. శిక్ష సంగతి ఎలా ఉన్నా వేధించడానికి.

మళ్లీ ప్రస్తుతానికి వద్దాం.

సుప్రీంకోర్టు 2009 జనవరి 27న స్టే తొలగించి, గవర్నర్‌కుండే క్షమాభిక్ష విచక్షణను వినియోగించుకోవచ్చునని చెప్పినా అప్పటి ప్రభుత్వం కదలలేదు. వాస్తవానికి జైళ్లు ఎప్పటికప్పుడు ఏ గడువు (కటాఫ్ డేట్) పెడితే ఆ గడువుకు తగినంతమంది జీవితఖైదీల జాబితాలు తయారు చేసి సిద్ధంగా ఉంటున్నాయి. పంపమన్నదే ఆలస్యంగా జైళ్ల ఉన్నతాధికారులకు పంపుతున్నాయి. ప్రభుత్వం దానిమీద తాత్సారం చేస్తున్నది. ఎన్నికల నియమావళి ప్రకటించక ముందే సుప్రీంకోర్టు ఉత్తర్వులు అమలు చేయమని అటు జీవితఖైదీలు, ఇటు ప్రజాస్వామ్య వాదులు ఎన్నో విన్నపాలు చేసారు. మహజర్లు పంపారు. ప్రభుత్వం మాయమాటలు చెప్పి కాలయాపన చేసింది. ఇంతలో ఎన్నికల నియమావళి వచ్చింది. ఎన్నికల నియమావళి రాకముందు హోంమంత్రి అయినా, ముఖ్యమంత్రి అయినా, ప్రభుత్వంలో బాధ్యత గల వారయినా చెప్పిందేమంటే – ఇప్పుడు మేం ఏం చేసినా, మాకు కావల్సిన వారిని విడుదల చేయడానికే చేసామని ప్రతిపక్షాలు ఆరోపిస్తాయని, అందుకే ఆచితూచి అడుగేస్తున్నామని, ప్రతిపక్షాలను, వాళ్లకు అనుకూలంగా రాస్తున్న పత్రికలను అడ్డురాకుండా చూడమన్నారు.

జీవితఖైదీలు, వాళ్ల తరఫున మాట్లాడేవాళ్లు ప్రతిపక్షాలకు, ముఖ్యంగా టిడిపి కి, చంద్రబాబు నాయుడుకు చాల ఓపికగా కింది విషయాలు వివరించారు.

ఇపుడింక మద్దెల చెరువు సూర్యనారాయణ రెడ్డి విడుదల కోసమే ప్రభుత్వం జాబితా తయారు చేస్తున్నదని మీరంటున్నారు కదా. మీరు సూరి గురించి ఎంతమంది జీవితఖైదీలు విడుదల కాకుండా ఆపుతున్నారో చూడండి. న్యాయనీతి ఏం చెప్తుంది – తొంబైతొమ్మిది మంది నేరస్తులు తప్పించుకున్నా ఫర్వాలేదు గానీ, ఒక్క అమాయకుడు శిక్షించబడకూడదు అని. ఇపుడేమవుతున్నది – మీరంటున్న ఒక్క నేరస్తుని కోసం తొమ్మిదివందల మంది విడుదలకు అర్హులయిన జీవితఖైదీలు ఆగిపోతున్నారు. అయినా సూరి జైల్లో ఉండే పరిటాల రవిని చంపించాడని మీరు భావిస్తున్నపుడు, ఆరోపిస్తున్నపుడు, ఆయన విడుదల వల్ల వచ్చే అదనపు నష్టమేమిటి? నీతి, న్యాయం, శాంతి సంరక్షకులుగా గంభీరంగా అడ్డుపడిన పత్రికలకు కూడా ఈ విషయాలతో పాటు చేసిన, చేస్తున్న విజ్ఞప్తి ఏమిటంటే –

1. సత్ప్రవర్తన ఆధారంగా విడుదలయిన జీవితఖైదీలలో ఒక్కరు కూడా మళ్లీ ఏ నేరారోపణతోను జైలుకు రాలేదు. వాళ్లంతా సాధారణ జీవితాల్లో కలో, గంజో తాగి బతుకుతున్నారు.
2. మీరు అడ్డుపడుతున్న ఒకరిద్దరు తప్ప మిగతా అందరు పేదలు, అట్టడుగు వర్గాల నుంచి వచ్చినవాళ్లు. పేద ముస్లింలు.
3. మీరు అడ్డుపడిన వాళ్లలో ఒకరెట్లాగూ విడుదలయ్యారు. ఇంకొకరిని ఇట్లా ఎంతకాలం ఆపగలరు? అయినా మరి వీరు జైళ్ల నుంచే బయట హత్యలకు, జైళ్లలోనే హత్యలకు పథకాలు రచిస్తున్నారని మీరే అటువంటి వాళ్లమీదనే కాకుండా, అధికారపక్షం మీద, వారికి అండగా పోలీసుల మీద కూడా అభియోగాలు, ఆరోపణలు చేస్తున్నారు కదా. ఇదంతా ఆవులావులు కొట్లాడుకొని లేగదూడల కాళ్లు విరగ్గొట్టడం కాదా?
4. జైళ్లలో ఉన్నవాళ్లు నేరస్తులు, బయటివాళ్లం వాళ్ల గురించి ఒక శిక్షా వైఖరి తీసుకొనవలసిన వాళ్లం – అని భావించే అర్హత మనకెవరిచ్చారు?

సుప్రీంకోర్టు స్టే తొలగించినప్పటి నుంచీ ఖైదీల విడుదలకు ఆటంకమవుతారని భావించిన వారి ముందు పెట్టిన అవగాహన ఇది.

ఎన్నికలయిపోయాయి. ఎన్నికల నియమావళి గడువు ముగిసింది. మంత్రివర్గం ఏర్పడింది. ముఖ్యమంత్రిగా వై.ఎస్.ఆర్. మళ్లా ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచీ అటు ఖైదీల నుంచి, ఇటువాళ్ల న్యాయమైన పోరాటాలకు సంఘీభావం ప్రకటిస్తున్న వాళ్లనుంచి ధర్నాలు, విజ్ఞప్తులు, పోరాటాలు, విన్నపాలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం ఎప్పుడూ ఆశపెడుతూనే వస్తున్నది.

ఇదంతా తమవాళ్ల కోసమే అని అనేవాళ్లు, రాసేవాళ్లు ఆ పని చేస్తూనే ఉన్నారు. రెండు పత్రికల్లో ఒక పత్రిక అనుకూలమైంది.

చంద్రబాబు నేను అడ్డుపడనన్నాడు గానీ, సిపిఐ తప్ప ఏ పార్టీ కూడ జీవితఖైదీల విడుదల కోసం బయటగానీ, శాసనసభలోగానీ చేసిందేమీ లేదు. శాసనసభలోనూ, బయట ఎం.ఐ.ఎం. ఎం.ఎల్.ఎ.లు, ఎం.పి.లు తప్ప ఎవరూ మాట్లాడలేదు.

ఎట్టకేలకు ఆగస్ట్ 15ను పురస్కరించుకొని జీవితఖైదీల విడుదల కోసం ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడినవి. సుప్రీంకోర్టు స్టే తొలగించిన ఉత్తర్వుల కన్నా మెరుగయిన ఉత్తర్వులు ఇవి. ఇందులో శిక్షాస్మృతిలో 120 బి కుట్ర, ఆయుధాల చట్టం, పేలుడు పదార్థాల చట్టం కింద శిక్షలు పడినవాళ్లు మినహాయించబడలేదు. అంటే ఈ ఉత్తర్వుల ప్రకారం ఈ శిక్షలనుభవించే వాళ్లు కూడా విడుదలవుతారు.

కాని విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వోద్యోగిని చంపినవాళ్లు, కేంద్ర చట్టాల ప్రకారం శిక్షలనుభవిస్తున్నవాళ్లు, మత కలహాల్లో హత్యలకు శిక్షలనుభవిస్తున్నవాళ్లు, లైంగిక హింస, వరకట్న హింసలకు శిక్షలనుభవిస్తున్నవాళ్లు విడుదల కారు.

విధిలో ఉన్న ప్రభుత్వోద్యోగి అంటే పంచాయతీ సర్పంచ్ కూడ అవుతాడా? పంచాయతీ సర్పంచ్ మొదలు పార్లమెంట్ సభ్యుని వరకు ప్రజా ప్రతినిధి – పీపుల్స్ రిప్రజెంటేటివ్ అవుతారు గానీ, పబ్లిక్ సర్వెంట్ కారు గదా – అనే వాదన ఉంది.

కేంద్ర చట్టాలు అంటే ఎన్నడో కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించు కున్న టాడా, పోటా వంటి చట్టాలవుతాయా – కాకపోవచ్చు అనే వాదనలు, ఆశలు ఉన్నవి.

ఈ మినహాయింపులు తమ వాళ్లను విడిపించుకోవడానికేనని, అందుకే ఆయుధాల చట్టం, కుట్ర, పేలుడు పదార్థాల నిరోధక చట్టం, టాడా వంటి కేంద్ర చట్టాలను మినహాయించారని గల్లా సతీష్ అనే న్యాయవాది సుప్రీంకోర్టులో మళ్లీ ప్రజాప్రయోజన వ్యాజ్యం ఆగస్ట్ 5న వేసారు.

ప్రభుత్వ ఉత్తర్వుపై గవర్నర్ సంతకం చేయలేదని, గవర్నర్‌కు తెలియకుండానే ఉత్తర్వులు జారీచేసారని, ఆగస్ట్ 15న ఈ ఉత్తర్వుల ప్రకారం ఖైదీల విడుదల కాకుండా స్టే ఇవ్వాలని కూడ కోరారు. సుప్రీం కోర్టు స్టే ఇవ్వలేదు గానీ, ఈ వ్యాజ్యాన్ని అనుమతించే విషయం వాదనలు వినదలుచుకొని ఆగస్ట్ 11కి వాయిదా వేసింది.

ఆగస్ట్ 11న వాదనల్లో ప్రభుత్వ న్యాయవాది హరీశ్ సాల్వే 'విడుదల జాబితా ఇంకా తయారు కాలేదని, కనుక ఆగస్ట్ 15న ఖైదీలు విడుదలయ్యే అవకాశం లేకపోవచ్చు' నని తన కళ్లుగప్పి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఖైదీలను (అందులో తమ వాళ్లను కూడా) విడుదల చేస్తున్నదని సుప్రీంకోర్టు కోపం తెచ్చుకుంటుందనే జాగ్రత్తతో చెప్పినట్లున్నాడు.

అదే ఖైదీల కాళ్లకు అడ్డుపడింది.

సుప్రీంకోర్టులో ప్రభుత్వ న్యాయవాది అట్లా చెప్పినప్పుడు సుప్రీంకోర్టు ఏమీ ఆదేశాలివ్వకుండా తొందరపడి ప్రభుత్వం ఆగస్ట్ 15న విడుదల చేయడం భావ్యం కాదు గదా అని ప్రభుత్వంలోని మర్యాదస్తులు (ఎవరైనా ఉంటే) భావించినట్లున్నారు.

ఈ జాప్యమంతా సూరి కొరకే అంటున్న వాళ్లు కూడా ఉన్నారు. ఈ ఉత్తర్వులు నక్సలైట్లను, ఐఎస్ఐ వాళ్లను విడుదల చేయడానికే అంటున్న 'దేశభక్తులూ' ఉన్నారు. ఈ ఉత్తర్వులు నేరస్తులను విడుదల చేయడానికే అంటున్న, ఇప్పటికి చట్టం – కాదు న్యాయస్థానం తీర్పు చెప్పని – తామే తీర్పరులైన ఆర్యలూ ఉన్నారు.

మళ్లీ వాయిదా ఆగస్ట్ 24. మళ్లీ వాయిదా కూడా పడవచ్చు. అందాక ఆగస్ట్ 15 వరకే, ప్రభుత్వ ఉత్తర్వుల మేరకే అర్హులైన 950 మంది (న్యాయంగా వీళ్లలో ఎక్కువమంది 2005లోనే విడుదల అయి ఉండవలసిన వాళ్లు) అదనంగా జైల్లో మగ్గిపోవాల్సిందే.

2005 ఆగస్ట్ 15న ఇంక జీవితఖైదీలు విడుదలకారని నిరాశ మొదలై కొనసాగుతున్న ఈ నాలుగేళ్లలో శేష జీవితమంతా చీకటి కొట్లలోనే మగ్గాలని భగ్నహృదయులై ఆత్మహత్యలు చేసుకున్న వాళ్లెందరో. గుండెపగిలి చనిపోయిన వాళ్లెందరో. రకరకాల జబ్బులతో, మనోవ్యాధితో ఆసుపత్రుల పాలైన వాళ్లెందరో. బయట ఇవే స్థితులనుభవించిన వాళ్ల కుటుంబాలు ఎన్నో. ఎన్ని కుటుంబాలు చితికిపోయి, శిథిలమైపోయినవో. అటు ప్రభుత్వానికీ, ప్రజాస్వామ్య వాదులకూ జైళ్ల నుంచి, ఖైదీల కుటుంబాల నుంచి ఎన్నో హృదయ విదారకమైన ఉదంతాలతో విజ్ఞాపనలు వచ్చాయో. మంచీ చెడూ, నేరమూ శిక్షా, విచక్షణా వివేచనా చేసే అవకాశాన్నో, అధికారాన్నో కలిగి ఉండి తీర్పు ఇచ్చే స్థానంలో ఉన్నామని అనుకుంటున్న వాళ్లు ఏదో ఒక రూపంలో సారాంశంలో ఆధిపత్య భావజాలానికి చెందినవాళ్లే. చట్టపరంగా చూసినా సుప్రీంకోర్టు స్టే తొలగించిన జనవరి 27 తర్వాత అప్పటికి అర్హులైన జీవితఖైదీలను, అప్పటి ఉత్తర్వుల ప్రకారం విడుదల కావల్సి ఉండినవారిని విడుదల చేయని ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలను ఉల్లంఘించినట్లే.

అట్లే ఆగస్ట్ 15 విడుదల కోసం జారీచేసిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు స్టే ఇవ్వకపోయినా ఆగస్ట్ 15నే అమలు చేయకపోవడం కూడ గవర్నర్ ఆదేశాలను, సుప్రీంకోర్టు అనుమతిని ఉల్లంఘించినట్లే.

ఇప్పటికైనా ఏ ఆటంకమూ లేని, న్యాయ వ్యాఖ్యాన నిరపేక్షమైన జీవిత ఖైదీలను వెంటనే విడుదల చేయాలి. జనవరి 27 నాటికి, ఆగస్ట్ 15 నాటికి ప్రభుత్వానికి, ప్రభుత్వం నియమించిన కమిటీకి ఏ విధంగానూ అభ్యంతరం లేని జీవిత ఖైదీలను తక్షణం విడుదల చేయాలి. అంటే, ప్రతిపక్షాలు, మీడియా కూడా వేలెత్తి చూపడానికి వీలులేని సాధారణ జీవిత ఖైదీలందరినీ వెంటనే విడుదల చేయాలి.

'తమవాళ్ల' కోసం సుప్రీంకోర్టు స్టే కాలం నుంచి విడుదల ఆగిపోయిన ఈ సాధారణ జీవిత ఖైదీల క్షోభ, ఉసురు ఎవరికీ తాకకూడదు. అట్లాగే ఆ ఆరోపణతో ఎవ్వరూ జీవిత ఖైదీల విడుదలను అడ్డుకోకూడదు. అందులో అధికార పక్షంలో అత్యంత ముఖ్యులకు కావాల్సిన వాళ్లు ఉన్నప్పటికీ అది సాకుగా, కక్షతో విడుదల కావల్సి ఉన్న 950 మంది ఖైదీలను అడ్డుకున్న వాళ్లకు వారి కుటుంబాల ఉసురు వాళ్లకు తాకుతుంది.

వాస్తవానికి ఏ మినహాయింపు లేకుండా ఏడేళ్ల శిక్ష, రెమిషన్‌తో పదేళ్ల జైలు అనుభవించిన జీవితఖైదీలందరూ విడుదల కావాలి. అందులో కేంద్ర చట్టాలు ఉన్నాసరే. ప్రభుత్వోద్యోగి విధిలో ఉండగా చంపిన కేసు ఉన్నా సరే. (ఎందుకంటే అవి వ్యక్తిగతమైనవి కావు. ఉద్దేశపూర్వకమైనవి కావు.) ఉరిశిక్షలు జీవితఖైదీగా మారినవైనా సరే. నక్సలైటు, ఐ.ఎస్.ఐ. వంటి బూచి చూపవద్దు. ముస్లింలనే మత ఘర్షణల

నేరస్తులుగా చూపుతున్న ప్రభుత్వ వివక్షను దృష్టిలో పెట్టుకున్నా, ఐ.ఎస్.ఐ. అనే చట్టవ్యతిరేక ఆరోపణ ఎంత వివక్షో అర్థమవుతుంది. 65 ఏళ్ల పైబడినవారు, మహిళలు, దీర్ఘవ్యాధులతో బాధపడుతున్న వాళ్ల విషయంలో ఈ నియమం ఇంకా సడలింపబడాలి. ఆదివాసులు, దళితుల విషయంలో బయటి సమాజంలో రాజ్యాంగ, చట్ట పరిరక్షణలున్నట్లే ఖైదీల విషయంలో కూడా ఉండాలి.

ముగించే ముందు జీవితఖైదీల విడుదల కోసం ఇంత అనుకూల వాదనలెందుకు అనే ప్రశ్నకు మరో కోణం నుంచి కూడా సమాధానం చూద్దాం.

జైళ్లలో అధికారులకన్నా, బహుశా జైలు వార్డర్లకన్నా (అన్ని ప్రభుత్వ ఉద్యోగాల్లో జోనల్, స్థానిక నియామకాలు ఉంటాయి గానీ, జైళ్ల శాఖలో మాత్రం రాష్ట్ర వ్యాప్త బదిలీలు ఉంటాయి. శ్రీకాకుళం పేద జైలువార్డరు బదిలీ అయి వచ్చి చెర్లపల్లి జైలులో పని చేయాలి.) ఎక్కువకాలం జైళ్లలో ఉండేవాళ్లు జీవితఖైదీలే. బదిలీలవల్ల మాత్రమే కాకుండా జైలు సిబ్బంది ఎవరైనా రోజుకు ఎనిమిది గంటలకు మించి జైల్లో ఉండరు. ఇరవైనాలుగు గంటలు జైల్లో ఉండేవాళ్లు జీవిత ఖైదీలే. పనుల్లోకి వెళ్లినా జైలు వార్డర్ల కాపలాలోనే. ఇందులోనూ అన్ లాకప్ నుంచి లాకప్ దాకా జైలు పనులన్నీ చక్కబెట్టేది జీవిత ఖైదీలే.

ఒక్కసారి కేంద్ర కారాగారాలకు వెళ్లి చూడండి. ఆంధ్రప్రదేశ్ జైళ్లు స్వర్గం అని అంటున్న పార్లమెంటరీ కమిటీ జైలు నిర్మాణాలు మాత్రమే కాకుండా, జైలు నిర్వహణ (శుభ్రత, చెట్లు, చేమల పెంపకం దృష్ట్యా) గురించి ఆ అభిప్రాయం వెలిబుచ్చి ఉంటే అందుకు పూర్తి క్రెడిట్ జీవిత ఖైదీలకే చెందుతుంది. వాళ్లు ఒళ్లు దాచుకోకుండా పనిచేస్తారు. శుభ్రంగా ఉంటారు. జైళ్లను శుభ్రంగా ఉంచుతారు. జైలు కర్మాగారాల్లో ఉత్పత్తి, ఉత్పత్తిలో నైపుణ్యమంతా వాళ్లదే. ఆరోగ్యం, పర్యావరణ దృష్టితో చూసినపుడు నిజంగా జైళ్లలో ఉత్పత్తి అవుతున్న వస్త్రాలు, సబ్బులు వంటి వినియోగ వస్తువులకన్నా విశిష్టమైనవి లేవు. జైళ్లలో తయారవుతున్న జంపుఖానాలు, కలపసామాన్లు (ఫర్నిచర్) ఎంత విలువయినవో ఖైదీల విడుదలకు సంబంధించిన సరైన నియమాలు చేసే ఉన్నతాధికారుల అనుభవంలో ఉన్న విషయమే. జైళ్లు మాత్రమే కాదు, జైలు అధికారుల భవనాల శుభ్రత, ఉద్యానవనాలు ఎవరి చలవ. కేవలం జీవితఖైదీల చలవ. జైల్లో సబ్ జైలర్ మొదలు సూపరింటెండెంట్ దాకా చేయవలసిన రాతపని ఎవరు చేస్తారు – జీవితఖైదీలు. సంతకాలు మాత్రమే అధికారులవి. తమ విడుదలకు సంబంధించిన ఉత్తర్వులు వాళ్లు రాసుకోలేరు. వాళ్ల విడుదల కోసం మాత్రమే వాళ్లు జైళ్ల గేట్లు తెరవలేరు. మిగతా అన్ని వేళల్లోను జైలు తాళపుచెవులన్ని వాళ్ల దగ్గరే. జైలు ఫైళ్లన్నీ వాళ్ల దగ్గరే. విశ్వసనీయతకు మారుపేరు జీవిత ఖైదీలు. జైలు అధికారులందరూ అనధికారంగా అంగీకరించే విషయమే ఇది.

పశ్చాత్తాపం వల్ల, నేరం చేయని పక్షంలో (వాళ్లే ఎక్కువ) విడుదల కోసం జీవితఖైదీలు 'సత్ప్రవర్తన'ను ఒక సంస్కారంగా, ఒక జీవితశైలిగా అలవరుచుకొని ఆచరిస్తారు. వ్యవసాయం కూడా చేస్తున్న మౌలాలీ వంటి ఓపెన్ జైళ్లను ఒక్కసారి చూడండి. ఎంత ఫలసాయం తెస్తున్నారు. జైళ్లనేకాదు, బయటికి కూడా సరఫరా అయ్యేంత పాడి, పంటలు ఉత్పత్తి చేస్తున్నారు. కూరగాయలు పండిస్తున్నారు. అటువంటి లైఫర్స్ విడుదలయితే జైలు కర్మాగారాల్లో, వ్యవసాయ క్షేత్రాల్లో ఉత్పత్తి కుంటు పడుతుందని ఆందోళన చెందుతున్న అధికారులు ఉన్నారని కూడ ఇటీవల ఒక పత్రిక ఒక విచిత్రమైన విశ్లేషణ ప్రచురించింది.

మైలసఫాయి పనిచేసేవాళ్లు, ఊడ్చేవాళ్లు, బట్టలుతికేవాళ్లు, క్షవరాలు చేసేవాళ్లు (ఎక్కువగా ఆ వృత్తులు చేసే కులాలవాళ్లు), కష్టమైన పనులు చేసేవాళ్లు విడుదలయితే ఎట్లా అని ఆందోళన పడే అధికారులు కూడా లేకపోలేదు.

నందికొండ కాలువ తవ్వినప్పుడు, గోదావరి వరదలు వచ్చినప్పుడు, రాయలసీమ కరువు సందర్భంగా కరువు నివారణ చర్యలు చేపట్టినప్పుడు, దివిసీమ ఉప్పెన సందర్భంగా – జీవితఖైదీలను నియోగిస్తే వాళ్లు చేసిన సేవలు చూసినవారూ, పొందిన వారు ఎన్నటికీ మరచిపోలేరు.

దీనికంతటికీ కారణం భారతీయ సమాజాల్లో జైలుకుపోయే వాళ్లు నూటికి తొంభైతొమ్మిది మంది పీడితులు, బడుగువర్గాలు, కష్టజీవులు, నిరుపేదలు. వారితోపాటు దృఢమైన ప్రత్యామ్నాయ రాజకీయాలు కలవాళ్లు, రాజ్యంపై, ప్రభుత్వాలపై ధిక్కారంతో పోరాడేవాళ్లు.

వీళ్లంతా స్వయంచోదిత క్రమశిక్షణయే చైతన్యంగా కలవాళ్లు. అటువంటి వారిని జీవితమంతా జైళ్లలోనే ఉంచాలనీ వాళ్లు ఎంత ఉదారంగా ఆలోచించే వాళ్లయినా ఒకటి రెండు అపవాదాల కోసం ఆటంకాలు కల్పించగూడదు. మనుషులకు జీవితం కావాలి. జీవించే స్వేచ్ఛ కావాలి. జీవితఖైదు యావజ్జీవ కారాగార శిక్ష కారాదు. జీవితాన్ని తీర్చిదిద్దుకునే స్వేచ్ఛ కావాలి. వీ

*పాలకులు ఎవరైనా, ప్రభుత్వాలు ఎన్ని మారినా కరువుని నివారించాలనే చిత్తశుద్ధితో కూడిన ప్రణాళికలు, దీర్ఘకాలిక దృష్టి లేనంతకాలం కరువులు మళ్లీ మళ్లీ వస్తూనే ఉంటాయని అంటున్నారు* **వి. హనుమంతరావు**

# కరువుకు కరువు రావాలి

ఇటీవలి కాలంలో ముఖ్యమంత్రి వై.ఎస్. చేస్తున్న ప్రకటనలు, ఉపన్యాసాలు రాష్ట్రంలో చాలామందికి గొంతుదిగడం లేదు. వర్షం కరువు, మంచినీటి కరువు, నిధుల కరువు, కరువులేని ధరల పెరుగుదల, కేంద్రం నుంచి రావాల్సిన నిధుల కరువు, పేదలకు తిండి కరువు – ఈ కరువులన్నీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రజల దుస్థితి గురించి ముక్కు మీదే గుద్ది చెబుతూంటే, ముఖ్యమంత్రి, ఆయన సహచర మంత్రులు ఏం ఫర్వాలేదు, అంతా బాగానే ఉంది, తీసుకోవాల్సిన చర్యలు తీసుకుంటున్నాం అని భరోసా పలుకుతుంటే ప్రజలకు ప్రభుత్వం మీద విశ్వాసం సడలిపోతోంది. రాష్ట్ర ప్రజలు మాపై విశ్వాసం ఉండబట్టే, మమ్మల్ని రెండోసారి అధికారంలోకి పంపారని చంద్రబాబు మీద విసుర్లు విసరవచ్చునేమో గాని నూటికి 30 మంది ఓటే వెయ్యలేదని, మొత్తం ఓట్లలో కాంగ్రెస్ పార్టీకి సుమారు 35 శాతం ఓట్లేసారని, కాగా ఆ పార్టీని అధికారంలోకి పంపింది ప్రజలు కాదని, ప్రస్తుత ఓటింగ్ విధానమేనని ఆయనకూ తెలుసు ప్రజలకూ తెలుసు. ధరలు మండిపోతుంటే ప్రజల గుండెలు మండిపోతున్న నేపథ్యంలో ఏం ఫర్వాలేదనటం పుండు మీద కారం జల్లినట్టుంది. ఆయనతో పోలిస్తే కరువు పరిస్థితులు లేవని ప్రభుత్వం భావించడం లేదని రెవెన్యూ మంత్రి, మాంద్యం పరిస్థితులు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ప్రతికూలంగా ప్రభావితం చేస్తున్నాయని ఆర్థికమంత్రి అంగీకరిస్తున్నారు. కాని ముఖ్యమంత్రి మాటల్లో ఆ సంయమనం కనిపించడం లేదు సరికదా 'సబ్ ఠీక్ హై' ధ్వనే వినిపిస్తోంది.

ఆర్థికమంత్రి ముళ్లబాటలో నడుస్తున్నారు. దేశంలో కేంద్ర ప్రభుత్వ ఆదాయం తగ్గింది అంటే, ఆ మేరకు రాష్ట్రానికి కేంద్రం నుంచి వచ్చే ఆదాయం తగ్గుతుంది. కేంద్రం రాను రాను ఆర్థిక వనరులను తమ చేతుల్లోకి తీసుకొంటూ రావడంతో, రాష్ట్రాల ఆదాయాలు కుంచించుకు పోతున్నాయి. ఉదాహరణకు సర్వశిక్షా అభియాన్, నూరు రోజుల ఉపాధి పథకం, జాతీయ ఆరోగ్య పథకం లాంటి పథకాలను కేంద్రం ప్రకటించి, ఆచరించడంతో, ఒకపక్క రాష్ట్రాల పరిధిలో ఉన్న విషయాల్లో కేంద్రం వేలుపెట్టడం, రెండో పక్క వాటికి నిధులను కొంత మేరకే కేంద్రం కేటాయించి, మిగతా దాన్ని రాష్ట్రాలు భరించాలనడంతో అసలే నిధుల కరువుతో ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రాలు మరింత ఆర్థిక ఇబ్బందుల నెదుర్కొంటున్నాయి. అలాంటపుడు ఈ అఖిలభారత పథకాలకూ రాష్ట్రాలు తమవంతు నిధులను సమర్పించడం గోరుచుట్టు మీద రోకలి పోటవుతుంది. ఇది ఫెడరలిజం వ్యవస్థకు వ్యతిరేకం.

రాష్ట్రాలు, కేంద్రం అప్పు చేయడానికి ఎఫ్.ఆర్.బి.ఎం. చట్టం పరిమితిని విధించింది. ఈ చట్టాన్ని ప్రపంచబ్యాంక్ ఒత్తిడి మేరకు ప్రవేశపెట్టిన విషయం అందరికీ తెలిసిన విషయమే. ఇప్పుడు ఆ పరిమితిని కేంద్రం కాస్త పెంచిందంటే అదేదో రాష్ట్రాలు ఇబ్బంది పడిపోతున్నాయనే జాలి, కరుణతో కాదు. కేంద్రమే అలాంటి పరిస్థితుల్లో చిక్కుకొనడంతో, నలుగురితో పాటు నారాయణ అన్నట్లు రాష్ట్రాలకు కూడా ఆ సౌకర్యాన్ని కలిగించి నాలుగున్నర లక్షల కోట్లు అప్పు చేయడానికి లైన్ క్లియర్ సంపాదించుకొంది. రాష్ట్రాలు అప్పు ద్వారా సంపాదించుకొనే నిధులు అభివృద్ధి కార్యక్రమాల కోసం ఖర్చు చేయాలా, రెవెన్యూ లోటును తగ్గించుకోవడానికి వినియోగించాలా? ఇది మన రాష్ట్ర ఆర్థికమంత్రి తేల్చుకోవాల్సిన విషయం. తీసుకొచ్చిన రుణాల మీద వడ్డీ చెల్లింపు, జీతభత్యాలు, పెన్షన్ల చెల్లింపు లాంటివి ఆరునూరైనా ప్రతి నెలా చెల్లించాల్సిందే. సామాజిక సేవల రంగం కేటాయింపులు ఇప్పటికే 2009–10 బడ్జెట్‌లో కోతకు గురయింది. ఇంకా కోత విధించడం రాజకీయంగా సాధ్యం కానిపని. ముఖ్యమంత్రి ఇప్పటికి రెండు మూడు సార్లు ఢిల్లీ వెళ్లి అదనపు ఆర్థిక సాయాన్ని అర్థించారు. భారీ ఖర్చుతో కూడిన నీటిపారుదల ప్రాజెక్టులను జాతీయ ప్రాజెక్టులుగా గుర్తించమన్నారు. కేంద్రం నుంచి ఉలుకూ పలుకూ లేదు. తానే పీకల్లోతు ఆర్థిక సమస్యల్లో కూరుకొని పోయి ఉంది. ఇతర రాష్ట్రాలు కూడా వారి వారి ఆర్థిక సమస్యల పరిష్కారానికి కేంద్ర సహాయాన్ని అర్థిస్తున్నవి.

**ప్రణాళికల – కేటాయింపులు (లక్షల రు.)**

| ప్రణాళిక | కేటాయింపు | ఖర్చు | రెవెన్యూ ఆదాయం |
|---|---|---|---|
| 6వ ప్రణాళిక | 352517 | 323707 | 102906 |
| 7వ ప్రణాళిక | 644699 | 597888 | 170400 |
| 8వ ప్రణాళిక | 1262900 | 1360660 | 412800 |
| 9వ ప్రణాళిక | 3118718 | 2857240 | 800400 |
| 10వ ప్రణాళిక | 6954708 | 6217682 | – |
| 11వ ప్రణాళిక | | | |
| 2007–08 | 3001353 | 2717074 | – |
| 2008–09 | 4319160 | 3618763 (స.అం.) | – |
| 2009–10 (బ.అం.) | 36633557 | – | – |

మాంద్యం తన విశ్వరూపాన్ని చూపిస్తోంది. రాష్ట్రం ప్రణాళిక అమలు ఆరవ ప్రణాళిక నుంచి నేలచూపులు చూస్తూనే ఉంది.

పట్టిక రెండు విషయాలు తెలియజేస్తుంది: 1) ఏ ప్రణాళికలో నూ కేటాయింపు పూర్తిగా ఖర్చుకాలేదు. 2) ప్రణాళిక కన్నా మరో ప్రణాళిక కాలంలో రెవెన్యూ ఆదాయం పెరుగుదల తాబేటి నడక సాగిస్తుంటే, ప్రణాళిక కేటాయింపులు లేడిలాగా పరిగెడుతున్నాయి. అవసరమైన మేరకు ఆదాయం పెరక్కుండా ప్రణాళిక ఖర్చు పెంచుకొంటూ పోతే రాష్ట్రం అప్పులపాలవుతుంది. వడ్డీలు తినేస్తాయి. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత అప్పులు అంతకు అంత పెరిగాయి. వడ్డీ కాసులవాడు పీకలమీద కూర్చొంటాడు.

కరువుతో ప్రారంభించి నా కలం ఎక్కడెక్కడికో వెళ్లిపోయింది. అలాగని కరువుకు, ఆర్థిక దుస్థితికి సంబంధం లేదని కాదు. కరువుకు కరువు లేదు. రాష్ట్ర ప్రజలకు కరువు కొత్తకాదు. అలాంటి పరిస్థితి ఏర్పడినపుడు ప్రభుత్వాలు ఏం చేసాయి అనేదీ కొత్త కాదు. ఈ శతాబ్ది ఆరంభంలో, చంద్రబాబు పాలనకాలంలో కూడా వర్షాభావ పరిస్థితు లేర్పడ్డాయి. అప్పటి పరిస్థితి గురించి 'ఉద్యోగ సోపానం ఇయర్ బుక్ 2003'లో ఏమి రాసారో చూడండి. ప్రస్తుతం రాష్ట్రంలో పురులువిప్పిన కరువులాంటి పరిస్థితి గత యాభై సంవత్సరాలలో ఎప్పుడూ లేదని శాసనసభలో చంద్రబాబు చేసిన విమర్శను దృష్టిలో ఉంచుకొని చదవండి:

'అన్నపూర్ణగా పేరొందిన ఆంధ్రప్రదేశ్ ఈ ఏడాది వర్షాభావ కారణంగా కరువు బారినపడి విలవిల్లాడింది. గత అయిదు సంవత్సరాలుగా కొనసాగుతున్న కరువు నుంచి గత ఏడాది (2000-01) కొంచెం తేరుకొన్నామని ఊపిరి పీల్చుకొనేలోగా ఈ ఏడాది మరింత తీవ్రంగా విరుచుకుపడింది. రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల వర్షాలు సకాలంలో కురవకపోవడంతో ఖరీఫ్ నాట్లు గణనీయంగా పడిపోయాయి. దీని ప్రభావం రబీ పంట మీద కూడా పడింది. వర్షాలు లేక జలాశయాల్లో నీటిమట్టాలు అడుగంటి పోవడంతో కాలువల ద్వారా వ్యవసాయం కూడా తగ్గిపోయింది. భూగర్భ జలాలు ఇంకిపోవడంతో బోరు బావుల ద్వారా నీటి సరఫరా నిలిచిపోయింది. అటు వర్షాలు లేక, ఇటు ఇతరత్రా నీటివసతిలేక లక్షలఎకరాలు బీళ్లుగా మారిపోయాయి. కూలీపనులు దొరక్క వేల మంది వలసపోయారు. రాష్ట్రంలో 1126 మండలాల్లో 960 కరువు మండలాలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా సగటు సాధారణ వర్షం 285.3 మిల్లీమీటర్లు కాగా ఈ ఏడాది 152.3 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. 18 మండలాల్లో మాత్రమే సాధారణ వర్షం నమోదైంది. 941 మండలాల్లో సాధారణ వర్షం కంటే తక్కువ పడింది. పశ్చిమ గోదావరిలో సాధారణ వర్షం కంటే 75 శాతం, తూర్పు గోదావరిలో 75 శాతం, నెల్లూరులో 75 శాతం, ఖమ్మంలో 69 శాతం, వరంగల్‌లో 67 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. సాధారణ వర్షపాతం కంటె యాభై శాతం తక్కువ నమోదైన ప్రాంతాల్లో కరువు ఏర్పడినట్లు అధికారికంగా గుర్తిస్తారు. ఆ లెక్కన చూస్తే రాష్ట్రంలో 162 మండలాలు కరువు మండలాలుగా గుర్తింపు పొందాయి. మామూలుగా ఖరీఫ్‌లో రాష్ట్రంలో 81.80 లక్షల హెక్టార్లలో పంటలు వేయాలి. ఈసారి కేవలం 25.37 లక్షల హెక్టార్లలో మాత్రమే సాగుజరిగింది. ఫలితంగా కోటి ముప్పై ఎనిమిది లక్షల పద్దెనిమిది వేలమంది వ్యవసాయ కూలీలకు ఉపాధి కరువైంది. కరువు నివారణకు 1869 కోట్ల రూపాయలు కేటాయించాలని, 15 లక్షల టన్నుల బియ్యం సరఫరా చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. కేంద్ర హోంశాఖ మంత్రి ఎల్.కె. అద్వాని అధ్యక్షతన ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్ వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కరువు నివేదికలను పరిశీలించి రాష్ట్రాలకు కరువు సహాయాన్ని ప్రకటించింది. దీనికింద ఆంధ్రప్రదేశ్‌కు రు. 174.61 కోట్లు కేటాయించారు. రాష్ట్ర ప్రభుత్వం కరువు నివారణ సహాయ చర్యల కోసం రు. 200 కోట్లకు పైగా ఖర్చు చేసింది. వర్షాభావం వల్ల జలాశయాలు వట్టిపోయి విద్యుదుత్పత్తికి ఆటంకం ఏర్పడింది. ఫలితంగా పారిశ్రామిక ఉత్పత్తి క్షీణించింది. ఉత్పత్తి తగ్గడంతో ధరలు పెరిగాయి.' వేరే వ్యాఖ్య అవసరం లేదనుకుంటా.

వై.ఎస్. పాలనలో ఇదే మొదటి కరువు. బ్రిటిష్ పాలనలో కూడా కరువులు తరచు వచ్చేవి. అయితే అప్పటికీ, ఇప్పటికీ తేడా ఏమంటే అపుడు వేలాదిమంది పిట్టల్లా రాలిపోయేవారు. ఇపుడు పదుల్లో చనిపోతున్నారు. చంద్రబాబు పాలనలో, ఇపుడూ కరువుకు ప్రభుత్వమే బాధ్యతంటూ కరువును రాజకీయం చేయడం, తిట్టుకోవడం షరామామూలే. అపుడూ, ఇపుడూ ప్రభుత్వాలు కేంద్రాన్ని అర్థించడం, అధికారులు వచ్చి చూసి రిపోర్టులివ్వడం, కేంద్రం ఎంగిలి చెయ్యి విదల్చడం మామూలైపోయింది. ప్రకృతి వైఫల్యం ఒక కారణమైతే, ప్రభుత్వ వైఫల్యాలు మరికొంత కారణం. ముఖ్యమంత్రి భరోసా పలుకులు పలుకుతున్నారు. బియ్యం నిల్వలున్న మాట నిజం. అయితే ఏమి లాభం? ఇలాంటి సమయాల్లో మిల్లర్లు, దొంగ వ్యాపారులు తిండి గింజలు దాచేసి, ధరలు పెంచడం జరుగుతుంటుంది. ప్రభుత్వం లాంఛనంగా దాడులు చేసి చేతులు దులిపేసుకుంటోంది. ధరలు పెరుగుతాయి. ఏ కరువు సంవత్సరంలోనైనా ఇదే తంతు. దొంగ నిల్వలు పట్టుకొన్న సందర్భాలున్నాయి కాని, ఆ దొంగ నిలవదారులను శిక్షించిన వార్త పత్రికల్లో కనబడటం లేదు. రాష్ట్ర గోదాముల మీద దాడులు చేస్తున్నారని, పక్క రాష్ట్రాల్లో దాచి పెడుతున్నారు.

బియ్యం నిలువలున్నాయి నిజమే కాని, 'దేర్ ఈజ్ మెని ఎ స్లిప్ బిట్వీన్ ది కప్ అండ్ ది లిప్' అన్నట్లు గోదాముల్లో నిల్వలకు, పేదవాడి నోటికి చాలా దూరం. ఈ నిల్వలు గ్రామాలకు చేరాలి. చవక దుకాణదారులు ఆ బియ్యాన్ని దొంగచాటుగా తరలించకుండా ఉండాలి. పేదవాడి జేబులో డబ్బుండాలి. అవి ముక్కిపోయిన, తినలేని గింజలై ఉండకూడదు. ఇవి జరగవని ముఖ్యమంత్రి హామీ ఇవ్వగలరా? అసలు సమస్య వదలిపెట్టి శాసనసభను కరువు సమస్యపై రణరంగం చేసేస్తున్నారు. కరువు, వై.ఎస్. వైఫల్యం - ఈ రెండు మాటలే ప్రధాన ప్రతిపక్షం నుంచి వినిపిస్తున్నాయి. ఈ శతాబ్దం ఆరంభంలో వరుసగా రెండు మూడు సంవత్సరాలు కరువు వచ్చి 2000-01లో 124.5 లక్షల టన్నులు పండిన బియ్యం 2003-04 నాటికి 89.53 లక్షల టన్నులకు పడిపోలేదా? బియ్యం పండించే భూమి విస్తీర్ణం అదే కాలంలో 43 లక్షల హెక్టార్ల నుంచి 29.75 లక్షల హెక్టార్లకు పడిపోలేదా? దీనినే గురివింద గింజ తన కింద నలుపు తానెరుగదంటారు. అటు ప్రతిపక్షంగానీ, ఇటు ప్రభుత్వ పక్షం గానీ కరువుకు మూలకారణాలేమిటనే విషయం జోలికి పోరు. ఎందుచేతనంటే అలా పోతే ప్రభుత్వ వైఫల్యాలను అంగీకరించాల్సిన పరిస్థితిలో పడిపోతారు. ఈ విషయం గురించి ప్రముఖ వ్యవసాయార్థిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ కె.ఆర్.చౌదరి చెప్పినదాని ప్రకారం, 1) వర్షపాతం బాగా ఉంటే కరువు ఉందని చెప్పడం సరికాదు. ఎందుకంటే ప్రపంచంలోనే అత్యధిక వర్షపాతం ఉన్న చిర్రపుంజీలో

*(తరువాయి 52వ పేజీలో ...)*

*విద్యాబోధన మాతృభాషలో జరిగితేనే సృజనాత్మకతకూ, నేర్చుకోవడానికీ అవకాశముంటుందనీ, మాతృభాషలో బోధనే శాస్త్రీయంగా సరైందనీ అంటున్నారు* **డా. జి. లచ్చయ్య**

# మాతృభాష - గుమస్తా ఉద్యోగం?

అమెరికా మిలిటరీలో పనిచేస్తున్న భారతీయ సిక్కులు తలపాగాను నిషేధించినందుకు నిరసన తెలిపారు. దేశంగాని దేశంలో తమ సంస్కృతి చిహ్నాన్ని నిషేధించడం సిక్కులు ఒప్పుకోలేకపోతున్నారు. అక్కడి మిలిటరీ అధికారులు సానుకూలతను వ్యక్తపరిచారు. 1956లో సోలోమన్ బండారునాయకే సింహళ భాషను అధికార భాషగా నిర్ణయించడంతో ఆ దేశంలోని తమిళులలో రాజుకున్న అసంతృప్తి నేటికీ ఎల్.టి.టి.ఇ. రూపంలో కొనసాగుతోంది. ఉత్తర భారతీయులు హిందీని అభిమానిస్తే, దక్షిణ భారతీయులు, ముఖ్యంగా తమిళులు, కన్నడీయులు వారి మాతృభాషలకు అధిక ప్రాధాన్యత ఇస్తారు. మొన్న జరిగిన అమెరికా, రష్యా అధ్యక్షుల సమావేశంలో రష్యా అధ్యక్షుడు గలగల రష్యన్ భాషలో మాట్లాడితే ముఖం వెల్లబెట్టడం ఒబామా వంతు కాగా, వెంటనే దుబాషీలు ఆంగ్లంలోకి తర్జుమా చేశారు. మొన్నటికి మొన్న జూలై 21న లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో జైరాం రమేష్ హిందీలోనే సమాధానాలు చెప్పాలని ములాయం సింగ్ పట్టుబట్టడం చూసాం. ఇవన్నీ ఆయా సంస్కృతుల నేపథ్యంలో చూస్తే అభిమానం గానూ, వేరే విధంగా చూస్తే దురభిమానంగా అనిపిస్తుంది. ఈ మధ్యన మహారాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ పాఠశాలలతో సహా అన్ని పాఠశాలల్లో మరాఠీని ఒక భాషగా విధిగా చదవాలని కోరగా, దానిపై పెద్ద చర్చ జరిగింది.

స్వాతంత్ర్యానంతరం భాషాభిమానాలపై, దురభిమానాలపై చర్చ జరుగుతూనే ఉంది. ప్రపంచీకరణ పుణ్యమా అని జరగాల్సిన భాషా విధ్వంసం జరుగుతూనే ఉంది. మన కాళ్ల కింది నేల కదులుతూ ఉంది. మన సంస్కృతి విచ్ఛిన్నమవుతున్నది. మనం మనం కాకుండా పోతూ ఉన్నాం. ప్రపంచంలో ఆరు వేలకు పైగా గల భాషల్లో దాదాపు ఆరు వందలకు పైగా భాషలు అంతరించి పోయాయి. ఇందులో అత్యధికంగా మూలవాసులైన ఆదివాసుల భాషలు కావడం గమనార్హం. 33 తెగలు గల ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ స్రవంతి పేరున ప్రాంతీయ భాషలోనే విద్యావిధానం కొనసాగించడంలో గిరిజనులు వారి ఉనికినే కోల్పోతున్నారు. నాడు బ్రిటిష్ అభిమానం, నేడు అమెరికా బానిసత్వం వెరసి ఆంగ్లీకరణ అనే అంటువ్యాధి అంటుకుంది. ఒక జాతిని, తెగను అంతమొందించాలన్నా, లోబర్చుకోవాలన్నా వారి భాషను దెబ్బతీయాలనేది నానుడి. ఇది వాస్తవం కూడా.

భాష ఓ సాంస్కృతిక చిహ్నం. ఆంధ్రప్రదేశ్‌లో మూడు ప్రాంతాల్లో తెలుగునే మాట్లాడినా, సంస్కృతిపరంగా భిన్నత్వం ఉండడం, ఒక ప్రాంతపు వారి రాజకీయ పెత్తనం ఉండడంతో తెలంగాణ వాదం కొనసాగుతోంది. భాషా, సంస్కృతులకు గల నేపథ్యాలివి. ముప్పై శాతం ప్రజలు సంబంధిత భాషను మాట్లాడనిచో ఆ భాష అంతరించి పోతుందని స్వయంగా ఐక్యరాజ్య సమితి విద్యా వైజ్ఞానిక సాంస్కృతిక సంస్థ (యునెస్కో) కనుమరుగవుతున్న భాషల నేపథ్యంలో హెచ్చరిస్తూనే ఉంది. ఒకప్పుడు రాజఠీవిని ప్రదర్శించిన గ్రీక్, లాటిన్, సంస్కృత భాషలకు ఇదే పరిస్థితి ఏర్పడింది.

వ్యక్తిగత భావాలను, అనుభూతులను, ఆవేశాలను, ఆలోచనలను వ్యక్తీకరించడానికి భాషను ఒక మాధ్యమంగా వాడతారు. మానవుడు సాధించుకున్న గొప్ప పరిణామ క్రమం భాష. ఒకరి భాష మరొకరికి అర్థం కానప్పుడు శరీర కదలిక ద్వారా, సైగల ద్వారా అర్థం చేయిస్తారు. వినికిడి, గ్రహణశక్తి అత్యధికంగా మాతృభాష ద్వారానే జరుగుతుందని, మాతృభాషలోనే తమ తమ భావాలను సులభంగా వ్యక్తపరుస్తారని మానసిక శాస్త్రవేత్తలు, సామాజిక శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు అనాదిగా తెలుపుతూనే ఉన్నారు. ప్రపంచస్థాయి అత్యుత్తమ సాహిత్యాన్ని సృజించిన రచయితలందరు వారి వారి మాతృభాషనే మాధ్యమంగా వాడుకున్నారు. తత్వవేత్తలు తమ తమ తాత్విక చింతనను వారి వారి మాతృభాషల్లోనే వెలువరించారు. శాస్త్రజ్ఞులు తాము కనుగొన్న అంశాలను మాతృభాషల్లోనే ఆవిష్కరించారు. డార్విన్ పరిణామ సిద్ధాంతం, మెండలీఫ్ అనువంశిక సిద్ధాంతం, హ్యూగో డివ్రీన్ జన్యు సిద్ధాంతం, మార్క్స్ రాజకీయ, ఆర్థిక తత్వశాస్త్రం, కౌటిల్యుడి అర్థశాస్త్రం లాంటివన్నీ ఆయా మాతృభాషల్లోనే ముందుగా రాయబడినవి. గెలీలియో, ఐన్‌స్టీన్, కోపర్నికస్ సిద్ధాంతాలు ఈ విధంగానే ప్రజల్లోకి వెళ్లాయి. బంగారు కిరీటం కల్తీదో కాదో తెలుసుకోవడానికి నిత్యజీవిత అనుభవాన్ని జోడించి 'యురేకా, యురేకా' అని అరచుకుంటూ వెళ్లింది ఆయన మాతృభాషలోనే! మాతృభాష ప్రాముఖ్యతకై ఎన్ని దృష్టాంతాలైనా చెప్పవచ్చు.

భారతదేశ విద్యావిధానం గురించి ప్రస్తావించినప్పుడు మెకాలేను జ్ఞప్తికి తెచ్చుకుంటాం. సామ్రాజ్యవాద వ్యతిరేకోద్యమాన్ని చల్లార్చడానికి, బ్రిటిష్ వారికి ఊడిగం చేయడానికి, కావాల్సిన గుమస్తాలను తయారు చేయడానికి ఆంగ్లమాధ్యమాన్ని వాళ్లు ప్రవేశపెట్టే మన శక్తియుక్తుల్ని బలహీనం చేశారు. ప్రాపంచిక దృక్పథం, వైజ్ఞానిక పరిజ్ఞానం అభివృద్ధి జరగాలంటే, వివిధ భాషల్లో నిక్షిప్తమైన శాస్త్రీయ విజ్ఞానాన్ని ఆయా మాతృభాషల్లోకి సులభ సరళిలోకి అనువదించుకోవాలి. 15వ శతాబ్దం దాకా ఆంగ్లానికి అసలు విలువలేదు. గ్రీకు, లాటిన్ భాషలు పశ్చిమాన సంస్కృతం, రష్యన్, చైనీస్, జపనీస్, అరబ్బీ తదితర భాషలు మధ్య

ఆసియా, తూర్పు ఆసియా దేశాల్లో ప్రాధాన్యతను కలిగి ఉండేవి. గ్రీకు, లాటిన్ భాషల్లోకి వైజ్ఞానిక సంపదను ఆంగ్లంలోకి తర్జుమా చేశారు. నిజానికి ఇవాళ ఆంగ్ల భాషలో కనపడుతున్న అత్యధిక పదజాలం గ్రీకు, లాటిన్, ఇతర భాషల నుంచి గ్రహించినవే. ఈ విధానాన్ని నైజాం ప్రభువులు ఆచరించారు. ఆ కాలంలో ఉర్దు రాజ్యభాషగా ఉండడంతో మెడిసిన్, ఇంజనీరింగ్ తదితర వృత్తి విద్యా కోర్సులన్నింటినీ ఉర్దు మాధ్యమంలో నడుపుతూ, పుస్తకాలను ఉర్దులోకి తర్జుమా చేయించారు. ఉన్నత స్థాయి ఇంజనీర్లు, డాక్టర్లు తయారయ్యారు. మనం గొప్పగా చెప్పుకునే సివి రామన్, జగదీశ్ చంద్రబోస్, రామానుజం, రాధాకృష్ణ, వివేకానంద, విశ్వేశ్వరయ్య, రవీంద్రనాథ్ టాగూర్ తదితరులెందరో తమ తమ మాతృభాషలో విద్యనభ్యసించిన వారే! తర్వాత ఆంగ్ల పాండిత్యంలో వారు ప్రావీణ్యతను సంపాదించుకున్నారు. మన ఆంగ్ల రచయితలు ఆర్.కె. నారాయణన్, ప్రముఖ కార్టూనిస్ట్ ఆర్.కె. లక్ష్మణ్, శంకర్స్ వీక్లిని నడిపి బ్రిటిష్ సామ్రాజ్యవాదంపై వేలాది వ్యంగ్య కార్టూన్లు వేసిన శంకర్ లాంటి వారు చదువుకున్నది వారి మాతృభాషలోనే! ఇంతెందుకు, దేశ అత్యున్నత న్యాయస్థానంలో ముఖ్య న్యాయాధీశులుగా, న్యాయ కోవిదులుగా పనిచేస్తున్నవారు ఏ కొంతమందో తప్ప, అందరూ ఆయా మాతృభాషల్లోనే చదువుకున్నవారు కారా? నెహ్రూ కుటుంబానికి చెందిన ప్రధానమంత్రులు ఆంగ్లమాధ్యమంలో చదవుకోవచ్చుగాని, మెజారిటీ రాష్ట్రపతులు ఆయా మాతృభాషల్లో చదువుకున్నవారే.

బానిస వ్యవస్థ రద్దు కావడానికి, రాచరిక వ్యవస్థలు కూలిపోవడానికి, మారుతున్న ప్రపంచ గమనానికి, విప్లవాలు రావడానికి, మాధ్యమాలు మాతృభాషలే! జీసస్, ప్రాఫెట్ వారి మాతృభాషల్లోనే జనాన్ని సమీకరించి ఉద్బోధించారు. అర్జునినికి కృష్ణుడు గీతోపదేశం చేసింది పరభాషలో కాదు. స్పార్టకస్ కావచ్చు, గోన్ఆఫ్ ఆర్క్ కావచ్చు, భగత్‌సింగ్ కావచ్చు, అల్లూరి, వీరపాండ్య కట్టబ్రహ్మణ్, కొమురం భీం, బాబా సాహెబ్, లెనిన్, మావో, చివరికి గాంధీ, నెల్సన్ మండెలాలు ప్రజలతో భాషించింది వారి వారి మాతృభాషల్లోనే! గాయకులు, రచయితలు, వక్తలు, చివరికి వ్యంగ్య చిత్రకారులు, కార్టూనిస్టులు తమ భావాలను వారి మాతృభాషల్లోనే వ్యక్తీకరించి నలుగుర్నీ నవ్విస్తారు. మిక్కీమౌస్‌ను బుల్లితెరమీద చూసి ఆనందించే మనం మన పంచతంత్రాన్ని ఆనందించ లేకపోతున్నాం. ఇది భావ దారిద్ర్యమే కాక స్వభాష పట్లగల దురభిమానమే. పెడగాగీ (పిల్లల విద్య) ప్రపంచ స్థాయి పుస్తకాలను చూసే మనం, పరమానందయ్య విద్యార్థులతో మసలిన విధానాన్ని తరగతి గదికి అన్వయించలేక పోతున్నాం.

సామ్రాజ్యవాదుల కుట్రలకు ఆది నుంచి మోసపోవడానికి అలవాటుపడిన మనం, భాష ద్వారా పరాయీకరణ చెందడాన్ని ఎప్పుడూ వ్యతిరేకించ లేకపోతున్నాం. ప్రపంచాన్ని తెలుసుకోవడానికి ఆంగ్లమాధ్యం సరియైంది కాదని వాదించే కుహనా మేధావులు ప్రపంచీకరణకు, సామ్రాజ్యవాదానికి లొంగి మాట్లాడుతున్నారుగాని వాస్తవంగా కాదు. ఆంగ్ల మాధ్యమం వేరు. ఆంగ్లభాష వేరు. ప్రపంచాన్ని తెలుసుకోవడానికి ఒక భాషగా ఆంగ్లం సరిపోతుంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఇది అమలు జరుగుతూనే ఉంది. ఆంగ్ల మాధ్యమాన్ని వ్యతిరేకించడమంటే ఆంగ్ల భాష పట్ల ద్వేషాన్ని కలిగి ఉండడం కాదు.

మనదేశ అత్యున్నత న్యాయస్థాన న్యాయమూర్తులైన కెజి బాలకృష్ణన్, జస్టిస్ సదాశివం, జస్టిస్ బిఎస్ చౌహాన్‌లు మాతృభాషలో చదువుకుంటే గుమస్తా ఉద్యోగాలు కూడా రావని కర్ణాటక ప్రభుత్వాన్ని ఉద్దేశించి 21 జూలైన వ్యాఖ్యానించడం మాతృభాషలను కించపర్చడమే అవుతుంది. నిజానికి ఆంగ్ల భాషలో చదువుకుంటే దొరికేవి గుమస్తా ఉద్యోగాలే. ఈ దేశ ప్రజల శ్రమతో చదువుకొని, పరదేశ ప్రజలకు సేవలందిస్తున్న డాక్టర్లు, ఇంజనీర్లు చేస్తున్న పని దాదాపుగా ఈ గుమస్తాగిరి పనే. జీతభత్యాలు కొంత మెరుగ్గా ఉన్నాయేమోగాని మన ఇంజనీర్లు సాఫ్ట్‌వేర్ రంగంలో చేసేపని అదే. మనం ఉత్పత్తి చేస్తున్న ఇంజనీర్లు 7 శాతం మించి శక్తి సామర్థ్యాలను కనపర్చడం లేదని సర్వేలు తెలుపుతున్నాయి. ప్రపంచస్థాయిలో గల 200 ఉన్నత సాంకేతిక సంస్థల్లో మన ఢిల్లీ ఐఐటి 153వ స్థానంలో, ముంబయి ఐఐటి 176 స్థానంలో ఉన్నాయి. ఇవన్నీ ఆంగ్ల మాధ్యమంలోనే నడుస్తున్నాయి. అరబ్ దేశాల్లో, మెజారిటీ యూరప్ దేశాల్లో, రష్యా, చైనా, జపాన్ లాంటి దేశాల్లో మాతృభాషల్లోనే విద్యావిధానం కొనసాగుతుంటే, అభివృద్ధి చెందుతున్న మనలాంటి దేశాల్లో పరభాషలో చదువుకోవాలను కోవడం అభివృద్ధి నిరోధకమే.

పరభాషలో చదువుకోవడం ద్వారా సృజనాత్మక పెంపొందక పోగా, మెదడుకు తొందరగా అలసట వస్తుంది. గ్రహణశక్తి తగ్గుతుంది. 11 శాతం ఉన్నత విద్యను అభ్యసించే అతికొద్ది శాతం విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని, మొత్తం విద్యార్థులను ఆంగ్లమాధ్యమంలో విద్యనభ్యసించాలనడం మెజారిటీ విద్యార్థుల హక్కులను కాలరాయడమే. ఈ 11 శాతంలో కూడా ఉన్నత స్థాయి ఉద్యోగాలను ఆశించే ఐఎఎస్, ఐపిఎస్ లాంటి పరీక్షలు రాసి ఉద్యోగాలు సంపాదించిన తర్వాత పరిపాలనా వ్యవహారాల్ని ఏ మాధ్యమంలో చేస్తారు. ఈ దేశ సామాజిక, ఆర్థిక, రాజకీయ విషయావగాహన ఈ దేశ మాతృభాషల ద్వారా బాగా అర్థం చేసుకోగలరా? లేక ఆంగ్ల మాధ్యమం ద్వారానా – అత్యున్నత న్యాయస్థానం ఆలోచించాలి.

ఇప్పటికే చాలా ఆలస్యమైంది. జరగాల్సిన సాంస్కృతిక విధ్వంసం జరిగిపోయింది. యువత బలహీనపడింది, పడుతోంది. యువతను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే విద్యావిధానం, మాధ్యమం కావాలి. అప్పుడే యువతలో దాగి ఉన్న వివిధ కళలు బయటికి వస్తాయి. రచయితలు బయట పడతారు. వక్తలు, కార్టూనిస్టులు, గాయకులు బయటికి వస్తారు. లేకపోతే మూసపోసిన, నైపుణ్యత లేని యువత తయారై విదేశాలకు ఊడిగం చేయడానికి తయారు అవుతారు. ఇప్పటికే ఇది శీఘ్రగతిన జరుగుతోంది. మన తరగతి గదుల్లో రేపటి భారత పౌరులను కాదు – రేపటి అమెరికా పౌరులను తయారు చేస్తున్నాం. దీనిని నిరోధించాల్సిన అవసరం ఉంది. ఈ దేశ యువతరాన్ని ఈ దేశ ప్రజలకు సేవలందించే విధంగా తయారు చేయాలిగాని, పరదేశీయులకు కాదు. అలా పరదేశంలో గుమస్తా ఉద్యోగాలు చేయాలనుకునే వారు ఆంగ్ల భాషా పరిజ్ఞానంతో ప్రావీణ్యాన్ని పొందాలి. అప్పుడు అమెరికా పోవచ్చు! ఆస్ట్రేలియా పోవచ్చు! సింగపూర్‌లో బతకవచ్చు!

దాదాపు అరవై సంవత్సరాల తర్వాత కేంద్ర మానవ వనరుల మంత్రి కపిల్ సిబాల్ నైబర్ హుడ్ స్కూళ్ల గురించి, కామన్ స్కూళ్ల గురించి ప్రస్తావిస్తున్న సమయంలో అత్యున్నత ధర్మాసనం మాతృభాషను కించపరిచే విధంగా వ్యాఖ్యానించడం శోచనీయం. వీ

*సింగరేణిలో ఓపెన్ కాస్ట్ విధానానికి వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమాలు బంగ్లాదేశ్ ప్రజల పోరాట విజయాల్నీ, అనుభవాల్నీ ప్రేరణగా తీసుకోవాలంటున్నారు* **పిట్టల రవీందర్**

# ఓపెన్‌కాస్ట్ ఉద్యమం, ఫూల్‌బరీ అనుభవం

ఓపెన్‌కాస్ట్ బొగ్గుగనులకు వ్యతిరేకంగా ఇటీవలి కాలంలో ఊపందుకున్న ప్రజా ఉద్యమాన్ని నీరుగార్చే ప్రయత్నంలో భాగంగా సింగరేణి యాజమాన్యం కొత్తతరహా ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నది. ప్రపంచ వ్యాపితంగా మారిన పరిస్థితుల నేపథ్యంలో అన్ని దేశాల్లోనూ బొగ్గు ఉత్పత్తి ప్రక్రియలో ఓపెన్‌కాస్ట్ విధానాలనే అనుసరిస్తున్నట్లు సింగరేణి యాజమాన్యం నమ్మబలుకుతున్నది. ఓపెన్‌కాస్ట్ గనులకు వ్యతిరేకంగా ప్రపంచ వ్యాపితంగా వెల్లువెత్తుతున్న ప్రజా ఉద్యమాలను మరుగున పరచేందుకు సింగరేణి యాజమాన్యం ప్రయత్నిస్తోంది. అందువల్ల ప్రపంచంలోని ఇతర ప్రాంతాలలో ఓపెన్‌కాస్ట్ బొగ్గుగనులకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమాలను పరిశీలించి, సింగరేణిలో జరుగుతున్న ఓపెన్‌కాస్ట్ బొగ్గుగనుల వ్యతిరేక ఉద్యమానికి అవసరమైన అనుభవాలను జతకూర్చుకోవలసిన అవసరం ఉన్నది. ఇందుకు మన సరిహద్దు దేశమైన బంగ్లాదేశ్‌లో ఓపెన్‌కాస్ట్ బొగ్గుగనులకు వ్యతిరేకంగా, విజయవంతంగా నిర్వహించిన ప్రజా ఉద్యమాన్ని పరిశీలించడం భారత్–బంగ్లాదేశ్ సరిహద్దు దేశాల సామాజిక, ఆర్థిక నేపథ్యానికి సరిపోల్చుకోవడానికి అవకాశం లభిస్తుంది.

బంగ్లాదేశ్‌లోని దినాజ్‌పూర్ జిల్లా ఫూల్‌బరీ అనే దట్టమైన అటవీ ప్రాంతంలోని నేలబొగ్గు నిక్షేపాలను వెలికితీసేందుకు బ్రిటన్‌కు చెందిన ఆసియా ఎనర్జీ అనే బహుళజాతి సంస్థ బంగ్లాదేశ్ ప్రభుత్వంతో 2004లో ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. ఈ ఒప్పందం ప్రకారం ఫూల్‌బరీ అటవీ ప్రాంతంలో ఓపెన్‌కాస్ట్ విధానం ద్వారా ఏటా 15 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసి ఇండియా, చైనా దేశాలకు ఎగుమతి చేసుకునేందుకు ఆసియా ఎనర్జీ సంస్థకు హక్కులను కల్పించారు. దినాజ్‌పూర్ జిల్లాలోని నాలుగు రెవెన్యూ మండలాల పరిధిలో విస్తరించిఉన్న 570 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలపై 30సంవత్సరాలపాటు ఈ సంస్థకు పూర్తి అధికారం ఉంటుంది. ఈ ఒప్పందం ద్వారా బంగ్లాదేశ్ ప్రభుత్వానికి రెండువేలకోట్ల అమెరికా డాలర్ల ఆర్థిక ప్రయోజనం చేకూరుతుంది. అంతర్జాతీయ ద్రవ్య సంస్థల ద్వారా ఆసియా ఎనర్జీ సంస్థ ఫూల్‌బరీ ఓపెన్‌కాస్ట్ బొగ్గుగనిని నిర్వహించేందుకు అవసరమైన 1100 కోట్ల డాలర్ల పెట్టుబడిని సమకూర్చుకుంటుంది. ఇందుకు అవసరమైన పూచీకత్తును బంగ్లాదేశ్ ప్రభుత్వం సమకూరుస్తుంది.

ఫూల్‌బరీ ఓపెన్‌కాస్ట్ వల్ల ఈ ప్రాంతంలో సుమారు నాలుగువందల సంవత్సరాలుగా స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న సంతాల్ తెగకు సంబంధించిన సుమారు లక్ష ఆదివాసీ కుటుంబాల వారు నిరాశ్రయులవుతారు. సహజంగానే ఆదివాసీ ప్రజలకు భూమిమీద సాధికారకమైన హక్కులు లేకపోవడం, రెవెన్యూ నిబంధనల ప్రకారం వారి భూములకు పట్టాలు లేకపోవడంతో ఓపెన్‌కాస్ట్ గనికోసం సేకరించే భూములకు నష్టపరిహారం చెల్లించేది లేదని ఆసియా ఎనర్జీ సంస్థ తేల్చి చెప్పింది. బంగ్లాదేశ్ ప్రభుత్వం కూడా ఈ బహుళజాతి సంస్థ అభిప్రాయానికి తలూపింది. తరతరాలుగా అడవిని నమ్ముకుని జీవిస్తున్న లక్ష ఆదివాసీ కుటుంబాలను నిరాశ్రయులను చేసే ఫూల్‌బరీ ఓపెన్‌కాస్ట్ బొగ్గుగనిని అనుమతించేదిలేదని సంతాల్ తెగల వారు ఉద్యమం ప్రారంభించారు. ఓపెన్‌కాస్ట్ బొగ్గుగనులు రావడంవల్ల ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, బంగ్లాదేశ్ అభివృద్ధికి ఫూల్‌బరీ ఓపెన్‌కాస్ట్ ఎంతో ఉపయోగపడుతుందని ఆసియా ఎనర్జీ సంస్థ మీడియాలో పెద్దయెత్తున ప్రచారం నిర్వహించింది. మైదాన ప్రాంతంలోని దిగువ, మధ్యతరగతి ప్రజల్లో ఆదివాసీలపట్ల వ్యతిరేకతను పెంచేందుకు ప్రయత్నించింది. ఆదివాసీలను అభివృద్ధి నిరోధకులుగా అభివర్ణించింది. సంతాల్ తెగలకు, మైదానప్రాంత ప్రజలకు మధ్యన చిచ్చుపెట్టేందుకు అనేక ఎత్తులు వేసింది. ఈ సంస్థ ఎత్తుగడలకు ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా సహకరించింది. అయినా సంతాల్ తెగలు ఐకమత్యంతో తమ ఉద్యమాన్ని కొనసాగించాయి.

సంతాల్ తెగలు నిర్వహిస్తున్న రాజీలేని పోరాటాన్ని గమనించిన బంగ్లాదేశ్‌లోని హక్కుల సంఘాలు, ప్రజా సంఘాలు, కొన్ని స్వచ్ఛంద సంస్థలు ఫూల్‌బరీ ఓపెన్‌కాస్ట్ వ్యతిరేక పోరాటానికి తమ సంపూర్ణ మద్దతును ప్రకటించాయి. పర్యావరణవేత్తలు రంగంలోకి దిగారు. నిజనిర్ధారణ కమిటీలు ప్రభావిత ప్రాంతాలలో పర్యటించి నివేదికలను సమర్పించాయి. ఫూల్‌బరీ ఓపెన్‌కాస్ట్ బొగ్గుగనుల వల్ల 17వేల హెక్టార్ల (సుమారు 45వేల ఎకరాలు) విస్తీర్ణంలోని వరిపొలాలు నాశనమవుతాయని అంచనా వేసారు. ఫూల్‌బరీ అటవీ ప్రాంతంలోని సుమారు 25లక్షల చెట్లు అంతరించిపోతాయని లెక్కతేల్చారు. సంతాల్ తెగకు చెందిన సుమారు లక్షకుటుంబాలు నిరాశ్రయులవుతారని అంచనా వేశారు. సుమారు 50కిలోమీటర్ల పరిధిలోని భూగర్భజలాలు అడుగంటి పోయి, వ్యవసాయం పూర్తిగా కుంటుపడుతుందని, వరిపొలాలు బీళ్లుగా మారుతాయని హెచ్చరించారు. బంగ్లాదేశ్ ప్రజలకు తిండిగింజలకు కరవు ఏర్పడుతుందని చెప్పారు. ఈ వివరాలన్నింటినీ ఉద్యమ సంస్థలు

విస్తృతంగా దేశవ్యాపితంగా ప్రచారాన్ని నిర్వహించాయి. ఫలితంగా దేశంలోని అన్ని వర్గాల ప్రజలు ఫూల్‌బరీ ఓపెన్‌కాస్ట్ వ్యతిరేక ఉద్యమంపట్ల సానుకూలంగా వ్యవహరించాయి.

సుమారు 16 నెలలపాటు ఫూల్‌బరీ ఓపెన్‌కాస్ట్ బొగ్గుగని వ్యతిరేక ఉద్యమం వివిధ స్థాయిల్లో విస్తరించింది. మరోవైపున 2006 ఫిబ్రవరి నెలలో ఆసియా ఎనర్జీ సంస్థ ఫూల్‌బరీ ప్రాంతంలో ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టును ప్రారంభించేందుకు పారామిలిటరీ బలగాల సాయుధ పహరాలో ప్రయత్నించింది. అడ్డుతగిలిన ఆదివాసీలకు ఉద్యోగాలు ఇస్తామని ఆశచూపింది. నష్టపరిహారం పెంచుతామని నమ్మబలికింది. పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని పూచీపలికింది. పునరావాసం కల్పిస్తామని హామీ ఇచ్చింది. ఈ ఎత్తుగడలేవీ ఫలించకపోవడంతో స్థానికంగా కొంతమందిని మధ్యదళారీలుగా మార్చుకున్నది. మీడియా ప్రతినిధులను లోబరుచుకున్నది. ఓపెన్‌కాస్ట్ బొగ్గుగనులవల్ల స్థానిక ప్రజలకు అనేక లాభాలున్నాయని మరోమారు ఊదరగొట్టింది.

అయితే సంతాల్ తెగ ప్రజలు ఆసియా ఎనర్జీ ఎత్తుగడలను చిత్తు చేసేవిధంగా తమ ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లారు. ఆందోళనలను మరింతగా ఉధృతం చేసారు. నిర్వాసిత గ్రామాల ప్రజలతోపాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల ప్రజలు సైతం ఈ ఓపెన్‌కాస్ట్ బొగ్గుగనికి వ్యతిరేకంగా ఉద్యమించారు. ఫూల్‌బరీ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు వ్యతిరేక ఉద్యమానికి దేశంలోని అనేక ప్రాంతాల ప్రజల నుండి మద్దతు లభించింది. విశ్వవిద్యాలయాల నుండి అధ్యాపకులు ఫూల్‌బరీ ఉద్యమంలో కలిసి ఆందోళనలు నిర్వహించారు. విద్యార్థులు తరగతులను బహిష్కరించారు. దినాజ్‌పూర్ జిల్లాలోని వ్యాపారసంస్థలు కూడా ఫూల్‌బరీ ఓపెన్‌కాస్ట్ ఉద్యమానికి మద్దతుగా రోజుల తరబడి దుకాణాలను మూసివేసారు. బంద్‌లు పాటించారు. ప్రదర్శనలు నిర్వహించారు. రిక్షా కార్మికులు, ఆటోడ్రైవర్లు, ట్రక్కు ఆపరేటర్లు సైతం బంద్‌లో భాగం పంచుకున్నారు. సంఘీభావం ప్రకటించారు. జాతీయ రహదారులను రోజుల తరబడి దిగ్బంధించారు. రైల్లరాకపోకలకు పూర్తిగా అంతరాయం కలిగింది. దాదాపు వారం రోజులపాటు దినాజ్‌పూర్ జిల్లాలో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. ప్రభుత్వ కార్యాలయాలకు సైతం సెలవు ప్రకటించారు. ఫూల్‌బరీ ఓపెన్‌కాస్ట్ వ్యతిరేక ఉద్యమానికి జాతీయ, అంతర్జాతీయ హక్కుల సంఘాలు మద్దతును ప్రకటించాయి. ఈ ఉద్యమం దేశవ్యాపితంగా ప్రకంపనలు సృష్టించింది. దేశంలోని రాజకీయ పార్టీలన్నీ అనివార్యంగా ఈ ఉద్యమానికి మద్దతును ప్రకటించాయి. సంతాల్ తెగ ఆదివాసీల ఉద్యమం జాతీయ ఉద్యమంగా మారిపోయింది. వరుసగా కరువుకాటకాలతో, భూకంపాలతో, వరదలతో సతమతమవుతున్న బంగ్లా ప్రభుత్వానికి ఫూల్‌బరీ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు వ్యతిరేక ఉద్యమం 'సునామీ'గా పరిణమించింది.

ఫూల్‌బరీ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు వ్యతిరేక ఉద్యమం 26 ఆగస్ట్ 2006 నాటి సంఘటనతో ఊహించని మలుపు తిరిగింది. సుమారు 30వేలమంది ఆదివాసీలు బాణాలు, విల్లంబులు చేతబూని ఫూల్‌బరీలోని ఆసియా ఎనర్జీ కంపెనీ కార్యాలయాన్ని దిగ్బంధించారు. సంస్థ బోర్డులను పీకివేసారు. తమ దేశం విడిచి వెళ్లిపోవాలని హెచ్చరించారు. కార్యాలయంలోని ఉద్యోగులను తరిమివేసారు. ఇదే సమయంలో పరిస్థితి అదుపుతప్పిందనే నెపంతో బంగ్లాదేశ్ ప్రభుత్వం సాయుధ బలగాలను రంగంలోకి దింపింది. ఉద్యమకారులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపింది. ఈ కాల్పుల్లో 14 సంవత్సరాల బాలునితో సహా ఆరుగురు ఉద్యమకారులు మృతి చెందారు. సుమారు మూడువందలమంది ఆదివాసీలు గాయాలపాలయ్యారు. ఈ సంఘటనపై ప్రపంచ వ్యాపితంగా నిరసనలు వెల్లువెత్తడంతో ప్రభుత్వం ఆందోళనకారులతో చర్చలకు సిద్ధపడింది. మొదటినుండీ ఈ ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న సామాజికవేత్త ప్రొఫెసర్ అనూ ముహమ్మద్ నాయకత్వంలో ఆదివాసీలతో కూడిన ప్రజా కమిటీ ఏర్పాటయ్యింది. (ఫూల్‌బరీ ఓపెన్‌కాస్ట్ వ్యతిరేక ఉద్యమంలో చురుకైన పాత్రను నిర్వహించిన 48ఏండ్ల మానవహక్కుల ఉద్యమ నాయకురాలు నస్రీన్ హఖ్ కారుఢీకొట్టిన సంఘటనలో మృతి చెందిన సంఘటన ఇంకా మిస్టరీగానే మిగిలిపోయింది).

ఆగస్ట్ 26 నుండి 31వరకు ఒకవైపు తమ ఆందోళనను కొనసాగిస్తూనే ఉద్యమ కమిటీ ప్రభుత్వంతో చర్చలు నిర్వహించింది. చివరకు ఆగస్ట్ 31నాడు ఇరువర్గాలకు మధ్యన ఒక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం "ఆసియా ఎనర్జీతో బంగ్లాదేశ్ ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం పూర్తిగా రద్దు చేయాలి. ఆసియా ఎనర్జీ కంపెనీ కార్యాలయాలను ఎత్తివేసి, దేశంలోకి ఆ సంస్థ తిరిగి రాకుండా చర్యలు తీసుకోవాలి. ఫూల్‌బరీ ఓపన్‌కాస్ట్ ప్రాజెక్టు ప్రతిపాదనలను శాశ్వతంగా ఉపసంహరించుకోవడంతోపాటు, భవిష్యత్తులో దేశంలో ఎక్కడా ఓపెన్‌కాస్ట్ బొగ్గుగనులను అనుమతించ కూడదు. ఫూల్‌బరీ కాల్పుల్లో మృతిచెందిన వారికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలి. ఫూల్‌బరీ ఉద్యమంలో పాల్గొన్న నాయకులపై పెట్టిన అన్ని కేసులను బేషరతుగా ఎత్తివేయాలి. భవిష్యత్తులో తమ నాయకులపై ఎలాంటి కక్ష సాధింపు చర్యలకు పూనుకోకూడదు. దేశంలో కేవలం అండర్‌గ్రౌండ్ గనుల ద్వారా మాత్రమే బొగ్గును ఉత్పత్తి చేయాలి. బొగ్గుగనుల ప్రాంతంలోనే థర్మల్ విద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. విదేశాలకు బొగ్గును ఎగుమతి చేయరాదు. ఆగస్ట్ 26ను ఫూల్‌బరీ అమరవీరుల సంస్మరణ దినంగా ప్రకటించి ప్రతియేటా అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించాలి. అండర్‌గ్రౌండ్ బొగ్గుగనుల కోసం నిర్వాసితులైన ప్రజలకు నష్టపరిహారం, పునరావాసంతోపాటుగా కుటుంబంలో ఒకరికి బొగ్గుగనుల్లో ఉద్యోగం కల్పించాలి. అదేవిధంగా సదరు బొగ్గుగనిలో ఉత్పత్తి జరిగే బొగ్గుపై వచ్చే లాభాలలో నిర్వాసితులకు న్యాయమైనా వాటాను చెల్లించాలి." ఈ ఒప్పందాన్ని అమలు చేయడానికి అన్నిరకాల చర్యలు తీసుకోవాలని బంగ్లాదేశ్ ప్రధానమంత్రి కార్యాలయం దేశ ఖనిజ వనరుల శాఖను ఆదేశించింది.

ఫూల్‌బరీ ఓపెన్‌కాస్ట్ వ్యతిరేక ఉద్యమం ఇప్పుడు ప్రపంచ వ్యాపితంగా జరుగుతున్న ఓపెన్‌కాస్ట్ వ్యతిరేక ఉద్యమాలకు అనుసరణీయమైన 'ఆదివాసీల విజయగాథ'గా నిలిచిపోతుందనడంలో అనుమానంలేదు. అయితే ఓపెన్‌కాస్ట్ వ్యతిరేక ఉద్యమాలు విజయం సాధించడానికి ఫూల్‌బరీ ఉదంతం సింగరేణిలోనూ పునరావృతం కావాల్సిందేనా? ఇప్పుడు ప్రతిఒక్కరూ జవాబును వెతుక్కోవాల్సిన ప్రశ్న ఇది. వీ

*సమాజంలోని దోపిడీ, అణచివేతలలో భాగంగానే స్త్రీలపై రకరకాల దోపిడీ, వివక్షలు అమలవుతున్నాయనీ, మహిళలు సంఘటిత పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందనీ అంటున్నారు* **పి. జయ**

# మహిళను యంత్రంగా మార్చిన ఉద్యోగం

ఉద్యోగ మహిళల దినచర్య ఉదయం నాలుగు – ఐదు గంటల మధ్య మొదలవుతుంది. ఒకపక్క వంట చేస్తూ, మరోపక్క పిల్లల, భర్త, అత్తమామల సేవలు చేస్తుంటారు. అందరికి అన్నీ సర్ది, తనూ సర్దుకొని చివరికి టిఫిన్ కూడా తినకుండా బాక్సులో వేసుకొని డ్యూటీకి పరుగెత్తుతారు. బస్సులోనో, రైల్లోనో టిఫిన్ ముగిస్తారు. అదికూడా సీటుదొరికితేనే. లేదంటే గమ్యస్థానం చేరాకనే. ఇక రోజంతా విధినిర్వహణలో ఎన్నో సమస్యలను ఎదుర్కొంటారు. ఎంత నైపుణ్యంగా పని చేసినా వేధింపులు, (కొన్ని చోట్ల లైంగిక వేధింపులు కూడా) అన్ని రకాల వివక్షలు, పనిభారం, ప్రయాణ బడలికతో సతమతమవుతుంటారు. మళ్లీ సాయంత్రం ఇల్లు చేరేసరికి రాత్రి ఏడు లేక ఎనిమిదవుతుంది. ఇంట్లో పనులన్నీ ఆమె కోసం ఎదురుచూస్తూంటాయి. మళ్లీ అందరికి అన్నీ అమర్చి నిద్రపోయేసరికి రాత్రి పదకొండవుతుంది. ఈ పనులన్నీ రొటీన్‌గా చేస్తూ స్త్రీలు యంత్రాల్లా మారుతున్నారు.

ఉద్యోగ మహిళల గురించి ఇంత చర్చించుకోవాల్సిన అవసరముందా, ఇవి పెద్ద పనులేం కాదుకదా అని కొట్టిపడేసే పురుషులు కూడా లేకపోలేదు. గతంలో అమ్మలు, అమ్మమ్మలు ఇంతకన్నా బండచాకిరీ చేసేవారని, సుక్కపొడవంగ లేసి (రాత్రి 3 గంటలకు) దంచి, ఇసిరి, వండి, వడ్డించి ఇంటి చాకిరీ అంతా చేసి పొలం పనులకు, కూలి పనులకు వెళ్లేవారని, ఇప్పటిలాగ న్యూక్లియర్ కుటుంబాలు కూడా కాదు అన్నీ ఉమ్మడి కుటుంబాలేనని, ఎంత బలమైన పనులైనా చేసేవారని, ఇప్పటి ఆడవాళ్లకు ఏమీ చేతకాదనే హితోపదేశం విరివిగా వినిపిస్తుంది. నిజమే శ్రామిక స్త్రీలకు ఆ పనులే అందుబాటులో ఉంటాయి. అవే తప్పక చేయాలి, అవి చెయ్యకపోతే గడవదు. ఒకవేళ చేతకాకపోయినా చెయ్యలేమని చెప్పే ధైర్యం, సాహసం వారు చేయలేరు. ఎందుకంటే చదువుకున్న స్త్రీల లాగ విద్య, చైతన్యం వారికి లేవు. కనుక తప్పక చేయాల్సిందే. నిరంతరం శారీరక శ్రమ చేస్తారు కనక దేహ దారుఢ్యం బాగుంటుంది. అందుకే ఎంత బరువైన పనులైనా అవలీలగా చేసేస్తారు. వాళ్లతో పోల్చినపుడు చదువుకున్న స్త్రీలేకాదు, చదువుకున్న పురుషులు కూడా ఆ పనులు చేయలేరు. శాస్త్రీయమైన జ్ఞానం లేనివారే ఈ భిన్నమైన పోలికలు చెబుతూ పబ్బం గడుపుతారు. కుటుంబ బాధ్యత ఇద్దరిదీ అన్న నిజం మరుగున పర్చి అర్థ రహితమైన వాదనలు చేయడం అతి తెలివైనా కావాలి, అజ్ఞానమైనా కావాలి.

మొత్తంగా చూసినపుడు ఉత్పత్తిలో భాగమయ్యే స్త్రీలకైనా, ఉద్యోగం చేసే స్త్రీలకైనా వెట్టి తప్పడం లేదు. కాకపోతే శ్రమ రూపం మారింది. అంతేతప్ప బాధ్యతలలో మార్పులేదు. హక్కులు కూడా ఏ వర్గ స్త్రీలకు లేవు. అదే పురుషునికి ఏ వర్గమైనప్పటికీ సర్వ హక్కులున్నాయి. మరి పురుషునికి బాధ్యతలు ఎందుకు లేవు, స్త్రీలే ఎందుకు అదనపు బాధ్యతలు పడాలి, కుటుంబం ఇద్దరిదీ కదా; అన్న అనుమానాలు, ఆలోచనలు విద్యావంతులైన స్త్రీలలో స్ఫురిస్తున్నాయి. మరి ఏ సమస్యకైనా చారిత్రక మూలాలు ఉన్నట్లే ఉద్యోగ స్త్రీల సమస్యలకు కూడా ఉన్నాయి.

మహిళలు పురుషులతో సమానంగా తమ శారీరక, మానసిక శక్తి సామర్థ్యాలను ప్రదర్శించి ఉన్నతంగా, గౌరవంగా, సమానత్వంలో జీవించిన మాతృస్వామిక వ్యవస్థను కుప్పకూల్చిన మనుధర్మం స్త్రీని కనీసం మనిషిగా చూడకుండా తమ ఉక్కు సంకెళ్లలో బంధించింది. స్త్రీలంటే పిల్లలను కనేయంత్రాలు, ఇంటి చాకిరి చేసే బానిసలు, శృంగార సాధనాలన్న భూస్వామ్యం తన కబంధ హస్తాలలో నలిపివేసింది. పురుషులతోపాటు సామాజిక అంతరాలు, వర్గ అసమానతలు అనుభవిస్తూనే స్త్రీలు అదనంగా పితృస్వామ్య అణచివేతను కూడా అనుభవిస్తున్నారు. ఆధిపత్య కుల, వర్గ స్త్రీలు పరదాచాటున బంధించబడితే అట్టడుగు కుల, వర్గ స్త్రీలు పశువులకన్నా హీనంగా చూడబడుతూ శ్రమదోపిడీకి, లైంగిక దోపిడీకి బలయ్యారు. ఇప్పటికీ అవుతూనే ఉన్నారు. పైగా అన్ని వర్గాల స్త్రీలు విద్యకు, విజ్ఞానానికి దూరం చేయబడ్డారు.

పెట్టుబడిని ముల్లెగట్టుకొని ఈ దేశానికి వలసవచ్చిన ఈస్టిండియా కంపెనీ మనువాద–భూస్వామ్య వ్యవస్థల దుర్మార్గాన్ని చెక్కుచెదర నీయకుండా కాపాడుతూనే తన దోపిడీ విధానాలను అమలు చేసింది. సమాజం సమగ్రాభివృద్ధి చెందాలంటే స్త్రీల భాగస్వామ్యం కూడా అవసరమని భావించిన ఈ దేశ పురుష సంస్కర్తలు స్త్రీలకు విద్య అవసరమని బ్రిటిష్ వారికి విన్నవించారు. ఈ సదవకాశమేదో తమ కనుకూలంగా ఉందని గ్రహించిన బ్రిటిష్‌వారు సంస్కర్తల ప్రతిపాదనను ఆమోదించారు. ఈ అవకాశాన్ని ముందుగా అందిపుచ్చుకుంది ఆధిపత్యవర్గాల స్త్రీలే. శ్రామిక వర్గాల స్త్రీలు అంటరానితనంతో ఈసడించబడుతూ, శ్రమలోనే నిమగ్నమయ్యారు కనుక విద్యనభ్యసించే అవకాశం చాలా ఆలస్యంగా లభించింది. అది కూడా సాంఘిక పోరాటాలవల్లనే. ఈ వైరుధ్యాన్ని వాడుకున్న బ్రిటిష్‌వారు మిషనరీల ద్వారా మత ప్రచారంతో పాటు విద్యతో ఈ వర్గాలకు చేరువయ్యారు. ఇకపోతే ఉద్యోగస్వామ్యంలో (బ్యూరాక్రసీ) పురుషుల్ని మాత్రమే చేర్చుకుంటే సరిపోదనీ, సమాజంలో సగమైన స్త్రీల సేవలు కూడా

వాడుకుంటేనే తమ దోపిడీ సాఫీగా సాగుతుందని భావించాయి. అందుకే విద్యావిధానం కూడా వారికనుకూలమైన గుమస్తాలను తయారు చేసేదిగా, కేవలం ఉపాధినిచ్చేదిగా రూపొందించారు. ఆ విధంగా స్త్రీలను ఉద్యోగ రంగంలో ఇముడ్చుకున్నారు తప్ప సానుభూతిగానో, బాధ్యతగానో కాదు. స్త్రీలు ఈ మాత్రం ఉద్యోగాలలోకి రావడం వెనుక ఎంతో ఘర్షణ, పోరాటాలున్నాయి. ఈ ఘర్షణ తీవ్రత కూడా ఆయా సామాజిక నేపథ్యాన్ని బట్టి ఉంది. ఈ కనీస అవకాశాన్ని కూడా సహించని మనువాద, భూస్వామ్యం మహిళలు ఉద్యోగాలు చేసి ఊళ్లేల్తారా అని కుళ్లుకుంది.

తరతరాలుగా ఆర్థిక స్వేచ్ఛకు దూరం చేయబడ్డ మహిళలు నాలుగు గోడలను చీల్చుకొని ఉద్యోగ రంగంలోకి అడుగుపెట్టారు. స్వతంత్రమనే అధికారమార్పిడి (1947) అనంతరం బ్రిటిష్ సామ్రాజ్యవాద పెత్తనం పెట్టుబడుల రూపంలో కొనసాగింది. ఇదొక్కటే కాక ఇతర సామ్రాజ్యవాద దేశాలైన జర్మనీ, జపాన్, ఫ్రాన్స్, రష్యా, అమెరికా, చైనా మొదలైన దేశాల పెట్టుబడులు కూడా కుప్పలుతెప్పలుగా ఈ దేశంలోకి వచ్చిపడ్డాయి. వీరి రథసారథి అమెరికా. వీరందరి లక్ష్యం ఇదొక్కటే కాదు, ఈ దేశంలో ఉన్న పుష్కలమైన వనరులను కాజేయడం, వారి వస్తువులు దిగుమతి చేయడం, మార్కెట్ విస్తరించుకోవడం. ఈ ప్రక్రియకంతటికీ ప్రపంచబ్యాంక్‌ను సాధనంగా వాడుకుంటున్నారు. అందులో భాగంగా సేవారంగాన్ని ప్రోత్సహించారు. అందులోకి స్త్రీలనెక్కువగా భాగస్వాములను చేశారు. చివరికి నైట్‌షిఫ్టులకు కూడా వదలడం లేదు.

1990 నుండి మొదలైన నూతన ఆర్థిక విధానాలు సేవారంగాన్ని మరింత తీవ్రతరం చేశాయి. మరోపక్క ప్రభుత్వరంగాలను బలహీనం చేస్తూ అభద్రతకు గురిచేస్తున్నాయి. అంతే కాక స్త్రీల ఇంటి పనికి, పిల్లల పెంపకానికి ప్రత్యామ్నాయం చూపలేదు. వారు కనిపెట్టిన ప్రత్యామ్నాయమల్లా ఒక్కటే. ప్రెజర్ కుక్కర్లు, మిక్సీలు, వాషింగ్ మెషీన్‌లు, గ్యాస్ స్టవ్‌లు మొదలయిన ఎలక్ట్రానిక్ పరికరాలు స్త్రీలకందుబాటులోకి తెచ్చి పని తగ్గించామని చేతులు దులుపుకున్నారు. అంతే తప్ప ఇంటి పనిలోనూ, పిల్లల పెంపకంలోనూ పురుషులు కూడా భాగం పంచుకోవాలని, బాధ్యత పడాలన్న ప్రచారమెక్కడా జరగలేదు. ఏకకాలంలో స్త్రీలు మూడు బాధ్యతలు నెరవేర్చుతూ ఎంతో మానసిక, శారీరక ఆందోళనకు గురవుతున్నారు. కుటుంబాలలో ఘర్షణ పెరిగిపోయి, ఏ ఒక్కరూ సంతృప్తిగా జీవించడం లేదు. ఆధునిక యుగంలో అన్నీ అందుబాటులోకి వచ్చాయి అనుకుంటూనే తెలియని బాధ, అవసరం లేని జీవిత వేగం పెరిగిపోతున్నాయి. పురుషులు మాత్రం ఒక్కపని (ఉద్యోగమో, వ్యాపారమో) తో సరిపెట్టుకుంటూ పైగా తాము చేస్తున్న పనే గొప్పదని, స్త్రీలు చేస్తున్న పనుల పట్ల చిన్నచూపూ, చులకన భావం ఉంటోంది. ఎంత పనిచేసినా మెచ్చుకోల్లుండవు. పైగా నువ్వు కాబట్టి చేస్తున్నావులే అని కించపరుస్తారు.

స్త్రీలు నేడు అన్ని రంగాలలో ఎంతో నైపుణ్యంతో ఏ హోదాలో పనిచేస్తున్నప్పటికీ కుటుంబంలోనూ, విధి నిర్వహణలోనూ చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారు. మరి ఈ సమస్యలు ఎక్కడినుండి వస్తున్నాయి, ఎవరు సృష్టిస్తున్నారు, వారికి అంత ఇంటరెస్టు ఏమిటి అని పరిశీలిస్తే పరిష్కారం దొరుకుతుంది. వ్యవస్థను వేల సంవత్సరాలుగా తమ గుప్పిట్లో బంధించిన మనువాద, భూస్వామ్య, పెట్టుబడిదారీ వర్గాలు తమ సంపదను, అధికారాన్ని కాపాడుకోవడానికి ప్రజలను ఎన్ని ముక్కలుగా వీలైతే అన్ని ముక్కలు చేశారు. అందులో స్త్రీ పురుషులను కూడా వారు చేజిక్కించుకుంటున్న అధికారం ద్వారా క్రూరంగా అణచివేస్తున్నారు. పైగా వారు విసర్జించే దోపిడీ సంస్కృతిలో ప్రజలను మభ్యపెడుతూ లబ్ధిపొందుతున్నారు. ఈ సంస్కృతి ప్రభావం స్త్రీలపై అధికంగా ఉంటోంది. దానికి అనేక కారణాలున్నాయి. వీరు చేస్తున్న దోపిడే కాకుండా వీరి యజమానులైన సామ్రాజ్యవాదులతో కుమ్మక్కయి ఈ దేశ వనరులనే కాక మనుషుల శ్రమను, సేవలను దోచి పెట్టే దళారీ పాత్ర పోషిస్తున్నారు. అంతేకాక వారిచేతిలో కీలుబొమ్మలుగా మారి ఈ దేశ, రాజకీయార్థిక విధానాలు రూపకల్పన చేయిస్తున్నారు.

ఈ ముప్పేట దాడిని గుర్తించిన ప్రజలు వివిధ పద్ధతుల ద్వారా సంఘటితమవుతూ ఉద్యమిస్తున్నారు. అందులో ఉద్యోగులు కూడా భాగమవుతున్నారు. సమస్యల తీవ్రతలో తరతమ భేదాలున్నప్పటికీ, అన్ని వర్గాల ప్రజలకు సమస్యలున్నాయి. అందులో స్త్రీలకు మరీ ఎక్కువ. అందరి సమస్యలకు మూలం ఒక్కటే. అది ఈ దోపిడీ వ్యవస్థ. ఈ వ్యవస్థ వేళ్లు మర్రి ఊడల్లా పాకిపోయాయి. వాటిని పెకలించడానికి సంఘటిత శ్రామిక శక్తి అవసరం. సంఘటిత పోరాటాల ద్వారానే సమూల మార్పు సాధ్యమవుతుంది. అందుకే శ్రమకు మేధస్సు, మేధస్సుకు శ్రమ తోడుకావాలి. విడివిడిగా సాగుతున్న కార్మిక, కర్షక, ఉద్యోగ పోరాటాలు ఐక్యం కావాలి. ఈ ఐక్యతను దెబ్బతీయడానికి పాలకవర్గాలు నానా తంటాలు పడుతున్నాయి. అయినప్పటికీ ప్రజలు వెనుకంజ వేయడం లేదు. ఎందుకంటే సమస్యలున్నంత కాలం తిరుగుబాట్లు, పోరాటాలుంటాయి. నిత్యం సమస్యలతో సతమతమయ్యే స్త్రీలకు పోరాడితే పోయేదేమీలేదు సమస్యలు తప్ప. అందుకే అన్ని వర్గాల స్త్రీల సంఘటిత ఉద్యమంలో ఉద్యోగ స్త్రీలు కూడా భాగమై, ఉద్యమించినప్పుడే అన్ని సమస్యలు పరిష్కారమై నిజమైన విముక్తి లభిస్తుంది. వీ

*రకరకాల ఒత్తిడుల మధ్య బహుముఖంగా జీవన పోరాటం సాగిస్తూ నిబద్ధతతో, ఓర్పుతో పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల స్థితిగతులను వివరిస్తున్నారు* **పి. శివలక్ష్మి**

# టెలికం వ్యవస్థ - ఉద్యోగినులు

శరీరానికి నాడీ వ్యవస్థ లాగే దేశానికి సమాచార వ్యవస్థ చాలా కీలకమైనది. 1948 జనవరి 30న గాంధీ మరణవార్త ప్రపంచానికి తెలియటానికి మూడు గంటలు పట్టింది. 1969 జూలై 20న నీల్ ఆమ్‌స్ట్రాంగ్ చంద్రమండలం పై కాలు మోపినప్పుడు ఆ వార్త పావుగంట అటూ ఇటూగా ప్రపంచానికి తెలిసిపోయింది. కానీ ఇప్పుడు సమాచార వ్యవస్థలోని సాంకేతిక పరికరాల సహాయంతో సమాచారం కాంతివేగంతో ప్రపంచంలోని మూలమూలలకి చేరిపోతోంది. ఇప్పుడున్న శక్తిమంతమైన కమ్యూనికేషన్ వ్యవస్థ గనుక బ్రిటిష్‌వారి వలసపాలన కాలంలో ఉండి ఉంటే వాళ్లు ప్రపంచాన్ని అతి సునాయసంగా తమ గుప్పిట్లో పెట్టుకొని ఉండేవారని ప్రముఖ రచయిత ఆల్విన్ టాఫ్లర్ తన ప్రసిద్ధ గ్రంథం 'ది థర్డ్ వేవ్' లో చెప్పారు. ఈ ఆధునిక సాంకేతిక వ్యవస్థలోని రేడియో, టి.వి., కంప్యూటర్, ఇంటర్‌నెట్, ఈమెయిల్, నెట్ ఛాటింగ్, మొదలైన ఆధునిక ఆవిష్కరణలన్నిట్లో 'టెలిఫోన్' విశిష్టమైనది. మనుషులు తమ సంభాషణల ద్వారా ఎంత దూరంలో ఉన్నవారితోనైనా తమ కష్టసుఖాల్నీ, ఆనంద ఉద్వేగాల్నీ పంచుకుంటారు. మాట – సంభాషణలకున్న మహత్తరమైన శక్తి వల్ల ఒక్కోసారి ప్రమాదంలోనో, తీవ్ర అస్వస్థతలోనో ఉన్నప్పుడు అవతలి వారి స్వరం వినగానే స్వాంతన పొంది స్థిమితపడిపోతారు.

అలెగ్జాండర్ గ్రహంబెల్ 1878లో టెలిఫోన్‌ని కనిపెట్టాడు. ఆయన పసివయసులో ఉన్నప్పుడే వాళ్లమ్మకి బ్రహ్మచెముడు పట్టుకుందట. అమ్మకోసం తపనపడుతూ మాట్లాడ్డానికీ, వినడానికీ సంబంధించిన వస్తువుల కోసం ప్రయోగాలు చెయ్యడం మొదలెట్టాడు. యుక్త వయసొచ్చాక బోస్టన్‌లోని మూగ, చెవిటి వాళ్లకి మాట్లాడటానికి శిక్షణనిచ్చే స్కూల్లో ఉపాధ్యాయుడిగా చేరాడు. అదే స్కూల్లో చదువుకుంటున్న ఒక మూగ, చెవిటి అమ్మాయిని ప్రేమించి పెళ్లాడాడు. అమ్మకోసం, ప్రేయసి కోసం అహర్నిశలూ శ్రమించి టెలిఫోన్‌ని సాధించాడు. అసలు అలెగ్జాండర్ గ్రహంబెల్ టెలిఫోన్ ఆవిష్కరణ వెనక ఇద్దరు స్త్రీమూర్తుల స్ఫూర్తి ఉంది.

గ్రహంబెల్ గురించీ, ఫోన్ పనిచేసే విధానం గురించీ చదువుతున్నప్పుడు మొదటిగా ఫోన్‌ని హ్రాక్ మీద నుంచి తీసి చెవి దగ్గర పెట్టగానే 'టెలిఫోన్ ఆపరేటర్ తియ్యని కంఠస్వరం వినిపిస్తుంది.' సరిగ్గా ఆ తియ్యని కంఠస్వరాలున్న మహిళలని ఆడిషన్ టెస్ట్‌ద్వారా ఉద్యోగాలకు సెలెక్ట్ చేస్తారు. మహిళల ఉద్యోగాలు – ఆర్థిక స్వావలంబన ఎలా, ఎప్పుడు మొదలయ్యాయి అనే విషయం గురించి ప్రపంచవ్యాప్తంగా చూసినా సరే మొట్టమొదటగా 18వ శతాబ్దంలో 'టైపురైటర్లు' కనిపిస్తారు. ఆ తర్వాత 'టెలిగ్రాఫిస్టు'లు కానీ ఈ రెండు ఉద్యోగాలలోనూ మహిళలది అతి స్వల్పమైన సంఖ్యే. ఆ రోజుల్లో ఫోన్ల పని విధానం అనేక అవకతవకలతో ఉండేది. డబ్బున్న ఉన్నతవర్గాల వారికి మాత్రమే ఫోన్లుండేవి. సంభాషణ కంతరాయం కలిగినప్పుడు కోపంతో ఊగిపోతూ తిట్టేవారు. పురుషులు కూడా అంతే ఊపుతో తిట్లు లంకించుకునేవారు. గొడవలతో ఇరువర్గాల వారూ విసుగెత్తి పోయేవారు. ఓర్పు, సహనం, వినయం స్త్రీలలో సహజంగానే ఉంటాయని గమనించిన అన్ని దేశాల ప్రభుత్వాలూ నగరాలన్నిటినీ ఫెమినైజ్ చేసి పెద్ద ఎత్తున స్త్రీలను ఉద్యోగాల్లోకి తీసుకున్నాయి. మన దేశంలో 1983 వరకూ ఎన్నో బ్యాచ్‌లను రిక్రూట్ చేసుకోవడం వల్ల నగరాల్లో వేలకొద్దీ మహిళలు ఉద్యోగాల్లోకి వచ్చారు. రోజుకి అయిదారు షిఫ్టులతో, ఒక్కొక్క షిఫ్ట్‌లో వందలకొద్దీ మహిళలతో, ఒక షిఫ్ట్ ముగిసి, ఇంకోటి మొదలవుతున్నప్పుడు తిరణాలలాగా మహిళలతో కిక్కిరిసిపోయేవి నగరాల్లో టెలిఫోను భవన్లు. ప్రపంచీకరణ ఫలితంగా ఇప్పుడు శ్మశాన వాతావరణం తలుపుకొస్తుంది.

స్వాతంత్ర్యానికి పూర్వం నుండి ఎన్నో రకాల కఠిన నిబంధనల మధ్య మహిళలు పనిచేసేవారు. దాచిపెట్టబడిన నిజాలను గరళంలా మింగుతూ నోరెత్తకుండా సర్వీస్ రూల్స్ పాటించేవారు. పాలనాపరమైన తప్పొప్పులు, అవకతవకలు ఎవరివల్ల జరిగినా వినియోగదారుడికి చెవిలో వినపడేది ఆపరేటర్ గొంతు గనుక మొత్తం డిపార్ట్‌మెంట్ తరఫు నుంచి బాధ్యతగా తిట్లు తినేవారు. రాజధాని నగరాల్లో మంత్రులూ, ప్రముఖులూ ఉంటారు. వాళ్లకి హాట్‌లైన్స్ ఉంటాయి. ఏ సమయంలోనైనా లైన్లోకొస్తారు. ఎమర్జెన్సీ సర్వీసులు గనుక 24 గంటలూ ఎలర్ట్‌గా ఉండాలి. మనుషులు ఆపదల్లో ఉన్నప్పుడు లైటెనింగ్ కాల్స్, ప్రమాదాల్లో ఉన్నప్పుడు సేవ్ వాల్యుబల్ హ్యూమన్ లైఫ్ (ఎస్.వి.ఎచ్.) కాల్స్ వచ్చేవి. కొంతమంది లైన్లో కొస్తూనే ఏడ్చేసేవారు. స్త్రీలు వెంటనే స్పందించి పట్టుదలగా ఒకలైన్ దొరక్కపోతే ఇంకోలైన్ ద్వారా అవతలి పార్టీ వచ్చేవరకూ సాధించేవారు. ఇప్పటి ఎస్.టి.డి. లాగా అప్పుడు లైన్లు సులభంగా దొరికేవి కావు. టెక్నాలజీ ప్రారంభ దశ అది. జైపూర్, జోధ్‌పూర్, అజ్మీర్, లక్నో, ఢిల్లీ, కలకత్తా, అహమ్మదాబాద్ మొదలైన స్టేషన్లకి కలుపుతున్న తర్వాత లైన్లు కలవడానికి తెల్లవార్లూ అరుస్తూనే ఉండేవారు. కర్ఫ్యూలు, తుఫాన్లు, వరదలు, వర్షాలు మొదలైన

ఆపత్సమయాల్లో ముఖ్యమైన పోజిషన్స్‌లో ఉన్నవాళ్లు రిలీవర్ రాకుండా కదలకూడదనే నిబంధన వల్ల నాలుగైదు రోజులైనా అలాగే ఉండేవారు. ఇంత నిబద్ధతగా చేసినా, డ్యూటీ సక్రమంగా చేశారనే తృప్తి కూడా మిగలకుండా బయటిలోకం నుంచి ఎన్నో సూటిపోటీ మాటలు, కుటుంబం నుంచి ఎన్నో ఒత్తిడులు. ఈ విధంగా మహిళలు తమ స్వరాలతో చేసిన కంట్రిబ్యూషన్ చాలా గొప్పదీ, మరువలేనిదీ.

జాతీయ (ఎస్.టి.డి. – సబ్స్‌క్రైబర్ ట్రంక్ డైలింగ్), అంతర్జాతీయ (ఐ.ఎస్.డి. – ఇంటర్నేషనల్ సబ్స్‌క్రైబర్ డైలింగ్) కాల్స్‌ని కస్టమర్ లైన్లకి అనుసంధానం చేసినందున ఆపరేటర్లను క్లర్కులుగా మార్చారు. ఈ మార్పే క్రమంలో అంతకు ముందున్న 15 నుంచి 20 ఏళ్ల సర్వీసంతా పోయి క్లరికల్ కేడర్‌లో జూనియర్లై పోతున్నప్పుడు ఆడవాళ్లకి కుటుంబం ముఖ్యం, పిల్లల పెంపకం ముఖ్యం, మీరు నైట్ డ్యూటీల్లో ఉంటే కుటుంబాలు ఇబ్బందుల పాలౌతాయంటూ పితృస్వామ్య భావజాలాన్ని నూరిపోశారు. అలా మార్చిన మహిళలను ఎక్కడ బడితే అక్కడ బిల్లింగ్ సెక్షన్‌లలో, అడ్మినిస్ట్రేషన్, ఆపరేషన్, పే సెక్షన్, కాష్ కౌంటర్లు, కస్టమర్ సర్వీస్ సెంటర్లలో వేసి పనిచేయిస్తున్నారు. నిజానికి ప్రభుత్వ నియమాల ప్రకారం చూసినా క్లర్కులకి షిఫ్ట్ డ్యూటీలు వెయ్యకూడదు. కానీ ఎక్కడెక్కడ సేవలు అవసరమౌతాయో అక్కడంతా మహిళల శ్రమ దోపిడీ చేస్తూ ఏ విషయంలోనూ మహిళలకు ప్రాతినిధ్యం లేకుండా చేస్తూ నెమ్మది నెమ్మదిగా మహిళల పాత్రని నేపథ్యంలోకి నెట్టేస్తున్నారు.

1984 నుంచి కొత్త నియామకాలు ఆపివేశారు. కస్టమర్ కౌంటర్లలో పనిచేయాడానికి మాత్రం అన్ని భాషలూ ధారాళంగా మాట్లాడగలిగిన అందమైన, చలాకీగా ఉండే మహిళలు కావాలంటుంది యాజమాన్యం. 18, 19 శతాబ్దాల్లో జరిగిన యాంత్రీకరణ సమాజంలో ఉన్న మానవశక్తిని వినియోగంలోకి తెస్తే, ఈనాటి కంప్యూటరీకరణ వినియోగంతో ఉన్న మానవశక్తిని నిరుపయోగం చేస్తుంది.

'సింగల్ విండో కాన్సెప్ట్' విధానాన్ని కౌంటర్లలో ప్రవేశపెట్టి 'ఇక క్షణాల్లో పరిష్కారం. సంబంధిత కాల్‌సెంటర్లలో సంప్రదించండి' అంటూ మీడియాకి సమాచారమందిస్తారు. మాకు ఏ రకమైన సమాచారం గానీ, బిల్లులు సరిచేసే అధికారం గానీ, పాడైన సాధనం స్థానంలో కొత్త సాధనం ఇచ్చే వీలుగానీ ఏదీ ఉండదు. 'తెలియదు' అనే పదం నోటినుంచి రాకూడదనే ఒత్తిడి ఆడవాళ్ల మీద ఉంటుంది. క్షణక్షణం మారిపోతున్న టెక్నాలజీ మహిళల పనిని మరింత పెంచి ఊపిరి సలపకుండా చేస్తోంది. పురుషులు బయట తిరిగినా సీట్లలో లేకపోయినా పల్లెత్తు మాటనరు. మహిళల భోజన విరామం అరగంటకి ఒక నిమిషం లేటైతే 'మేడమ్, మీరు రెండు నిమిషాలు క్రాస్ అయ్యారు' అంటూ బెదిరిస్తారు. పెరిగిన టెక్నాలజీ మనిషికి విరామం, వెసులుబాటు కలిగించాల్సింది పోయి, చార్లీ చాప్లిన్ 'మాడర్న్ టైమ్స్' సినిమాలో చూపించినట్లు మనిషిని తిండి కూడా తిననీయని దయనీయమైన పరిస్థితుల్ని తెచ్చిపెట్టాయి.

స్త్రీలలో స్వతహాగానే కొన్ని ప్రతిభావంతమైన లక్షణాలు దాగుంటాయి. ప్రభావశీలంగా సమాచారాన్ని సేకరించడం, తెలిసిన సమాచారాన్ని కస్టమర్లకు వినయంగా చేరవేయడం, అప్పగించిన పనిని అంకిత భావంతో పూర్తిచెయ్యడం, సూక్ష్మమైన విషయాలను కూడా గుర్తుంచుకొని సమయస్ఫూర్తితో వాడుకోవడం, ఒకే సమయంలో అనేక పనులు చేయగలిగిన సామర్థ్యం మొదలైనవి. ఉదాహరణకి మా కస్టమర్ సర్వీసు సెంటర్లలో మహిళలు కంప్యూటర్ చూస్తూ, కొత్త అప్లికేషన్ ఫారాలు పూర్తిచేస్తూ, డిపాజిట్ కట్టించుకుంటూ, దాని రశీదు ప్రింట్ చేస్తూ, అదే సమయంలో కౌంటర్ కొస్తున్న కస్టమర్లను మర్యాదగా పలకరిస్తూ, ఎంక్వైరీలు అడుగుతున్న వారికి వినయంగా సమాధానాలు చెప్తుంటారు. ఈ కౌంటర్లు పైకి చూడడానికి అధునాతన సౌకర్యాలతో ఉన్నట్లే ఉంటాయి. లోపల మహిళలకి సరైన టాయిలెట్లుండవు. వాటిల్లో నీళ్లుండవు. భోజనానికి చిన్న స్థలముండదు. నిరంతర సంభాషణలతో నీళ్లు తాగే వీలుకూడా ఉండదు కొన్నిసార్లు. ఒకే భంగిమలో కూర్చోవలసి రావడం, కంప్యూటర్ చూసి చూసి కళ్లు నెప్పి పుట్టడం, పండగలకి కస్టమర్లకి యాజమాన్యానిచ్చే ఆఫర్ల ధాటికి తట్టుకోలేకపోవడం – ఇలా ఎన్నో రకాల ఇబ్బందులుంటాయి.

హక్కుల స్పృహలేని కాలంలో (స్వాతంత్ర్యానికి ముందు) ప్రభుత్వం మహిళలకు ప్రతి నగరంలోనూ టెలిఫోన్ భవన్‌లలో పెద్ద పెద్ద విశ్రాంతి గదులు, శుభ్రమైన టాయిలెట్లు, భోజనాలకు, అతిథులకు పెద్ద పెద్ద గదులు నిర్మించింది. కానీ కార్పొరేషన్ చేసి తొమ్మిదేళ్లవుతున్నా ఒక్క చిన్న విశ్రాంతి గది కూడా లేకుండా చేశారు. దానికోసం అడిగితే, 'రూమెందుకు, డ్యూటీలో నిద్రపోతారా?' అని వ్యంగ్యంగా మాట్లాడతారు. 2001లో భారత ప్రభుత్వం మహిళా సాధికారతా సంవత్సరంగా ప్రకటించాక పరిస్థితి మరీ అధ్వాన్నమైపోయింది. మధ్య వయసువారు ఆరోగ్య సమస్యలతో ఎవరైనా కళ్లు తిరిగి పడిపోతే, హాస్పిటల్‌కి తీసికెళ్లేలోపు తోటి మనుషుల మీద పడుకోబెట్టాల్సిందే. బి.పి. షుగర్, థైరాయిడ్, నడుము నొప్పి, మోకాళ్ల నొప్పుల లాంటి వయసు పైబడేకొద్దీ వచ్చే వ్యాధులు, ఇంటా బయటా ఎడతెరిపి లేని బండచాకిరీ, పిల్లల పెళ్లిళ్ల సమస్యలు, ఆడపిల్లల పెళ్లిళ్లయితే వాళ్లత్తమామలు, ఆడబిడ్డలతో ఆచారాలు, సంప్రదాయాల పేరిట ఆడవాళ్లపై రకరకాల సతాయింపులు – వీటన్నిటి మధ్య మార్పు కోసమని వేరే సీటివ్వమని అడిగితే 'ఉద్యోగమంటే ఏదైనా చెయ్యాలి, జీతం తీసుకోవట్లేదా?' అంటారు. ప్రభుత్వరంగ సంస్థలో కష్టాలు, అనారోగ్యాలు కనీసం వినేవారు, కార్పొరేట్ సంస్కృతిలో అవేమీ ఉండవు. ప్రాముఖ్యత ఉన్న సీట్లలో పురుషులు పాతుకుపోతారు. రోటీన్ సీట్లలో, రొడ్డకొట్టుడు పనులతో శక్తియుక్తులు నశించి మెదడు మొద్దుబారిపోయే పన్లు మహిళలకిస్తారు. సమాజం స్త్రీల ఇంటి పనిని విలువలేకుండా చేసినట్లే, 'తేలిక సీట్లండీ, అక్కడ పని చాలా సులభం' అంటూ పలుచన చేస్తారు.

ఇన్ని బాధలున్నప్పటికీ మహిళలు డ్యూటీ చేస్తున్నప్పుడు అవేమీ పైకి తెలియనివ్వరు. స్థిరంగా సీట్లలో కూర్చుని నిజాయితీగా పనిచేస్తారు. కొంతమంది పెద్దవాళ్లు 'అమ్మా! మీ ఫోను మా ఇంట్లో యాభై ఏళ్ల నుంచీ పనిచేస్తుంది. ఆడవాళ్లుండ బట్టే – మీ సంస్థలో ఇప్పటికీ కొన్ని విలువలు మీ సేవలవల్ల నిలిచి ఉన్నాయి' అని మా కౌంటర్ల కొచ్చి చెప్తుంటారు. కానీ ప్రభుత్వం మాత్రం దేశంలోని ఏ సంస్థ అయినా మూతబడడానికి కారణం ఉద్యోగులేనన్నట్లు ప్రజలను నమ్మబలికే ప్రచారాలు చేస్తుంది. ప్రపంచ కుగ్రామం (ది గ్లోబల్ విలేజ్) అనే పదాన్ని సృష్టించిన మార్షల్ మెక్‌లుహాన్ 'యాజమాన్యాలు సరికొత్త కాలం (ఎలక్ట్రిక్ ఏజ్) డిమాండ్ చేస్తున్న సవాళ్లను ఈనాటి తక్షణ పనిముట్లతో పరిష్కరించాలి. కానీ సంస్థలు ఈ క్షణమే తలెత్తుతున్న సమస్యలను

పాతబడిన సాంకేతిక పరికరాలతో, ఇప్పటి ప్రశ్నలను నిన్నటి బూజుపట్టిన జవాబులతో సరిపెట్టాలని చూస్తున్నాయి. ఇది ఆయా సంస్థలు చేస్తున్న అతిపెద్ద పొరపాటు' అని అంటారు. ఒకప్పుడు వైభవంతో వెలిగిన సంస్థల తిరోగమనానికి ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలే కారణమవుతాయి తప్ప ఉద్యోగులు చేతులారా తమ నోటి దగ్గర కూడు పోగొట్టుకోవడానికి ఏరకంగానూ దోహదం చెయ్యరు.

ఢిల్లీ, ముంబాయి, కోలకత, హైదరాబాద్ లాంటి కొన్ని నగరాలకే పరిమితమై, కొన్ని పరిమిత సేవలందించే ప్రైవేట్ ఆపరేటర్లలా కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న సుమారు మూడు వేల కౌంటర్ల ద్వారా నిజమైన సేవలు దేశ ప్రజలకి అందిస్తున్న మహిళలే బి.ఎస్.ఎన్.ఎల్.కి అసలైన బ్రాండ్ ఎంబాసిడర్లు. శ్రమ చేయని మార్కెట్ మలచిన బొమ్మలు ప్రీతీ జింటా, దీపికా పదుకునేలు కానేకాదు.

ఇక కార్యాలయాల వాతావరణం పితృస్వామ్య చట్రాల్లోనే ఉంటుంది. వివక్ష, కనపడని హింస వ్యవస్థీకృతమైపోయాయి. 'పెట్టుబడిదారులు దోపిడీ చేసే వర్గం అయితే కార్మికులు దోపిడీకి గురయ్యే వర్గం. అంటే ఒకప్పటి బానిసల వారసులే, ఈనాటి కార్మికులు' అని అంటారు రంగనాయకమ్మ స్పార్టకస్ ముందుమాటలో. అసలందరి కంటే ఎక్కువగా కార్మికులకే రాజకీయాలు తెలియాలంటారు. కానీ మహిళలకి ప్రజాస్వామ్యం, సమానత్వం, సమసమాజం – ఇవేవీ అంతగా తెలియవు. అసలు పట్టించుకోరు. భరించలేని అణచివేతల మధ్య లోంచి అంతులేని భక్తి పుట్టుకొస్తుంది. అదీగాక ఇప్పుడు రాజకీయాలు సరికొత్త రూపాల్లో మనముందుకొస్తున్నాయి. జనాభాలో మూడొంతుల ప్రజలు తాగునీరు, విద్య, వైద్యం లేక దారిద్ర్యం, అజ్ఞానం, తిండిలేమి, నిరుద్యోగాలతో సతమతమవుతున్నారు. అది దృష్టికి రానివ్వదు మీడియా. అవసరం లేని వస్తువుల్ని మార్కెట్ ఎడాపెడా మహిళల మీదకి రుద్దేస్తూ ఉంటుంది. వీటన్నిటి మధ్య ఇంత విశాల ప్రజానీకంతో అక్కడక్కడా భూమి కోసం, భుక్తికోసం, విముక్తికోసం, సమ సమాజ స్థాపన కోసం చేసే ఉద్యమాలు మహిళలను తాకడం లేదు. అసలు ప్రశ్నించాలనే ఆలోచనా రాని మహిళలున్నారు. తలవంచుకుని ఎంత కష్టమైనా పళ్లబిగువున భరిస్తూంటారు. స్పార్టకస్‌కి ముందు బానిసలకు ఆ స్పృహే ఉండేది కాదట. మనం బానిసలం. వాళ్లు యజమానులు అంతే అన్నట్లుండే వారట. ఇప్పటికీ కొంతమంది అలాంటి వాళ్లున్నారు.

ఆడపిల్లల్ని పుట్టనిస్తారో లేదో తెలీదు. పుట్టాక సమానంగా పెరగనివ్వరు. ఇష్టమైన చదువులసలే అందవు. అడుగడుగునా ఎదురయ్యే అవరోధాలనధిగమించి సంఘటిత ఉద్యోగ వ్యవస్థలోకి ప్రవేశిస్తున్న మహిళలు 4.2 శాతం మాత్రమే. జీవిక కోసం అసంఘటిత రంగంలో పనిచేసే మిగిలిన 95.8 శాతం మహిళల కష్టాలు చెప్పనలవి గానివి.

మన దేశంలో ట్రేడ్ యూనియన్ ఉద్యమం స్వాతంత్ర్యోద్యమానికి ముందు నుంచే ఉంది. కానీ నాయకులకు మహిళా దృక్పథం లేదు. వారిని సగభాగంగా ఇముడ్చుకుని పోరాటం చేసే సంస్కారం ఇంకా రాలేదట. నిజానికి టెలికాం శాఖలో మహిళల సంఖ్య దేశవ్యాప్తంగా ఎక్కువే ఉన్నప్పటికీ కార్మిక సంఘాల్లో వారి పాత్ర ఏమీలేదు. అధికారులు ఆధిపత్య భావజాలంతో ఉంటారు. కానీ ఆశ్చర్యకరంగా ఉద్యోగ సంఘాల నాయకులు కూడా అలాగే ఉన్నారు. ఎలక్షన్‌లలో మద్దతు కోరుతూ వారిని ఓటు బ్యాంకులుగా తప్ప ప్రాతినిధ్యం, నాయకత్వం వహించ గలిగిన వారిగా మలచాలని భావించరు. స్త్రీల సమస్యలు యూనియన్ ఎజెండాలలో ఉండనే ఉండవు. మహిళల ప్రత్యేక సమస్యల్ని గానీ వాళ్ల పరిమితుల్ని గానీ గుర్తించరు. అభ్యుదయవాదులమని చెప్పుకునే నాయకులున్న కార్మిక సంఘాల్లో కూడా స్త్రీల విషయానికొచ్చేసరికి ఉదాసీనంగా ఉంటారు. దేశంలో డైనమిక్ రాష్ట్రమని చెప్పుకునే ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రస్థాయిలోగాని, జిల్లాస్థాయిలోగాని, చివరికి బ్రాంచ్ స్థాయిలోనైనా ఒక్కరంటే ఒక్క మహిళా ప్రతినిధి కూడాలేరు. ఎన్ని రోజుల మీటింగులోనైనా సాగదీస్తూ పురుషుల ఉపన్యాసాలే ఉంటాయి తప్ప కనీసం మీ సమస్యలేమైనా మీరు చెప్తారా అని కూడా అవకాశమివ్వరు. నిజానికి మహిళల్లో 10, 15 మంది 15–20 ఏళ్ల నుంచి యూనియన్ ప్రతిపోరాటంలో ఉంటూ, కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటూ యూనియన్‌కి అంటిపెట్టుకున్న మహిళలున్నారు. వారికి సరైన శిక్షణ ఇవ్వడం, తరచుగా మీటింగులు పెట్టడం, సమస్యలు పట్టించుకోవడం ఏమీ ఉండదు. మహిళలు రాలేరంటూ తప్పించేసి గప్‌చుప్‌గా అన్నిట్లోనూ వాళ్లే ఉంటారు. దూదు బసవన్నలను, వాళ్లేమీ చెప్పినా నోరెత్తకుండా వినేవాళ్లనూ కింది స్థానంలో నాయకులుగా పెట్టుకుంటారు. మహిళలకే రకమైన ప్రోత్సాహం ఇవ్వకుండా అప్రజాస్వామిక విధానాలు అవలంబిస్తున్నారు. ఈ 4.2 శాతంగా సంఘటిత రంగంలో ఉన్న స్త్రీలు కూడా యూనియన్ల వెలుపలే ఉన్నారని జాతీయ మహిళా కమిషన్ చెప్తుంది. ఇది ట్రేడ్ యూనియన్ల వైఫల్యమే.

మహిళలు కూడా తాము కార్మికవర్గంలో భాగమని గుర్తించే కార్యక్రమాలు యూనియన్లు చేపట్టాలి. కేవలం ప్రచారం ద్వారా, పార్లమెంటరీ వ్యవస్థ ద్వారా మహిళల పరిస్థితుల్లో మార్పు తెస్తామనే స్త్రీవాద ఉద్యమాలు గానీ, ప్రగతిశీల ఉద్యమాలు గానీ మహిళా విముక్తిని సాధించలేవు. సమాజంలో పైనున్న సోమరిపోతులు, అట్టడుగున ఉన్న పనిదొరకని జనం – ఇద్దరి విముక్తి తోనే స్త్రీ విముక్తి కూడా ఉందని నమ్మి పని చేస్తున్న మహిళా సంఘాలు స్త్రీల అణచివేత వెనకున్న రాజకీయాల గురించి విప్పిచెప్పి, సాధారణ మహిళలు గందరగోళ పడకుండా నిజమైన జ్ఞానం పొందే దిశగా కృషి చెయ్యాలి. అక్కడక్కడా వెదజల్లబడిన మహిళా శక్తిని ఏకం చెయ్యడానికీ, చైతన్యవంతం చెయ్యడానికీ చొరవ తీసుకోవాలి. సంఘటిత, అసంఘటిత, శ్రామిక, రైతుకూలీ మొదలైన అన్ని రంగాల్లోని మహిళలందరూ కలిసి చర్చించుకునేటట్లుగా ప్రజాస్వామిక సంస్థలూ, మేధావులూ దిశానిర్దేశనం చెయ్యాలి. మహిళలకు సరైన నిప్పు అందితే భావితరాలు బాగుపడతాయి. అలాంటి రోజులొస్తాయని ఆశిద్దాం. వీ

*సంఘటిత రంగంలో పనిచేస్తున్న కొద్దిమంది మహిళలు మాత్రమే కాక అసంఘటిత రంగంలో ఉన్న కోట్లాది మంది శ్రామిక మహిళలతో కలిసి తమ హక్కుల కోసం పోరాడాల్సిన అవసరాన్ని చెబుతున్నారు* **నెల్లుట్ల అరుణ**

# సంఘటిత రంగంలో మహిళా ఉద్యోగులు

మన దేశ జనాభాలో మహిళల సంఖ్య 49 కోట్లు. వీరిలో పనిచేసే మహిళల సంఖ్య 13 కోట్లు. అసంఘటిత రంగంలో పని చేసే మహిళలు 12 కోట్లయితే కేవలం ఒక కోటి మంది మహిళలు మాత్రమే సంఘటితరంగంలో పనిచేస్తున్నారు. అంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వరంగ కార్యాలయాలు, ఆర్థికపరమైన శాఖలు, బ్యాంకింగ్, ఇన్స్యూరెన్స్ రంగాలు లాంటివి. దేశ ఆర్థికాభివృద్ధి లో శ్రామిక మహిళల భాగస్వామ్యం చెప్పుకోదగ్గదిగా ఉన్నప్పటికీ ఎక్కువ భాగం అసంఘటిత రంగంలో ఉండడం వలన, పనిచేసే మహిళలు అనగానే మనకు గుర్తొచ్చేది సంఘటిత రంగంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు మాత్రమే. ఈ కొద్దిమంది ఉద్యోగినులకయినా అన్ని రకాల సౌకర్యాలు అందుతున్నాయా? ఏ సమస్యలు లేకుండా వారు తమ విధుల్ని నిర్వహించగలుగుతున్నారా అనేది చర్చనీయాంశమే.

ముఖ్యంగా ప్రపంచీకరణ నేపథ్యంలో నూతన ఆర్థిక విధానాల అమలులో పెద్ద ఎత్తున నష్టపోతున్నది కార్మిక వర్గమే. మరీ ముఖ్యంగా శ్రామిక మహిళలు. పర్మనెంట్ ఉద్యోగాల కోత, ఉద్యోగ భద్రత కరువవడం, వి.ఆర్.ఎస్.లు, రిట్రెంచ్‌మెంట్‌లు, మొబిలిటీ లాంటి విధానాల ద్వారా ఇంటికి పంపించబడుతున్న ఉద్యోగులు కోకొల్లలు. వారిలో ఎక్కువమంది మహిళలు కావడం విశేషం. ఎందుకంటే ఇటు ఇంటిపని, అటు ఆఫీసు బాధ్యతలు కూడా కలిపి అతి కష్టం మీద జీవితాన్ని నెట్టుకొస్తున్న ఉద్యోగినికి మొబిలిటీ పేరుతో ట్రాన్స్‌ఫర్‌లను, ఇంకా ఇతర ఇబ్బందులను తట్టుకోలేక వి.ఆర్.ఎస్.తోనో, రిజైన్ చేసో ఇంటికెళ్లే ఉద్యోగినులే ఎక్కువ. ఈ పెద్ద సమస్య గురించి ఆందోళన చెందుతూనే రోజువారి దైనందిన జీవితాలలో ఉద్యోగినులు ఎదుర్కొంటున్న సమస్యలేమిటో చూద్దాం.

ప్రధానంగా అందరు ఉద్యోగినులు ఎదుర్కొంటున్న సమస్యలు కొంచెం హెచ్చు తగ్గులుగా ఒక్కటే. ఆయా రంగాలను బట్టి తేడాలుండవచ్చు. ముఖ్యంగా ప్రభుత్వరంగ బ్యాంకులు, ఇన్స్యూరెన్స్ రంగాల్లోని ఉద్యోగినులకు మిగతావారి కన్నా సమస్యలు తక్కువనే చెప్పాలి. ముఖ్యంగా ఉద్యోగినులు ఎదుర్కొంటున్న సమస్యల్లో టాయిలెట్స్, రెస్ట్‌రూమ్స్‌లు, లైంగిక వేధింపులు, రవాణా, ట్రాన్స్‌ఫర్, ప్రమోషన్ల పేరుతో వేధింపులు లాంటివి ఉంటాయి. ఇంటి వద్ద కూడా ఉద్యోగస్తురాలయిన స్త్రీకి అనేక సమస్యలు ఎదురవుతూ ఉంటాయి.

లైంగిక వేధింపుల విషయానికొస్తే చాలా చోట్ల తనకింది సిబ్బంది మహిళ అయితే ఏదో కారణంతో తన చాంబర్‌లోకి పిలవడం, మాటలతో వేధించడం చేస్తూ ఉంటారు. కొంతమంది పురుష ఉద్యోగులు కూడా మహిళ అనేసరికి రెండర్థాల మాటలు మాట్లాడడం, మహిళా టాయిలెట్లలో బూతు పదాలు రాయడం లాంటివి చేస్తుంటారు. ఇంట్లో ఏదైనా సమస్యతో ఆఫీసుకు వచ్చి అన్యమనస్కంగా ఉంటే దానికి పెడర్థాలు తీసి మాట్లాడుతుంటారు. పైకి అంతా మంచిగా ప్రవర్తించినట్టే ఉంటుంది. కాని మానసికంగా మహిళల్ని దెబ్బతీసే ప్రయత్నం జరుగుతూ ఉంటుంది.

రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయమయిన తూనికలు కొలతల శాఖలో ఒక సంఘటన జరిగింది. కంపాషనేట్ అప్పాయింట్‌మెంట్‌లో జాయిన్ అయిన 21 ఏళ్ల యువతిని, ఆ అమ్మాయి పై ఆఫీసరు ఒక సంవత్సర కాలంగా లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడు. అదే ఆఫీసులో పనిచేస్తున్న ఒక వ్యక్తిని ఆ అమ్మాయి వివాహం చేసుకోవాలనుకుంది. ఈ విషయం తెలిసినదగ్గర్నుండి ఆ అధికారి వేధింపులు ఇంకా ఎక్కువయ్యాయి. ఆ అమ్మాయిని లోబరుచుకోవడానికి ఎన్నో ప్రయత్నాలు చేసి చివరకు కక్ష సాధింపు చర్యగా ఆమెకు మెమో ఇవ్వడం, ఆ వ్యక్తిని ఏవో తప్పుడు కారణాలతో సస్పెండ్ చేయడం జరిగింది. మొత్తం ఆఫీసులో అందరూ వాళ్లకు సానుభూతి చూపించారు. ఆ అధికారిపై చర్య తీసుకోవాలని కోరారు. అయినా ఏమీ జరగలేదు. చివరకు ఆ అమ్మాయి మహిళా సంఘాలకు చెప్పుకుని మీడియా ద్వారా ప్రజల దృష్టికి తెచ్చింది. ఆ అధికారిని రక్షించే ప్రయత్నంలో ఆ కార్యాలయాధికారి మీడియా వాళ్లను కొట్టించడం కూడా జరిగింది. ఇంత పెద్ద ఆందోళన సాగించినా చివరకు ఆ అధికారిని ట్రాన్స్‌ఫర్ కూడా చేయలేదు.

ఇక హైదరాబాద్ నడిబొడ్డున సెక్రటేరియట్‌లో మంత్రుల చాంబర్‌లలో జరుగుతున్న భాగోతాలు మనకు తెలుసు. ఒక మహిళా ఉద్యోగినిని తన చాంబరుకు పిలిపించుకుని లోదుస్తుల కొలతల గురించి అసభ్యంగా మాట్లాడిన ఒక పైస్థాయి అధికారి గురించి రాష్ట్రమంతటా చాలా పెద్ద చర్చ జరిగింది. దాదాపు తనతో సమాన హోదా కలిగివున్న సహోద్యోగినితో ఇట్లా మాట్లాడడాన్ని టివి ఛానళ్ల సాక్షిగా ఆ అధికారి సమర్థించుకోవడం కొసమెరుపు. ఇంత జరిగినా సరియైన చర్య తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందనే విమర్శలు ఉన్నాయి.

ఇక ప్రైవేట్ రంగం – దానికేమీ మినహాయింపు కాదు. ఆ మధ్య ఒక పెద్ద కార్పొరేట్ సంస్థలో కంపెనీ సెమినార్ జరుగుతున్న హోటల్లో హాలుకు ఆనుకుని ఉన్న గదిలో ఒక మహిళా ఉద్యోగినిపై అత్యాచారం చేయడానికి ఒడిగట్టాడు ఆ సంస్థ అధికారి. ఆ మహిళ పెద్దగా కేకలు వేయడంతో సెమినార్ హాలులోని వ్యక్తులు వెళ్లి రక్షించగలిగారు.

ఇవి ప్రతిఘటించి బైటికి వచ్చిన స్త్రీలు చెప్పిన సంఘటనలు. బైటికి చెప్పలేక మనసులో మధనపడుతూ, ఎదిరిస్తే ఉద్యోగం ఏమవుతుందోనన్న ఆందోళనతో ఎంతోమంది ఉద్యోగినులు భరిస్తూ ఉంటారు. ఇక ఒంటరిగా నివసించే స్త్రీల పరిస్థితి మరీ దారుణం. ఒంటరితనాన్ని అవకాశంగా తీసుకుని లైంగిక వేధింపులకు గురిచేస్తూ ఉంటారు.

మహిళలు పనిచేసే ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని సుప్రీం కోర్టు ఆదేశాలు ఉన్నాయి. ప్రతి కార్యాలయంలో ఈ చట్టం పరిధిలో ఒక మహిళా సెల్‌ని ఏర్పాటు చేసి విచారణ జరపాలి. అట్లాగే రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా కమిషన్‌లు ఏర్పాటు చేసి ఇట్లాంటివి జరగకుండా చూడాలి. కాని ఇప్పటివరకు అక్కడక్కడా తప్ప మొత్తంగా ఈ 'ఉమెన్ సెల్స్' ఏర్పాటు కాలేదు. ఏర్పాటు చేయబడిన చోట కూడా అమలులో అంత ఉపయోగంగా ఉండడం లేదు. మనరాష్ట్ర మహిళా కమిషన్ పరిస్థితి అందరికి తెలుసు. పూర్తిగా బలహీనపరచబడింది.

ఉద్యోగినులు రోజూ ఎదుర్కొంటున్న సమస్య రవాణా సౌకర్యం. ఉద్యోగినులకు ఆఫీసు వేళల్లో ప్రత్యేకమైన బస్సులు కావాలనే డిమాండ్ ఎప్పటినుంచో ఉంది. కానీ ఒక్క సెక్రటేరియట్‌కు అదీ పొద్దున పూట మాత్రమే పూర్తి సౌకర్యం ఉంటుంది. మళ్లీ సాయంత్రం అంతంత మాత్రమే. ఆ బస్సులు కూడా సమయానికి రాకపోవడం, వచ్చినా నిర్లక్ష్యాన్ని ప్రదర్శించడం, మహిళలే కదా ఏం చేస్తారులే అనే ధీమాతో వ్యవహరించడం జరుగుతోంది. కొన్ని చోట్ల డ్రైవరుదో, కండక్టరుదో ప్రవర్తన బాగాలేదని డిపో మేనేజర్‌కు ఫిర్యాదు చేయడం జరిగినా వారిని మారుస్తామని మాటవరసకు చెప్పడమే తప్ప ఏమీ మార్పుండదు. ప్రత్యేక బస్సులు ఇట్లా ఉంటే, ఇక మామూలు బస్సుల్లో ప్రయాణించే ఉద్యోగినుల అవస్థలు అన్నీయిన్నీ కావు. బస్టాపులో నిలుచున్న దగ్గర్నుండి పోకిరీల సూదుల్లాంటి చూపులు కొన్నిసార్లు చేతల వరకూ వెళ్తాయి. వయసుతో నిమిత్తం లేదు. యాభై ఏళ్ల మహిళకైనా, ఇరవై ఏళ్ల యువతికైనా ఒకేలాంటి అనుభవాలే. బస్సు రాగానే కావాలని తోసుకుంటూ ఎక్కడం, ముందు డోర్ నుండి మహిళలే ఎక్కాల్సి ఉండగా, పురుషులు ముందుగా ఎక్కి డోర్‌కు అడ్డంగా నిలబడి మహిళలు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు వాళ్లని తాకుతూ పైశాచిక ఆనందాన్ని పొందుతూంటారు. తమ స్టాపు వచ్చినప్పుడు బస్సులో నుండి దిగడం అంటే తాతలు దిగిరావాల్సిందే. త్వరగా దిగట్లేదని డ్రైవరు బండబూతులు తిడుతూ ఉంటాడు. తిరిగి ఏమైనా అనాలని ఉన్నా ఆఫీస్ టైం అయిపోతుందన్న తొందర, గొడవ ఎందుకులే అని భరిస్తూ దిగిపోతుంది. ఇక ఆ రోజంతా బస్సులో జరిగిన సంఘటనకి ఆ ఉద్యోగిని బాధపడుతూనే ఉంటుంది. కావాలని బస్సు సడన్ బ్రేకులు వేయడం లాంటివి చేస్తూ మహిళలు బ్యాగులు, టిఫిన్ బాక్సులతో ముందుకీ, వెనక్కీ పడిపోతుంటే ఆనందించే వాళ్లు కొందరుంటారు. 'ఈ ఆడవాళ్లకు ఉద్యోగాలు ఎందుకు? చీరలు, నగలు, ప్రదర్శించడానికి కాకపోతే' లాంటి కామెంట్స్ సర్వసాధారణం. ఈ మధ్య సెక్రటేరియట్ బస్టాపులో ఒక సైకో సృష్టించిన అల్లరి అంతాయింతా కాదు. ప్రత్యేకంగా ఉద్యోగినులు నిలబడ్డ క్యూ దగ్గరికి వచ్చి బూతుపదాలు వాడుతూ, మహిళలపైకి కాగితాలు విసురుతూ ఎవరో ఒకళ్లని ఎంపిక చేసుకుని వాళ్లెక్కిన బస్సే ఎక్కి ఆ మహిళని అల్లరి చేయడం చేస్తుండేవాడు. ఎంతోమంది ఉద్యోగినులను ఈ వ్యక్తి ఇట్లాగే వేధిస్తూ ఉండేవాడు. ఈ బాధలు పడలేక రోజూ రెండు మూడు బస్సులుమారి అవస్థలు పడుతూ ఇల్లు చేరుకున్న మహిళలు ఎంతోమంది. ఈ విషయాన్ని ట్రేడ్ యూనియన్ దృష్టికి తీసికెళ్లిన తర్వాత కొంత మార్పు వచ్చినా, ఆ వ్యక్తిని మాత్రం ఏమీ చేయలేకపోయారు. అతను కూడా సెక్రటేరియట్ ఉద్యోగి కావడం, ప్రత్యేకంగా ఉద్యోగినుల సమస్యలను పట్టించుకోవాల్సిన అవసరాన్ని గుర్తించకపోవడం, స్త్రీలంటే, స్త్రీ సమస్యలంటే ఒక రకమైన చిన్నచూపు, చులకన భావం గల పురుషాధిక్య సమాజంలో ఇంతకంటే మించి ఊహించలేం.

ఇక మహిళా ఉద్యోగులకు ప్రత్యేకమయిన టాయిలెట్లు లేని ఆఫీసులు ఎన్నో. ఉద్యోగినులు నలుగురైదుగురుగా వచ్చి లోపల ఎవరూ లేరని నిర్ధారించుకున్న తర్వాతనే టాయిలెట్లను ఉపయోగించుకో గలుగుతారు. ఏ మహిళ అయినా ప్రత్యేకమయిన స్త్రీ సమస్యతో బాధ పడుతున్నట్టయితే ఆమె కష్టాలు చెప్పతరం కావు. నిజానికి స్త్రీలకు ప్రత్యేక టాయిలెట్లే కాదు ప్రత్యేకమయిన రెస్ట్‌రూంలు కూడా ప్రతీ కార్యాలయంలో ఉండాలి. ఎందుకంటే స్త్రీల శరీర సంబంధమైన సమస్యల వల్ల ఒక అరగంట విశ్రాంతి కొన్నిసార్లు తప్పనిసరి అవుతుంది. గర్భంతో ఉన్నప్పుడు, బాలింతగా ఉన్నప్పుడు ఇంకా ఇతర ఆపరేషన్ల సమయంలోనూ పొద్దుటి నుండీ సాయంత్రం వరకు సీట్లలో కూర్చోవడం అసాధ్యం. కాబట్టి కాసేపు విశ్రాంతి కావాలి. మహిళల విశ్రాంతి గదుల డిమాండ్ కొన్ని కార్యాలయాల్లో పెట్టినప్పుడు 'రెస్ట్ రూములెందుకు? సోఫాల్లో నిద్రపోవటానికా' లాంటి కామెంట్స్ వచ్చాయి. ఈ విషయంలో బ్యాంకింగ్, ఇన్స్యూరెన్స్ రంగాల్లోని మహిళల్ని అభినందించాలి. వాళ్లు ట్రేడ్ యూనియన్‌లో మహిళా కమిటీలను ఏర్పరచుకుని ప్రతి కార్యాలయంలోనూ 'లేడీస్ రెస్ట్ రూం'లు ఏర్పాటు చేసుకోగలిగారు.

ఇక ఇంటి విషయానికొస్తే ఉద్యోగినుల కష్టాలు కత్తిమీద సాము లాంటివి. ఇటు ఇంటి పని, అటు ఆఫీసు పని రెండు పడవలపై ప్రయాణం లాంటిది. పొద్దున లేచిందగ్గర్నుండీ పడుకునేవరకు ఇంట్లో అందరి అవసరాలు తీరుస్తూ వస్తుంది కానీ ఉద్యోగస్తురాలనే మినహాయింపు ఏమీ ఉండదు. ఇద్దరూ ఉద్యోగస్తులయినా టైమయి పోతున్నా వంటింట్లో పనితో సతమతమవుతున్న భార్యకు సహాయం చేయాలన్న ధ్యాస కూడా లేక పేపరు చదువుతూ ముందు గదిలో కూర్చునే భర్తలే మనకు కనిపిస్తారు. ఏ కొందరో దానికి మినహాయింపు కావొచ్చు. ఆఫీసు అయిపోయాక కూడా ఉద్యోగిని పిల్లలు, ఇల్లు అంటూ ఒక్క నిమిషం ఆలస్యం చేయకుండా ఇంటికొస్తుంది. అదే పురుషుడు కాలక్షేపం కబుర్లతో గడిపి ఏ అన్నం తినేవేళకో ఇల్లు చేరుకుంటాడు. ఇక పిల్లలకి జ్వరం లాంటివి వచ్చినప్పుడు, పిల్లల పరీక్షలప్పుడు, బంధువులు ఇళ్లకి వచ్చినప్పుడు, ఇంట్లో శుభకార్యాలు జరిగినప్పుడు ఇట్లా అనేకానేక కారణాలతో సెలవులు పెట్టుకోవాల్సింది ఉద్యోగస్తురాలయిన మహిళనే. అదే టైంలో ఆఫీసులో ఏ ఇన్‌స్పెక్షన్ లాంటిదో, పై అధికారి రావడం లాంటిదో జరిగితే సెలవు ఇవ్వకపోతే ఆ మహిళ పరిస్థితి దారుణంగా ఉంటుంది ఇంట్లో.

ఉద్యోగం చేసి సంపాదించే సొమ్ముపైన కూడా ఆమెకు హక్కులేదు. జీతం వచ్చేరోజు ఆఫీసుకు వచ్చి జీతం కవరు తీసుకెళ్లే భర్తలు ఎంతోమంది. స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం వస్తే అన్ని సమస్యలు తీరిపోతాయనీ, వివక్షతకు తావుండదనీ, సమానత్వం వస్తుందనీ ఎవరైనా నమ్మే వాళ్లుంటే ఈ ఉదాహరణ చాలనుకుంటాను.

**పుట్టక ముందు నుంచే వివక్షను ఎదుర్కొనే మహిళలు తమ రక్షణ కోసం పోరాడి సాధించుకున్న చట్టాల అమలు కోసం కూడా తామే పెద్ద ఎత్తున ఉద్యమించాల్సిన స్థితి ఉందంటున్నారు ఎస్. నీలాదేవి**

# మహిళల పై దాడుల్ని ఎదుర్కోవాలి

'మన సమాజంలో కొందరు తక్కువ కులాల్లో పుడతారు. మరికొందరు ఆడవాళ్లుగా పుడతారు' అంటూ కొడవటిగంటి కుటుంబరావు 'ఆడజన్మ'కు సమాజంలో ఉన్న విలువను అరవై ఏళ్ల కిందనే ఒక్క మాటలో తెలియజేశారు. సృష్టిలో ఏ ప్రాణికైనా పుట్టిన తర్వాతనే కష్టాలు, సమస్యలు. కాని స్త్రీకి పుట్టక ముందునుండే కష్టాలు. కడుపులోని నలుసు ఆడపిల్ల అని తెలియగానే ప్రపంచాన్ని చూడకముందే అంతం అయిన ఆడజీవితాలెన్నో?

మహిళ పుట్టకముందు నుండే వివక్షకు గురవుతూ పెంపకంలో, విద్యలో వ్యత్యాసానికి లోనవుతూ, ఇంటిపనిలో బానిసత్వానికి బలవుతూ ఇలా ఎదగడానికి ఎన్నో ఆటంకాలు. అదృష్టం కొద్దీ చదువుకునే అవకాశాలు కలిగి ఉన్న ప్రేమ పేరుతో వేధింపులు – ఇలా దినదిన గండంగా ఎదిగిన జీవితాలకు వివాహం కోసం వరకట్న దురాచారం, వివాహానంతరం గృహహింస ఇలా ప్రతిక్షణం ఏదో ఓ రూపంలో స్త్రీ జీవితమే సమస్యల వలయంగా మారింది.

ఈ మధ్యకాలంలో పెరుగుతున్న దాడులు మహిళలను మరింత భయాందోళనలకు గురిచేస్తున్నాయి. ఎప్పుడు ఎవరిపై ఏ రూపంలో దాడి జరుగుతుందో తెలియని పరిస్థితులలో మహిళల జీవితాలున్నాయి.

ఈ మధ్యకాలంలో డబ్బునో, చదువునో, అందాన్నో చూసి ప్రేమించానని వెంటపడి వేధించడం, కాదంటే ఉన్మాదంతో హింసకు పూనుకోవడం, అవుననంటే మోసగించడం సర్వసాధారణమైపోయింది.

ఈ పురుషాధిక్య సమాజంలో ఉన్న వివాహ వ్యవస్థలో ఉన్న లోపాలు స్త్రీకి సమస్యగా పరిణమించాయి. నాడు కన్యాశుల్కం అయినా నేడు వరకట్నం అయినా స్త్రీల జీవితాలను అల్లకల్లోలం చేస్తున్నాయి. మధ్యతరగతి ఆడపిల్లల తల్లిదండ్రుల జీవితాలను అతలాకుతలం చేస్తూ, తమ గుండెల మీది కుంపటిని బిడ్డల నెత్తిమీద పెట్టి, ఏదో విధంగా బరువు దించుకోవాలని తలతాకట్టు పెట్టి కష్టపడి పెళ్లి చేసిన ఏడాదిలోపే ఇంకా కట్నం కావాలంటూ మళ్లీ పుట్టింటికో, కాదంటే కాటికో పంపే పెళ్లికొడుకులెందరో?

---

స్త్రీలు దుబారా ఖర్చు ఎక్కువ చేస్తారని చాలా తెలివిగా గృహరుణాలు, వాహన తదితర రుణాలన్నీ భార్యల జీతాల్లో నుండి కోత పెట్టించే వాళ్లు ఉంటారు. ఒక అవగాహనతో ఇద్దరూ కలిసి మాట్లాడుకుని ఎవరో ఒకరి జీతం నుండి రుణ చెల్లింపులు జరిపే వాళ్ల గురించి కాదు నేనిక్కడ ప్రస్తావిస్తున్నది. భార్యలకు తెలియకుండా ఇన్వెస్ట్‌మెంట్లు పేరుతో షేర్లలోనో ఇంకా ఇతర అవసరాలలో తమ సంపాదనను వాడుకుంటున్న వాళ్ల గురించి. ఇంత చేసినా ఉద్యోగినికి ఇంట్లో దక్కే గౌరవం అంతంత మాత్రమే.

ఆఫీసులో ప్రమోషన్ల విషయానికొస్తే ఒకేరకమైన విద్యార్హతలు, అనుభవం, కార్యదక్షత ఉండి కూడా స్త్రీలు పురుషులంత వేగంగా పై పదవులకు వెళ్లలేకపోతున్నారు. ఏ సంస్థను పరిశీలించినా కనిపించే అంశం ఇదే. ఉద్యోగినుల సామర్థ్యం గురించి మాట్లాడినప్పుడల్లా మగవారు కూడా స్త్రీలు చాలా బాగా పనిచేస్తారని ప్రశంసిస్తారు. కాని స్త్రీలకు అప్పగించే ఉద్యోగ బాధ్యతలు వివక్షతాపూరితంగా ఉంటాయి. సవాళ్లు తక్కువ ఉన్న ఉద్యోగాలు కేటాయిస్తారు. ప్రయాణాలు, క్యాంపులు, బయటివారితో చర్చలు అవసరం అయ్యే బాధ్యతలు కేటాయించరు. అయితే స్త్రీలు కూడా ఇంటి బాధ్యతలకే మొదటి ప్రాధాన్యత ఇవ్వడం వల్ల ప్రమోషన్లు, ఇతర ఆఫీసు బాధ్యతలు తీసుకోవడంలో వెనుకంజ వేస్తారు. మిగతా ఉద్యోగులు కూడా వారిని నిరుత్సాహపరుస్తూ ఉంటారు. వీటన్నిటిని తట్టుకుని ఒక ఛాలెంజ్‌గా తీసుకుని ఉన్నత పదవుల్లో ఉన్న మహిళలు కూడా ఉన్నారు. తెలివి తేటలు, సమర్థత విషయంలో పురుషుల కంటే ఏ విధంగానూ తక్కువ కాకపోయినా, పురుషాధిక్య సమాజంలో ఉద్యోగిని ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నది.

చివరగా సమస్యలను అధిగమించడానికి అన్ని రంగాలవలె కార్మిక రంగంలోని మహిళలు ముందుకు రావాల్సిన అవసరం ఎంతయినా ఉంది. ట్రేడ్ యూనియన్లలో పని చేస్తున్న మహిళలు వేళ్లమీద లెక్కపెట్టేంత మంది మాత్రమే. తమ హక్కుల గురించి మాట్లాడాలన్నా, ఉద్యోగ రంగంలోని లోటుపాట్లను ఎత్తి చూపాలన్నా ఉద్యోగినులు వాళ్ల వాళ్ల రంగాల్లోని యూనియన్ కార్యకలాపాల్లో విస్తృతంగా పాల్గొనాలి. సమాజంలో జరుగుతున్న పరిణామాలు పరిశీలిస్తూ ఉండాలి. ఆఫీసుకు, ఇల్లుకు మాత్రమే పరిమితం కాకూడదు. ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మస్థైర్యాన్ని అలవరచుకుని, ఉద్యోగాన్ని కేవలం జీతం కోసం కాక, జీవన వికాసానికి ఒక మార్గంగా చూసినప్పుడు తప్పకుండా మార్పు వస్తుంది. గృహిణులకు లేని అవకాశం ఉద్యోగినులుగా తమకు అందుతుందనే విషయం మరవకూడదు. సమాజానికీ తమకూ గల సంబంధం ఉద్యోగ రూపంలో కలుగుతుందనే నిజం గ్రహించాలి. 'గానుగెద్దు ఉద్యోగం' లాంటి పాత పదాలను పక్కనపెట్టి సమాజంలో తలెత్తుకు తిరిగే ఆత్మవిశ్వాసాన్ని ఉద్యోగం కలిగించిందనే విశ్వాసం అలవరచుకోవాలి. అప్పుడు మాత్రమే సమస్యల మీద పోరాటం చేయగలుగుతారు. ఆ రోజు ఎంతో దూరంలో లేదనే ఆశ్వాసాన్ని ప్రతి ఉద్యోగిని కలిగించుకోవాలి. వీ

స్త్రీకి విద్య అయినా ఆర్థిక స్వాతంత్ర్యాన్ని, స్వావలంబనను చేకూర్చ లేకపోతోంది. ఆర్థికంగా స్వతంత్రులు, విద్యావంతులైన ఉద్యోగస్తులైన మహిళలపై దాడి మరొకరకం. ఉద్యోగం చేసే చోట మహిళ అనే చులకనభావంతో చూడడం, లైంగిక వేధింపులకు గురి చేయడం, అత్యాచారానికి పాల్పడడం వంటి దాడులు జరుగుతున్నాయి. ఇక ఇంటిలో శ్రమ విభజన లేకుండా ఉద్యోగ బాధ్యత, పిల్లల బాధ్యత, గృహ నిర్వహణ కొనసాగిస్తూ మానసిక ఒత్తిడికీ, అనారోగ్యానికీ గురికావడం, గృహహింసలో భాగంగా అనుమానం, ఆంక్షలు మొదలైన వాటి ద్వారా మానసికంగా, శారీరకంగా హింస ఇవన్నీ ఉద్యోగినులైన చాలా మంది మహిళలు నిత్యం సాధారణంగా ఎదుర్కొనేవే.

ఇన్ని సమస్యలతో నిత్యం సతమతమవుతున్న మహిళ సమాజంలో ఎందుకింత వివక్షకు గురి అవుతోంది? ఆమె పురుషుడితో పాటుగా ఒక మనిషిగా సమానంగా గౌరవం ఎందుకు పొందలేకపోతోంది? తరతరాల నుండి వచ్చిన సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, 'న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి' అంటూ స్త్రీకి స్వాతంత్ర్యం అవసరం లేదని ప్రకటించి, పురుషాధిక్య సమాజాన్ని నిర్మించుకొని, స్త్రీని బానిసగా చిత్రీకరించి బాల్యంలో తల్లిదండ్రులు, వయస్సులో భర్త, ముసలితనంలో కొడుకుల అధీనంలో ఉండాలంటూ, జీవితాంతం పురుషుని నీడలో, సేవలో ఉండాలని చెపుతూ స్త్రీకి విద్య, స్వాతంత్ర్యం లేకుండా చేశాయి. కాలంతో వచ్చిన మార్పులకనుగుణంగా, కొంత సంస్కర్తల పుణ్యమా అని ఎన్నో బాలారిష్టాలు దాటుకొని స్త్రీ ఎంతో కొంత విద్యను, స్వాతంత్ర్య ఆర్జనను సంపాదించుకొని తన విజ్ఞానంతో ముందుకు వెళ్లినా లింగ వివక్షతో వెనుకకు నెట్టివేయబడుతూ ఉంది.

నేటి సామ్రాజ్యవాద విషవలయంలో, ప్రపంచీకరణ నేపథ్యంలో స్త్రీ జీవితం మరింత సమస్యల వలయంలోకి నెట్టివేయబడుతోంది.

విశాఖ జిల్లా వాకపల్లి ఏజెన్సీ ప్రాంతంలో పదకొండు మంది ఆదివాసీ మహిళలపై జరిగిన అత్యాచారాన్ని సిగ్గు విడిచి చెప్పుకున్నా, సిగ్గులేని రాజ్యం చూపిన న్యాయం ఏది? అయేషాపై జరిగిన అత్యాచారానికి ప్రభుత్వ బాధ్యత ఏ విధంగా ఉంది. చట్టాలు కళ్లకే కాదు, చెవులకూ గంతలు కట్టుకొని తీర్పులు చెప్తున్న వైనం సామాన్యులైన ప్రజలను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

స్త్రీకి రక్షణ కల్పించాలని సరియైన చిత్తశుద్ధిలేని పాలనలో స్త్రీలపై దాడులు కాక మరేమి జరుగుతాయి. అర్ధరాత్రి స్త్రీ ఒంటరిగా నడచి వెళ్లటం కాదు. పట్టపగలు జనారణ్యంలో జంటలుగా తిరగలేని పరిస్థితులలో నేడు స్త్రీ జీవితం ఉంది. ఎంత రాక్షసరాజ్యం కాకపోతే పట్టపగలు యాసిడ్ దాడులు, కత్తిపోట్లు, అత్యాచారాలు జరుగుతాయి. శ్రీలక్ష్మి, కల్పన, అనిత, ప్రణీత, స్వప్నిక ఇలా ఎందరో? స్త్రీల రక్షణకోసం ఏర్పాటు చేసిన చట్టాలు వారిపై దాడిచేసిన వారిని రక్షించటంకోసం ఉపయోగపడుతున్నాయి.

స్త్రీ తనకు తానుగా స్వయంగా రక్షణ కల్పించమని కోరినా నిర్లక్ష్యతను, ఉదాసీనతను ప్రదర్శించే పోలీసు వ్యవస్థా, సమస్యల పరిష్కారం కోసం కోర్టును ఆశ్రయిస్తే సంవత్సరాల తరబడి ముగింపుకు రాక హింసను భరిస్తూ అత్తవారింట్లోనే ఉంటే బాగుండేది అనుకుంటున్నారు ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాల మహిళలు.

స్త్రీని విలాస వస్తువుగా, సౌందర్య సాధనంగా అంగట్లో నిలబెడుతూ వ్యాపార ప్రకటనలకు అనవసరమైన అశ్లీలతను కనబరుస్తూ మహిళల వ్యక్తిత్వాన్ని కించపరుస్తున్నాయి.

స్త్రీలపై జరుగుతున్న దాడులను ఖండించడం, తీవ్రంగా పరిగణిస్తున్నామంటూ ప్రకటనలు, ఆదేశాలు జారీ చేయడం కంటితుడుపు చర్యలు. మహిళా దినోత్సవాలను రాష్ట్రమంతటా నిర్వహించడం, స్త్రీలకు తాము ఎంత ప్రాధాన్యం ఇస్తున్నామో తెలియజేయడం కోసం అచ్చులో తమ పేరునూ, పత్రికల్లో తమ ఫొటోలనూ వేయించుకోవడం, సభలు, సమావేశాలు నిర్వహించి వేదికపైనే స్త్రీ సాధికారతను పూర్తిగా సాధించినట్లుగా చేయడం ఇవన్నీ నేడు మనకు కనిపించే నాణెంకు ఒకవైపు. రెండోవైపు అంతా స్త్రీల పట్ల పూర్తి వివక్షతనే కనిపిస్తుంది. చట్టసభల్లో, అన్ని అవకాశాల్లో కనీస స్థాయిని కలిగించని చట్టాలు, శాసనాలు, ప్రభుత్వాలు కనీస రక్షణ కల్పించలేని పరిస్థితి నేడు మనం చూస్తున్నాం.

నైతిక విలువలు దిగజార్చేలా వస్తున్న సినిమాలు, అశ్లీల కార్యక్రమాలను అదే పనిగా చూపిస్తూ, నేరాలను, ఘోరాలను ఏ విధంగా చేయాలో చాలా నైపుణ్యంగా చూపిస్తున్నాయి.

స్త్రీని బాల్యంలో కంటికి రెప్పలా కాపాడాల్సిన కన్నతండ్రులే తమ బిడ్డలపై దుర్మార్గంగా అత్యాచారం చేయడం చూస్తూ ఉన్నాం. ఇంతకన్నా నైతిక హీనత ఇంకెక్కడా మనం చూడం. ఎవరేమన్నా కన్నతండ్రికి చెప్పి రక్షించమనే చిన్నారికి కన్నతండ్రే భక్షకుడైతే ఎవరికి చెప్పి రక్షించమనడం. ఇంటా బయటా జరిగే దాడుల నుండి ఈ సమాజంలో మహిళ ఎలా తన మాన ప్రాణాలను రక్షించుకోవాలి?

ఒక తోటి మనిషిని మనిషిగా గుర్తించలేని, గౌరవించలేని క్రూర జనారణ్యంలో మహిళ ఎన్నో మానవ మృగాల నుండి తనను తాను రక్షించుకోలేని పరిస్థితులలో తనకు జరిగిన దాడికి న్యాయం పొందే పరిస్థితులలో నేడు లేదు.

మహిళలు న్యాయం పొందేలా రూపొందించిన చట్టాలన్ని ఏం చేస్తున్నాయి. వరకట్న నిషేధ చట్టం ఎందుకు అమలు జరగడం లేదు. యువకులు విద్యావంతులైతే వరకట్న దురాచారం రూపుమాసి పోతుందనుకున్నారు కాని, విద్య ఎక్కువైన కొద్దీ వారి విద్యకైన ఖర్చు అంతా వరకట్నం రూపంలో పొందాలనుకుంటున్నారు. తన జీవిత సహచరిని ఖర్చులకు సరిపోయే తిండితో, బట్టలతో, వస్తువులతో ఆహ్వానిస్తున్నాడు నేటి అతి విద్యావంతుడైన మేటి వరుడు.

కులం, మతం అడ్డుగోడలుగా నిలుస్తూ, సమాజం, కట్టుబాట్లు, ఆచార వ్యవహారాలు ఇవేవీ స్త్రీకి నిజమైన స్వాతంత్ర్యాన్ని ఇవ్వలేక పోతున్నాయి. పురుషాధిక్య సమాజంలో పుట్టిన స్త్రీ తాను కని పెంచిన సమాజం చేతిలోనే తాను విభజించి పాలించబడుతోంది.

స్త్రీ స్వేచ్ఛ, సమానత్వం కోరినచోట బరితెగించిన ఆడదిగా సమాజంలో చిత్రించబడుతూ ఉంది. స్త్రీకి విద్య ఆర్థిక స్వావలంబననూ, వివాహం రక్షణనూ, భద్రతాభావాన్నీ, విడాకులు జీవితానికి పరిష్కారాన్నీ సూచించ లేకపోతున్నాయి.

స్వాతంత్ర్యం వచ్చి అరవై ఏళ్లు దాటినా ఆరు సంవత్సరాల బాలిక నుండి అరవై ఏళ్ల వయసున్న అవ్వకూడా ఈ సమాజంలో ఒంటరిగా తిరగలేని పరిస్థితుల్లో ఉన్న ఈ దేశ దౌర్భాగ్యాన్ని ఏమనాలో తెలియకుండా ఉంది? ఇప్పటికైనా ప్రభుత్వాలు మేలుకొని మహిళా సంక్షేమం పట్ల శుష్కప్రియాలు చెప్పకుండా మహిళలపై జరిగే దాడుల పట్ల చట్టాలను సక్రమంగా అమలు జరిగేలా చూసి, కఠిన చర్యలను చేపట్టాలని ఆశిస్తూ, మహిళల సంఘటిత చైతన్య పోరాటమే సమస్యలకు పరిష్కారం. వీ

**మహిళలు చేసే పనికి ఇంటా, బయటా విలువ లేకపోవడమే కాదు, యూనియన్‌లలో వారికిచ్చే స్థానం, వారి పాత్ర కూడా నామమాత్రంగానే ఉన్నాయంటున్నారు** **అనంతలక్ష్మి**

# దిగజారుతున్న ఉద్యోగినుల పరిస్థితి

సమస్త సంపదల సృష్టికర్తలు శ్రామికులే. మహిళలంతా ప్రధానంగా శ్రమచేసేవారు. ఆకాశంలో సగభాగంగా ఉంటున్న మహిళలు ప్రపంచంలో మూడింట రెండు వంతుల పని చేస్తున్నారు. పనిభారం మోస్తున్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో మహిళలు పనులు వెతుక్కుంటూ ఇంటి నుంచి బైటకు రావాల్సి వస్తోంది. పెరుగుతున్న అవసరాలు మధ్యతరగతి మహిళలను ఉద్యోగాల కోసం పరుగులు పెట్టిస్తున్నాయి. తమ శ్రమను ఈ పోటీ ప్రపంచంలో కారుచౌకగా అమ్మకానికి పెట్టి ఎదురుచూడాల్సి వస్తోంది.

ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ జరుగుతున్న క్రమంలో ఉద్యోగాల సంఖ్య తగ్గుతోంది. నిరుద్యోగం పెరుగుతోంది. మరోవైపు శ్రామిక మహిళల సంఖ్య పెరుగుతోంది. ఎందుకంటే వాళ్ల శ్రమ కారుచౌక. అంతేకాక వాళ్లను సంఘటితం చెయ్యడం అంత సులువైన పనేమీకాదు. మరోవైపు పనిలో నైపుణ్యం తక్కువ. అందుకే స్త్రీలను ఉద్యోగాల్లోకి తీసుకోవడం ఎంత ఎక్కువగా ఉంటుందో అవసరమైతే తొలగించేది కూడా ముందుగా వీళ్లనే. అందుకు ప్రధాన కారణం రాజ్యమేలుతున్న పురుషాధిక్య భావజాలం.

సంక్షేమ కార్యక్రమాల అమలులో భాగంగా దళితవర్గాలకు ఉద్యోగ, ఉపాధి రంగాల్లో రిజర్వేషన్ కల్పించినట్లు, స్త్రీలకు కూడా ఉద్యోగాల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించడాన్ని కూడా సంక్షేమ కార్యక్రమాలలో భాగంగా చూడాలి. సామాజిక అసంతృప్తిని తగ్గించి, కార్యక్రమాలలో భాగం చెయ్యాలి.

మహిళలు బైట పనులు చేస్తున్నా, ఆర్థికంగా మగవారికన్న ఎక్కువ సంపాదిస్తున్నా ఇంటి పనుల్లో నుంచి బయటపడలేదు. వంట, ఇల్లు ఆమెకు అదనపు పనిగా మారింది. అలాగే పిల్లల పెంపకం కూడా తప్పించుకోలేని మానసిక, శారీరక సంకెళ్లుగా అయిపోయాయి.

మహిళా ఉద్యోగులు పని ఎంత నిజాయితీగా, నిక్కచ్చిగా చేసినా తోటి ఉద్యోగుల నుండి ఒక్క ప్రశంస రాదు సరికదా, నిరసనలు, ఎగతాళి, వెక్కిరింపులే. యూనియన్లలో వారికి ఎలాంటి ప్రాధాన్యత లేదు. వాళ్లు అవసరానికి ఓటర్లు. యూనియన్ కార్యక్రమాలకు హాజరు కావలసిన సంఖ్య. మహిళా ఉద్యోగుల సంఖ్య టీచింగ్ తదితర రంగాల్లో పెరిగినా, యూనియన్లలో వాళ్లు నిర్ణయాత్మక సంఖ్యగా ఉండరు. కార్యవర్గంలో వాళ్లు అప్రధానమైన పోస్టుల్లో ఉంటారు. నిర్ణయాలు తీసుకొని యూనియన్ల వాళ్లు వీళ్లకు తీరికగా తెలియజేస్తారు. చాలా వరకు తెలియజెయ్యరు. వామపక్ష విధానాలకు కట్టుబడి ఉన్నామని ప్రణాళికలో రాసుకున్న సంఘాల్లో కూడా స్త్రీలకు ఎలాంటి ప్రాముఖ్యతా రావడం లేదు. మరోవైపు వాళ్లు రారని, వాళ్లకు ఇంటిపనులు, పిల్లల పనులు ఉంటాయని ప్రశ్నలు, జవాబులు వాళ్లే చెప్పుకుంటారు.

మహిళా ఉద్యోగులు పని చేసే చోట ఎదుర్కొంటున్న సమస్యలు ఒకటీ రెండూ కాదు. తాగటానికి నీళ్లుండవు. ఉన్నా నీళ్లుండి తాగితే టాయిలెట్లకు వెళ్లాల్సి వస్తుందని తాగలేని పరిస్థితి. ఉదయం నుంచి సాయంత్రం దాకా ప్రకృతి పిలుపులను బిగబట్టుకొని పని చేయాల్సిన పరిస్థితి. అనేక చోట్ల టాయిలెట్స్ ఉండవు. విడిగా అసలు ఉండవు. పరిశుభ్రంగా ఉండవు. ఇవన్నీ మహిళా ఉద్యోగుల శారీరక, మానసిక స్థితిపై ప్రభావం చూపుతాయి.

మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న మరో సమస్య ప్రధానమైంది పనిచేసే చోట ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులు. ఇది చెప్పుకోలేని సామాజిక సమస్య. చట్టాలు ఎన్ని ఉన్నా, మహిళా ఉద్యోగులు ఎలాంటి ఊరట పొందలేని స్థితి. అనేక పోరాటాలు చేసి సాధించుకున్న చట్టాలు ఆచరణలో అమలు చేయించుకోలేని పరిస్థితి. పనిచేసే చోట, ప్రతీచోట లైంగిక వేధింపుల నివారణ కమిటీలను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించినా, ప్రభుత్వాల ఆదేశాలు ఉన్నా ఆచరణలో ప్రగతి దాదాపు శూన్యం. పన్నెండేళ్లు పైగా గడుస్తున్నా ఈ చట్టం ఆచరణలో ప్రాథమిక స్థాయిని కూడా దాటలేదు.

హోదా పెరిగే కొద్దీ మహిళా ఉద్యోగులకు సమస్యలూ పెరుగుతున్నాయి. తమతోటి ఉద్యోగి తమ పై అధికారిగా చూడడానికి, ఆమె ఆధ్వర్యంలో పనిచేయడానికి తోటి మహిళా ఉద్యోగులు కూడా చిన్నతనంగా, అవమానంగా భావించే పరిస్థితులున్నాయి. స్త్రీ అధికారిణి ఆదేశాలను విధిలేక భరిస్తూ వీలైనంత సహాయ నిరాకరణ చేసే ఉద్యోగులు కోకొల్లలు. బస్సులో స్త్రీలకోసం ప్రత్యేకించిన సీట్లలో వాళ్లే కూర్చోవడానికి ఎంత పోరాటం చెయ్యాలో, అందుకు తోటి ప్రయాణికుల సహకారం ఎంత ఉంటుందో మహిళలకు అందులో ఉద్యోగాలు చేసేవాళ్లకు ప్రతిరోజూ అనుభవమే.

మహిళా ఉద్యోగులకు ఆఫీసుల్లో అప్రధానమైన హోదాలు కేటాయిస్తూ తక్కువగా చూస్తున్నారు. ప్రధానమైన హోదాలు, లంచాలు మేయటానికి అవకాశమున్నవి పురుష ఉద్యోగులు పోటీ పడి మహిళలను రానివ్వకుండా చేస్తారు.

మహిళలు మగవారికన్నా సమర్థవంతంగా పనిచేసినా, చేయగలిగినా అలాంటి హోదా, పనులు ఇవ్వకుండా చిన్నచూపు చూడడం సర్వసాధారణం. ఎలాగైతే రాష్ట్రమంత్రివర్గంలో తొలిసారిగా ఒక మహిళను హోంమంత్రిగా నియమిస్తే అది ఎంతటి విప్లవాత్మక మైందని వర్ణించారో మహిళలకు ప్రధానమైన శాఖలు, హోదాలు కేటాయించినా అలాంటి స్పందనే కలుగుతోంది.

మహిళా ఉద్యోగులు ప్రధానంగా ప్రభుత్వ శాఖల్లోకి తమ కుటుంబ సభ్యులు, తల్లితండ్రి, భర్త మొదలైనవారు పనిచేస్తూ చనిపోవడం వల్ల కుటుంబ భారాన్ని తలకెత్తుకొని పనులకు వస్తున్నారు. తోటి ఉద్యోగుల ఛీత్కారాలను, అవమానాలను భరిస్తూ, పిల్లలను, కుటుంబ సభ్యులను పోషించడానికి మొన్నటిదాకా భర్త పనిచేసిన ఆఫీసులో ఉద్యోగాల్లోకి రాకతప్పటం లేదు. వీళ్లపై లైంగిక వేధింపులు తరుచు జరుగుతున్నట్లు రిపోర్టులు వస్తున్నాయి. లైంగిక వేధింపులపై ఫిర్యాదులు బయటికి రాకపోవడానికి సామాజిక, వ్యక్తిగత కారణాలు, బయట మద్దతు లేకపోవడం, మహిళా సంఘాలు సమర్థవంతంగా పనిచేయక పోవడం, ప్రభుత్వపరంగా వేధింపులకు పాల్పడ్డవారికి సకాలంలో సరియైన శిక్షలు పడకపోవడం మొదలైన అనేక కారణాలున్నాయి.

రాష్ట్రంలో ఎక్కడైనా ఏర్పాటు అయ్యిందో లేదో తెలీదు కానీ కర్నూలు జిల్లాలో మాత్రం 2004లో 'పనిచేసే చోట మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపుల నిరోధక కమిటీ' ఏర్పడింది. అప్పటి జిల్లా కలెక్టర్, మహిళా ఉద్యోగుల సంఘం ప్రోద్బలంతో, చొరవతో అధికారిక ఉత్తర్వుల ద్వారా ఈ కమిటీని ఏర్పాటు చేశారు.

'విశాఖ వర్సెస్ స్టేట్ ఆఫ్ రాజస్థాన్' కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులననుసరించి, ఈ కమిటీ ఏర్పడి, స్వతంత్రంగా పనిచేయడం ప్రారంభించింది. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎచ్ ఎన్ ఎస్ ఎస్ నాగమ్మగారి అధ్యక్షతన ఈ కమిటీ ఏర్పడింది. ఒక కన్వీనర్, ఇద్దరు కో కన్వీనర్స్, నలుగురు సభ్యులతో ఈ కమిటీ పని ప్రారంభించింది. ఇప్పటికీ మూడు కేసుల్లో నివేదికలను సమర్పించింది.

రూల్స్ ప్రకారం ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఇలాంటి కమిటీలను ఏర్పాటు చేయడం, పనిచేయించడం, ప్రభుత్వం ఆధ్వర్యంలోని స్త్రీ శిశు సంక్షేమ శాఖ ద్వారానే జరగాలి. ఈ కమిటీ ఆ శాఖ ద్వారానే ఏర్పడినప్పటికీ, ఆ శాఖ మిగతా ప్రభుత్వ శాఖలతో పాటు ఎంత వెనకబడిందో అర్థమయ్యింది. ఈ కమిటీకి వచ్చిన ఒక కేసు అత్యంత బాధాకరమైన, విచారకరమైన కేసు అదే డిపార్ట్‌మెంట్‌కు చెందింది కావడం ఒకింత ఆశ్చర్యకరమైంది. ఎందుకంటే ఉద్యోగినులకు రక్షణ కల్పించాల్సిన డిపార్ట్‌మెంట్‌లోనే ఉద్యోగినులకు రక్షణ లేదని తేల్చి చెప్పింది. పైగా, వీరి డిపార్ట్‌మెంట్‌లోనే మహిళలపై వేధింపులు జరగకుండా అడ్డుకోలేకపోతున్నారు.

కర్నూలు స్త్రీ శిశు సంక్షేమ శాఖలోని సూపరింటెండెంట్ స్థాయి ఉద్యోగి తనతోపాటు పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ స్థాయిగల మహిళను, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఎంబ్లమ్ చూపించి వేధించడం, ఆమె ఎవరికి చెప్పుకోలేక మౌనంగా భరిస్తూ రావడం విచిత్రమే అయినా వింత కాదు. చివరికి ఆమె ఈ కమిటీకి ఫిర్యాదు చేయడంతో ఈ విషయం బయటికి వచ్చింది. కమిటీ నిజనిర్ధారణ జరిపి వేధింపులకు గురిచేసిన ఉద్యోగి నేరం చేశాడని రుజువు చేసి రిపోర్ట్‌ను సమర్పించింది.

అంతకు మునుపే వేధింపులకు గురియైన ఉద్యోగిని ఈ విషయాన్ని తమ డిపార్ట్‌మెంట్ వారి దృష్టికి తీసుకెళ్లినా, కలెక్టర్ దానిపై ఆర్డర్స్ వేసినా, ఎటువంటి చర్యను తీసుకొననందుకే, ఫిర్యాది ఈ కమిటీని ఆశ్రయించింది. ఈ కమిటీ రిపోర్ట్‌ను ఆధారం చేసుకొని ఆ డిపార్ట్‌మెంట్ నిందితుడైన ఉద్యోగిని సస్పెండ్ చేసింది.

అప్పటినుండి ఆ నిందితుడు ఆ మహిళను సాధించడం, వేధించడం, రకరకాలుగా కమిటీ సభ్యుల డిపార్ట్‌మెంట్ అధికారులకు ఫిర్యాదు చేయడం, కలెక్టర్ కమిటీని ఏర్పాటు చేసినా కమిటీని, సభ్యులను వేధించడం ప్రారంభించాడు. కమిటీ నివేదిక ఆధారంగా తనపై చర్య తీసుకోవచ్చనీ దాన్నే ఎంక్వైరీ రిపోర్ట్‌గా పరిగణించవచ్చని ఉత్తర్వులు ఉన్నా, స్త్రీ శిశు సంక్షేమ అధికారులు, వేధింపులకు పాల్పడ్డ వ్యక్తికి ఉపయోగపడే రీతిలో విచారణను మళ్లీ మొదటి నుంచి కొనసాగించి, ఎంక్వైరీ కమిటీ సభ్యులను విచారణకు పిలుస్తూ కమిటీలలోకి ముందుకు వచ్చి, వాలంటరీగా పనిచేస్తూ ఉద్యోగం కాకుండా అదనంగా ఈ పనులను చేస్తూ, ఎటువంటి భత్యం లేకుండా ఎటువంటి నిధులు ప్రభుత్వం నుంచి తీసుకోక, స్వంత ఖర్చులను పెట్టుకుంటూ పనిచేస్తున్న సభ్యులను నిరుత్సాహపరిచే విధంగా వ్యవహరించాడు. దాంతో కొంతమంది కమిటీ సభ్యులు కమిటీ నుంచి పక్కకు తప్పుకున్నారు. ఇది బాధితురాలి పై బండలు విసిరే పద్ధతి. దీంతో రెచ్చిపోతున్న ఆ నిందితుడు, ఇంకా ఆమెను వేధించేందుకు ముందుకు వచ్చి, ఆమె వ్యక్తిగత జీవితంపై మరింత బురద చల్లడానికి ప్రయత్నం చేస్తున్నాడు.

ఇలాంటివి ఎందుకు జరుగుతున్నాయి? దీనికి కారణం ప్రభుత్వ శాఖలకూ, అధికారులకూ కోర్టులంటే గౌరవం లేదు. మహిళా ఉద్యోగుల సమస్యలపై సానుభూతి లేదు. ప్రభుత్వ ఉత్తర్వుల అమలు పట్ల చిత్తశుద్ధి లేదు. జి.ఒ. 27 వచ్చి 12 ఏండ్లు అవుతున్నా ఏ ప్రభుత్వ ఆఫీసు దీనిపై తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవడం లేదు.

ఈ కమిటీ ప్రతి డిపార్ట్‌మెంట్‌కు ఫిర్యాదుల స్వీకరణ కమిటీలను ప్రతి ఆఫీస్‌లో ఏర్పాటు చెయ్యాలని రాతపూర్వకంగా ఆదేశించినా ఒక్క అధికారి నుండి స్పందన రాలేదు. పైగా యూనియన్ నాయకుల నుండి వ్యతిరేకత వచ్చింది. చాలాచోట్ల నిందితులకు మద్దతుగా యూనియన్ నాయకులు, కుల సంఘాల నాయకులు మాట్లాడడం, పురుషాధిపత్య భావజాలంతో జరుగుతున్నది తప్ప మరొకటి కాదు.

ఇన్ని ప్రతిబంధకాల మధ్య కూడా ఇలాంటి కమిటీలు వీటికి ఎదురీదుతూ పనిచేస్తున్నాయంటే అందుకు కారణం వీరి వెనుక ఉద్యోగినుల మద్దతూ, అంతో ఇంతో చైతన్యం ఉండబట్టే. అధికారులు కొంతమందైనా ధైర్యంగా అండగా ఉన్నారు కనుక ఈ కమిటీలు ముందుకు పోతున్నాయి.

మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి వారి చైతన్య స్థాయిని పెంచడమే సరియైన పరిష్కారమార్గం. అందుకు సంఘాల్లో చేరి సంఘటితం కావాలి. నాయకత్వ స్థానాలకు భయపడకుండా ఎదగాలి. నిబద్ధతతో తమ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తూ సహ ఉద్యోగులకు అండదండలుగా నిలబడినప్పుడే పరిష్కారం సాధ్యం అవుతుంది. వీ

*మారిన కాలమాన పరిస్థితులు, ఉద్యోగ అవకాశాల నేపథ్యంలో సంక్లిష్టతకు లోనయిన కుటుంబ జీవితాలనూ, మహిళలు ఎదుర్కొంటున్న అదనపు సమస్యలనూ వివరిస్తున్నారు* **కె. సుభాషిణి**

# మారిన ఉద్యోగాలు - కొత్త సమస్యలు

'ఎందుకమ్మా సందామామా కన్నీరెడతావూ....
పుట్టకుండా సచ్చేదానా...'

ఏ ప్రాణికి అయినా భూమి మీద జన్మించిన తర్వాతే కష్టాలు మొదలయితే, ఆడ శిశువుకు మాత్రం పుట్టక ముందే అంటే, తల్లి గర్భంలో ఊపిరి పోసుకోవడం ఆరంభమయిన క్షణం నుండే ఈ ఆడ శిశువును భూమి మీదకు పంపాలా లేక మొగ్గగానే చిదిమి వేయాలా అనే వివక్షతో సమస్యలు మొదలవుతాయి. ఈ గండం నుండి బయట పడిన తర్వాత -

'పుట్టినాది మొదలు నీకు పుట్టేడన్నీ బాధలు
లెక్కలేని తిప్పలు ఎటుపడితే అటు కత్తులు..'

మహిళలు నిరంతరం కత్తుల బోను లాంటి పితృస్వామ్య సమాజంలో ఎలా మనుగడ సాగిస్తూ ఉన్నారో కళ్లకు కట్టినట్లు వర్ణించిన పాట ఇది.

గర్భస్త శిశువు దశ, బాల్య దశ, విద్యార్థిని దశలలో ఏర్పడే గండాలను దాటుకొని ప్రౌఢగా ఎదుగుతున్న క్రమంలో స్త్రీలకు సంపాదనా, ఆర్థిక స్వేచ్ఛల అవసరాన్ని గుర్తించి తమకు అందుబాటులో ఉన్న ఉద్యోగాలలో చేరుతున్నారు. పురుషులతో పాటు సమానంగా ఉద్యోగం చేస్తున్న స్త్రీలకు ఇంటి పనులు, పిల్లల బాధ్యత అదనపు భారం కావడంతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఇటు ఇల్లు, అటు ఉద్యోగం రెండింటి మధ్య స్త్రీ శాండ్‌విచ్‌లాగా నలిగిపోతోంది. స్త్రీల స్వేచ్ఛను, సమానత్వాన్ని అంగీకరించలేని పురుషాధిక్య సమాజం 'ఆడదాని సంపాదనా కూడా ఒక సంపాదనేనా' అంటూ చేసే దురహంకార విమర్శను ఉద్యోగినులు తగు రీతిగా తిప్పికొట్టారు. 'భార్య సంపాదన వేన్నీళ్లకు చన్నీళ్ల లాంటిది' అనే పితృస్వామ్య బుజ్జగింపుల మాయ నుండి కూడా నేటి ఉద్యోగినులు బయటపడ్డారు.

అన్ని వర్గాల స్త్రీల సమస్యలు ఒకటి కానట్టు, అన్ని రంగాలలో పనిచేసే స్త్రీల సమస్యలు కూడా ఒక్కటిగా లేవు. గ్రామీణ, మండల స్థాయిలల్లో ఉద్యోగినులు ఎదుర్కొనే సమస్యలకు, డివిజన్ స్థాయిలల్లో ఉద్యోగినులు ఎదుర్కొనే కొన్ని సమస్యలకు కొద్దిపాటి సారూప్యత ఉన్నప్పటికీ తీవ్రత వేరేగా ఉంటుంది. ఒక్కొక్కసారి అదనపు సమస్యలు వస్తూంటాయి. విశృంఖలంగా, అతి వేగంగా విస్తరిస్తున్న కార్పొరేట్ సంస్కృతి వలన మెట్రోపాలిటన్ ప్రాంతాలలో పనిచేసే ఉద్యోగినుల సమస్యలు మరింత జఠిలంగా తయారవుతున్నాయి.

గంటల తరబడి సిటి బస్సులల్లో ప్రయాణాలు, ట్రాఫిక్ జామ్‌లు, ఎప్పుడు ఆఫీసులకు చేరుతారో, ఎప్పుడు ఇండ్లకు చేరుకుంటారో తెలియని పరిస్థితి. అయితే విద్యాసంస్థలు, బ్యాంకులు, ప్రభుత్వ ఆఫీసులు లాంటి వాటిలో పనిచేసే ఉద్యోగినులకు కొంచెం వెసులుబాటు ఉంటోంది. ఎందుకంటే వాళ్లు పనిచేసే ప్రాంతాలకు దగ్గరగా ఇళ్లు తీసుకుంటే ప్రయాణాల కోసం వెచ్చించాల్సిన సమయం ఆదా అవుతుంది. వీళ్లు పనిచేసే వేళలు ఉదయం 9 లేదా 10 గంటలకు మొదలయ్యి సాయంత్రం 5 లేదా 6 గంటలకు పూర్తి అవుతాయి. ఈ సమయాలకు భిన్నంగా పనిచేసే సంస్థలు లేదా షిఫ్ట్ పద్ధతులతో రోజంతా నడిచే సంస్థలలో పనిచేసే ఉద్యోగినుల పరిస్థితి వర్ణనాతీతం.

ఆంగ్లభాషలో మంచిపట్టు, నైపుణ్యం గల నేటి యువతీ యువకులకు బి.పి.ఒ. రంగం స్వర్గంలాగా కనిపిస్తోంది. వీటిల్లో దాదాపు ఎనభై శాతం మంది 25-30 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవాళ్లు, అందులో సగానికి పైగా మహిళలే. మాధుర్యంతో కూడిన కంఠస్వరం యువతులకు ఉంటుంది. వారైతే వినియోగదారులను చక్కగా ఆకట్టుకోగలరు అనే ఉద్దేశంతో బి.పి.ఒ. సంస్థలు పెద్ద సంఖ్యలో స్త్రీలను నియమించుకుంటున్నాయి.

వినియోగదారులు ఈ బి.పి.ఒ. సంస్థల ఉద్యోగినుల నుండి తమకు కావలసిన సేవలను అందుకున్న తర్వాత కూడా ఉద్యోగినులతో ఫోన్‌లో సంభాషణ పొడిగిస్తూ అసభ్యంగా, వెకిలిగా మాట్లాడి వేధిస్తూంటారు. అయినా ఫోన్ కట్ చేయకూడదు. మూడు నిమిషాల పాటు వినవలసిందే. ఉద్యోగినులు ఈ విషయం మీద ఫిర్యాదు చేసినా సంస్థలు చర్య తీసుకోవడం లేదు. దీనితో వీరికి అవమానంతో మానసికంగా కృంగిపోవాల్సిన అగత్యం ఏర్పడింది.

నేటి సమాజంలో ప్రేమ పేరిట స్త్రీలపై చేసే అతి కిరాతకమైన భౌతిక దాడులు - యాసిడ్ చల్లడం, కత్తులతో పొడవడం, బ్లేడుతో కోయడం లాంటివి ఇక్కడ కనిపించవు. కాని కొత్తరకం 'సాఫ్ట్‌వేర్ దాడులు' వికృత రూపం దాలుస్తున్నాయి. కొంతమంది ఉద్యోగులు తమ సహ ఉద్యోగినులకు అసభ్యకరమైన ఎస్.ఎం.ఎస్.లు, మెయిల్స్ పంపడాలు, సెల్లు, కంప్యూటర్లల్లో 'మార్ఫింగ్' ద్వారా ఫొటోలు తారుమారు చేసి బ్లాక్‌మెయిలింగ్ చేస్తుండడంతో ఎవరితో చెప్పుకోవాలో తెలియక ఉద్యోగినులు మానసికంగా క్షోభపడుతున్నారు. తమతోపాటు పబ్‌లకు

ఆహ్వానించడం, వారితో అసభ్యకరమైన భంగిమల్లో నృత్యాలు చేయమని బలవంత పెట్టడం లాంటివి నగరాల్లో ఎక్కువగా కనిపిస్తోంది.

కాల్ సెంటర్ల ఉద్యోగినుల మీద జరుగుతున్న అత్యాచారాలు, హత్యలు కూడా చాలా ఆందోళనకు గురిచేస్తున్నాయి. రాత్రిపూట సంస్థలకు చెందిన క్యాబ్‌లో ప్రయాణాలు, సహ ఉద్యోగుల లైంగిక వేధింపులతో నిత్య భయాందోళనలతో గడుపుతున్నారు.

రాత్రిపూట ఉద్యోగాలు, నిద్రపోవాల్సిన సమయాల్లో పనివేళలు, లేచి పనులు చేసుకోవాల్సిన సమయంలో నిద్ర, వేళకు ఆహారం తీసుకోలేకపోవడం – ఇవన్నీ బి.పి.ఒ., కాల్‌సెంటర్లలో పనిచేసే ఉద్యోగినుల ఆరోగ్యాల మీద తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. ఉదయం ఏ పదకొండు గంటలకో నిద్రలేవడం వలన రోజువారి పనులను చురుకుగా, వేగంగా చేసుకోలేకపోతున్నారు. నిరంతరం కంప్యూటర్ ముందు కూచోవడం, దానికి కళ్లు అప్పగించడం, చెవులకు హెడ్‌ఫోన్స్ బంధించి ఉంచడంతో వెన్నెముక, నడుము, భుజాలకు సంబంధించిన తీవ్రమైన నొప్పులతో బాధపడుతున్నారు. శరీరానికి ఏమాత్రం శ్రమ కలిగించని ఉద్యోగాలు కావడం అధిక బరువు, ఊబకాయం లాంటి సమస్యలు వీళ్లను వేధిస్తున్నాయి. దీని వలన అధికరక్తస్రావం, ఇర్రెగ్యులర్ పీరియడ్స్‌తో ఇబ్బంది పడుతున్నారు.

భార్యాభర్తలు ఇరువురిలో ఒకరిది పగటిపూట ఉద్యోగం, ఇంకొరిది రాత్రిపూట ఉద్యోగం అయితే వాళ్ల పరిస్థితి ఏమిటి? ఏ వారాంతపు రోజుల్లో తప్ప మిగిలిన రోజుల్లో ఒకరి ముఖాలు ఒకరు చూసుకోలేని పరిస్థితులు. ఇక సంసార సుఖాలు, జీవితాలు కలలో మాట. దీంతో అక్రమ సంబంధాలు పెంచుకుంటున్నారు. ఫలితం, భార్యాభర్తల మధ్య ఘర్షణ తీవ్రరూపం దాల్చి కుటుంబాలు విచ్ఛిన్నమై పోతున్నాయి. ఒకవేళ భార్యాభర్తలు ఇరువురికీ రాత్రిపూట ఉద్యోగాలు అయితే అప్పుడు పిల్లల బాధ్యత, సంరక్షణ ఎవరు చూస్తారు? రాత్రిపూట వీళ్ల పిలల్ని చూడ్డానికి ఏ క్రష్‌లు తెరిచి ఉంటాయి? వీళ్ల కోసం పగలు నిద్రపోయి రాత్రిపూట పనిచేసే ఆయాలు ఎక్కడ దొరుకుతారు? బి.పి.ఒ. సంస్థలే క్రష్ (బేబీకేర్ సెంటర్) నడిపితే సమస్య ఇంత తీవ్రంగా ఉండదు.

ఒకవేళ పిల్లల్ని చూసుకోవడానికి ఎవరో ఒకరు కుటుంబ సభ్యులు అనగా అమ్మమ్మో లేక నాన్నమ్మో ఉంటే కూడా సమస్య కొంతమేరకు పరిష్కారం అయినట్లే. అయితే ఇక్కడ కొత్త సమస్య ఒకటి ఏర్పడే అవకాశం ఉంది. సాధారణంగా పిల్లలు ఉదయాన్నే లేచిన వెంటనే తల్లికోసం చూస్తారు. పక్కనే నిద్రపోతున్న తల్లిని, నిద్రలేపేస్తారు. రాత్రంతా పనిచేసి, అలసి ఇంటికి వచ్చి అప్పుడప్పుడే నిద్రబోతున్న తల్లులకు వెంటనే నిద్రలేవడం అనేది ఎంత నరకయాతనగా ఉంటుందో అనుభవించే వాళ్లకు తప్ప వేరే వాళ్లకు అర్థం కాదు. మూడు లేదా నాలుగు గంటల నిద్ర సహజంగానే సరిపోదు. దానితో వీళ్లు అసహనానికి గురవుతారు. 'డిప్రెషన్' లాంటి మానసిక రుగ్మతల బారిన పడుతున్నారు.

పొద్దున్నే లేచి పనులు చేయకుండా అత్తగారింట్లో పొద్దెక్కే వరకు తలుపులు బిడాయించుకొని పడుకుంటే అత్తమామలు సహించి ఊరుకుంటారా? 'ఇదెక్కడి చోద్యం..' అంటూ బుగ్గలు నొక్కుకుని ఊరు వాడా చాటింపు వేస్తారు. దీనికి భయపడి కొందరు ఉద్యోగినులు నిద్రను త్యాగం చేసి ఉదయాన్నే లేచి ఇంటిపనులు చేసుకుంటుంటే భర్తలేమో గుర్రుపెట్టి నిద్రబోవటమో లేక ఏ వార్తాపత్రికను పట్టుకొని కూచోవడమో చేస్తుంటారు. అందుకే అంటుంటారు – 'ఉదయం నిద్ర లేవగానే స్త్రీ పాదాలు వంటింటి వైపు కదులుతాయి. మగవాళ్ల కళ్లు వార్తాపత్రికల కోసం, పెదవులు సిగరెట్టు కోసం వెతుక్కుంటాయి.'

బి.పి.ఒ. సంస్థలల్లో పనిచేసేవారు ఎక్కువగా యువతీ యువకులే కాబట్టి, ఇక్కడ ప్రేమ వివాహాలు సర్వసాధారణం. కులం, మతం, భాషా సంకెళ్లను బద్దలు కొట్టే ధోరణి కనిపించినప్పటికీ సాంప్రదాయ పితృస్వామ్య లక్షణాలు మాత్రం సజీవంగానే కనిపిస్తాయి.

వీరికి ఇంటిలో అనారోగ్యంతో కూదుకున్న ముసలి తల్లిదండ్రులు ఉంటే వారికి కనీస సేవలు చేసేది ఎవరు? వారు తినగలిగిన, తినవలసిన ఆహారాన్ని సమకూర్చే వాళ్లు ఎవరు? ఉదయం పదకొండుకో పన్నెండుకో వీరు నిద్రలేస్తే అంతవరకు వృద్ధులు ఏమీ తినకుండా ఉండగలరా? అలాంటి పరిస్థితుల్లో ఇక వృద్ధాశ్రమాలే శరణ్యం. తాము ఉండి కూడా తల్లిదండ్రులను అనాథలుగా ఉంచవలసి వస్తోందనే అపరాధభావన వీరిని నిత్యం వెంటాడుతూనే ఉంటుంది.

పిల్లలు, కుటుంబ సభ్యులతో గడపడానికే సమయం లేని ఉద్యోగినులు ఇక ఇరుగు పొరుగు వారితోనూ, సమాజంలోని ఇతర సమూహాలతోనూ సంబంధాలు కొనసాగించలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు. అందరూ ఆఫీసు వదిలి ఇళ్లకు చేరుకునే సమయంలో వీరు ఇళ్లు ఒదిలి ఆఫీసులకు చేరుకుంటారు. అందరు నిద్రలేచే సమయంలో వీళ్లు నిద్రకు ఉపక్రమిస్తారు.

ఇన్ని ప్రతికూల పరిస్థితుల్లో, అన్నిరకాల ఇబ్బందులను ఓర్చుకుంటూ, అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటూ ఈ సంస్థలల్లో ఎందుకు పని చేస్తున్నారు అనే ప్రశ్న, ఆసక్తి సహజంగానే సమాజంలో రేకెత్తుతుంది.

మిగతా రంగాలలో ఉద్యోగాలు లేకపోవడం, ఇక్కడ ఆకర్షణీయమైన జీతాలతో కూడిన ఉద్యోగాలు కావడం, దాదాపు మామూలు ఉద్యోగాల్లో వచ్చే జీతాల కంటే ఇక్కడ మూడు నాలుగు రెట్లు ఎక్కువగా ఉండటం ప్రధాన కారణం. ఇంత పెద్ద మొత్తం జీతంతో తమ జీవన ప్రమాణాల స్థాయిని, అలవాట్లను పెంచుకోవచ్చు. ఖరీదైన జీవితాన్ని గడపొచ్చు. ఆకర్షణీయమైనవి, మార్కెట్‌లోకి వచ్చే కొత్త కొత్త వస్తువులను కొని జీవితాలను అనుభవించవచ్చు అనే అభిప్రాయాలతో ఈ సంస్థలలో పనిచేయడానికి మొగ్గు చూపుతున్నారు. వర్తమానాన్నే కాదు భవిష్య జీవితాన్ని కూడా నిశ్చింతగా ఉంచడానికి 'మేము ఈ రోజే లిఖించగలం' అనే ధీమా వీరిలో బాగా కనిపిస్తోంది. ఇదంతా ఒకనాటి మాట. అంటే ఆర్థిక మాంద్యానికి పూర్వం ఉన్న పరిస్థితి ఇది. ఈ ఆర్థిక మాంద్యం దెబ్బకు బి.పి.ఒ. సంస్థలు నేడు గజగజ వణికిపోతున్నాయి. ఎక్కడో ఒకచోట, రెండు మూడు రోజులకు ఒకసారి చిన్న, చితక బి.పి.ఒ. సంస్థలు మూతపడుతున్నాయి. లేదా ఉద్యోగుల సంఖ్య ముఖ్యంగా ఉద్యోగినులను తొలగించడమో లేక దూర ప్రాంతాలకు బదిలీ చేయడమో జరుగుతోంది. కొత్త ప్రాంతాలలో ఒంటరిగా ఉండలేక, వారాంతపు రోజులల్లో ప్రయాణాలు చేయలేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. భద్రత కరువై, తుమ్మితే ఊడిపోయే ముక్కు లాంటి ఉద్యోగాల గురించి యువతులు ఇప్పుడిప్పుడు ఆలోచించడం మొదలుపెట్టారు.

*వివిధ రంగాలలో ఉపాధికోసం ముందుకు వస్తున్న మహిళలకు ప్రత్యేక వసతులు, సౌకర్యాలు కలిగించి ప్రోత్సహించాల్సిన ప్రభుత్వ బాధ్యతను, అవసరాన్ని గుర్తుచేస్తున్నారు* **టి.ఎన్.జి.ఒ. మహిళలు**

# మహిళా ఉద్యోగుల సమస్యలు

పూర్వకాలంలో పురుషులు సంపాదించి తెస్తే ఇంట్లో ఉండి వారి అవసరాలు చూసుకునేదిగా ఉండేది స్త్రీ. కాని ఈనాటి మహిళ పురుషుడితో పాటుగా ఎంతోకొంత సంపాదిస్తే కాని ఇల్లు గడవని పరిస్థితి. అందుకే మహిళలు ఇంట్లో నుండి బయటకు రావాల్సిన పరిస్థితి. ఉద్యోగం చేసే మహిళ ఇంట్లో వాళ్లకు లోకువే, బయటి వాళ్లకు లోకువే. అన్ని అమర్చకుండ వెళ్లిపోతుందని ఇంట్లో వాళ్లు, టింగురంగమని ఇంట్లో వాళ్ల బాగోగులు చూస్కోకుండా బ్యాగు వేసుకుని వెళ్లిపోతుందని బయటి వాళ్లనుకుంటారు.

ఆడదంటే అగాధం అంటారు. ఇక్కడ ఉద్యోగాలు చేసే ఆడదంటే ఊబి అని అర్థం. ఊబిలో కూరుకుపోవడమే కాని లేవడం జరగదు. మనకు స్వాతంత్ర్యం వచ్చి 62 సంవత్సరాలు గడిచినప్పటికీ మనదేశంలో పురుషాధిక్య, భూస్వామ్య, పెత్తందారీ స్వభావం ఇంకా మన సమాజాన్ని వీడిపోలేదు. నిజానికి ఇప్పటికీ మనది పురుషాధిక్య సమాజమే. స్త్రీలు ఎంత ఉద్యోగాలు చేస్తున్నా పురుషుల అదుపాజ్ఞలలోనే ఉంటున్నారు. అది తరతరాలుగా వస్తున్న సాంప్రదాయమేకావచ్చు లేదా ఆ పరిస్థితికి అలవాటు పడిపోయి అయినా కావచ్చు.

మనిషిగా పుట్టినప్పటికీ కేవలం ఆడవారు అయినందు వల్లనే మహిళలు అన్ని రంగాల్లో వివక్షతని ఎదుర్కొంటున్నారు. స్త్రీల సమస్యలు కొండంత, పరిష్కారం గోరంత చందంగా ఉంది. వాస్తవ పరిస్థితుల్లో స్త్రీ ఉద్యోగినుల సమస్యలు, పురుష ఉద్యోగుల సమస్యల కంటే భిన్నంగా ఉంటాయి కనుక పరిష్కారాలు అదే దిశగా ఉండాలి. మహిళా ఉద్యోగులకి ప్రత్యేక రవాణా సౌకర్యం లేక ఆర్.టి.సి. బస్సులో ప్రయాణించడంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్త్రీలకు కేటాయించిన సీట్లలోంచి మగవారు కూర్చొని లేవకపోవడం, అదేమంటే సమానత్వం అంటారు. గర్భిణిగా, బాలింతగా అనారోగ్య పరిస్థితుల్లో ఉన్నా చాలాసార్లు డ్రైవర్, కండక్టర్ పట్టనట్లు వ్యవహరించడం. డ్రైవర్

---

ఈ బి.పి.ఒ. సంస్థలు ఏ ప్రజల ప్రయోజనాల కోసం పని చేస్తున్నాయి? తమ సిబ్బందితో రాత్రిపూట ఉద్యోగాలు చేయించి ఎవరికి సేవలు అందజేస్తున్నాయి? ప్రజలు ఎవరు? ఏ దేశస్తులు? వారు కూడా రాత్రిపూట ఉద్యోగాలు చేసే వాళ్లేనా? వీరి సేవలను ప్రజలు రాత్రి పూటనే అందుకుంటున్నారా?

ఏ దేశం వారికి పగలు ఉన్నప్పుడు భారతదేశంలో రాత్రి అవుతుందో – ఆ దేశ ప్రజల ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన సమాచారాన్ని అందజేయడమే ఈ బి.పి.ఒ. సంస్థల ముఖ్యపని. భారతదేశంలో నైపుణ్యం ఉంటూ తక్కువ జీతాలకు పనిచేసే ప్రజలు విరివిగా దొరుకుతారు. కాబట్టి ఈ సంస్థలు భారతదేశంలో నెలకొల్పడానికి మొగ్గుచూపాయి. అక్కడి దేశాలు ఆర్థికంగా పతనావస్థలో ఉంటే ఇక్కడ ఈ సంస్థలలో పనిచేసే వాళ్ల ఉద్యోగాలు ఊడిపోతాయి. అందుకే ప్రస్తుత పరిస్థితులల్లో ఈ ఊద్యోగినులు తమ ఆరోగ్యాన్ని, పిల్లల బాధ్యతను దృష్టిలో పెట్టుకొని, తక్కువ జీతమైనా సరే భద్రత గల పగటి పూట ఉద్యోగాలు చేయడానికి సిద్ధంగా ఉన్నారు.

పగటిపూట పనిచేసే కాల్‌సెంటర్లు కూడా భారతదేశంలో విరివిగానే ఉన్నాయి. కాని కార్పొరేట్ బి.పి.ఒ. సంస్థల జీతాలతో పోల్చుకుంటే, జీతాలు చాలా తక్కువగా ఉంటాయి. ఈ కాల్‌సెంటర్లు దేశీయ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంటాయి. ఉదాహరణకు ఒక ప్రైవేట్ బ్యాంక్‌తో ఒప్పందం చేసుకొని, ఆ బ్యాంక్ ప్రవేశపెట్టిన పథకాలను ప్రచారం చేయడానికి రోజుకు నాలుగుసార్లు ఫోన్ చేసి 'ఆకర్షణీయమైన వడ్డీలతో మా బ్యాంక్‌లో రుణం తీసుకోండి' అని తియ్యటి గొంతుతో ప్రజల్ని పలకరించి వేధిస్తూంటారు. వాళ్ల ఉద్యోగం అలాంటిది. వినివిని విసిగిపోయి కొంతమంది వారిని ఫోన్‌లోనే చెడమడా తిట్టి ఫోన్ పెట్టేస్తారు.

హక్కులు నిషేధం అయిన ఈ బి.పి.ఒ., కాల్‌సెంటర్లలో హక్కుల గురించి అవగాహన పెంచుకోవడం, వాటి గురించి మాట్లాడి చర్చించుకోవడం, ఉద్యోగినుల మధ్య ప్రచారం చేయడం అత్యవసరం. రొటేషన్ సిస్టమ్‌లో షిఫ్ట్ పద్ధతులను ప్రవేశపెట్టమని సంస్థలను డిమాండ్ చేసే స్థాయికి ఎదగాలి. వినియోగదారులు తోటి ఉద్యోగుల లైంగిక వేధింపులను ఎదుర్కొనేందుకు ఉద్యోగినులు అందరూ సంఘటితమై తక్షణమే స్పందించి నిందితులపై కఠినచర్యలు తీసుకునేట్టుగా సంస్థలపై ఒత్తిడి తీసుకురావాలి.

లైంగిక వేధింపులు, మానసిక, శారీరక ఆరోగ్య సమస్యలు సృష్టిస్తూ వ్యక్తిగత జీవితాల్లోకి ప్రవేశించి, అశాంతిని, కల్లోలాన్ని రేకెత్తిస్తూ, ఏ క్షణంలో ఉద్యోగం ఊడుతుంతో అనే అభద్రతను కలగజేస్తున్న ఈ బి.పి.ఒ., కాల్‌సెంటర్ల కుట్రలకు అడ్డుకట్టవేయడం నేటి యువతీ యువకుల కనీస బాధ్యత. వీ

బస్సును ఆపవలసిన చోట ఆపకుండా వెనుకగానీ, ముందుగానీ ఆపి మహిళా ఉద్యోగినులతో ఆటలాడుకుంటారు. అతనికి సరదా కావచ్చు కాని ఉద్యోగినికి ఎంత అసహనం. అసలే కాలం పరిగెత్తుతుంది, బస్సు పరుగెత్తుతుంది, ఆ రెండింటినీ అందుకోవడానికి ఉద్యోగిని పరుగెత్తడం.

మహిళా ఉద్యోగినులకి సౌకర్యాలు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం జారీచేసిన జి.ఒ.లు కొన్ని రాష్ట్ర ప్రభుత్వంలో లేకపోవడం, ఉన్నవి అమలుకు నోచుకోకపోవడం జరుగుతోంది. స్త్రీలు తల్లులుగా, కుటుంబ రథసారథులుగా విభిన్న పాత్రల్లో జీవిస్తూ వృత్తికి న్యాయం చేయాల్సి ఉంటుంది కనుక తల్లుల కోసం ఉద్దేశించిన ప్రసూతి సెలవు కేంద్ర ప్రభుత్వం వారు ఆరు నెలలు సౌకర్యం కల్పిస్తే, రాష్ట్ర ప్రభుత్వం కేవలం నాలుగు నెలల మాత్రమే ప్రసూతి సెలువు ఇస్తోంది. తల్లిపాల వారోత్సవాలు జరుపుకుంటూ, తల్లిపాలు బిడ్డ హక్కు అని ప్రచారం చేస్తూ ఆ తల్లులకి మొదటి ఆరు నెలలు బిడ్డలకి పాలు ఇచ్చే సౌకర్యం కల్పించకపోవడం శోచనీయం. కనుక రాష్ట్ర మహిళా ఉద్యోగులకు ఆరు నెలలు ప్రసూతి సెలవు ఇవ్వాలి. ప్రసూతి సదుపాయాలు, రవాణా సౌకర్యాలు, వ్యక్తిగత భద్రత, పిల్లల సంరక్షణాలయాలు (కార్యాలయాల లోనే క్రష్‌లు) వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

నాన్ గెజిటెడ్ స్త్రీ ఉద్యోగుల్లో ఎక్జిక్యూటివ్స్ అందరికీ ప్రభుత్వం టూవీలర్ కోసం రుణ సదుపాయం, డ్రైవింగ్ నేర్చుకొనే అవకాశం కూడ కల్పించాలి. కార్యాలయాల్లో అన్ని చోట్ల టాయిలెట్స్, నీటి వసతి, లంచ్‌రూమ్స్ అన్నీ అందుబాటులో ఉండాలి. పని చేసే చోట లైంగిక వేధింపులు ఎదురైనప్పుడు పై అధికారులు పరిష్కరించాలి. సమస్య తీవ్రతరమైనపుడు చట్టాలన్ని ఉపయోగించుకోవడంలో వెనుతీయరాదు. అంతేకాక చట్టాల వినియోగంలో విజ్ఞత, అవగాహనతో వ్యవహరించి తప్పుడు ఆరోపణలకి గురికాకుండా చూసుకోవాలి.

కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో చాలా కార్యాలయాలలో పనిభారాన్ని ఎన్.జి.ఒ.లపై వదలేసి వారి నిర్ణయాలు అమలు ఫలితాలు సాధిస్తే అది పై వారి విజయాలుగా లేక వైఫల్యాలు ఎదురైతే దానిని కింది వారిని బాధ్యుల్ని చేస్తూ, జి.ఒ.లు వెతికే బాధ్యత కిందివారిపై నెట్టివేసే చర్యలు చేపడుతున్నారు. ఇది దురదృష్టకరం. వీటితోపాటుగా స్త్రీలకు మగ అధికారుల నుండి లైంగిక వేధింపులు, గృహహింస వంటి సమస్యలు పట్టి పీడిస్తూనే ఉంటాయి.

స్త్రీ సహజంగా బలహీనురాలు అని అంటారు. కాని ఆ స్త్రీకి అమ్మ మనస్సు ఉన్నందున ఎదుర్కొనే ధైర్యం నుండి ఆదిశక్తిగా మారలేక పోతున్నది. అందుకే ఒక స్త్రీ కాకుండా సంఘంగా ఉంటే ఎదుర్కోవడానికి కావలసిన ధైర్యం ఉంటుంది. అందుకే మహిళా ఉద్యోగులు కూడా సంఘంగా ఏర్పడి వాళ్లకు కావలసిన హక్కులు పొందడానికి తగిన కృషి చేయాలి. హక్కు అన్నది ఒకరు ఇచ్చేది కాదు. మనకు మనమే తీసుకోవాలి. ఉదాహరణకు స్త్రీలు అంగన్‌వాడీ కార్యకర్త, ఆరోగ్య కార్యకర్తల స్థాయిలో మాత్రమే ఉన్నారు. వారికిచ్చే వేతనం వారు చేసే పనితో పోలిస్తే చాలా తక్కువ. అలాగే పని వాతావరణం చాలా దారుణంగా ఉంటుంది. ఈ విషయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. వ్యవసాయ కూలీలుగా కూడా ఎక్కువ మంది స్త్రీలే ఉన్నారు. తక్కువ వేతనంతో ఎలాంటి సౌకర్యాలు లేకుండా ఎన్నో ఇక్కట్లకు గురవుతున్నారు. ఏ ఒక్కరి సమస్య అయినా మన సమస్యే అన్న రీతిలో ఆ సమస్యలకు ముగింపు తేవాలి. బీడీ కార్మికురాళ్లు, ఆశ కార్యకర్తలు కూడా ఈ కోవలోని వారే.

స్త్రీలు వారికున్న కుటుంబ సమస్యలు, అవసరాలు, వంట చేయడం, పిల్లల్ని సాకడం వంటి ఇంటి పనులతో సతమతమవుతూనే, సంఘం వాటి కార్యకలాపాల్లో చాలా చురుగ్గా పాల్గొంటున్నారన్న విషయాన్ని గ్రహించాలి. అయితే పురుషులు ఈ విషయాన్ని అంతగా జీర్ణించుకోలేక పోతున్నారు. దీనివల్ల మహిళా కార్యకర్తలు చాలా తక్కువ సంఖ్యలో పాల్గొంటున్నారు.

పురుషాహంకారం, పురుషాధిపత్య భావాలు నాటుకుపోయిన మన మగవారు స్త్రీలను సంఘం కార్యకలాపాల్లో ముందుంచుతున్నారు. కాని నాయకత్వ విషయానికి వచ్చేసరికి మాత్రం మహిళలను నాయకులుగా అంగీకరించలేకపోతున్నారు.

స్త్రీల సమస్యల విషయంలో ప్రతి కార్యాలయంలో స్త్రీలే సభ్యులుగా ఉండి, కమిటీలను ఏర్పరచి, తరచుగా వారి సమస్యలని పరిశీలిస్తూ ఉంటే సమస్యల ఉధృతి తగ్గుతుంది. కనుక స్త్రీలంతా సంఘటితమై సమస్యల పరిష్కారం కోసం పోరాడినపుడే ద్వితీయ శ్రేణి గుర్తింపు నుంచి ఎదగగలుగుతారు.

మహిళలు ఎలా చేసినా పనిని పూర్తిచేసుకోవాలి, ఏ టైంలోనైనా కార్యాలయంకు వచ్చి నిర్దేశించిన పని చేయడానికి అవకాశం ఇవ్వాలి. ఉద్యోగినులను దామాషా పద్ధతిలో సంఘం సభ్యులుగా నియమించాలి. స్త్రీ, శిశు సంక్షేమ శాఖలోని పోస్టులను స్త్రీలతో నింపాలి. అవసరమయితే పురుషులకు వేరే డిపార్ట్‌మెంట్‌లోనికి పంపి అయినా. కొన్ని కార్యాలయాల్లో మినిస్టీరియల్ స్టాఫ్ అంతా మగవారే ఉంటున్నారు. సచివాలయంలో, ఇంకా కొన్ని శాఖలలో స్త్రీలకు ఉన్న 33 శాతం రిజర్వేషన్ కనబడడం లేదు. ఆర్.టి.సి. బస్సులలో స్త్రీలకూ, వికలాంగులకూ  కేటాయించిన సీట్లు కేవలం మగవారికి మాత్రమే అన్న విధంగా ప్రవర్తిస్తూ, అంగవైకల్యం ఉన్న మహిళలకు, వృద్ధులకి సీట్లు ఇవ్వడం లేదు. రిజర్వేషన్ సీట్లు పురుషులకి, స్త్రీలకి సమానం అన్న విషయం ఆర్.టి.సి. అధికారులకు తెలవకపోవడం విచిత్రం.

ఇదివరలో ఉద్యోగం పురుషలక్షణం అనేవారు. నేడు ఉద్యోగం స్త్రీల లక్షణమని చెప్పవచ్చు. భారత రాజ్యాంగం కుల, మత, లింగ వివక్షత లేకుండా మనుషులంతా సమానం అని ఆర్టికల్ 14 విశదపరుస్తున్నప్పటికీ పురుషుల ఆధిపత్యం మహిళల హక్కులను కాలరాస్తున్నాయి.

ఎక్కడైతే స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలు కొలువుంటారని పురాణాలు చెపుతున్నాయి. కాని నేటి సమాజంలో ఆడశిశువును గర్భంలో ఉండగానే చిదిమేస్తున్నారు. గతంలో వైద్యులు గర్భిణీగా ఉండగానే లింగ నిర్ధారణ చేసేవారు. తల్లి గర్భంలో ఉండగానే ఆడపిల్ల వద్దు అనుకునే మన వెనకబడిన సమాజంలో ఆడపిల్ల బయటకు వచ్చి ఎన్ని సమస్యలు ఎదర్కోవాలో కదా.

*(బి. అరుణ, ప్రజ్వల, శాంత, రేఖ గార్ల ఉమ్మడి రచన)* వీ

*స్త్రీలు తాము ఒంటరులం కామనే చైతన్యాన్ని పెంచుకొని, సంఘటితమై పోరాడడమే అన్ని సమస్యలకు పరిష్కారమంటున్నారు* **డి.ఆర్. మంజుల**

# మహిళలకు ఆఫీసుల్లో వేధింపులు

**దా**దాపు పదిహేను సంవత్సరాల నుండి ఉద్యోగినుల సమస్యలపై పనిచేస్తున్నాను. ఆఫీసులోనూ, కుటుంబంలోనూ, బయట వాళ్లు ఎదుర్కొంటున్న సమస్యలు చెపుతుంటే చాలా సందర్భాల్లో బాధ అనిపించినా, కోపం, ఆవేశం వచ్చిన సందర్భాలు, నిరాశ, నిస్పృహ పడ్డ సందర్భాలెన్నో ఉన్నాయి.

ఉద్యోగినికి రోజూ ఇంటిపని, వంటపని, పిల్లల పెంపకం, ఇంటి అవసరాల కోసం షాపింగ్ వగైరా పని, ఆఫీసుపని, సాయంత్రాలు గుళ్లు, గోపురాలకు తిరిగే పని, ఇలా పదిపదిహేను రకాల పనులుంటాయి. స్కూలుకెళ్లే పిల్లలున్న వాళ్లైతే, ఉదయంపూట ఫోన్ చేసినా దొరకరు. చాలా బిజీ అని సమాధానమిస్తారు. మీటింగ్ ఉంది రమ్మని ఫోన్‌చేసిన ప్రతిసారీ అక్కా పాపకు జడేస్తున్నాననో, క్యారియర్లు కట్టాలి తొందరగా అనో, ఏదో ఇలాంటివే చెప్పిన సందర్భాలెన్నో. అంటే ఉదయం పూట మాట్లాడడానికి కూడా అవకాశం ఉండదు. గబగబ బ్యాగు సర్దుకొని బయటపడడంలో చాలామంది ఉద్యోగినులు టిఫిన్ తినడం మర్చిపోతూ ఉంటారు.

మా ఫ్రెండ్ ఒకసారి ఆరోగ్యం బాగోలేక వెన్నెముక ప్రాబ్లెమ్ వచ్చి బెడ్‌రిడన్ అయ్యింది. చూడడానికి నలుగురైదుగురం వెళ్లాం. చూస్తే పడుకోకుండా పనిచేస్తోంది. అంత ఆరోగ్యం బాగోలేని దానివి పడుకోవచ్చు గదా అంటే అదొక్కటే తక్కువ అంది. మీ ఆయన సహాయం చెయ్యొచ్చుగదా అంటే, అతనికి జీతం కావాలి గాని పని సహాయం చేస్తే కిరీటం కిందపడ్తుంది గదా మేడమ్ అంది. వచ్చిన వాళ్లందరిళ్లల్లోనూ అదే సమస్య. విజయ వాళ్లింట్లో ఆమె హార్ట్‌పేషెంట్ అయి, కోమాలోకి వెళ్లి చచ్చిబతికినా ఆమె వంట చెయ్యాలి. ఇక ఈశ్వరి ఇంట్లో సుగర్ మొగుడికి ఒకరకం వంట, బిపి అత్తగారికి ఇంకోరకం వంట, వాళ్లకు ఇంకో రకం ఇలా మూడు వంటలు చేసి పరిగెత్తుకుంటూ రావాలి. ఆదివారం చర్చి ఉంటే చర్చికి వెళ్లొచ్చిన తర్వాత, ఒంటిగంటైనా ఆమె వంట చెయ్యాలి. నైట్ డ్యూటీ ఉన్న నర్స్ అయితే డ్యూటీ గురించి మాట్లాడకుండా ఉదయం నుంచి పనుల్లోకి దిగాలి. ఎక్కడో మారుమూల పల్లెల్లో టీచర్ ఉద్యోగం చేస్తే ఉదయం నాలుగు గంటలకంతా వాళ్లింట్లో కుక్కర్ కూత వెయ్యాల్సిందే. చంటిబిడ్డలుంటే వాళ్లకు ఒక తిండి. పనిమనిషి ఉంటే కొంత వెసులుబాటు, లేకుంటే అన్నీ వాళ్లే చేసుకోవాలి. అటెండర్ అయినా గెజిటెడ్ అయినా ఎటువంటి మార్పు ఉండదు. మాకు తెలిసినామెకు పక్క జిల్లాకు ట్రాన్స్‌ఫర్ అయ్యింది. ఆమె ఒక డిస్ట్రిక్ట్ ఆఫీసర్, ముస్లిం. ఆమె ఉదయం లేచి అంతా చేసి టేబల్ మీద పెట్టి ఆఫీస్ జీప్‌లో రెగ్యులర్‌గా అప్ అండ్ డౌన్ చేసేది. ప్రతి ఒక్క ఉద్యోగిని పొద్దునపూట ఇంట్లో పెద్ద కసరత్తు చేస్తూ ఉంటుంది. స్త్రీ ఇంట్లో రోజు ఎనిమిది మైళ్లు నడుస్తుందని ఒక సర్వేలో తేలిందట. ఆ రకంగా 8+8=16 మైళ్లు తిరగాల్సివస్తోంది.

ఉదయం పూట ప్రతిపనికీ టైం కేటాయించుకొని ఆ టైంలోనే చెయ్యాలి. శరీరం యాంత్రికంగా కదులుతూ ఉండాలే తప్ప వెనుకబడ కూడదు. మెదడు కూడా విపరీతంగా చురుకుగా ఉంచుకోవాలి. ప్రతి విషయాన్ని జ్ఞాపకం ఉంచుకొని చేసుకోవాలి. లేదంటే అది సాయంత్రంకు వాయిదానే.

ఉద్యోగాలు చేసే స్త్రీలు గుండెపోటుతో మరణించడం, పక్షవాతం రావడం, బిపి, మధుమేహం లాంటి జబ్బులు రావడం జరుగుతోంది. పైగా ఎక్కడివక్కడ సర్దుకుంటే మరుసటిరోజుకు ఊరట. లేదంటే అదనపు పని. ఈ శ్రమ ఉద్యోగం చేసే మగవాళ్లకు ఉండదు. భార్యాభర్తలు ఉద్యోగాలు చేస్తున్నా, పై శ్రమ ఉద్యోగిని అయిన భార్యకు ఉంటుంది కాని భర్తకు ఉండదు. భర్త సహాయం కూడా చిన్న చిన్న పనులకు ఉంటుంది. మేజర్ ఇంటి పని స్త్రీదే. కాలంతోపాటే వేగంగా రోజూ ప్రయాణం చేసి చేసి అలసట, ఒత్తిడి వల్ల శరీరం మెత్తబడేకొద్ది రోగాల రూపంలో బయటపడుతోంది.

ఈ యాంత్రికత ఎప్పుడో వయసులో రోగాలతో బయటపడేది ఒకరకమైతే, రోజువారీ పనిలో చాలా విసుగుదల వస్తుంది. చిన్నదానికి కూడా విసుక్కుంటూంటారు. అలసటతో శరీరం విశ్రాంతిని కోరుతున్నా, అది ఎప్పుడో రాత్రికి కాని సాధ్యపడదు కాబట్టి ఈ అలసట పనిలో చూపిస్తూ ఉంటుంది.

ఉద్యోగం చేసే స్త్రీలు తమ ప్రతిపనిని కుటుంబానికి అనుగుణంగానే మలుచుకోవాల్సి ఉంటుంది. అర్థం చేసుకునే భాగస్వామి లేకపోవడంతో ఈ ఒత్తిడి మరింత పెరుగుతుంది. భర్త బాధ్యతల్ని పంచుకోకపోవడం, పిల్లలను పెంచడం మొదలైన వాటితో మానసిక ఒత్తిడి పెరిగి డిప్రెషన్ పెరుగుతోంది.

ఉద్యోగాలు చేస్తున్నా కుటుంబ హింస తప్పదు. చాలామంది ఉద్యోగాలు చేసే స్త్రీలు భర్తల చేతుల్లో తన్నులు తింటూనే ఉంటారు. ఇది చాలావరకు సమాజంలో ప్రైవేట్ వ్యవహారంగా చూస్తారు కాబట్టి సర్వసాధారణమే పోయింది.

అందుకే చాలామంది స్త్రీలు ప్రతిచిన్న దానికి ఏడుస్తారు. ఏ విషయంలోనూ ఏకాగ్రత పెట్టరు. ఎప్పుడూ నిరాశ, నిస్పృహ, నిరాసక్తత. ఎప్పుడూ అలిసిపోయేటట్లు ఉండే తత్వంతో జీవితం పట్ల, పనిపట్ల నిరాసక్తంగా ఉంటారు. నిద్రలేకపోవడం, అతిగా తిండి తినడం మామూలు. చాలామంది ఉద్యోగినులు గిల్టీగా ఫీలవుతుంటారు.

చాలామంది ఉద్యోగినులు ఈ డిప్రెషన్‌లో ఎప్పుడూ ఉంటారు. అంత సంపాదిస్తూ, చిన్న సమస్య వస్తే ఏం తోచడం లేదని వాపోతూ ఉంటారు. పిల్లల ఆరోగ్యం ఉద్యోగినులకు చాలా పెద్ద సమస్య. ప్రత్యేక శ్రద్ధ పెట్టడం అసాధ్యం కాబట్టి చాలా అసంతృప్తితో ఉంటారు.

ఇవి సాధారణ మానసిక రుగ్మతలు. వీటిలో స్త్రీలే ప్రధాన బాధితులు. ఈ ధోరణికి కారణం సామాజికపరమైన అంశాలే. స్త్రీల జీవితాల్లోని వివక్ష, హింస, భయాందోళనలు, అభద్రత, అనేక పాత్రలను పోషించాల్సిన పరిస్థితులు, కుటుంబ సంరక్షణా భారం ఎక్కువగా వీళ్లమీదనే పడడం ఇంటి పనులన్నీ వాళ్లే చెయ్యాల్సిన శ్రమ విభజన, ఇతర కుటుంబ సభ్యుల సహకారం లేకపోడం – ఇవన్నీ మనచుట్టూ ఉండే సమాజం నుంచి పుట్టుకొచ్చిన అంశాలే.

అర్ధరాత్రి పన్నెండు గంటలకు స్త్రీ ఒంటరిగా రోడ్డుపై నడవగలిగిన రోజే మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చినట్లని' గాంధీ చెప్పారు. అర్ధరాత్రి సంగతి అట్లుంచితే పట్టపగలు సాక్షాత్తూ ప్రభుత్వ ఉద్యోగం చేసే స్థలంలో రక్షణ కరువవుతోంది. ఎప్పుడు ఏం జరుగుతుందో, ఎవ్వరేమంటారో అని తెలియని భయానక పరిస్థితులలో ఉద్యోగినులు కొట్టుమిట్టాడుతున్నారు. కారణం – వేధింపులు.

వేధింపులు – వస్త్రధారణ గురించి కామెంట్ కావచ్చు, నఖశిఖ పర్యంతం చూస్తూ చంపేసే చూపులు కావచ్చు, మనుష్యుల్ని జవసత్వాలు లేకుండా చేసే బూతు జోకులు కావచ్చు, 'వర్క్' పేరుతో చేసే ఎద్దేవా కావచ్చు, కించపరిచే మాటలు కావచ్చు, ఫోన్ బెదిరింపులు కావచ్చు, ప్రేమలేఖలు కావచ్చు, హత్యలు కావచ్చు, చివరకు కండోమ్స్ పాకెట్స్, బూతు పుస్తకాలు టేబుల్ డ్రాలలో పెట్టే సంఘటనలు కావచ్చు – ఏదైతేనేం పితృస్వామ్య అణచివేత రూపాన్ని చవిచూడని ఉద్యోగిని లేదంటే అతిశయోక్తి కాదు.

ఐఎఎస్ ఆఫీసర్ రూపన్ బజాజ్ దియోల్ మొదలుకొని ఈ నెలలో వరుసగా జరిగిన విశాఖపట్నంలో ఎంఆర్ఓ పై లైంగిక వేధింపులు, మహబూబ్‌నగర్ జిల్లాలో టీచర్ శ్రీలక్ష్మి హత్య, సహఉద్యోగిచే బ్లాక్‌మెయిల్‌కు గురైన ఉద్యోగిని, ఇవీ శృతిమించిన సందర్భాలలో వెలుగులోకి వచ్చిన కొన్ని వ్యథలు. అయితే అసహాయంగా తమలో తామే కుమిలిపోయే బాధాతప్తహృదయాలు ఎన్నో. 'బాధా సర్పద్రష్టలు' ఎందరో.

వేధింపులకు గురిచేసే వాళ్లలో అధికారులు, సూపరిన్‌టెండెంట్స్, క్లాస్ 3, క్లాస్ 4 ఇలా అన్నిరకాల పురుష ఉద్యోగులూ ఉంటున్నారు. ఎవ్వరూ మినహాయింపు లేరు. ఈ వేధింపులు మనల్ని నిస్సహాయలుగా మార్చి, మనల్ని మరింత అసమానత్వంలోకి నెట్టి, భవిష్యత్తును అంధకారం చేస్తున్నాయి. ఈ రకంగా రోజురోజుకీ స్త్రీల పట్ల పెరుగుతున్న అసభ్య, అనాగరిక చేష్టలకు కారణమైనవి, అశ్లీల సాహిత్యం, సినిమాలు వీటిని ఎంతో పెంచిపోషిస్తున్న సమాజం, ప్రభుత్వాలు. ఈ అస్తవ్యస్తమైన వ్యవస్థకు పుట్టిందే 'ఈ వేధింపు'ల ధోరణి. ఈ ధోరణి వల్ల స్త్రీ వ్యక్తిత్వం లేని ఒక మాంసపు ముద్దగా, విలాస వస్తువుగా రూపాంతరం చెందుతోంది.

ఈ సమాజంలో బాధితులైన స్త్రీలకు తమ బాధలు చెప్పుకునే అవకాశం శూన్యం. కాబట్టి వేధింపు కేసుల్లో కూడా బాధితురాలే దోషి. బాధితురాలి వ్యక్తిగత చరిత్ర, కట్టుబొట్టు, నడవడి, చర్చనీయాంశం అవుతున్నాయి. చాలామంది వేధించడమే ఆమెకు సరియైన శిక్ష అనే శాడిస్టు ధోరణితో వ్యవహరిస్తూ ఉంటారు. అందుకే వీటిని ప్రమాద రహితమైన జోకులుగా కొట్టిపడేస్తూ ఉంటారు. అందుకే బాధితులు తమలో తాము కృంగిపోయి, మానసికంగా చిత్రహింసకు గురవుతూ ఉంటారు. పై కారణాల వల్ల చాలామంది ఉద్యోగినులు ఈ వేధింపులకు గురైనా, ఈ అన్యాయాన్ని ఎదుర్కోవడానికి ముందుకు రావడం లేదు.

ఎన్నో ఉద్యమాల ఫలితంగా సుప్రీంకోర్టు విశాఖ తీర్పులో 'అన్ని రకాల లైంగిక వేధింపులు' అనే విస్తృత అర్థాన్ని, నిర్వచనాన్ని ఇచ్చింది. పైగా ఈ వేధింపుల వల్ల 'పనిచేసే స్థలంలో సురక్షితంగా పనిచేసే హక్కుకు' భంగం కలుగుతోందని స్పష్టం చేసింది. ఉద్యోగుల ప్రవర్తనా నియమావళి స్పష్టంగా ఉండాలని ఆదేశించింది. బాధితురాలికి న్యాయం చేకూర్చేందుకు ప్రతి డిపార్ట్‌మెంట్‌లోనూ, జిల్లాల్లోనూ 'ఫిర్యాదుల కమిటీ'ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీచేసింది. తదనుగుణంగా శిక్షల్ని సవరిస్తూ సి.ఆర్.పి.సి., సి.పి.సి.లలో మార్పులు కూడా చేసింది. బాధితురాలే దోషి కంటే ఎక్కువ నిరాదరణకు గురవుతోందని గుర్తిస్తూ ఈ వేధింపులను 'పరస్పరం అంగీకారం లేని చర్యలుగా' గుర్తించింది. అయితే ఈ చట్టాల నిజస్వరూపం అవి అమలు జరిగి ఉంటే తెలుస్తుంది. 'అత్యాచార సవరణ చట్టం' మహిళల పోరాటాల చిరువిజయమనే చెప్పాలి. వేధింపులు ఆగాలంటే ఏం చెయ్యాలి? మహిళలు ఆత్మవిశ్వాసం పెంచుకోవాలి. కించపరిచేవారికి బుద్ధిచెప్పాలి. సంఘటితంగా ఎదుర్కోవాలి. ఉద్యమంలో భాగం కావాలి. అప్పుడే వేధింపులు తగ్గుతాయి. మహిళలు ఒంటరిగా లేరు అన్న విశ్వాసమే వారికి కొండంత అండ. ఒంటరిగా లేమనే స్పృహతో కలిసి నడచి వేధింపులను ఎదుర్కోవలసిందే. వీ

**వచ్చే సంచికలలో...**

- **ఫోకస్ - అక్టోబర్ 2009 : చైనా విముక్తికి అరవై ఏళ్లు - పాఠాలూ, గుణపాఠాలూ**
- **ఫోకస్ - నవంబర్ 2009 : వీక్షణం నూరవ సంచిక**
- **వాతావరణ సంక్షోభం - క్యోటో ఒప్పంద రాజకీయాలు - కె. నరేంద్రమోహన్**
- **ద్రవ్య సంక్షోభం - ముంచుకొస్తున్న మహామాంద్యం - అరవింద్**

# జాతీయ బాలల హక్కుల పరిశోధన ఫెలోషిప్‌లు 2009-10

భారతదేశంలో బాల్యం అందరికీ ఒకటే కాదు. నిజానికి అనేక రకాల బాల్యాలు సహజీవనం చేస్తాయి. సామాజిక, ఆర్థిక హోదా, శారీరక, మానసిక సామర్థ్యాలు, ప్రాంతం బాల్యం మీద ప్రభావం వేస్తాయి. బాలలు కూడా సర్వసత్తాక అధికారం కలిగిన, సమానమైన సభ్యులని గౌరవించడం తొలి అడుగు. ఆ దిశలో వారిని కేవలం లబ్ధిదారులుగా కాక భాగస్వాములుగా గుర్తించడం వారి సముచిత ప్రయోజనాలేమిటో అర్థం చేసుకోవడం కూడా సాగాలి.

బాలలకు న్యాయం అనే రాజ్యాంగ చట్రం లోపల ఉత్తమ ప్రయోజనం ప్రాతిపదికన బాలల హక్కులకు ఉన్న విభిన్న కోణాలను అన్వేషించే పరిశోధనకు చైల్డ్ రైట్స్ అండ్ యూ (సిఆర్‌వై) దరఖాస్తులను కోరుతున్నది.

బాల్యాలను నిర్ణయించడంలో సంస్కృతీ, చట్టాలూ, నైతిక సూత్రాలూ, విధానాలూ పరస్పరం సంబంధంలో ఉండేటప్పుడు ఏ సాధారణ, సంక్లిష్ట సత్యాలు వెల్లడవుతాయో అన్వేషిండం, కనిపెట్టడం, ఆ పనిని నియత పద్ధతిలోనూ, అనియత పద్ధతిలోనూ సాగించడం గురించి కొత్త భావనలను సిఆర్‌వై ఆశిస్తున్నది.

### కేంద్రీకరించదగిన విషయాలు

వారి జీవితానుభవాలను, దృక్పథాన్ని బట్టి ఈ ఇతివృత్తాలను విస్తరించడానికి, వ్యాఖ్యానించడానికి మిమ్మల్ని ప్రోత్సహిస్తున్నాం.

- బాల్యపు అనుభవంలో, వ్యక్తీకరణలో, కథలనూ, జానపద గీతాలనూ, కవితలనూ సామాజిక సంపర్కానికి చిహ్నాలుగా వాడుకోవడంలో సృజనాత్మకత, ఊహా శక్తి.
- బాలలకు తోటి బాలలతో, రాజ్యంతో, సమూహంతో, కుటుంబంతో ఉండే సంబంధాల అన్వేషణ.
- ఇల్లు, బడి, పని, ఆటస్థలం, పాలనావ్యవస్థలు వంటి నిర్ణయాధికార వేదికలలో బాలల పాత్రను అంగీకరించడం గురించి, తిరస్కరించడం గురించి ఆధారాలు.
- బాలలు అనుభవించే లేదా గమనించే జాతితత్వం, అసమానత, ఘర్షణల ఆధారాలు, సంబంధాలు
- ఉత్తమ ప్రయోజన ప్రాతిపదిక ఒక విలువనా, ఒక రాజ్యాంగ హక్కా, ఒక వ్యాఖ్యాన సహితమైన సంస్కరణ ప్రయత్నమా, లేక చట్టబద్ధ పాలనా?

### ఫెలోషిప్‌కు వర్తించే సూత్రాలు

**అర్హత :** దరఖాస్తుదారులు భారతదేశంలో నివసిస్తున్న భారతీయులై ఉండాలి. పద్దెనిమిదేళ్లకు పై బడి ఉండాలి. గతంలో ఈ ఫెలోషిప్ పొందినవారు అనర్హులు. ఫీజులు వసూలు చేయని ప్రభుత్వ పాఠశాలలో చదివిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుంది. (ఇప్పటికే సాగిన అధ్యయనాల ప్రకారం, గ్రామాలలోనూ, పట్టణ మురికివాడలలోనూ, రెండు వేల అనాదృత వర్గాలలో సిఆర్‌వై పనిచేసిన అనుభవం ప్రకారం తేలినదేమంటే ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ప్రధానంగా దళితులు, ఆదివాసులు, స్త్రీలే యజమానులుగా ఉన్న లేదా భూమిలేని కుటుంబాలలోని బాలబాలికలే.)

ఫెలోషిప్ పొందగల అభ్యర్థులు సిఆర్‌వై పాటించే విలువలకు కట్టుబడి ఉంటారని ఆశిస్తున్నాం:

***మానవ గౌరవం పట్ల విశ్వాసం; లౌకికవాదం; అహింస; జవాబుదారీతనం; కొత్తదనం; పారదర్శకత; సహకార కృషి***

**భాష:** అభ్యర్థులు ఇంగ్లిష్‌తో సహా ఏ భారతీయ భాషలోనైనా పనిచేయవచ్చు. ఏ భాషలో పనిచేయదలచుకున్నారో స్పష్టంగా సూచించండి. దరఖాస్తు పరిశీలన ఇంగ్లిష్‌లోనూ, మీరు పనిచేయదలచుకున్న భాషలోనూ జరుగుతుంది. అందువల్ల మీ ప్రతిపాదనను, మీ జీవిత విశేషాలను (కరికులమ్ విటే), గతంలో చేసిన పనిని ఇంగ్లిష్ అనువాదంలో జతచేయండి.

**సిఆర్‌వై నుంచి మీకు అందేది:** మొత్తం మీద పది ఫెలోషిప్‌లు ఇవ్వడం జరుగుతుంది. అవి ఒక్కొక్కటి రు. 50,000 నుంచి రు. 1,00,000 వరకు ఉంటాయి. ఈ నగదు సహాయ భృతి మాత్రమే. అభ్యర్థులు తమ ప్రాథమిక వృత్తి ఉద్యోగాలలో కొనసాగవచ్చు. ఒక లక్ష రూపాయలకన్న ఎక్కువ ప్రతిపాదనలు పరిశీలనకు స్వీకరించడం జరగదు.

### తప్పనిసరి ఉండవలసినవి:

1. ఒక మూడు పేజీల ప్రతిపాదన. అది మీరు పరిశోధించదలచుకున్న అంశాన్ని, ఒక చట్రంలోపల మీ పరిశోధనా ప్రశ్నల వివరాలను, ప్రతిపాదిస్తున్న సంవిధానాన్ని, పరిశోధనా కాలక్రమాన్ని, సంబంధిత సాహిత్య జాబితాను, లేదా ఈ అంశం మీద ఇప్పటికే సాగిన అధ్యయనాలను, ఒక వివరమైన ఆర్థిక అంచనాను (బడ్జెట్) కలిగి ఉండాలి.

2. రెండు పేజీల జీవిత విశేషాలు (సివి)

3. సంబంధిత విషయం మీద మీరిప్పటికే రాసి ఉన్న, ప్రచురితమైన లేదా ప్రచురితం కాని పత్రం లేదా వ్యాసం లేదా ఏదైనా సమాచారం.

ఒక సంవత్సరం కన్న ఎక్కువ వ్యవధి పట్టే ప్రతిపాదనలు పరిశీలించబడవు.

ఎంపికైన అభ్యర్థులు తమ పరిశోధనా ప్రణాళికలను ఇతరులతో పంచుకోవడానికీ, సామూహిక అనుభవం నుంచి గ్రహించడానికీ మార్చ్ 2010 ప్రాంతంలో ఒక ప్రాథమిక వర్క్‌షాప్‌లో పాల్గొనవలసి ఉంటుంది. అలాగే అర్ధవార్షిక సంభాషణా సమావేశంలో పాల్గొనవలసి ఉంటుంది. ఈ రెండు సమావేశాలకూ అవసరమైన ప్రయాణ, వసతి, భోజన ఖర్చులను సిఆర్‌వై భరిస్తుంది. కొందరు అభ్యర్థులకు వారి అభిప్రాయాలను, భవిష్యత్తు ప్రణాళికలను సిఆర్‌వై మదింపు బృందపు సభ్యులతో చర్చించడానికి అవకాశం ఉంటుంది.

### ప్రచారం

పరిశోధనా ఫలితాలను వివిధ భాషలలోకి అనువదించి, వేరువేరు వేదికల ద్వారా కార్యకర్తలకు, విద్యావేత్తలకు, అభివృద్ధి వ్యవహారాల నిపుణులకు, ఆసక్తిగల సాధారణ ప్రజానీకానికి అందుబాటులో ఉంచడం జరుగుతుంది. తద్వారా బాలల హక్కుల గురించిన చర్చాసరళిని ప్రభావితం చేయడానికి, ఉత్తమ ప్రయోజన ప్రాతిపదికన ప్రచారం చేయడానికి ప్రయత్నం జరుగుతుంది.

### యాజమాన్యం

తుది పరిశోధనా నివేదిక మీద, వస్తువు మీద రచయితలుగా అభ్యర్థుల హక్కును గౌరవిస్తూనే ఈ క్రమంలో సేకరించిన సమస్త సమాచారాన్ని పరిశీలనలను వీలైనంత ఎక్కువ మందికి బహిరంగంగా, ఉచితంగా అందుబాటులో ఉంచడం జరుగుతుంది. అభ్యర్థులు తమ పరిశోధనా కృషిలోని పరిశీలనలను ప్రచురించుకోవడానికి అవకాశం ఉంటుంది. అయితే ఆ పని జాతీయ బాలల హక్కుల పరిశోధనా ఫెలోషిప్, సిఆర్‌వై సౌజన్యంతో అని ప్రకటించాలి.

ఒకవేళ మీ ప్రతిపాదన మరేదైనా విద్యా సంస్థకు సమర్పించిన దరఖాస్తులో భాగమయినట్టయితే అది ఈ ఫెలోషిప్‌కు అనర్హమవుతుంది. అలాగే అభ్యర్థి ఇక్కడ ప్రతిపాదిస్తున్న పరిశోధన సాగించడానికి ఇదివరకే నిధులు పొందుతున్నట్టయితే ఈ ఫెలోషిప్‌కు అనర్హమవుతుంది. ఫెలోషిప్ పరిశోధన సాగుతున్న క్రమంలో అభ్యర్థి గనుక ఈ పరిశోధనా పరిధిని విస్తరించాలని, మరింత లోతుగా జరపాలని భావిస్తే ఆ విషయం గురించి, అదనపు నిధుల అవసరం గురించి మొట్టమొదట సిఆర్‌వై కి తెలియజేయాలి. అలాగే మరేవరైనా దాతలను ఆ నిధుల కోసం అడుగుతున్నట్టయితే వారికి ఇక్కడ ప్రధాన కృషి సిఆర్‌వై సహాయంతో జరుగుతున్నదని చెప్పవలసి ఉంటుంది.

### దరఖాస్తుల దాఖలకు చివరి గడువు సెప్టెంబర్ 12, 2009

మీ దరఖాస్తును research@crymail.org కి ఈమేయిల్ చేయండి. మీకు ఇంటర్నెట్ అందుబాటులో లేనట్టయితే మీ దరఖాస్తును పోస్ట్ ద్వారా

**CRY - Child Rights and You, Documentation Centre,**
**189 A, Anand Estate, Sane Guruji Marg,**
**Mumbai - 400 011**

ఫెలోషిప్‌కు ఎంపికైన పరిశోధకుల పేర్లను సిఆర్‌వై వెబ్‌సైట్ మీద 2010 ఏప్రిల్ లోపు ప్రకటించడం జరుగుతుంది.

CHILD RIGHTS AND YOU
www.cry.org

Advt.

*ఏ సమాజం అయినా స్వయంశక్తితోనే అభివృద్ధి చెందుతుందనీ, స్వశక్తితో సంబంధంలేని అవకాశాలు ఎన్ని పెరిగినా మౌలికంగా ఆ సమాజం అభివృద్ధి చెందదనీ అంటున్నారు* **ముదునూరి భారతి**

# పేదరిక నిర్మూలన, ప్రపంచబ్యాంక్ అవగాహన

ప్రపంచవ్యాప్తంగా పేదరికానికొక గుర్తింపు ఈ మధ్యకాలంలో చాలా పెరిగింది. పేదదేశాలు, పేద ప్రజల మీద చర్చ చాలాకాలం నుంచి జరుగుతున్నా, అంటే పెట్టుబడిదారీ వ్యవస్థ తొలి రోజుల నుంచి కొనసాగుతూనే ఉంది. పెట్టుబడి డబ్బు రూపంలో, ఫైనాన్స్ రూపంలో సామ్రాజ్యవాద దశలో ప్రపంచీకరణ జరుగుతున్న క్రమంలో, పేదరికం మీద దృష్టి సారించడం మానవతా దృక్పథంగా కనిపించినా, దాని రాజకీయ ప్రయోజనాలు కూడా ఇమిడి ఉన్నాయి. వృద్ధిని ప్రపంచ వ్యాప్తంగా ఒకే నమూనాలో చూసే ప్రపంచీకరణ భావజాలం, ఆ నమూనా వలన ఉద్భవించే పేదరికాన్ని కూడా గుర్తుచేసుకోవలసిన అవసరం ఉంది. అంతేకాక ఆ పేదరికాన్ని నిర్మూలించే కార్యక్రమాలు కూడా చేపట్టినట్లు కనిపించవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఇక్కడ పేద దేశాలకు పెట్టుబడిలోటు వలన పేద దేశాలుగానే ఉండిపోయాయి అనే భావజాలం ప్రాచుర్యం పొందింది. ఈ ప్రపంచీకరణలో భాగంగా పెట్టుబడిని పేద దేశాలకు ఎగుమతి చేయడం, దానికి కావలసిన నిధులను ఎయిడ్ ద్వారా అప్పులివ్వడం, జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులను ప్రోత్సహించడం ద్వారా అభివృద్ధి సాధ్యమని ఒక ఆశాజనకమైన మార్గాన్ని ప్రవేశపెట్టారు. ఇక పేద ప్రజల విషయానికి వస్తే ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల ద్వారా పేదవారికి అవసరమైన సహాయం తిన్నగా వారికే అందేటట్లు అనేక కార్యక్రమాలు రూపొందించుకున్నాయి. ఒక ఆర్థిక నమూనాలోంచి పుట్టిన పేదరికానికి ఒక రాజకీయ గుర్తింపు ఇవ్వడం ప్రస్తుత సమాజంలో ఒక అనివార్యమైన పరిస్థితి.

మన దేశానికి వస్తే, పెట్టుబడి ద్వారా భారతదేశ ఆర్థిక వ్యవస్థలో పంచవర్ష ప్రణాళికల ద్వారా తీసుకుని వద్దామనుకున్న మార్పులు దేశంలో ఊహించనిరీతిలో వ్యవసాయరంగంలో ఒక పెద్ద సంక్షోభాన్ని తీసుకుని వచ్చాయి. అది ధరల పెరుగుదల రూపంలో, ముఖ్యంగా తిండి సరుకుల ధరలు అనూహ్యంగా పెరగడంతో ఆర్థిక నమూనా, ప్రభావానికి వ్యతిరేకంగా ఒక సిగ్నల్ పంపింది. అది 1964-67 కాలంలోని మాట. వ్యవసాయరంగంలోని సంక్షోభాన్ని ఉత్పత్తి సమస్యగా చూసి ఒక హరిత విప్లవాన్ని ప్రవేశపెట్టారు. దాంతో సంక్షోభం తీరిపోయిందని ఊహించిన ప్రభుత్వానికి 1990ల కాలంలో మళ్లీ వ్యవసాయ రంగం ఒక సంక్షోభంలో పడింది. దీన్ని కూడా ఒక ఉత్పత్తి సమస్యగానే చూసి కొన్ని సాంకేతిక సమాధానాలు కూడా వెతుకుతూ, వ్యవస్థలో మార్పులు కూడా రావాలి అని కార్పొరేటీకరణ, సహకారీకరణ వంటివి కూడా అవసరమని, దానికి తగిన కార్యక్రమాలు కూడా ముందు పెడుతున్నారు. సంక్షోభాన్ని ఉత్పత్తి సమస్యగా చూడకుండా వ్యవస్థాగతంగా చూస్తే, వ్యవసాయరంగంలో పని దొరకని పని చేద్దామనుకున్న ప్రజానీకం (పేద ప్రజలని వీళ్లనే అంటారు) అధికంగా ఉండిపోవడం అనేది ఒక సంకేతం. ఈ పేద ప్రజలను ఒక ఉత్పత్తి శక్తిగా చూడలేని నమూనా వ్యవసాయరంగంలోని సంక్షోభం నుండి బయటపడటానికి వీరిని ఒక సమాధానంగా చూడటం జరగలేదు. పేదరిక నిర్మూలన ఉత్పత్తి సంబంధాలలోని సంక్షోభానికి సమాధానంగా చూడనంత కాలం, ఈ రెండు సంక్షోభాలు – వ్యవసాయరంగ సంక్షోభం, పేద ప్రజల సంక్షోభం – ఒకదానికొకటి పెనవేసుకుని విడదీయలేని చిక్కుముడిగా కొనసాగుతూనే ఉంటాయి.

ఆర్థికపరంగా పేదరికం కనిపించిన క్రమంలో దాని ప్రతిరూపం రాజకీయాలలో కూడా ప్రతిబింబిస్తుంది. దీనికి ప్రధానంగా మూడు కోణాలున్నాయి. అందులో మొదటిది కాంగ్రెస్ పార్టీకి ముఖ్యులైన నెహ్రూ కుటుంబం పట్టు రాజకీయంగా సడలిపోవడం. నెహ్రూ కుటుంబానికి చెందిన ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా ఒక సిండికేటు ఏర్పడడం జరిగింది. ఇక రెండో కోణం అస్తిత్వ ఉద్యమాలు. ఇందులో భాషా ఉద్యమాలు కూడా చోటు చేసుకున్నాయి. మూడో కోణం నక్సలిజం అనే రాజకీయోద్యమం. కాంగ్రెస్ పార్టీ నెహ్రూ కుటుంబం తాము కోల్పోయిన పట్టుని ఇందిరాగాంధీ తిరిగి పేదరికం, పేదరిక నిర్మూలన (గరీబీ హఠావో) అనే నినాదమిచ్చి పేదరికానికొక రాజకీయ గుర్తింపు తెచ్చి దీనిని దేశ రాజకీయాలలోకి ప్రవేశపెట్టింది. అప్పటినుండి ఇప్పటి వరకూ ఎప్పుడు ఎన్నికలు జరిగినా పేదవాళ్లకే పెద్దపీట. పేద ప్రజలే ఓటు బ్యాంకు అని అన్ని రాజకీయ పార్టీల నమ్మకం. ఒక పార్టీని మించి మరొక పార్టీ పేదలకు ఎన్నో వరాలు కురిపిస్తూ ఉంటాయి. తమిళనాడు రాజకీయాలలో ఈ వరాలు కొత్త కొత్త రూపాలు సంతరించుకున్నాయి. అస్తిత్వపు రాజకీయలకు కూడా పేదరికం ఒక ముఖ్యమైన పని చేసిపెడుతూ ఉంటుంది. ఇకపోతే నక్సలైటు రాజకీయాలు వ్యవసాయరంగంలో వ్యవస్థాగత మార్పులు, ప్రజా ఉద్యమాలు చేస్తూ ఈ పేద ప్రజల కేంద్రంగా ఒక నూతన సమాజం గురించి చేసే ప్రయత్నంలో ఉంటాయి. పేదరికం మీద చర్చ కొనసాగుతూనే ఉంటుంది.

## 2

పేదరికం అంటే ఏమిటి? ఎవరు పేదప్రజలు? వాళ్లు ఎంతమంది ఉన్నారు? అనేది ఒక చర్చనీయాంశం. స్థూలంగానే మనిషి శ్రమ చేయడానికి అవసరమైన కార్బోహైడ్రేట్స్ (పిండి పదార్థాలు) తగినంత దొరకకపోతే మనిషి శ్రమ చేయడానికి కావలసిన శక్తి ఉండదు. శారీరక శ్రమ చేసే మనిషికి రోజువారి 2400 కాలరీలు కావాలి అనేది వైద్య జ్ఞానం నుండి తీసుకున్న ఒక కొలమానం. పేదరికాన్ని చూడటంలో దీన్ని ఉపయోగిస్తారు. అక్కడ నుండి ఇన్ని కాలరీలు ఇవ్వడానికి కావలసిన బియ్యం ఎన్ని కిలోలు కావాలి, అది కొనుక్కోవడానికి ఒక కుటుంబపు తిండి ఖర్చు ఎంత ఉండాలి అనేవి పేదరికపు రేఖగా నిర్ధారించడానికి ఉపయోగపడింది. ఉదాహరణకి ఒక కుటుంబం నెలసరి ఇరవై రూపాయలు భోజనం మీద ఖర్చు చేస్తే, అందులో భాగంగా వాళ్లకి కావలసిన పోషకపదార్థాలు అందుతాయనేది ఒక అంశం. దేశవ్యాప్తంగా ఎన్.ఎస్.ఎస్. అనే సంస్థ ఇంటి ఖర్చుల మీద ప్రతి ఏడాది ఒక సర్వే నిర్వహిస్తుంది. ఈ కొలమానం తీసుకుని ఎంతమంది కొలమానం కంటే తక్కువ ఉంటారు అనేది లెక్కకడుతుంది. ధరల పెరుగుదల కూడా ఉటంకిస్తే, ప్రతి సంవత్సరం ఎంతమంది పేదప్రజలు ఉన్నారు అనే లెక్కలు తెలుస్తూ ఉంటాయి. దీనినే ఒక డాలరు ప్రతిరోజూ ఖర్చు కింద పేదరికానికి సూచికగా ప్రపంచ బ్యాంక్ వాళ్లు గుర్తిస్తారు. ఈ లెక్కల్లో అవకతవకలు, ఇది నిజంగా పేదరికమేనా అనేది గత అర్థశతాబ్దం నుండి చర్చ జరుగుతూనే ఉంది.

ఈ నేపథ్యంలో పేదరికం నుంచి ప్రజలు ఎలా బయటికి వస్తున్నారు? పేదరికం అనేది ఎవరు నిర్వచిస్తారు? అనే అంశాలపై ప్రపంచబ్యాంక్ ఆధ్వర్యంలో ప్రపంచంలో ఉండే పేద దేశాలు, వాటిలో ఉండే ప్రజల (15 దేశాలలో ఉండే 5000 మంది ప్రజలు) మీద పది సంవత్సరాల పాటు సుదీర్ఘంగా చేసిన సర్వే ఫలితాలను 'పేదరికం నుండి బయటకు రావడం ఎలా' అనే రిపోర్ట్‌లో ప్రచురించారు. ప్రస్తుత వ్యాసం ఆ రిపోర్ట్ మీద ఒక సమీక్ష.

ఈ రిపోర్ట్‌కి ఒక ప్రత్యేకత ఉంది. సిద్ధాంతాలకి అతీతంగా, తాత్వికానికి అతీతంగా, చరిత్రకి అతీతంగా చేసిన ఒక ఎంపిరికల్ స్టడీ ఇది. వారి భాషలోనే –

'మా పుస్తకం ఒక భావజాలానికి సంబంధించినది కాదు, అది రైట్ అవవచ్చును, లెఫ్ట్ అవవచ్చును. ఇది ఉదారవాదానికి కాని, వ్యక్తివాదానికి కాని సంబంధించింది కాదు. ఇది స్వేచ్ఛా మార్కెట్లు విధానాలను కాని ప్రభుత్వాన్ని గురించి కాని వత్తాసు పలకదు. ఇది ప్రపంచీకరణని సమర్థించడం కాని, వ్యతిరేకించటం కాని చెయ్యదు. ఇది నాగరికతల మధ్య ఉండే యుద్ధాల మీద కాదు, మతాలకు అతీతం. ఇది సిద్ధాంత పరిధిలో మార్పుల గురించి కూడా కాదు.

మా పుస్తకం స్థానిక వాస్తవికతల గురించి, ప్రపంచం మొత్తంగా లక్షలాది పేద ప్రజల జీవన అనుభవాల సహాయంతో పేదరిక నిర్మూలన విధానాలను రూపొందించవలసిన అత్యావశ్యకత గురించే వివరిస్తుంది.'

## 3

ఈ నివేదికలోని పరిశోధనా పద్ధతిలో మూడు కీలకమైన అంశాలు ఉన్నాయి. అందులో మొదటిది వ్యక్తిని నిపుణుడుగా కేంద్రీకరించడం జరిగింది. అలా అనడంలో ఉద్దేశం ఆ వ్యక్తికి తనమీద ఉండే అవగాహన మిగిలిన వ్యక్తులకంటే ఎక్కువగా ఉంటుంది. ఒక ఫిలాసఫీ నుంచి వచ్చిన మేధావి నిర్మొహమాటంగా ఒప్పుకునే అంశం ఒక వ్యక్తి గురించి వ్యక్తికి తెలిసి, మేధావులకు తెలియని బహుశా అంతుపట్టని అనేక విషయాలు వ్యక్తి దగ్గరే అంతర్గతంగా మిగిలే ఉంటాయి అనేది కీలక సూత్రం. కొంతవరకూ గ్రామ్‌స్కీ కానీ మావో కానీ వారికి ఆద్యుడైన మార్క్స్ కానీ ఈ విషయాన్ని గ్రహించారనటం తప్పుకాదు. ఆచరణలో ఉన్న సీతారామయ్యగారి 'గ్రామాలకు తరలి వెళ్లండి' అనే కార్యక్రమం కూడా ఈ కోవలోకే చెందుతుంది. ఎంపిరికల్ శాస్త్రవేత్తలు చేసే పరిశోధనా పద్ధతి కూడా ఇదే రకం.

వ్యక్తికి తన ఉనికికి ప్రధానమైన స్థానిక ప్రకృతి, స్థానిక సమాజం (లోకల్ కమ్యూనిటీ) వాటి ఆచరణ మీద ఉండే జ్ఞానం పరిపూర్ణంగా లేకపోయినా చాలా హెచ్చుగానే ఉంటుంది. ఉదాహరణకి ఎవరికి ఎంత పొలం ఉంది? ఎలా పంటలు పండిస్తారు? పంటని ఎలా వాడుకుంటారు? ఎవరికి ఎన్ని పశువులు ఉన్నాయి? ఎవరికి ఎన్ని నూతులు ఉన్నాయి? ఎవరి పొలంలో ఎవరు పనిచేస్తారు? ఎవరి కులమేమిటి? ఆ కులం ఆచారాలేమిటి? అనే వాటిమీద జ్ఞానం బాగానే ఉంటుంది. ఈ జ్ఞానం వ్యక్తి తన అనుభవం నుండి గ్రహించవచ్చు. పక్కవాళ్ల అనుభవాల నుండి కూడా గ్రహించవచ్చును. ఈ జ్ఞానాన్ని వ్యక్తి సామూహిక సభలలో బయటపెట్టగలడు, ఆ సభలో జరిగిన చర్చ ఫలితంగా ఆ సముదాయపు ఆచరణలు రేఖామాత్రంగా రూపొందించగలం అనే అవగాహన నివేదికలో ఉన్న రెండవ కీలక అంశం. ఆ రూపకల్పన ద్వారా ఆ సముదాయంలో వ్యక్తుల మధ్య ఉన్న తేడాలను బట్టి ఆ సముదాయాన్ని కొన్ని గ్రూపులుగా విభజించడం జరిగింది. ఈ గ్రూపులుగా విభజించటానికి ఉత్పత్తికి కావలసిన వనరుల వితరణ, ఆ వనరుల వినియోగ క్రమంలో ఉత్పాదితమైన ఇళ్లు, తిండి, బట్ట, ఆరోగ్యం, విద్య మొదలయిన వాటిలో ఉండే వ్యత్యాసాలను పరిగణనలోకి తీసుకోవడం జరిగింది.

ఈ గ్రూపులను రూపొందించే క్రమంలో ఆ గ్రూపులను ఒక నిచ్చెన రూపంలో చూడటం నివేదికలో ఉన్న ఒక ప్రత్యేకత. ఆంధ్రప్రదేశ్‌లో కమలాపురంలో ఇటువంటి నిచ్చెన ఒకటి తయారు చేశారు. అందులో భూస్వాములు నిచ్చెన పై మెట్టుమీద ఉన్నారు. వీరికి పెద్ద భవనాలు ఉంటాయి. వీరు కూలీల సహాయంతో వ్యవసాయం చేస్తారు. వీరికి సమాజంలో పెద్ద హోదా ఉంటుంది. నిచ్చెనలో వీరి కింద మెట్టు మీద వారసత్వంలో వచ్చిన 15–25 ఎకరాల పొలం ఉండే పెద్ద రైతులు ఉంటారు. వీరికి 4 లేక 5 ఇండ్లు, మోటారు బైకులు, ఫ్యాన్లు, ఇంకా పశువులు ఉంటాయి. వీరు వ్యాపార పంటలు పండిస్తారు. వాటికి తగిన రుణాలు బ్యాంకులిస్తాయి. వీరి పిల్లలు బాగా చదువుకుంటారు. అంతే కాకుండా వీరు సొంతంగా పనిచేయకుండా బతకగలరు. ఈ మెట్టు కింద ఐదు ఎకరాల వరకు ఉండే మధ్యతరగతి రైతులు వస్తారు. వీరికి సొంత ఇళ్లు, పశువులు, బోరు నూతులు, టి.వి.లు, ఫ్యానతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలు కూడా ఉంటాయి. స్త్రీలకు బంగారు ఆభరణాలు, పిల్లలకు చదువులు ఉంటాయి. వీరి

కింద మెట్టు మీద 3-5 ఎకరాల పొలం ఉన్న చిన్న తరగతి రైతులు ఉంటారు. వీరికి సొంత ఇల్లు, పశువులు ఉంటాయి కాని, నూతులు ఉండవు. కాబట్టి వీరి జీవన విధానం వర్షాధారమై పోతుంది. కరువు సమయాలలో పట్టణాలకు వలసవెళ్లి కూలీలుగా పనిచేస్తారు. వీరి కింద ఐదవ మెట్టు మీద 1-2 ఎకరాల పొలం ఉండే వ్యవసాయ కూలీలు ఉంటారు. వీరు వ్యవసాయకూలీలు గానూ, పాలేర్ల గానూ కూడా పనిచేస్తారు. వీరికి సరియైన ఇళ్లు కాని, వీరి పిల్లలకు విద్యకాని ఉండవు. చివరి మెట్టు మీద పొలం లేని వ్యవసాయ కూలీలు ఉంటారు. వీరికి సరియైన భోజనం, ఇళ్లు, బట్టలు, రోజువారీ కూలీ పనులు ఉండవు. వీరి పిల్లలు కూడా కూలీ పని చేయవలసి వస్తుంది.

ఈ నిచ్చెనని ప్రజాసంక్షేమ నిచ్చెనగా రూపొందించడం జరిగింది. నిచ్చెనలో ఉన్న కింది మెట్టు తక్కువ సంక్షేమానికి గుర్తుగా తీసుకుని, ఆ సమాజంలో ఉండే అధిక సంక్షేమానికి పై మెట్టు గుర్తుగా తీసుకుంది. స్థానిక సముదాయం తయారు చేసిన ఈ నిచ్చెనను కేంద్రంగా తీసుకుని ఏ మెట్టు పేదరికాన్ని సూచిస్తుంది, ఏ మెట్టు పేదరికం కాదు అనేది సామూహికంగా నిర్ధారించడం ఒక ప్రక్రియ. కమలాపూర్‌లో సామూహికంగా పేదలు అని నిర్వచించడం కింది రెండు మెట్లుగా గుర్తించడం జరిగింది. ఈ కింది రెండు మెట్లలో ఉండే కుటుంబాలకు సంక్షేమం తక్కువ, ఎందుకంటే సంక్షేమం అంటే భూమి కలిగి ఉండి దానిమీద ఆధారపడడం, సేవింగ్స్, భోజన సదుపాయం, విద్య, సామాజిక హోదా తక్కువగా ఉండటంగా గుర్తించవచ్చును. పేదరికానికి ఇక్కడ ఇచ్చిన నిర్వచనం సాధారణంగా పేదరికాన్ని నిర్వచించే కొలమానానికి భిన్నంగా ఉంటుంది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా వాడుకలో ఉన్న నిర్వచనం పేదరికం అంటే కనీసం రోజుకు తిండి మీద ఒక డాలరు (యాభై రూపాయలు) అయినా ఖర్చు పెట్టలేని కుటుంబాలు. ఈ నిర్వచనంలో తిండి లేమి అనేదే పేదరికమైతే ఈ నివేదిక సూచించినట్లు సంక్షేమం తక్కువగా ఉన్న కుటుంబాలు పేద కుటుంబాలుగా గుర్తించవచ్చును. దానికి కారణం పేదలకు తమ సంక్షేమానికి అవసరమైన వనరులు కాని, వనరుల అందుబాటు కాని, తద్వారా వచ్చే ఉత్పాదకాలయిన ఇళ్లు, చదువులు, ఆరోగ్యం లాంటివి తక్కువగా ఉండటం అనేది నిర్వచనంలో భాగం. (బహుశా ఈ సంక్షేమ సూచికని దృష్టిలో పెట్టుకునే తమిళనాడు ముఖ్యమంత్రి వినోదాన్ని సంక్షేమంలో భాగంగా చూసి పేద కుటుంబాలకు రంగుల టి.వి.లను ఇవ్వడం జరిగిందేమో.) సమాజాన్ని ఒక నిచ్చెనగా ఊహించుకోవడంలో ఒక ముఖ్య అంశం దాగి ఉంది. ఆ నిచ్చెన ఎలా వచ్చింది? ఎందుకు వచ్చింది? ఆ నిచ్చెన మారి మరో నిచ్చెన కావాలని ప్రజలు కోరుకుంటారా? అనే ప్రశ్నలు కనుమరుగవుతాయి. నిచ్చెనలో ఒక మెట్టు నుండి మరో మెట్టుకి పాకడమే ఒక మూలాంశంగా ఉంటుంది.

నిచ్చెనల ప్రక్రియ పక్కన పెడితే సమాజాన్ని ఒక వర్గ సమాజంగా ఊహించే మార్క్స్ తదితరులు స్థానిక సమాజాన్ని వర్గ విశ్లేషణ చెయ్యడం జరిగింది. వ్యవసాయరంగాన్ని విశ్లేషిస్తూ లెనిన్ రష్యాకి సంబంధించి ఒక గణనీయమైన వర్ణనచేశాడు. అలాగే మావో చైనా వ్యవసాయరంగాన్ని కూడా విశ్లేషించాడు. ఆ వర్గసమాజపు రూపురేఖలు భూస్వాములు, ధనికరైతులు, మధ్య రైతులు, పేద రైతులు, వ్యవసాయ కూలీలుగా ఊహించారు. ఈ విశ్లేషణ భూమి మీద ఉండే ఆధిపత్యాన్ని, ఆ భూమిని ఉపయోగించుకునే శ్రమ రూపాలను బట్టి ఆధారపడింది. ఈ విశ్లేషణనే ఆధారంగా చేసుకుని నేను, ఆర్.ఎస్.రావు గారు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయం మీద ఒక అధ్యయనం చేయడం జరిగింది. (అది 'వెలుగు' వారిచ్చిన ఆర్థిక సహాయంతో జరిగింది.) ఈ విశ్లేషణలో ఉండే ప్రధానాంశం ఆ గ్రామంలో ఉండే సజీవ మానవ సంబంధాలనీ, అంటే ఒక వర్గం మీద మరొక వర్గం ఆధారపడి ఉంటుందనీ, ఆ ఆధారపడటం ఒక వైరుధ్యంతో కూడిన సంబంధమనీ, అదే ఆ సమాజానికి పునాది అని చెప్పడం జరిగింది. శ్రమ, శ్రమశక్తి, శ్రామికుడు ఒక ఉత్పత్తిశక్తిలో భాగాలుగా చూసే ఈ విశ్లేషణ సమాజ పునర్నిర్మాణానికి ఒక ఆధారం. ఒక పేద రైతు, ఒక వ్యవసాయ కూలీ సమాజ పునర్నిర్మాణానికి చోదకశక్తిగా పనిచేస్తారు అనేది ఒక ప్రధానమైన అంశం.

ఇంక మూడో కీలక అంశానికొస్తే, నివేదిక పేదరికం కన్న పేదరికం నుండి ఎలా బయటికి వస్తారు అనేది ముఖ్యంగా చూసింది. నివేదిక పేరే పేదరికంలో నుండి బయటికి రావడం. పరిశోధనా పద్ధతిలో స్థానిక సమాజాన్ని వేసిన ఒక ప్రశ్న గత పది సంవత్సరాలలో పేదలుగా గుర్తించిన కింది రెండు మెట్లమీద ఉండే కుటుంబాలు పై మెట్లకు చేరుకోగలిగారా? పై మెట్ల మీద నుండి కింది మెట్టు మీదకు వచ్చిన వాళ్లు ఉన్నారా? లేక ఆ కింది మెట్లమీదే ఉండిపోయారా అన్న ప్రశ్న. దానికి అనుబంధమైన మరో ప్రశ్న ఈ మార్పుకి కల కారణాలేమిటి? అనేది స్థానిక సమాజం చర్చించి ఒక నిర్ణయానికి వస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో వేల గ్రామాలలో చేసిన సర్వే ప్రకారం రెండు ముఖ్యమైన అంశాలను నివేదిక బయట పెట్టింది. అందులో మొదటిది స్వయంకృతం (ఇనిషియేటివ్), అంటే పేదలుగా గుర్తింపబడిన కుటుంబాలు, అందులో వ్యక్తులు పేదరికం నుండి బయటకు రావడానికి వాళ్లు చేసే ప్రయత్నాలు. వ్యక్తి పరిధిలో చూస్తే స్వయంకృతం అంటే కొత్త పంటలు పండించడం, కొత్త సాంకేతిక పరిజ్ఞానం వాడడం, కొత్త కొత్త వ్యాపార పంటలు పండించి ఎగుమతులు చేసుకోవడం, కొత్త వ్యాపారం మొదలుపెట్టడం, ఉద్యోగం సంపాదించడం, ఉపాధి నిమిత్తం పై ప్రాంతాలకు వలసపోవడంలా చూడవచ్చును.

ఇదే స్వయంకృతం అని సముదాయం పరిధిలో చూస్తే సమిష్టి, సహకార ఆచరణ అంటే శ్రమని కాని ఆదాయాన్ని కాని, సమిష్టిగా చూడడం లేక వస్తువు కొనుగోలు, అమ్మకాలలో సమిష్టి సహకార ఆచరణ ఇంకా సహకార వ్యవసాయం చేయడంగా చూడవచ్చును. ఇదంతా స్వయంకృతంలో భాగమే. పేదరికం నుండి బయటికి రావడానికి తగిన అవకాశాలు ఉండటం, అవి అందుబాటులో ఉండటం మరొక కారణం. పేదరికం పోవాలి అంటే వ్యక్తికి అవకాశాలు ఉండడం, అవి అందుబాటులో ఉండటం, వాటిని ఉపయోగించుకునే స్వయంకృతం ఉండటం అనేవి ముఖ్యమౌతాయి. అంటే పేదరికం నిర్మూలన జరగాలంటే ఎక్కువ అవకాశాలు కల్పించడం, వాటిని వినియోగించు కోగలిగిన స్వయంకృతం కల మనుష్యులు ఉండటం అనేవి నివేదిక చెప్పే ఎంపిరికల్ ఫైండింగ్స్. కొంత వరకూ ఆర్థిక పెరుగుదల

(ఎకనామిక్ గ్రోత్) త్వరితంగా జరిగితే, దాని ద్వారా వచ్చే అవకాశాలను ప్రజలు ఉపయోగించుకోగలిగితే పేదరికం అదే పోతుంది అనే ఒక పాతపాటని కొత్త బాణీలో వినిపిస్తుంది ఈ నివేదిక.

ఈ కొత్త బాణీలో అవకాశాలు అనేవి ప్రపంచీకరణ మూలాన చాలా పెరుగుతాయని కూడా పాటలో మరో చరణం. ప్రపంచీకరణలో భాగంగా దేశ ఆర్థిక వృద్ధి చాలా పెరిగింది అని కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నా, బి.జె.పి. ప్రభుత్వం ఉన్నా, రాష్ట్రంలో తెలుగుదేశం ఉన్నా, కాంగ్రెస్ పార్టీ ఉన్నా ఆర్థిక వృద్ధి కనీవినీ ఎరగని రీతిలో పెరిగిందనీ ప్రభుత్వాలు, ప్రపంచబ్యాంక్ ఘోషిస్తున్నాయి. చాలా అవకాశాలు కల్పిస్తాయనీ, పేదరిక నిర్మూలన జరుగుతుందనీ ఆశించేవాళ్లు చాలామంది ఉండవచ్చును. ఇక్కడొక ప్రధానమైన విషయం ఈ ఆర్థిక వృద్ధి ఇచ్చే అవకాశాలు పేదరికంలో మునిగిన ప్రజల స్వయంశక్తిని ఎంతవరకు ప్రతిబింబిస్తాయి, ప్రేరేపిస్తాయి అనే ప్రశ్నలు. ఏ ఉత్పత్తి శక్తి అయితే వృద్ధిని సాధిస్తుందో ఆ ఉత్పత్తి శక్తికి, పేద ప్రజలు వారి ఉత్పత్తి శక్తికి సమతుల్యం లేకపోతే అవకాశాలు వచ్చినా కూడా పేదరికం అలాగే ఉండిపోయే పరిస్థితి ఉంటుంది. ఏ సమాజమైన తన స్వయంశక్తిని కేంద్రంగా తీసుకున్నప్పుడు ఆ సమాజం అభివృద్ధి చెందుతుంది. స్వయంశక్తిని వదులుకొని స్వయంశక్తితో సంబంధం లేని అవకాశాలు ఎన్ని పెరిగినా ఆ సమాజం అభివృద్ధికి నోచుకోదు. అభివృద్ధి చెందకపోతే పేదరిక నిర్మూలన జరిగే అవకాశాలు బలహీన పడతాయి. పేదప్రజలకు ఏం కావాలని వారు కోరుకుంటున్నారు? వారు ఏం చెయ్యగలరు? వారి శక్తి ఏమిటి? అనే ప్రశ్నలు వేసుకోకపోతే అవకాశాలు ఎన్ని ఉన్నా, పేదరికం నిర్మూలించబడే అవకాశాలు తగ్గిపోతాయి. 1967 నుండి 2008 వరకూ పేదరిక నిర్మూలనకి ఎన్నో ప్రయోగాలు – గొర్రెలివ్వడం, మేకలివ్వడం, పశువులివ్వడం నుండి పనికి ఆహార పథకం నుండి గ్రామీణ ఉపాధి హామీ పథకం నుండి నగదు చెల్లింపు, రు. 2 కిలో బియ్యం వరకూ ఎన్నో అవకాశాలు. ఆ అవకాశాలు ఏం అయ్యాయి? అని ప్రశ్నించు కోకుండా, పేదరికం ఎందుకు వచ్చింది అని ప్రశ్నించుకోకపోతే ప్రస్తుత ప్రపంచబ్యాంక్ నివేదిక కూడా ప్రభుత్వాలకు ఉపయోగపడుతుందేమో కాని పేద ప్రజలకు ఇది మరో రిపోర్టు లాగానే మిగిలిపోతుంది.

## 4

మనిషిని నిపుణుడుగా చూడటంలో ఒక ప్రత్యేకత ఉంది. సాంకేతిక పరిజ్ఞానం బాగా పెరిగిన, పెరుగుతున్న ప్రస్తుత కాలంలో జ్ఞాన సముపార్జనలో శ్రమ విభజన ముఖ్యపాత్ర పోషిస్తున్నప్పుడు సాంకేతిక నిపుణులకు తమ జ్ఞానం పరిపూర్ణమని ఒక అహంభావం చోటు చేసుకునే ప్రమాదం చాలా ఉంది. ఆ నైపుణ్యం ప్రకృతి మీద అవవచ్చు, సమాజం మీద అవవచ్చును. ఉదాహరణకు అనునిత్యం మారుతున్న ప్రకృతి మీద అవగాహన పరిపూర్ణం అని అనుకోవడం ఎంత తప్పిదమో, అనునిత్యం మారే సమాజం మీద పూర్తి జ్ఞానమూ, అవగాహనా ఉంటుందనుకోవడం కూడా అంతే పొరపాటు. జ్ఞానం అనేది ప్రకృతి కాని, సమాజం కాని దాని మీద ఉండే నమూనాలో కేంద్రీకృతమౌతుంది. ఆ నమూనా వాస్తవానికి ఎప్పుడూ తక్కువగానే ఉంటుంది. మరో భాషలో చెప్పాలంటే ప్రకృతిలో ఉండే రహస్యాలు, మనిషిలో ఉండే రహస్యాలు తెలుసుకునే బాటే జ్ఞానం. మనిషిని నిపుణుడుగా చూస్తాం అన్నదాంట్లో అర్థం, సాంకేతిక నిపుణుడు దగ్గర మనిషి మీద ఉన్న జ్ఞానం అసంపూర్ణమని, మనిషి మీద మనిషి ద్వారా తెలుసుకోవలసినవి ఇంకా చాలా ఉన్నాయనీ అర్థం. మనిషి అనగానే ఆలోచన, ఆచరణ కూడలిగా చూడడం అనేది పరిపాటి. ఆచరణ మనిషి మనుగడకి సంబంధించిన విషయమైతే, ఆలోచన మనిషి అస్తిత్వానికి సంబంధించింది. ఒక ఆలోచన ఆచరణని ప్రేరేపిస్తే, ఒక ఆచరణ ఆలోచనని బలపరుస్తుంది. ఒక మనిషి (ఆచరణ – ఆలోచన – మారిన ఆచరణ – మారిన ఆలోచన – మారిన ఆచరణ –) గొలుసుగా ఆలోచిస్తే, ఆ గొలుసు తెగిపోయిన సందర్భం మనిషి మనిషిగా మనుగడ సాగించలేని పరిస్థితి, అస్తిత్వం కోల్పోయిన మనిషి.

మనిషి మనిషిగా లేని ఈ పరిస్థితిని దారిద్ర్యమన్నా, పేదరికమన్నా సరిపోతుందేమో. ఆలోచన మారకపోయినా, మారిన ఆలోచనని ఆచరించలేకపోయినా, ఆ పరిస్థితి మీద కార్యకారణ సంబంధాలు ఆ మనిషికే తెలుస్తాయి. ఆ క్రమంలో ఉండే అడ్డంకులు కూడా ఆ మనిషికే తెలుస్తాయి. ఇవి ఆ మనిషి ఎపుడు బయటపెడతాడు అంటే ఈ అడ్డంకులను అతిక్రమించడానికి ఎవరైతే సహాయం చెయ్యగలరో, ఎవరికైతే ఆ శక్తి ఉందో, వారి ప్రోద్బలంతో వారికే చెప్పడం జరుగుతుంది. ప్రపంచ బ్యాంక్ నివేదిక మనిషిని నిపుణుడిగా గుర్తించనంత వరకూ బాగానే ఉంటుంది. కాని తన నైపుణ్యతను (ఆలోచన – ఆచరణ సంబంధాలను) స్థానిక సమాజం ముందు చర్చలో బయటపెడతాడు అనేది హాస్యాస్పదం. ఎందుకంటే ఆ స్థానిక సమాజమే తన ప్రస్తుత స్థితికి కారణమవవచ్చును. మిగతా తారతమ్యాలు కావచ్చును. ఇటువంటి పరిస్థితులలో మనిషి తన ఆలోచనలను బయటపెడతాడు అని అనుకోవడం సమంజసం కాదు. మనం తరచూ గ్రామాలలో సర్వే చేస్తున్నప్పుడు వినబడే మాట 'మీరు ఆర్చేవాళ్లా, తీర్చేవాళ్లా' లేక 'మీరు మాకేం ఇస్తారు' అనే మాటలే. ఆర్చటం కాని తీర్చటం కాని స్థానిక సమాజం చెయ్యలేనప్పుడు ఆ స్థానిక సమాజం ముందు మనిషి తమ ఆలోచనలు బయటపెట్టడం సంభవం కాదు. ప్రపంచ బ్యాంక్ నివేదిక ఈ విషయం గుర్తించదు.

పేదరికమనేది ఇంతవరకూ మనుగడకు, అస్తిత్వానికి సంబంధించిన విషయమని అనుకుంటే, ముందుగా మనుగడ విషయం గురించి చూద్దాం. మనుగడ అంటే మనిషి బతకడానికి, బతికి మళ్లీ మనిషిగా కొనసాగించడానికి అవసరమైన వస్తు సామాగ్రి, అంటే ఒక విధంగా తినడానికి కావలసిన తిండి, కట్టుకోవడానికి కావలసిన బట్టలు, ఉండడానికి కావలసిన ఇల్లు అని చూడవచ్చును. మనం సర్వసాధారణంగా పేదరిక నిర్మూలన కార్యక్రమాలలో వీటి గురించే తరచూ వింటూ ఉంటాం. తల ఒక్కింటికి ఉచితంగా పది కిలోల బియ్యమనో, లేక చౌక ధరలలో బియ్యం, పప్పు, నూనె వగైరాలనో ఇవ్వడం ఈ కోవకి సంబంధించినవి. చవకలో బట్టల పంపిణీ (జనతా చీరెలు), పెళ్లి చేసుకుంటే బట్టలు పెట్టడం (మంగళసూత్రాలతో సహా),

ఇందిరా ఆవాస్ యోజనా అని, ఇళ్లు కట్టి ఇవ్వడం లాంటివి మనుగడకి సంబంధించిన విషయాలు. ఈ కోవకే ప్రతి ఇంటికి సామానులు కొనుక్కోవడానికి బ్యాంకులో డబ్బులు వేస్తాం (నగదు బదిలీ పథకం లాంటివి) అనే పథకాలు కూడా చెందుతాయి. దారిద్ర్య రేఖ కొలమానం కూడా ముందు ఒక డాలరుగా తీసుకునే సంకేతం కూడా ఈ కోవకి చెందినదే. ఇది కొంతవరకూ ముష్టి వాళ్లకి వేసే దానం లాగా, దేముడి గుళ్లో పెట్టే ప్రసాదంలాగా, మఠాలలో పెట్టే భోజనం లాగా ఉంటుంది. దీనితో మనిషి ఆచరణ చెయ్యగలడనీ, ఆచరణ చెయ్యగల యోగ్యుడనీ, దానికి కావలసిన శ్రమశక్తి ఉన్నవాడనీ గ్రహింపు ఉండదు. దీని కంటే ఒక మెట్టు పై భాగాన ఉండేది గొర్రెలు, మేకలు ఇవ్వడం లేక పనిచేస్తే ఆహారం అనే పథకాలు, ప్రస్తుతం విస్తృత ప్రచారం పొందుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లాంటివి కొంచెం మానవ శ్రమనీ, ఆచరణ చేయగల శక్తినీ గుర్తించే కార్యక్రమాలు. ఈ కార్యక్రమాల్లో శ్రమని, ఆచరణని గుర్తించినా కూడా ఆ మనిషి ఏ శ్రమని కోరుకుంటున్నాడు, ఏ శ్రమని చెయ్యగల శక్తి ఉంది, ఏ శ్రమ మీద కొంత సొంత ఆలోచనలు ఉన్నాయి అనే అవగాహన లేనటువంటి కార్యక్రమాలు ఇవి. ఒక కమ్మరి, కుమ్మరి, సాలీలు, గీత కార్మికుడు మొదలైన వారికుండే జ్ఞానం, ఆలోచనలకు అతీతంగా కొత్త కార్యక్రమాలు ప్రవేశపెడితే ఫలితం శూన్యంగా ఉంటుంది. మనిషి స్వశక్తి అంటే ఆలోచన – ఆచరణల మధ్య సమన్వయం కలిగిన శ్రమని గుర్తించకుండా, అంటే మనిషి కేంద్రంగా ఉండే అస్తిత్వానికి, మనుగడకి ఉండవలసిన సమన్వయం లేకపోతే ఇవి రెండూ గాడి తప్పుతాయి. ఇది గ్రహించకపోతే ఆ అస్తిత్వాలు, మనుగడ గాడితప్పిపోయిన కారణాలు వెతుక్కోకుండా, ఆ గాడి మీదకి తిరిగి తీసుకుని వచ్చే ప్రయత్నాలు లేకుండా ఉన్నంతకాలం పేదరికమూ, పేదరిక నిర్మూలన మీద చర్చ చర్విత చర్వణంగా అలాగే కొనసాగుతూనే ఉంటుంది. గాడి మీదికి తీసుకుని రావడమంటే మనిషిని స్వశక్తి మీద ఆధారపడేలా చెయ్యటమని గ్రహించవలసి ఉంటుంది.

మనుగడ మీద కేంద్రీకరించిన పేదరకమూ, పేదరకం మీద చర్చ మనిషి ఆలోచించగలడు. ఆచరణ ద్వారా ఆలోచనలను మెరుగు పెట్టుకోగలడు. ఆ క్రమంలోనే మనిషి ఎదుగుదల జరిగింది అనేది, అస్తిత్వానికి చెందినది అనేది మరుగున పడిపోయింది. ఇది పేదరికపు చర్చలో ఉండే ఒక భావ దారిద్ర్యం. ప్రౌధన్ అనే ఫ్రెంచ్ సోషలిస్ట్ రాసిన ఫిలాసఫీ ఆఫ్ పావర్టీకి సమాధానంగా మార్క్స్ రాసిన పావర్టీ ఆఫ్ ఫిలాసఫీ ఈ విషయాన్ని నొక్కి చెబుతుంది. ఆలోచన, ఆలోచనలో మార్పులు రావాలంటే మనిషి ప్రకృతి తోనూ సమాజంతోనూ ఒక సంబంధంలో ఉండి తీరాలి. ఆ సంబంధం తన ఆలోచనలను ఆచరణగా మార్చుకోవడం, ఆ ఆచరణ ద్వారా ఆలోచనని మార్చుకోవడం జరుగుతుంది. ఉదాహరణకు ఆదివాసులను ప్రకృతి నుంచి, అంటే అడవి నుంచి దూరం చేస్తే – అవి రిజర్వ్ ఫారెస్ట్ చట్టాల మూలాన అవవచ్చును. గనులు తవ్వడం మూలాన అవవచ్చును, రోడ్లు, రైల్వే మార్గాలు వేయడం వలన అవవచ్చును, డ్యాంలు కట్టడం మూలాన అవవచ్చును. ఈ ప్రక్రియలన్నీ ఆదివాసుల అస్తిత్వానికి సంబంధించిన అడవి, ప్రకృతితో సంబంధం గండికొడితే ఆదివాసులుగా ఉన్న మానవుల అస్తిత్వానికి దెబ్బ. ఆ అస్తిత్వంతోపాటు వారి మనుగడ కూడ దెబ్బతింటుంది. అలాగే గ్రామాలలో ల్యాండ్ సెటిల్‌మెంట్స్ వలన కాని, వ్యాపార పంటల వలన కాని, డ్యాంలు కట్టడం వలన కాని భూమిని కోల్పోయి వ్యవసాయ కూలీలుగా మిగిలిన వారి అస్తిత్వం, దానితోపాటు మనుగడ కూడా కోల్పోతారు. అలాగే గ్రామీణ వ్యవసాయేతర ఉత్పత్తుల విషయానికొస్తే, బ్రిటిష్ కాలం నుండి కాటన్ టెక్స్‌టైల్ పరిశ్రమ, అల్యూమినియం పరిశ్రమ, ఉక్కు పరిశ్రమ వచ్చిన క్రమంలో నేత పనివాళ్లు, కుమ్మరి, కమ్మరిలు తమ అస్తిత్వాన్ని కోల్పోయారు. నిర్వాసితులుగా పిలువబడే ఈ జనాభా అస్తిత్వం కోల్పోయి తిరిగి కొత్త సమాజంలో చేరుకోలేక సమాజపు అంచులలో ఉండిపోయే ఈ పేద ప్రజలు తిరిగి మనుష్యులుగా తయారు చెయ్యగలిగిన కార్యక్రమాలు లేనంత కాలం పేదరిక నిర్మూలన అనేది ఒక మీమాంసే.

ప్రస్తుత భావజాలంలో మనుగడ జరుగని వారిని పేదప్రజలుగా ఎలా చూస్తారో, అదే భావజాలం దేశాలకి కూడా వర్తిస్తుంది. పేద దేశాలనో, మూడవ ప్రపంచ దేశాలనో, అభివృద్ధి చెందిన దేశాలనో పిలువబడే దేశాలన్నీ వాటి మనుగడ సాధించలేవు. అందుకోసం సంపన్న దేశాలు పేద దేశాలకు ఆర్థిక సహాయం, సాంకేతిక సహాయం (దీన్నే ఎయిడ్ అంటారు) చేయాలని చూడడం, ఈ పేద దేశాలు వాటిని కావాలని కోరుకోవడమూ ఆ భావజాలంలో భాగమే. ఈ భావజాలంలో కుట్ర భాగాన్ని పక్కనపెడితే మనిషికి కావలసిన పేదరిక నిర్మూలన కార్యక్రమాలకూ, దేశ పేదరిక నిర్మూలన కార్యక్రమాలకూ సమానత్వం కనిపిస్తుంది. ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ ఇత్యాది సంస్థలు పేద దేశాలకు ఇచ్చే ధన సహాయం, తక్కువ వడ్డీతో అప్పులు ఇవన్నీ శాశ్వత మనుగడ లేమిని తెలిపే కార్యక్రమాలు. ఈ కోవకే చాలా ఎన్.జి.ఒ.లు కూడా చేరతాయి. ధన సహాయం, వస్తు సహాయం ఇచ్చే ఈ కార్యక్రమాలలో దేశాల స్వశక్తి మీద కాని, దానికి సంబంధించిన అస్తిత్వం మీద కాని గుర్తింపు శూన్యం. ధన సహాయం, వస్తు సహాయం కాకుండా భావ సహాయం (నైపుణ్యత పేరిట) మీ దేశాలు ఎలా పెరగాలి? ఎలా అభివృద్ధి చెందాలి? ఎటువంటి కార్యక్రమాలు తీసుకోవాలి? అనేవి కూడా ఈ సంస్థలు నిర్ణయిస్తాయి. స్వశక్తి ఈ దేశాలకు ఉంటుందని కాని స్వయం ప్రతిపత్తి ఈ దేశాలు సాధించగలవని కాని, వాటికొక అస్తిత్వం ఉంటుంది అని కాని గ్రహింపు లేశమాత్రంగానైనా ఆలోచనకి తావునివ్వరు. అదే భావజాలానికి చెందినదే ప్రపంచ బ్యాంక్ నివేదిక– 'పేదరికం నుండి బయటకు రావడం'. వారు చెప్పే మార్గం కూడా స్వయంకృతం (ఇండివిడ్యుల్ ఇనిషీయేటివ్) తోపాటు విస్తృతంగా అవకాశాలు ఉండాలి. ఈ విస్తృతమైన అవకాశాలు ప్రపంచీకరణ ద్వారానే సాధ్యమని, ఈ అవకాశాలను అందిపుచ్చుకోవడం ద్వారానే దేశాలకు కాని ప్రజలకు కాని పేదరికం నుండి విముక్తి లభిస్తుందని సారాంశంలో నివేదిక మనకు చెబుతుంది. పేద దేశాల నేతృత్వంలో ఈ సారాంశాన్ని ఒప్పుకుంటారా లేదా అనేది ఆ దేశ నేతృత్వం మీద ఆధారపడుతుంది. పేద ప్రజలకు ఇది అంగీకారమా లేదా అనేది పేద ప్రజలే నిర్ణయించుకోవాలి. వీ

*సిద్ధాంతం, ఆచరణ ఒక దానిని మరొకటి ప్రభావితం చేసుకుంటాయనీ, క్షేత్రపరిశోధనతోనే సైద్ధాంతిక అవగాహన రాటుదేలుతుందనీ చెబుతూ తన క్షేత్రపరిశోధనా అనుభవాలను వివరిస్తున్నారు* **పి.సి. జోషి**

# క్షేత్రపరిశోధన అనుభవం - పునస్సమీక్ష

*(గత సంచిక తరువాయి..)*

ఇరవై ఐదు సంవత్సరాల కింద ఈ అవగాహన నాకు మొట్టమొదటి సారి పరిచయమైన సందర్భాన్ని గుర్తుతెచ్చుకుంటుంటే అది అప్పుడు నా మనసు మీద ఎటువంటి విద్యుచ్చకితమైన ప్రభావం వేసిందో గుర్తుకొస్తోంది. శుష్క సిద్ధాంతాలు, పదాడంబరం నిండిన బీడుభూమిలో అది చల్లని తాజా గాలిలాగా వీచింది. వ్యక్తిత్వం రూపొందుతున్న ఆ తొలి సంవత్సరాలలో దాని ద్వారా నాకందిన మేధో ప్రేరణలు, నైతిక ప్రోత్సాహకాలు లేకపోయి ఉంటే నేనసలు వ్యవసాయ సమాజ అధ్యయనాల పట్ల ఇంత జీవిత పర్యంత ఆసక్తి పొంది ఉండే వాడినా అని అనుమానం వస్తుంది. ఒకవేళ వ్యవసాయ సమాజ అధ్యయనంలోకి ఏదో ఒకరకంగా ప్రవేశించినా నా మధ్యతరగతి దురభిప్రాయాలని, అపోహలని ఒదులుకొని, ఉత్తరప్రదేశ్ గ్రామాలలో 1952-53లలో ఒక సంవత్సరానికి పైగా నిమగ్నమైపోవడం ఈ అవగాహన లేకుండా సాధ్యమయ్యేది కాదు.

ఆ విధంగా గ్రామాలలో క్షేత్రపరిశోధన చేయడానికి మావో రచనల అధ్యయనం నన్ను ప్రేరేపిస్తే, శాస్త్రీయ విశ్లేషణలో వర్గం అనే ముఖ్య భావన పనిముట్టుగా ఎలా ఉపయోగించాలో నా మార్క్సిస్టు ప్రామాణిక గ్రంథాల అధ్యయనం నాకు తెలియజేసింది. చైనా గ్రామీణ సమాజంలో వర్గ విశ్లేషణ ఎలా చేయాలనే దాని గురించి మావో రాసిన వ్యాసాలు, చైనా గ్రామీణ ప్రాంతాలలో వర్గ విభజన గురించి జెన్ పి షి చేసిన విశ్లేషణ, లెనిన్ రాసిన రష్యాలో పెట్టుబడిదారీ విధాన అభివృద్ధి, రజనీ పామీ దత్ రాసిన ఇండియా టుడేలో భారత వ్యవసాయరంగ సమస్యల విశ్లేషణ నాకు వ్యవసాయరంగంలో వర్గ విశ్లేషణకు కొన్ని నమూనాలను అందించాయి. ఉత్తరప్రదేశ్‌లోని వ్యవసాయ వ్యవస్థను వర్గ దృక్పథం నుంచి అధ్యయనం చేయడం నా మేధో అన్వేషణగా మారింది.

వ్యవసాయ వ్యవస్థపై క్షేత్రపరిశోధన చేయడం అనే ఆలోచన నా రాజకీయ ఆసక్తులకూ, విద్యా ఆసక్తులకూ మధ్య వారధిగా నిలిచింది. అది నన్ను మళ్లీ వెనక్కు విద్యారంగ జీవితంలోకి తీసుకువచ్చింది. ఈ భావన నా మనస్సులో స్థిరపడగానే నేను రాధాకమల్ ముఖర్జీ (ఆర్.కె.)ని కలిసి ఉత్తరప్రదేశ్‌లో స్వాతంత్ర్యానంతరం మారుతున్న వ్యవసాయ వర్గ వ్యవస్థ అనే అంశం మీద పిఎచ్.డి. సిద్ధాంత పత్రం సమర్పిస్తానని ప్రతిపాదించాను. నేను మళ్లీ విద్యారంగంలోకి రావడాన్ని ఆయన స్వాగతించి నా పరిశోధనకు మార్గదర్శకుడుగా పనిచేయడానికి అంగీకరించారు. క్షేత్రపరిశోధన పట్ల నా వైఖరి సక్రమంగానే ఉన్నదని గుర్తించారు గనకనే ఆయన నా ప్రతిపాదనను వెంటనే అంగీకరించారు. కాని, అప్పటి విశ్వవిద్యాలయ పరిస్థితి ప్రకారం నా పరిశోధనకు నాకు ఆర్థిక సహాయం ఏదీ అందబోదని ఆయన స్పష్టం చేశారు. మరి ఆర్థిక సహాయం లేకుండా క్షేత్రపరిశోధన చేయడం ఎలా అని ఆయనను ప్రశ్నించినప్పుడు నా పార్టీ సంబంధాలే నాకు పెద్ద ఆస్తి అని, నా క్షేత్ర పరిశోధనలో ఆ సహకారం పొందవచ్చునని ఆయన అన్నారు. కిసాన్‌సభ నాయకుల సహాయంతో రైతులను కలుసుకో, రైతు కుటుంబాలలో కుటుంబ సభ్యుడిగా జీవించు అని ఆయన చెప్పారు. ఈ రకంగా వారి జీవితాల పట్ల మరెవరికీ కలగని అవగాహన నాకు కలిగే అవకాశం ఉందని ఆయన చెప్పారు.

అప్పటికి విశ్వవిద్యాలయంలో క్షేత్రపరిశోధనలో మరెవ్వరూ చేయని ప్రయత్నానికీ, ప్రయోగానికీ నన్ను పురికొల్పినందుకు ఆర్.కె.కు నేను ఎప్పటికీ కృతజ్ఞుడినై ఉంటాను. ఆ తరువాత 1952లో న్యూఢిల్లీలో నేను కమ్యూనిస్టు నాయకుడు ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్‌ను కలుసుకున్నాను. ఆయనతో చర్చించి కొన్ని భావనలను స్పష్టపరుచు కున్నాను. నా ప్రశ్నపత్రాలను, నమూనా సమాధాన పత్రాలను పార్టీ కేంద్ర కార్యాలయంలోనే మిమియోగ్రాఫ్ చేయించుకున్నాను. ఒక పరిశోధక విద్యార్థి గ్రామాలలో రైతాంగ కుటుంబాలతో కలిసి జీవించడం అనే ఆలోచనను ఆయన చాలా మెచ్చుకున్నారు. అంతేకాదు పార్టీలోపల ఇటువంటి ఆలోచన గల యువమేధావులను ఏ ఒక్కరినీ తాను చూడలేదని నన్ను ప్రోత్సహించారు.

నా అధ్యయన పరిధిని పరిమితం చేసుకోవడం మంచిదేమో ఆలోచించమని ఆర్.కె. నాకు సూచించారు. వ్యవసాయ వర్గ నిర్మాణం గురించి అధ్యయనం చేయడం అందులోనూ భారతదేశంలో స్వాతంత్ర్యానంతరం గ్రామీణ ఆర్థికవ్యవస్థ అర్ధభూస్వామ్య స్థితి నుంచి పెట్టుబడిదారీ స్థితికి ఎలా పరివర్తన చెందుతున్నదో అధ్యయనం చేయడం నా ఆసక్తి అని ఆయనకు చెప్పాను. భారత గ్రామీణ పరిస్థితి పైన ఒక మార్క్సిస్టు వర్గ నమూనాను అంటుకట్టడానికి నేను చేస్తున్న ప్రయత్నం తనకు వినోదం కలిగిస్తున్నదని ఆయన అన్నారు. భారతదేశానికి సంబంధించినంతవరకు తీసుకోగలిగిన సాధారణ వైఖరి తన 'సంస్థా నిర్మాణాల వైఖరి' అని ఆయన సూచించారు. అలాగే గ్రామీణ వ్యవసాయ వ్యవస్థ నిర్మాణాన్ని అర్థం చేసుకోవడానికి తాను రూపొందించిన 'గ్రామీణ సామూహిక వాదం' అనే భావన సరిపోతుందని ఆయన సూచించారు.

భారత సమాజ సందర్భంలో కులానికి ఉన్న ఆర్థిక ప్రాధాన్యతను అర్థం చేసుకోవలసిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. అట్లాగే గ్రామీణ ప్రాంతాలకూ, పట్టణ ప్రాంతాలకూ మధ్య ఉన్న తేడాను, ఉదాహరణకు పట్టణాలలో ఉండే వృత్తిపర వర్గాలకూ ఇతర వర్గాలకూ భూమితో ఉండే సంబంధాన్ని అర్థం చేసుకోవాలని ఆయన సూచించారు. నా పరిశోధనా అంశాన్ని ఈ ఆలోచనల నేపథ్యంలో తిరగరాసిన తరువాత నా క్షేత్రపరిశోధన ప్రారంభించాలని ఆయన అన్నారు.

ఆర్.కె. తో చర్చ తర్వాత నేను నిరాశకు లోనయ్యాను. మార్క్సిస్టు వర్గదృక్పథం ఒకవైపు లాగుతున్నట్టూ, భారత సామాజిక నిర్మాణంలోని సంక్లిష్టతల గురించి నాలో పెరుగుతున్న అవగాహన మరొక వైపు లాగుతున్నట్టూ అనిపించింది. నా ఆలోచనలను ఆయనతో పంచుకోవడం కూడా ఇబ్బంది అయిపోయింది. ఆయన నాతో ప్రేమగానే ఉన్నారు. కాని, తన అభిప్రాయాలు గట్టిగా చెప్పారు. ఆయన వాదనలలో కొంత బలం ఉన్నట్టే అనిపించింది. కాని, మౌలికంగా ఆయన వైఖరి అసంతృప్తి కలిగించింది. ఆయన వైఖరిలో గతిశీల దృక్పథం లేదని అనిపించింది. ఆయన కులం వంటి సాంప్రదాయిక అంశాల బలాన్ని సరిగానే గుర్తించారు. కాని, డబ్బు, మార్కెట్, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, విద్య వంటి బాహ్య అంశాల ప్రభావాన్ని విస్మరించారు. తన వైఖరి ఫలితంగా ఆయన భారతదేశాన్ని పరిణామ క్రమంలో అన్నీ ప్రత్యేకతలే ఉన్న దేశంగా పరిగణించారు. కాగా, మార్క్సిస్టులు భారతదేశంలో పరిణామక్రమంలో ఒక వర్గసమాజం తయారైందని, ఇంకా స్పష్టంగా చెప్పాలంటే పెట్టుబడిదారీ సమాజం తయారైందని భావించారు. భారత ఆర్థిక పరిణామంలో పెట్టుబడిదారీ విధాన దిశగా మార్పు ఉందని మార్క్సిస్టులు స్పష్టంగా గుర్తించారు.

ఈ అనుమానాలతో నేను డి.పి. ముఖర్జీని కలుసుకున్నాను. విద్యార్థులు తమంతట తాము ఆలోచించాలని ప్రోత్సహించే అధ్యాపకుడు ఆయన. వ్యవసాయ సమస్యా సిద్ధాంతాన్ని అధ్యయనం చేయడానికి అవసరమైన మానసిక స్థితి నాకిప్పుడు ఏర్పడిందని ఆయన అన్నారు. నా అనుమానాలకు జవాబులు సైద్ధాంతిక స్పష్టతలోనూ, చారిత్రక అధ్యయనంలోనూ దొరుకుతాయని ఆయన చెప్పారు. ఆ తరువాత నేను డి.ఎన్. మజుందార్‌ను కలిసి ఆయన అభిప్రాయం కూడా అడిగాను. ఇంక నేను చర్చలతో సమయం వృథా చేయగూడదని ఆయన చెప్పారు. నేనిక నేరుగా నా క్షేత్రపరిశోధనకు వెళ్లవలసిందేనని ఆయన అన్నారు. నేను ఆ విషయం మీద అవసరమైన మౌలిక పుస్తకాలు కొన్ని సేకరించుకొని క్షేత్ర పర్యటనకు బయలుదేరాను. ఆ రకంగా మాత్రమే నేను ఒకవైపు డి.పి. ముఖర్జీ, మరోవైపు ఆర్.కె., డి.ఎన్. మజుందార్‌లు ఇచ్చిన పరస్పర వ్యతిరేక సలహాల మధ్య సమన్వయం కుదర్చగలనని అనుకున్నాను.

క్షేత్రపరిశోధన అనుభవం గురించి చెప్పే వ్యాసంలో, క్షేత్రానికి వెళ్లే ముందు నా మనసును కల్లోలపరిచిన సమస్యలను చర్చించడానికి ఇంత స్థలం ఎందుకు కేటాయిస్తున్నానని ఎవరైనా ప్రశ్నించవచ్చు. నేరుగా నేను గ్రామానికి చేరగానే ఏం జరిగిందో దానితోనే వ్యాసం మొదలు పెట్టవచ్చు గదా? అయితే నేను ముందే చెప్పినట్టు గ్రామాలలో నా క్షేత్రపరిశోధన, నేను క్షేత్రపరిశోధన ప్రారంభించడానికి ముందే నన్ను కలవరపరిచిన ఆలోచనల నేపథ్యంలోనే సాగింది. సాధారణ పరిశోధనలో ఉండే విసుగుదల, శ్రమ నా సారమంతా తోడేసిన తరువాత నా మౌలిక, సైద్ధాంతిక ఆసక్తుల కోసమే నేను వాస్తవ వివరాలు సేకరించవలసి ఉంటుందనే ఆలోచన నన్ను క్షేత్రపరిశోధనకు పురికొల్పింది.

ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే ఉత్తరప్రదేశ్ పశ్చిమ భాగంలోని మీరట్ జిల్లాలో రెండు గ్రామాలలో నా క్షేత్రపరిశోధన సాగించడం నా అదృష్టమనుకుంటాను. ఆ తరువాత ఉత్తరప్రదేశ్ తూర్పు భాగంలోని గోరఖ్‌పూర్ జిల్లాలో రెండు గ్రామాలలోనూ, ఉత్తరప్రదేశ్ మధ్యభాగంలోని ఎటావా జిల్లాలో ఒక గ్రామంలోనూ, ఉత్తరప్రదేశ్ కొండ ప్రాంతాలలోని అల్మోరా జిల్లాలో ఒక గ్రామంలోనూ కూడా క్షేత్రపరిశోధన సాగించాను. మీరట్ గ్రామాలలో నా అనుభవం ఎన్నో రకాలుగా నన్ను దిగ్భ్రాంతి పరిచింది. మొట్టమొదట నా బ్రాహ్మణ, పట్టణ నేపథ్యం వల్ల, భారత సమాజం గురించి ఉదారవాద, మార్క్సిస్టు వ్యాఖ్యానాల అధ్యయనం వల్ల భారతదేశపు గ్రామీణ ప్రాంతాల గురించి నాకు ఏర్పడిన మౌలిక అవగాహనలను, నమ్మకాలను ఆ మీరట్ గ్రామాలు తలకిందులు చేశాయి. భారత గ్రామీణ మూఢత్వం గురించి, స్తబ్దత గురించి, వెనుకబాటుతనం గురించి నేను పుస్తకాల ద్వారా ఏర్పర్చుకున్న మానసిక చిత్రానికీ, నా కళ్లముందర రోజురోజూ వ్యక్తమైన రైతుల నిజజీవిత సంపన్న చిత్రానికీ సంబంధమే లేదు. క్షేత్రపరిశోధనా క్రమంలో గ్రామీణ జీవితంతో నా సంబంధం పెరుగుతున్న కొద్దీ నావంటి పట్టణ, మధ్యతరగతి వర్గం ఒక ఆధిక్యతా భావంతో గ్రామీణ నిరక్షరాస్య ప్రజల గురించి ఏర్పర్చుకున్న అభిప్రాయాలకు వాస్తవ పునాది ఏమీలేదని నాకర్థమయింది.

గ్రామీణులు నిరక్షరాస్యులనే మాట నిజమే. వాళ్లు పుస్తకాలూ, పత్రికలూ చదవరు. రేడియో ఎన్నడూ వినలేదు. జ్ఞానవంతులతో సంబంధంలోకి రాలేదు. కాని, సాంప్రదాయికంగా సహజమైన గ్రహణ శక్తితో వాస్తవిక జీవితం ద్వారా వాళ్లు తమ చుట్టూ ఉన్న ప్రాకృతిక, సామాజిక వాతావరణం గురించి ఎంతో పరిజ్ఞానం కలిగి ఉన్నారు. అది నానాటికీ పెరుగుతోంది కూడా. వ్యవసాయం గురించి, చేతివృత్తుల గురించి, పశు సంపద గురించి, మనుషులకూ, జంతువులకూ, మొక్కలకూ వచ్చే వ్యాధుల గురించి, వాటి చికిత్సల గురించి, రాజకీయాల గురించి, పాలన గురించి, న్యాయస్థానాల గురించి, మతం గురించి, తాత్విక దృక్పథం గురించి, నీతి గురించి వాళ్లకు ఎంత ఎక్కువ తెలుసునో నాకు ప్రతిరోజూ క్షేత్రపరిశోధనా అనుభవం తెలియజేసింది. రైతులలో అపారంగా ఉండే లోకజ్ఞానం, ధృఢత్వం, కష్టపడి పనిచేసే తత్వం నన్ను అబ్బురపర్చాయి. తమ జీవనోపాధి కొరకు వాళ్లు ఏడాది పొడుగునా అవిశ్రాంతమైన పోరాటం సాగిస్తున్నారు. అయితే ఈ జీవన్మరణ ఘర్షణ మధ్య కూడా వారి జీవితంలో హుందాతనం, విలాసం, ఆత్మగౌరవం కరువు కావడం లేదు. వాళ్లు పేదరికంలో ఉన్నారు. కాని, ఆతిథ్యంలో వెనక్కి తగ్గరు. తగాదాలలో, ఘర్షణలలో ఉన్నారు. కాని, ఇచ్చిపుచ్చుకునే వైఖరి అపారంగా ఉన్నది. దుఃఖాలు, దురదృష్టాలు ఉన్నమాట నిజమే. కాని, ఆ జీవితంలో ఆనందమూ, వినోదమూ కూడా ఉన్నాయి.

నా క్షేత్రపరిశోధనలో నాకు మార్గదర్శకుడుగా, వ్యాఖ్యాతగా పనిచేసిన వ్యక్తి ప్రీతం సింగ్ అనే జాట్ యువకుడు. ఆయనకు పుస్తక పరిజ్ఞానం ఏమీ లేదు. కాని, భారత జనజీవితం గురించి నాకన్న ఆయనకు ఎంతో ఎక్కువ తెలుసునని నాకు ప్రతిరోజూ అర్థమైంది.

సమయస్ఫూర్తి విషయంలో, ఆచరణాత్మకత విషయంలో ఆయన ప్రవర్తన నేను ఎన్నోసార్లు సిగ్గుపడేలా చేసింది. నేను ప్రతిరోజూ తినే అనేక వస్తువులు ఎలా తయారవుతాయో కూడా తెలియనంత అజ్ఞానం నాది. ఎందుకంటే అప్పటివరకు వ్యవసాయంతో నాకున్న సంబంధమంతా మా భోజనాల గదిలోని సంబంధమే. ఎంతో చదువుకుని, పట్టణంలోని నాజూకులన్నీ నేర్చుకుని ఉన్న నేను మౌలిక ఉత్పత్తి క్రమాల గురించి, వాస్తవ జీవితసమస్యల గురించి అంత అజ్ఞానంతో ఉండడం చూసి జాట్ రైతులు పరిహాసాలాడుతుండేవారు. శారీరకంగా కూడా నాకు తగిన శక్తిలేకపోవడం చూసి వాళ్లు నవ్వుతుండేవారు. ఆ శారీరక శక్తి లేకపోవడమనేది కష్టతరమైన శారీరక శ్రమకు నన్ను అసమర్థున్ని చేసేది. అలా ఒక బ్రాహ్మణ, పట్టణ, విద్యావంతుడి బలహీనతలకు ఉదాహరణ ప్రాయంగా ఉన్న నేను వాళ్ల వినోదానికి, పరిహాసానికి లక్ష్యంగా ఉంటూ ఉండేవాణ్ని.

నా పెరుగుదలలోనూ, విద్యలోనూ ఉన్న తీవ్రమైన లోపాలు బయటపడి నన్ను దాదాపు ప్రతిరోజూ ఎన్నో ఇబ్బందులకు గురిచేసినప్పటికీ ఆ గ్రామీణులతో నేను దగ్గరవుతున్న కొద్దీ వారిలో ఉన్న మౌలికలక్షణాల పట్ల నాలో గౌరవభావం పెంపొందింది. భూమితో, ప్రకృతితో వారికి ఉన్న సాన్నిహిత్యం, తరతరాలుగా సాగివస్తున్న తాత్విక చింతననూ, చుట్టూ ఉన్న పరిస్థితుల ఆచరణాత్మకతనూ వారు కలగలిపిన తీరు, ఉత్పాదక విలువల పట్ల వారికి ఉన్న నిబద్ధత, పరాన్నభుక్కుల పట్ల, విశ్రాంతి వర్గాల పట్ల వారికి ఉన్న ఆరోగ్యకరమైన ఆగ్రహం – ఈ లక్షణాలన్నీ గ్రామీణ ప్రజాజీవితానికి ఒక విలక్షణమైన సారాంశాన్ని, ప్రమాణాన్ని అందించాయని నాకు అర్థమైంది. పట్టణ జీవితంలో లోపించినవి ఈ లక్షణాలే. ఎన్ని మెరుగులు పెట్టినా, అలంకారాలు చేసుకున్నా పట్టణ జీవితం రక్తహీనంగా కనబడేది అందువల్లనే. ఆశ్చర్యంగా అనిపించవచ్చు కాని క్రమంగా నేను గ్రామాల పట్ల సగర్వంగా అనుభూతి చెందడం ప్రారంభించాను. నిజానికి నేను గ్రామీణ జీవితంలో ఎంత లోతుగా మునిగిపోయానంటే నాకు పట్టణ జీవితం గుర్తుకొచ్చేదే కాదు.

సాధారణ ప్రజానీకం మాట్లాడే భాషలో ఉండే లోతూ, సొగసూ నా మనస్సు మీద చెరపరాని ముద్రవేశాయి. వాళ్ల మాటతీరులో ఉండే తూగూ, లయా, వాళ్లు వాడే ప్రతీకలలో, పదచిత్రాలలో ఉండే గాంభీర్యం, వైవిధ్యం, వాళ్లు తమకు తెలిసిన జంతువుల పేర్లను, మొక్కల పేర్లను, సామూహిక అనుభవాన్ని వాడుకొని ఎంత సులభంగా ఒక పదబంధాన్నో, ఒక మాటనో సృష్టించగలుగుతారో చూడడం, సమయానికి సరిగ్గా సరిపోయేట్టు వాడగలిగిన అంతులేని సామెతలు, నుడికారాలు, వాటిలో వ్యక్తమయ్యే తరతరాల వివేకం, ఏ రోజుకారోజు తాజాగా కనిపించే అభిప్రాయాలు, స్పందనలు నన్ను ఎంతగానో ఆకట్టుకొన్నాయి. ఉత్తరప్రదేశ్‌లో నేను తిరిగిన అన్ని ప్రాంతాలలోను గ్రామీణ ప్రజల భాషలో కొన్ని సాధారణ లక్షణాలున్నాయి. అవి ప్రాచీన, మౌలిక భారతీయ విలువలను ప్రతిఫలించేట్టుగా ఉన్నాయి. వాళ్ల మాటలలో కర్మ, భాగ్యం, సత్యయుగం, రామరాజ్యం, భక్తి, పాపం, పుణ్యం, జ్ఞానం, అజ్ఞానం వంటి పవిత్ర గ్రంథాలలోని భావనలు ఎన్నో కనబడతాయి. కాని, అదే సమయంలో ప్రతి గ్రామీణ ప్రాంతంలోని భాషలో వస్తువులోనూ, రూపంలోనూ కొన్ని విశిష్టమైన అంశాలు ఉన్నాయి. అందువల్లనే తూర్పు జిల్లాలలో జాట్ రైతులు మాట్లాడే మొరటైన ఖడీ బోలీలోనూ, విశ్రాంతిని కోరుకునే అగ్రవర్ణాలూ, నిస్వార్థపరులైన పేదరైతులూ మాట్లాడే కోమలమైన భోజ్‌పురిలోనూ, కుమావున్ పర్వతశ్రేణి ప్రజలు మాట్లాడే పహాడీ భాషలో మనసుకు హత్తుకునే సాధారణత్వమూ, సంగీతమయమైన లయ – అన్నిటిలోనూ సకల వైవిధ్యంతోనూ ప్రకృతి ప్రభావం ప్రతిఫలిస్తూండేది.

ఉత్తరప్రదేశ్‌లో నాలుగు గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలతో నా సంబంధాల క్రమంలో నేను గుర్తించినది గ్రామీణ జీవిత సుగుణాలకు సంబంధించిన ఒక ప్రధాన వాస్తవం. అది సాంకేతిక, ఆర్థిక పరిణామపు అట్టడుగు స్థాయిలలో మనిషికీ, ప్రకృతికీ మధ్య వైరుధ్యంలోని విశిష్టమైన ఐక్యత. ఇది గుర్తించడం నా కళ్లు తెరిపించింది. తమ మనుగడ కొరకు ప్రకృతి మీదనే ఆధారపడే వ్యవసాయ సమాజాలలో వర్గ సంఘర్షణకు ఉన్న పరిమితులేమిటో నాకు అర్థమయింది. గ్రామీణ ప్రజల సమస్యల గురించి నేను ఇంకా ఇంకా ఎక్కువగా ఆలోచించిన కొద్దీ నాకు ఒక విషయం ఎక్కువగా అర్థంకావడం మొదలయింది. గ్రామీణ ప్రజానీకం ఒకవంక వర్గపునాదిపై, మరొకవంక సామూహికత్వపు పునాదిపై రెండు దిశలలో లాగుతున్న ఘర్షణకు లోనవుతున్నారు. మొదటి దిశయేమో మనిషికీ మనిషికీ మధ్య వైరుధ్యాన్ని ప్రతిఫలిస్తోంది. రెండో దిశయేమో మనిషికీ ప్రకృతికీ మధ్య వైరుధ్యాన్ని ప్రతిఫలిస్తోంది.

వ్యవసాయ సమాజాలలో మానవ సమూహాల ముందర తమ మనుగడ కోసం ప్రకృతితో చేయవలసివస్తున్న పోరాటమే అత్యంత ప్రధానమైనదిగా కనబడుతుంది. తత్ఫలితంగా సమూహాల ప్రయోజనాల మధ్య వచ్చే ఘర్షణలను ఎప్పటికప్పుడు నిజమైన లేదా ఊహాత్మకమైన ప్రయోజనాల ఐక్యతతో ఎదుర్కోవడం జరుగుతుంది. అందువల్ల ఎప్పటికప్పుడు సామూహిక ప్రాతిపదికే వర్గ ప్రాతిపదికమీద పైచేయిని సాధిస్తుంది. కరువు, వరద, వర్షాభావం, అంటువ్యాధుల వంటి సహజమైన ఉత్పాతాలు, జీవితపు ఒడిదుడుకులు, ముమ్మరపు కాలంలో వ్యవసాయ కార్యక్రమాల ఒత్తిడులు – ఇవన్నీ ఎప్పటికప్పుడు వస్తూనే ఉంటాయి. అంతమాత్రమే కాదు అవి ధనికులకూ పేదలకూ మధ్య, బలవంతులకూ బలహీనులకూ మధ్య, అగ్రవర్ణాలకూ నిమ్నవర్ణాలకూ మధ్య ఎటువంటి తేడాను చూడవు. అందువల్ల సమూహం మధ్య మనుగడ కోసం పరస్పరం ఆధారపడవలసిన, సంఘీభావం ప్రకటించవలసిన ప్రాతిపదికను బలోపేతం చేస్తాయి. ఈ కారణాలు చాలా తరచుగా వర్గప్రాతిపదికను వెనక్కు నెడతాయి. అంతేకాదు, బయటి నుంచి వెళ్లి చూసినవాళ్లకు ఆస్తిపరవర్గం ఆస్తిలేని వారిని చేసే దోపిడీగా కనిపించేది, లోపలి నుంచి చూసే వాళ్లకు ఒక నిర్దిష్ట సామాజిక చట్రం లోపల భూస్వామ్య వర్గాలు అందిస్తున్న పోషణకు భూమిలేనివారు చెల్లించే మూల్యంగా కనబడుతుంది. ఒక తిరుగుబాటుదారు వెళ్లి తన దోపిడీ సిద్ధాంత సూత్రాల మీద ఆధారపడి ఈ సాంప్రదాయిక, ప్రాపంచిక దృక్పథాన్ని సవాలు చేసినప్పుడు దోపిడీకి గురవుతున్న వర్గం ఆ మాటలు వింటుందేమో కాని, ఖాతరు చెయ్యదు. పైగా ఆ మాటలకి ఒక ప్రత్యామ్నాయ జీవనాధార పద్ధతి కానీ, మనుగడ కానీ తక్షణమే కనబడడం లేదు కూడా.

సాంకేతికంగా, ఆర్థికంగా వెనుకబాటుతనం ఉన్న పరిస్థితులలో గ్రామీణ ప్రజానీకం సగటు మానవ మనుగడ ప్రమాణాన్ని కూడా అందుకోకుండా ఉన్నప్పుడు, గ్రామానికి బయట ఉన్న ప్రపంచమంతా కూడా శత్రుపూరితమైనదని భావించేటప్పుడు ఆ గ్రామీణ ప్రజానీకం

దురదృష్టకరంగానే భౌతిక అవసరాల కోసమూ, మానసికంగా కూడా ఆధిపత్యబృందాల మీద ఆధారపడక తప్పదు. ఈ వైఖరి నుంచి గుణాత్మకమైన పరివర్తన జరగాలంటే, కొనసాగుతున్న సామాజిక ధర్మాన్ని దోపిడీవ్యవస్థగా గుర్తించి వాళ్లు నిరాకరించాలంటే ఒక పరిస్థితి ఏర్పడవలసి ఉంది. అది కేవలం వాళ్ల మానసిక ఆలోచనల్లో విప్లవం రావడం మాత్రమే కాదు. సాంప్రదాయికంగా ఆధిపత్య బృందాల మీద ఆధారపడడం నుంచి, ఏదో స్థాయిలో భౌతిక స్వాతంత్ర్యాన్ని ఇవ్వగలవిధంగా వాళ్లకు ఒక ప్రత్యామ్నాయ జీవనాధార వనరు దొరకవలసి ఉంటుంది. అందువల్లనే భూస్వామ్య వర్గాల మీద గ్రామీణ ప్రజానీకం ఆర్థికపరంగా సంపూర్ణంగా ఆధారపడిన, సాపేక్షికంగా మూసుకుపోయిన వ్యవసాయ వ్యవస్థలలో వర్గదోపిడీ అనే వాస్తవం ఎల్లప్పుడూ పోషక భావజాలం అనే ముసుగు కింద కనబడకుండా ఉంటుంది. అందుకే ఆర్థిక అవకాశాలు ఏమాత్రం లేని ఒక కుమావున్ గ్రామంలో, ఆ గ్రామంలో ఉండని అనుపస్థిత బ్రాహ్మణ భూస్వామికి అక్కడి వృద్ధ రైతు క్రమం తప్పకుండా అర్ధభాగమో, మూడోభాగమో చెల్లిస్తూనే ఉన్నాడు. అంతేకాదు, అలా చెల్లించడాన్ని తన ఇష్టపూర్వకంగా చెల్లిస్తున్నట్టుగా సమర్థించాడు. పండిన పంటలో అర్ధభాగాన్నో, మూడోభాగాన్నో అలా చెల్లించడం భూస్వాములకూ, కౌలుదారులకూ మధ్య తరతరాలుగా సాగివస్తున్న హక్కుల, బాధ్యతల సంప్రదాయంలో భాగంగా గుర్తించాడు. బ్రాహ్మణ భూస్వామి తన కౌలుదారు నుంచి కప్పం సంపాదిస్తుండగా, కౌలుదారు ఆ భూస్వామి నుంచి తనకు రక్షణనూ, బతుకుతెరువునూ సంపాదిస్తున్నానని అనుకుంటున్నాడు. మరొక గ్రామం సంగతి చూద్దాం. అదే జిల్లాలో కొంత పట్టణ ప్రభావాలుండి, ప్రత్యామ్నాయ ఆర్థిక అవకాశాలు ఉన్న గ్రామంలో కొత్త జీవన దృక్పథం వికసిస్తున్నది. భూస్వాములకూ, కౌలుదారులకూ మధ్య ఉండిన సాంప్రదాయిక సంబంధాలను పునర్వ్యాఖ్యానించే ధోరణి తలెత్తుతోంది. అక్కడ దోపిడీ సిద్ధాంత ప్రాతిపదిక మీద ఆ సంబంధాలను చూడడం పెరుగుతోంది. అలాగే గోరఖ్‌పూర్ జిల్లాలోని మహరాజ్‌గంజ్ తహసిల్‌లో ఒక మారుమూల గ్రామంలో భూస్వామికీ రైతుకూ మధ్య ఉండిన సంబంధాలను సాంప్రదాయిక భావజాల ప్రమాణాలలో చూడడం గుర్తించాను. కాని, వ్యాపారీకరణ, పట్టణీకరణ శక్తులు ఎంతో కొంత ఎక్కువగా ప్రవేశించిన మరొక గ్రామంలో దోపిడీ, వర్గసంఘర్షణ అనే భావజాలానికి కౌలుదారులు సానుకూలంగా స్పందించారు.

ఎప్పటికప్పుడు కరువులూ, కొరతలూ నిండిన వ్యవసాయ సమాజంలో అనిశ్చితతలూ, ఇబ్బందులూ నిరంతరం సాగుతూ మనుగడ కోసం తపనే అనంతంగా సాగుతూంటుంది. ఆ తపన ఆ ప్రజల మీద అనివార్యంగా ఒక సామూహిక భావనను రుద్దుతుంది. దాని నుంచి వారు బయటపడలేరు. అందుకే గ్రామీణ సమాజం ఎప్పుడూ వర్గ ప్రాతిపదికకూ, సమూహపు ప్రాతిపదికకూ మధ్య ఊగిసలాడుతూ ఉంటుంది. వర్గం గురించి సాపేక్షికంగా ఎక్కువ స్పృహ ఉన్న గ్రామీణ ప్రాంతాలలో కూడా ఉమ్మడి కుటుంబం, కులకట్టు, గ్రామకట్టు వంటి సంస్థలు తమ పట్టును చూపుతూనే ఉంటాయి. వాటిని కేవలం పాత సమాజపు అవశేషాలుగా కొట్టిపడేయడానికి వీలులేదు. పుట్టుక నుంచి చావుదాకా మనుషుల జీవితంలో ఉండే లెక్కలేనన్ని ఆచారాలూ, పండుగలూ, పబ్బాలూ, ఆనందానికీ విషాదానికీ సంబంధించిన అనేక ఘటనలూ, జీవిత సంక్షోభాలూ, ఆర్థిక మారకానికి, ఇచ్చిపుచ్చుకోవడానికి సంబంధించిన బలవంతపు అవసరాలూ ఈ సంస్థలకు మరింత కొత్త బలాన్ని అందజేశాయి. ధనికులయినా, పేదలయినా జీవితంలో ఎదుర్కొనే సమస్యల సందర్భంలో ఈ సంస్థలు ఉపయోగకరంగా ఉంటాయని చూపాయి. ఈలోగా రాజకీయ పార్టీ, కిసాన్ సభ (రైతు సంఘం), ఖేత్ మజ్దూర్ సభ (వ్యవసాయ కార్మికసంఘం), గ్రామ పాఠశాల, సహకార సంఘం, పంచాయత్ లాంటి కొత్త సంస్థలు రూపొందుతున్నాయి గాని అవి గ్రామంలో ఇంకా బలంగా వేళ్లూను కోలేదు. సంప్రదాయేతర లౌకిక జీవితంలో కూడా ఈ కొత్త సంస్థలు సంప్రదాయ సంస్థలను తోసిరాజనలేదు.

గ్రామీణ సమాజాలలో మనుగడ కోసం మనిషి ఇంకా బలమైన ప్రకృతి శక్తులను ఎదిరిస్తూ పోరాడవలసిన అవసరం ఎల్లప్పుడూ ఉందని క్షేత్రపరిశోధన నాకు నాటకీయంగా తెలియజేసింది. ఈ లక్షణం వల్ల గ్రామీణ సమాజంలోకి ఏవైనా సామాజిక మార్పులు ప్రవేశిస్తే అవి సామూహిక సంఘీభావాన్ని, భద్రతను బలపరిచేవయితే ఆమోదించడం, అవి ఆ సంఘీభావాన్ని, భద్రతను బలహీనపరిచేవయితే నిరాకరించడం అనే ధోరణి ఉంది. అందువల్ల వివాహ పద్ధతిలో, కుల వ్యవస్థలో, భూమికి సంబంధించిన సంప్రదాయాలలో, చట్టాలలో, యువకులకూ, స్త్రీలకూ స్వేచ్ఛను, అవకాశాలను ప్రోత్సహించే ఆధునిక విద్యలో వచ్చే సంస్కరణలేవయినా గ్రామీణ ప్రజానీకం తమ వెనుకబాటు ధోరణిలో, స్థిరమైన సూత్రాల ప్రాతిపదికన అంచనా వేయలేదు. తమ మానసిక, భౌతిక భద్రతను ఈ మార్పులు పెంచుతున్నాయా, తగ్గిస్తున్నాయా అనే ప్రాతిపదికమీదనే వాటిని ఆహ్వానించడం గానీ, వ్యతిరేకించడం గానీ చేశారు. గ్రామీణ ప్రాంతాలలో మనుగడ కోసం సాగే పోరాటంలో వ్యక్తికి ఒంటరిగా మనుగడ అవకాశాలు లేవు. అందువల్ల పెళ్లిలో సొంత నిర్ణయం గానీ, ఆస్తి చట్టాల మార్పు గానీ ఎందుకు వ్యతిరేకించ బడ్డాయంటే ఒక కుటుంబంలోని సభ్యుల మధ్య ఈ మార్పులు అభద్రతను ప్రవేశపెట్టాయి గనుక. ఆధునిక విద్య కనుక విద్యావంతులలో ఒక అధికార మనస్తత్వాన్ని ప్రవేశపెట్టినా, వ్యవసాయానికి అవసరమైన మానవశక్తిని కొల్లగొట్టినా, కుటుంబ పెద్దలకు అందించవలసిన సహాయాన్ని యువకులు అందించలేకపోయినా ఆ ఆధునిక విద్యను తిరస్కరించడం జరిగింది. కొత్త ఉత్పత్తి పద్ధతులనూ, కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్నీ ఎందుకు వ్యతిరేకించడం జరిగిందంటే వాటివల్ల నికర ఫలితంగా శ్రామికులను పని నుంచి తొలగించి వారికి జీవనోపాధి లేకుండా చేసినప్పుడు. అలాగే కౌలుదారులకు తమ కౌలు భూమిపట్ల రక్షణ కల్పించినప్పుడు గానీ, ధనికుల నుంచి పేదలకు భూమిని బదలాయించినప్పుడు గానీ భూసంస్కరణలను ఆహ్వానించడం జరిగింది. కాని, భూసంస్కరణల గురించి ఉట్టి వాగ్దానాలు కేవలం భూస్వాములకూ, భూమి లేని నిరుపేదలకూ మధ్య ఘర్షణ పెంపొందించడానికి మాత్రమే ఉపయోగపడ్డాయి. అందువల్ల విప్లవాత్మకమైన వాగాడంబరాన్ని గ్రామీణ ప్రజానీకం నమ్మలేదు.

*(ఇంకావుంది)*

*(ప్రొఫెసర్ పి.సి. జోషి, ఢిల్లీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనమిక్ గ్రోత్ పూర్వ సంచాలకులు. 1979 లో అచ్చయిన 'ది ఫీల్డ్ వర్కర్ అండ్ ది ఫీల్డ్ : ప్రాబ్లమ్స్ అండ్ చాలెంజెస్ ఇన్ సోషియోలాజికల్ ఇన్వెస్టిగేషన్' పుస్తకం నుంచి)* వీ

*రెండు దశాబ్దాలుగా గృహనిర్బంధం నుంచే నియంతృత్వ రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడుతున్న అంగ్‌సాన్ సూకీ జీవితాన్ని పరిచయం చేస్తున్నారు* **చిర్ర కుమారస్వామి, ఎన్. వెంకన్న**

# నిర్బంధంలోనే నిర్భయ పోరాటం

**మా**తృదేశంలో ఆవరించిన నియంతృత్వ చీకట్లను తరిమికొట్టి, ప్రజాస్వామ్య వెలుగులను ప్రసాదించాలని భర్తకు, పిల్లలకు కూడా దూరమై, ఇరవై ఏళ్లుగా గృహనిర్బంధంలో ఉంటూ గొప్ప నిబద్ధతతో శాంతి పోరాటం చేస్తున్న మయన్మార్ మణిదీపం అంగ్‌సాన్ సూకీ. మయన్మార్ గాంధీగా త్యాగాలకు మారుపేరు. నిర్బంధంలో మగ్గతూ మౌనమూ యుద్ధ భాషేనని చాటిన సమరశీలి. సైనిక పాలకులపై అహింసనే ఆయుధాన్ని సంధిస్తున్న అంగ్‌సాన్ సూకికి సౌత్ ఆఫ్రికాలోని గాంధీ ఫౌండేషన్ నుంచి ప్రతిష్ఠాత్మక గాంధీ అంతర్జాతీయ శాంతి బహుమతి లభించింది.

అంగ్‌సాన్ సూకీ 1945 జూన్ 19న రంగూన్‌లో జన్మించారు. తండ్రి అంగ్‌సాన్ మోడర్న్ బర్మీస్ ఆర్మీని స్థాపించి, యు.కె. నుంచి స్వాతంత్ర్యాన్ని కోరుతూ 1947లో సంప్రదింపులు జరిపారు. అదే సంవత్సరం ఆయన శత్రువుల చేతుల్లో హతమయ్యారు. తల్లి దౌత్యవేత్త. ఆమె, ఇద్దరు సోదరులతో పాటు భారతదేశానికి వచ్చి సూకీ హైస్కూల్, ఉన్నత విద్యను పూర్తి చేసింది. ఢిల్లీలోని లేడి శ్రీరామ్ కాలేజీలో డిగ్రీ, ఆక్స్‌ఫర్డ్‌లో పి.జి. పూర్తిచేసింది. రాజనీతి, తత్వ, ఆర్థిక శాస్త్రాల్లో పట్టు సాధించింది. ఆ సమయంలోనే మైకెల్ ఏరిస్‌తో వివాహమైంది. ఆమెకు ఇద్దరు కుమారులు. మరోవైపు తన విద్యను కొనసాగించింది. 1985లో యూనివర్సిటీ ఆఫ్ లండన్ నుంచి పిఎచ్.డి. పొందింది. 1990లో ఆనరరీ ఫెలోగా ఎంపికైంది. ఆ తరువాత యూనియన్ ఆఫ్ బర్మా ప్రభుత్వంలో కూడా పనిచేసింది.

1988లో సూకీ అనారోగ్యంతో బాధపడుతున్న తల్లిని చూడడానికి బర్మా వచ్చింది. అదే సమయంలో దీర్ఘకాలంగా అధికారంలో ఉన్న సోషలిస్ట్ పార్టీ నాయకుడు జనరల్ నెవిన్ పదవి నుంచి దిగిపోయి, ప్రజాస్వామ్యం కోసం ప్రజా ప్రదర్శనలు నిర్వహించారు. దాన్ని ప్రభుత్వం అణచివేసింది. 1988 ఆగస్ట్ 26న అంగ్‌సాన్ సూకీ దాదాపు ఐదు లక్షల ప్రజలున్న ర్యాలీని ఉద్దేశించి ష్వెడగాన్ పగోడా వద్ద ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ప్రసంగించింది. సెప్టెంబర్‌లో కొత్త మిలిటరీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అదే నెలలో నేషనల్ లీగ్ ఫర్ డెమొక్రసి (ఎన్‌ఎల్‌డి) ఏర్పాటయింది. దానికి సూకీ జనరల్ సెక్రటరీ. మహాత్మా గాంధీ బోధించిన అహింసా పద్ధతి, బుద్ధుడి ప్రవచనాలతో ఎంతగానో ప్రభావితమయిన ఆమె ప్రజాస్వామ్యం కోరుతూ పోరాటం మొదలుపెట్టి 1989 జూలై 20న గృహనిర్బంధానికి గురయ్యింది. దేశాన్ని విడిచివెళ్లే పక్షంలో ఆమెకు స్వేచ్ఛనిస్తామంది ప్రభుత్వం. కాని అంగ్‌సాన్ సూకీ అందుకు అంగీకరించలేదు. మైకెల్, మయన్మార్ ఒకసారి వచ్చినా ఆపైన అతనికి ఎంట్రీ వీసాను అక్కడి నియంత ప్రభుత్వం తిరస్కరించింది. అతనికి క్యాన్సర్ వచ్చినా, ఎందరో ప్రముఖ వ్యక్తులు, సంస్థలు అభ్యర్థించినా బర్మా ప్రభుత్వం మాత్రం అతనికి వీసా ఇవ్వడానికి అంగీకరించలేదు. కావాలంటే అతని కోసం అంగ్‌సాన్ సూకీ దేశం విడిచిపెట్టి వెళ్లవచ్చని తేల్చి చెప్పింది. ఆ సమయంలో ఆమెకు తాత్కాలికంగా గృహనిర్బంధాన్ని తొలగించారు. మైకెల్ 1999లో మరణించాడు. పిల్లలు యు.కె.లో ఉండడంతో సూకీ వారికి కూడా దూరమయింది. 'భయమే తొలి శత్రువు' అని ఆమె నమ్మకం. ఆ భావన తోనే 1995లో 'ఫ్రీడం ఫ్రమ్ ఫియర్' అనే పుస్తకం వెలువరించింది.

1990లో మిలిటరీ ప్రభుత్వం సాధారణ ఎన్నికలకు పిలుపు నిచ్చింది. ఆ ఎన్నికల్లో ఎన్‌ఎల్‌డి విజయం సాధించింది. సాధారణంగా అయితే ఎన్‌ఎల్‌డి అభ్యర్థిగా అంగ్‌సాన్ సూకీ ప్రధాని పదవి చేపట్టాలి. కాని ఎన్నికల ఫలితాలను రద్దుచేసి, అధికారాన్ని అప్పగించడానికి వ్యతిరేకించింది మిలిటరీ. రంగూన్‌లోని ఆమె నివాసంలో అదే సమయంలో ఆమె స్వాతంత్ర్య ఆకాంక్షకు గుర్తింపుగా సఖరోవ్ ప్రైజ్, ఆ మరుసటి సంవత్సరం నోబెల్ పీస్ ప్రైజ్ లభించాయి. ఆమె తరఫున ఆమె కుమారులు నోబెల్ పీస్ ప్రైజ్‌ను ఆమోదించారు. ఆ ధనంతో ఆమె మయన్మార్ ప్రజల విద్య, వైద్య సదుపాయాల కోసం ఓ ట్రస్ట్‌ని ఏర్పరిచింది. అప్పటి నుంచి 19 సంవత్సాల కాలంలో మొత్తం 13 ఏళ్లు ఆమెను మిలిటరీ ప్రభుత్వం గృహనిర్బంధంలో ఉంచింది. ఆ సమయాల్లో ఆమె ఎవరినీ కలిసేందుకు కూడా అనుమతించలేదు.

ఇద్దరు సేవకులు, డాక్టరు మాత్రమే ఆమెకు కనిపించే వ్యక్తులు. ఆమె ఫిలాసఫీ, పాలిటిక్స్, మహనీయుల జీవిత చరిత్రలు చదువుతూ కాలం గడుపుతోంది. ఆమెను కలవడానికి మీడియాకు కూడా అనుమతి లేదు. ఆ దేశంలో 1975 స్టేట్ ప్రొటెక్షన్ ఆక్ట్ ప్రకారం విచారణ లేకుండా ఐదేళ్లపాటు నిర్బంధంలో ఉంచవచ్చు. ఆ చట్టం కింద ఆమె గృహనిర్బంధానికి మళ్లీ మళ్లీ గురవుతూనే ఉంది.

ఐక్యరాజ్య సమితి జోక్యంతో 2002లో జుంతా, సూకీల మధ్య సంప్రదింపులు జరిగాయి. అంగ్‌సాన్ సూకీ తమ దేశానికి నవోదయం వచ్చిందని ఆనందంతో వెల్లడించింది. కాని 2003లో మిలిటరీ ప్రభుత్వం ఆమెపై దాడి చేయించింది. ఆమె మద్దతుదారులు అనేకులు చనిపోయారు. మరెందరో గాయపడ్డారు. ఆమెను మళ్లీ గృహనిర్బంధంలో ఉంచారు. అలా ఆమె నిర్బంధపర్వం సాగుతూనే ఉంది. అయితే మయన్మార్ లో మిలిటరీ నియంతృత్వం నశించి, ప్రజాస్వామ్యం నెలకొన్నప్పుడే అంగ్‌సాన్ సూకీ సుదీర్ఘ పోరాటానికి ఓ సార్థకత లభించేది. వీ


*జన్యుపరంగా మనుషులంతా ఒకటే జాతి అని శాస్త్రీయంగా నిరూపితమయ్యాక కూడా కేవలం స్వార్థ రాజకీయార్థిక ప్రయోజనాలే అంతరాలకూ, విద్వేషాలకూ కారణమవుతున్నాయని అంటున్నారు* **డా. కొడవటిగంటి రోహిణీప్రసాద్**

# మనుషుల్లో జాతులు

ప్రపంచంలో మనుషులందరరూ ఒకే మానవజాతికి చెందినప్పటికీ రకరకాల ముఖాలతో, శరీరాకృతులతో కనిపిస్తూ ఉంటారు. ఈ తేడాలన్నీ బాహ్యరూపానికి పరిమితమైనవేననీ, జన్యుపరంగా మనుషులంతా ఒకటేననీ విజ్ఞానం మనకు తెలియ జేస్తుంది. ఈ తేడాల్లో కొన్ని వ్యక్తుల స్థాయిలోనూ, మరికొన్ని జనసముదాయాల, జాతుల స్థాయిలోనూ కనిపిస్తాయి. మొదటివి మనుషులను గుర్తించటానికి పనికొస్తే, రెండో రకమైనవి వివిధ జాతులను గుర్తించటానికి పనికొస్తాయి. ప్రాణులను రకరకాల శాఖలూ, ఉపశాఖలూ, జాతులూ వగైరాలుగా శాస్త్రీయంగా విభజిస్తారు. అన్నీ క్షీరదాలు అయినప్పటికీ కుక్కలూ, పిల్లులూ మొదలైన విభిన్న జాతులు ఒకదానితో ఒకటి జత కట్టవు, కట్టలేవు అనేది తెలిసినదే. శారీరకంగా ఇటువంటిది జరిగే అవకాశం ఉన్నప్పటికీ ఇది అసహజమైనదిగానే భావించ బడుతుంది. ఈ విషయంలో విజ్ఞాన శాస్త్రపరంగా ఖచ్చితమైన అవగాహన ఉంటుంది. చూడటానికి ఎంత తేడాగా ఉన్నప్పటికీ సంతానోత్పత్తి సామర్థ్యం కలిగిన పిల్లలకు జన్మనివ్వగలిగిన ఆడ, మగ ప్రాణులను మాత్రమే ఒకే జాతికి చెందినవిగా పరిగణిస్తారు. ఈ విషయంలో మనుషులందరిదీ ఒకే జాతి.

పిల్లులూ, కుక్కలూ ఒక జాతికి చెందవుగాని పిల్లుల్లోనూ, కుక్కల్లోనూ రకరకాల తేడాలు కనబడతాయి. ఈ తేడాలు వివిధ స్థాయిల్లో ఉంటాయి. ఒక తల్లికి పుట్టిన పిల్లల్లోనే కొద్దిపాటి వ్యత్యాసం ఉంటుంది. ఒకే జాతిలోని వ్యక్తిపరమైన తేడాలేకాక, జాతుల మధ్య దూరం పెరుగుతున్న కొద్దీ వ్యత్యాసాలు కూడా పెరుగుతూ పోతాయి. ప్రాచీనయుగంలో ఏదో ఒకటే క్షీరదం ఉండేది. ఈనాటి వేలాది క్షీరద ప్రాణులన్నీ దాని వారసత్వంతో ఆవిర్భవించినవే. పంతొమ్మిదో శతాబ్దంలో డార్విన్ తాను జరిపిన పరిశీలనల ద్వారా ఒకో సముద్ర ప్రాంతంలో ఇరుగు పొరుగు ద్వీపాల మీద ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా పెరిగిన కొన్ని ప్రాణుల శరీరలక్షణాల్లో స్వల్పమైన వ్యత్యాసాలు ఏర్పడినట్టుగా గుర్తించాడు. మొదట్లో అన్నీ ఒకేలాగే ఉండేవనీ, స్థానిక పరిస్థితుల వల్ల వాటిలో కాస్తకాస్తగా తేడాలు కలిగాయనీ, అవన్నీ వాటి సంతతికి కూడా సంక్రమించడంతో పోలికలున్న వివిధ జాతులుగా రూపొందాయనీ అర్థమయింది. సముద్ర జలాల కారణంగా వాటి మధ్య సంపర్కం లేకుండా పోయింది. జీవ పరిణామవాదానికి దారితీసిన ఈ పరిశోధన మానవుల్లోని వైవిధ్యాన్ని కూడా వివరించగలదు. దీన్ని నిరూపించేందుకు జన్యుపరంగా కూడా పటిష్టమైన ఆధారాలున్నాయి.



కాంగాయిడ్ జాతి మహిళ


కేపాయిడ్ బుష్మన్ జాతి వ్యక్తి


ఆధునికమానవులు ఆఫ్రికాలో ఆవిర్భవించాక వారిలో కొందరు సహారాకు దక్షిణ ప్రాంతంలోనే కాంగాయిడ్ జాతులుగా ఉండిపోగా మరికొందరు ఉత్తరంగా ప్రయాణించి కేపాయిడ్ జాతిగా రూపొందారు (పటం).

తక్కినవారు కాలక్రమాన యూరప్, పశ్చిమాసియా, ఉత్తర ఆఫ్రికా తదితర ప్రాంతాల్లో కాకసాయిడ్ జాతులు గానూ, హిమాలయాలకు తూర్పున మంగోలాయిడ్ జాతులు గానూ, ఆస్ట్రేలియా తదితర ప్రాంతాల్లో ఆస్ట్రలాయిడ్ జాతులు గానూ రూపాంతరం చెందారు (పటం).

వీటిలో జాతులేవో, ఉపజాతులేవో కచ్చితంగా చెప్పటం కష్టం. ఎందుకంటే స్వీడన్, ఇటలీ, ఆర్మీనియా, ఈజిప్ట్, ఇరాన్ మొదలైన దేశాల ప్రజలందరినీ కాకసాయిడ్ జాతులుగా పరిగణించవచ్చు. అలాగే కొరియా, మలేసియా తదితర దేశాలవారూ, పెరూలోని స్థానిక తెగలూ అందరూ కూడా మంగోలాయిడ్ జాతులే. ఒక్కొక్క ప్రాంతం నుంచీ పొరుగు ప్రాంతాలకు తరలి వెళ్ళిన కొందరు కొద్దిపాటి వ్యత్యాసాలకు కారణమయారు.


మంగోలాయిడ్ జాతి వ్యక్తి

జరిగినదేమిటంటే అనాదిగా మనుషులు వివిధ సముదాయాలుగా ఏర్పడి, వేరువేరు ప్రాంతాల్లో నివసిస్తూ వచ్చారు. సమాచార, సంచార, రవాణా వ్యవస్థలేవీ లేని యుగాల్లో ఒక ప్రదేశానికి పరిమితమై జీవించిన సమాజాల్లోని స్త్రీ పురుషుల మధ్య మాత్రమే లైంగిక సంబంధాలు ఏర్పడేందుకు అవకాశాలు కలుగుతూ ఉండేవి. ఆ కారణంగా ఒకే కుదుటి నుంచి రూపొందిన జన్యు లక్షణాలే సంతానానికి అందుతూ


ఆస్ట్రలాయిడ్ జాతి వ్యక్తి

ఉండేవి. పెద్దలూ, పిల్లలూ అందరూ దాదాపుగా ఒకే రకమైన శరీర లక్షణాలు కలిగి ఉండేవారు. స్థానిక వాతావరణం, శీతోష్ణస్థితీ, నైసర్గిక పరిస్థితులూ వగైరాల కారణంగా శరీరపు ఆకృతిలోనూ, కనుముక్కు తీరులోనూ మార్పులు కలిగేవి కనక ఒక ప్రాంతానికి పరిమితమై, పిల్లల్ని కంటూ వస్తున్న జనసముదాయంలో కొన్ని ప్రత్యేక లక్షణాలు రూపుదిద్దుకుంటాయి. చైనాలో నీగ్రోలూ, ఆఫ్రికాలో ఆస్ట్రేలియా ఆదిమజాతులూ నివసించే అవకాశం తక్కువ కనుక ఒక్కొక్క దేశానికీ, ప్రాంతానికీ ఒక్కొక్క శరీరాకృతి సహజంగా ఏర్పడుతుంది. ఈ పద్ధతిలో వివిధ జాతుల మధ్య భౌగోళిక అవరోధాల కారణంగా సంబంధాలు తెగిపోయి, వేటికవి తక్కినవాటితో లైంగిక, సామాజిక సంపర్కం లేకుండా ఉండడంతో తేడాలు పెరుగుతూ పోయాయి.

ఇది కేవలం పైపైన కనిపించే వ్యత్యాసమనీ, నిజానికి చర్మపు రంగూ, ముఖకవళికలూ ఎటువంటివైనా మనుషులందరూ ఒక కుదుటి నుంచి పుట్టినవారేననీ ఎన్నో యుగాలుగా ఎవరికీ తెలియదు. తొలి మతాలు కూడా జాతి వైషమ్యాలను కొంతవరకూ ప్రోత్సహించి మనుషులను పెడదారి పట్టిస్తూ ఉండేవి. ప్రాచీన సుమేరియన్ నాగరికత కాలంలో సృష్టిని గురించి ఏర్పడిన తప్పుడు భావనలన్నీ కాలక్రమేణా యూదు మతంలోనూ, క్రైస్తవ, ఇస్లాం మతాలలోనూ కూడా ప్రవేశించాయి. ఇందులో వివిధ జాతుల ప్రజలను గురించి కూడా ఎన్నో అపోహాలుండేవి. ఇవన్నీ కాలం గడుస్తున్న కొద్దీ మరింతగా బలపడుతూ జాతి వైరాలకూ, యుద్ధాలకూ, రక్తపాతానికీ దారితీశాయి. అంతులేని విద్వేషాలు రగిలించే బాహ్య రూపురేఖలన్నీ మనుషులందరి లోనూ ఉండే సామాన్య లక్షణాలను కప్పి పెడుతున్నాయనీ, వీటికి నిజంగా అర్థమేమీ లేదనీ వివరించగలిగిన వైజ్ఞానిక దృక్పథం లోపించింది.


పాకిస్తాన్ ఆఫ్ఘనిస్తాన్ సరిహద్దు ప్రాంతపు పఠాన్ కాకసాయిడ్ జాతి వ్యక్తి

ఇన్ని రుజువులున్నప్పటికీ మనుషుల మధ్య దేశాలూ, ప్రాంతాలూ, జాతులవారీగా ఎన్నెన్నో విభేదాలూ, విద్వేషాలూ రగులుతూనే ఉన్నాయి. శరీరపు ఛాయను బట్టీ, ముఖ కవళికలను బట్టీ ఒకరినొకరు ద్వేషించడం, కసిని పెంచుకోవడం మామూలైపోయింది. ఇందులో భాగంగానే శ్వేతజాతులు అశ్వేతులను అసహ్యించుకోవటమూ, ఒకే దేశంలోని విభిన్న జాతుల, కులాల మధ్య తలెత్తే పొరపొచ్చాలూ, కొట్లాటలూ అన్నీ నానాటికీ విపరీతంగా పెరిగిపోతున్నాయి. వర్గ విభేదాలను పెంచేందుకూ, రాజకీయంగా, ఆర్థికంగా దేశాలనూ, జనసముదాయాలనూ దెబ్బ తీసేందుకూ విచ్ఛిన్నకర శక్తులన్నీ ఈ ద్వేషాలను రగిలిస్తూ, పెంపొందిస్తూ ఉంటాయి. వీటి డొల్లతనాన్ని సరైన దృష్టితో, సంయమనంతో అర్థం చేసుకోగలిగిననాడు అకారణంగా తలెత్తుతున్న ఆ హింస తగ్గుతుందనడం లో సందేహం లేదు. వీ

---

*(...18వ పేజీ తరువాయి)*

కూడా కరువుంది. 2) అడవులు, భూమి, నీరు జాతి సంపద; ప్రకృతి ప్రసాదించిన వరాలు. ఈ వనరులను క్రమక్రమంగా విధ్వంసం చేస్తున్నాం. వీటిని కాపాడు కొంటే కరువులు దూరమవుతాయి. 3) అడవులు మేఘాన్ని ఆకర్షించి వర్షాన్ని కురిపిస్తాయి. వర్షపు నీటి ప్రవాహాన్ని (రన్–ఆఫ్) అరికట్టి నీటిని భూమిలోకి ఇంకేటట్లు చేసి భూగర్భ జలాల అభివృద్ధికి తోడ్పడ్డాయి. అలాంటి అడవులు క్షీణిస్తున్నాయి. ఒకపక్క పరిశ్రమలు, రెండో పక్క స్మగ్లర్లు చెట్లను కొట్టివేస్తున్నారు. అడవుల క్షీణత వల్ల వ్యవసాయం దెబ్బతింటుంది, దిగుబడులు తగ్గి కరువుకు కారణమవుతాయి. 4) చెరువుల వినాశనం కరువుకు తోడ్పడుతుంది. 5) భూగర్భ జలాలను విచక్షణ రహితంగా తోడేస్తున్నారు. చెరువులు, బావులు ఎండిపోతున్నాయి. కరువుకు కారణం లోపభూయిష్టమైన నీటి యాజమాన్యమే. 6) దేశంలో అయిదేళ్ల క్రితం గణాంకాల ప్రకారం నేల కోతకు గురైన భూమి – 197 లక్షల హెక్టార్లు; చవుడు తేలిపోయిన భూమి – 47 లక్షల హెక్టార్లు నీటి ద్వారా కోతకు గురైన భూమి. 696 లక్షల హెక్టార్లు భూసారం పూర్తిగా కోల్పోయిన భూమి – 137 లక్షల హెక్టార్లు క్షీణించిన భూమి కరువుకు కారణం. 7) దేశీయ, విదేశీ మార్కెట్ శక్తులు వ్యవసాయరంగాన్ని శాసిస్తూ కరువుకు కారణమవుతున్నాయి. 8) నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణం నత్త నడకగానే నడుస్తున్నాయంటే ప్రత్యక్షంగా ప్రభుత్వం, పరోక్షంగా ప్రపంచబ్యాంక్ కారణం. వ్యవసాయరంగంలో పెట్టుబడులు 15 సంవత్సరాలుగా క్షీణిస్తున్నాయి. మన వ్యవసాయాన్ని ధ్వంసం చేసి, తిండి గింజలకు విదేశాలపైన ఆధారపడేలా చేయడం ప్రపంచబ్యాంకు లక్ష్యం. వ్యవసాయం బలహీనమైపోయి కరువుకు దారితీస్తోంది. తిండి గింజల కోసం అమెరికా తదితర అభివృద్ధి చెందిన దేశాల నుంచి దిగుమతి చేసుకోవాలి. ఇందుకు అనుగుణంగానే అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో రైతుల సంఖ్య 30 శాతానికి తగ్గాలని పిలుపునిచ్చారు. రైతుల సంఖ్య తగ్గిపోతే, కరువు సమస్య పరిష్కారమైపోతుందా?

ఎప్పటికప్పుడు పిట్టను కొట్ట, పొయ్యిలో పెట్టా అన్నట్లు, కరువు పరిస్థితి ఏర్పడినప్పుడల్లా తాత్కాలిక ఉపశమన చర్యలు తీసుకోవడం, మళ్లీ కరువు ఏర్పడే వరకు ఆ విషయాన్ని మరచిపోవడం జరుగుతోంది. ఇలా కాకుండా శాశ్వత కరువు నివారణ ప్రణాళిక తయారు చేసి నిర్దిష్ట కాలపరిమితిలో అమలు చేయాలి. గతంలో కేంద్రం క్షామపీడిత ప్రాంతాల అభివృద్ధి పథకాన్ని తయారు చేసి 1972లో దేశంలో 74 జిల్లాలో అమలు ప్రారంభించారు. సాగునీటి అభివృద్ధి, భూసంరక్షణ, తేమను నిలుపుకోవడం, అడవుల నరికివేతను అరికట్టడం, పశుగ్రాసం, వ్యవసాయ పద్ధతుల్లో పంటల విధానంలో మార్పులు చేయడం; పశుపోషణ మొదలైన అంశాలు ఈ పథకంలో ముఖ్యమైనవి. మూడు దశాబ్దాల అనంతరం కూడా పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుంది. కరువులు వస్తూనే ఉన్నాయి. 60 శాతంగా ఉన్న మెట్ట ప్రాంతాల అభివృద్ధి మీద దృష్టి సారించాలి. బ్యాంకులు విరివిగా రుణాలివ్వాలి. చిన్న నీటిపారుదల పథకాల మీద కేంద్రీకరించాలి. గిట్టుబాటు ధర ప్రకటించాలి. ప్రకృతి వనరులను అభివృద్ధి చేయాలి. ఉన్న తిండి గింజల నిల్వలను గ్రామాలకు చేరేలా చూడాలి. ఫామిన్ కోడ్‌ను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సవరించి అమలు పరచాలి. 1995 నాటి కరువు మాన్యువల్ సిఫార్సులను తక్షణం అమలు పరచాలి. వ్యవసాయాన్ని, వ్యవసాయదారులను ఉద్ధరించగలిగితే, కరువు సమస్య పరిష్కారమైపోతుంది. వీ

*సమాజానికీ, సినిమాకూ ఉండే సంబంధాన్ని సజీవంగా ఎత్తిపట్టి, సమాజంలో ఉన్నతమైన విలువల కోసం, మార్పుకోసం తన వంతుగా పరితపించిన బిమల్ రాయ్ సినిమాలను పరిచయం చేస్తున్నారు* **పి.వి. రమణ**

# వాస్తవిక సినిమాకు పునాదులేసిన బిమల్‌రాయ్

**భా**రతీయ సినిమాలకు జాతీయంగా అంతర్జాతీయంగా పేరు తెచ్చిన ఘనత బిమల్‌రాయ్‌ది. ఆయన చిత్రాలన్నీ మానవత్వంతో తొణికిసలాడుతుంటాయి. మధ్యతరగతి జీవితాలలో ఎదురయ్యే అనేక సమస్యలకు ఆయన సినిమాలు దర్పణం పడతాయి.

బిమల్‌రాయ్ తూర్పు బెంగాల్ (నేటి బంగ్లాదేశ్) లో 1909 జూలై 12న భూస్వామ్య కుటుంబంలో జన్మించారు. తండ్రి చనిపోయిన తర్వాత ఆ ప్రాంత జమీందార్ వారి కుటుంబాన్ని బయటకు తరిమేయడంతో తల్లి, చిన్న తమ్ముళ్లను తీసుకొని, చేతిలో దమ్మిడీ లేకుండా కలకత్తాకు వచ్చేశారు. అనేక చిన్న చిన్న పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. తర్వాత దేశంలోనే ప్రఖ్యాతి గాంచిన 'న్యూ థియేటర్ స్టూడియో'లో ప్రమితోష్ బారువా ఆయనకు స్టిల్ ఫొటోగ్రాఫర్‌గా అవకాశం ఇచ్చారు. ఆ రోజుల్లో 'న్యూ థియేటర్'లో దేవకీబోస్, నితిన్ బోస్, ధీరేన్ గంగూలీ లాంటి ప్రముఖ దర్శకులతో నిండి ఉండేది. 1935లో బారువా తీసిన దేవదాస్‌కు బిమల్‌రాయ్ కెమెరామెన్‌గా పనిచేశారు. ఆయన బ్రిటిష్ ప్రభుత్వానికి రెండు డాక్యుమెంటరీలు తీసినట్లుగా తెలుస్తుంది. కాని వాటి ఆచూకీ ఎక్కడా దొరకలేదు.

1943లో ఐదు లక్షల మంది చావుకు కారణమైన బెంగాల్ కరువుపై గొప్ప డాక్యుమెంటరీ తీసారు. ఆనాటి సామాజిక స్థితిలో బ్లాక్ మార్కెట్, దొంగ ధాన్యాల నిలవలు, దోపిడీలు, ఆకలి, ఆక్రందనలు, ఇవన్నీ అందులో చిత్రించబడ్డాయి. 1944లో 'ఉదయేర్ ఫతే' అనే బెంగాలీ చిత్రంతో తన యాత్ర ప్రారంభించారు. 1940-50ల్లో అంత వరకూ చలామణీ అవుతున్న సాంప్రదాయ ధోరణుల్ని బద్దలుగొట్టి, పురాణగాథలు, జానపదాలు స్థానంలో భారతీయ సినిమాను వాస్తవికతా పట్టాలెక్కించిన ఘనత బిమల్‌రాయ్‌దే. (అప్పటికే మన తెలుగు సినిమాలో చరిత్ర సృష్టించిన గుండవల్లి రామబ్రహ్మం నిర్మించిన మాలపిల్ల (1938), రైతుబిడ్డ (1939) బి.ఎన్. రెడ్డి నిర్మించిన వందేమాతరం (1939)లతో పాటు హిందీలో శాంతారాం దూనియా న మానె (1937) నితిన్ బోస్ - ధర్తీ మా లాంటి సామాజిక కోణంలో తియ్యబడ్డ చిత్రాలున్నాయి.)

రెండవ ప్రపంచయుద్ధం, దేశ విభజనలాంటి సామాజిక సంక్షోభాలు బెంగాల్ సినిమారంగంపై తీవ్రమైన ఒత్తిడిని కలిగించాయి. దాన్ని తట్టుకోలేక అనేకమంది బెంగాలీ కళాకారులు బొంబాయికి వలస వచ్చేసారు. వారితోపాటే వచ్చేసిన ఆయన 'బిమల్ రాయ్ ప్రొడక్షన్స్' అనే సంస్థను స్థాపించి, 'దో బీఘా జమీన్' ప్రారంభించారు. ఆ క్రమంలో ఆయన దాదాపు మూడు బెంగాలీ, పదహారు హిందీ సినిమాలు, ఐదు డాక్యుమెంటరీలు నిర్మించారు.

ఆయన సినిమాలన్నింటిలోనూ 'దో బీఘా జమీన్'కు ప్రత్యేకమైన చరిత్ర ఉంది. బెంగాల్‌లోనే ఓ పల్లెటూరి పేద రైతు 'శంభు మహతు' కథ ఇది. భూస్వామి చేతుల్లో ఇరుక్కొన్న భూమిని తిరిగి ఇప్పించమని ప్రాధేయపడితే అతను మిల్లు నిర్మించటానికి ఆ భూమిని అమ్మేయమంటాడు. 'భూమంటే తల్లిలాంటిది. తల్లినే ఎలా అమ్మగలను' అని శంభు అమాయకంగా ప్రశ్నిస్తారు. చివరకు భూమిని విడిపించుకోవడానికి అవసరమైన డబ్బు సంపాదించడానికి కలకత్తా నగరానికి ప్రయాణిస్తాడు. మానవతా విలువలు మృగ్యమయిన ఆ నగరంలో ఎన్నో కష్టాలు అనుభవించి, రిక్షా కార్మికుడిగా మారుతాడు. తర్వాత ప్రమాదానికి గురవుతాడు. భార్యను కోల్పోయే స్థితి వస్తుంది. అన్ని కష్టాలు భరించి, పల్లెకు తిరిగి వస్తే అతని స్థలంలో ఓ ఫ్యాక్టరీ నిర్మాణం సాగుతుంటుంది.

1952లో ముంబయిలో జరిగిన అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో 'విట్టోరి యాడెసిన్' నిర్మించిన ఇటలీ చిత్రం 'బై సైకిల్ థీఫ్' ను చూసి ప్రభావితుడైన బిమల్‌రాయ్ అటువంటి వాస్తవికతా దృక్పథంతో ఒక సినిమా తియ్యాలని దృఢ నిశ్చయం చేసుకున్నాడు. వామపక్ష భావాలుగల సలీల్ చౌదరి కథ 'రిక్షావాలా' ఆయనను ఆకట్టుకొంది. గ్రామాలలోని పేదరికం, అమాయకత్వం, నగరాలలో విశృంఖలత, అమానుషత్వం, రైతుకి, భూమికి గల పేగు సంబంధాన్ని ఈ కథలో చిత్రించడం జరిగింది.

ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఐపిటిఎ)లో సుశిక్షితుడైన బలరాజ్ సాహ్ని శంభు మహతో పాత్రకు ఎన్నికయ్యారు. ఈ సినిమా కోసం ఆయన రిక్షా లాగడం నేర్చుకొన్నారు. రాత్రిళ్లు రిక్షా కార్మికుల మధ్యే, వాళ్ల గుడిసెల్లోనే గడిపారు. వారి హావభావాలు భాష, అన్ని వారి దగ్గరే నేర్చుకొన్నారు.

ఈ సినిమా నిర్మాత రామనిక్ లాల్ సేథీ 'శంభూకి చివరకు భూమి దక్కేటట్టు చూపిస్తే బాగుంటుంది' అని వాదించినా బిమల్‌రాయ్ అటువంటి అవాస్తవికతను చిత్రించలేనని నిర్మొహమాటంగా చెప్పేశారు.

నగరాల్లోని అమానుషత్వాన్ని అద్భుతంగా ప్రతిబింబించడం వలన తర్వాత కాలంలో కొంతమంది ప్రొడ్యూసర్లు ఈ సినిమా 'కలకత్తా - క్రూయల్ సిటీ' అనే పేరుతో కూడా రిలీజ్ చేసారు.

భారతీయ రైతులకు భూమి అంటే ఎంత ప్రాణమో, రైతులు అప్పుల పాలు ఎందుకు అవుతున్నారో కళ్లకు కట్టినట్టు తీయటమే కాకుండా, వ్యవసాయానికి, పారిశ్రామికీకరణకు మధ్య భవిష్యత్‌లో ఏర్పడబోతున్న సంఘర్షణను బీజ రూపంలో అద్భుతంగా ఆవిష్కరించిన సినిమా ఇది. నేడు దేశవ్యాప్తంగా 'సెజ్'ల పేరుతో పచ్చని పంటలు పండే వ్యవసాయభూముల్ని బలవంతంగా లాక్కోవటం, దానికి పరాకాష్టగా జరిగిన నందిగ్రాం, సింగూరు రైతుల పోరాటాలకు భూమిక 56 సంవత్సరాల క్రితమే 'దో బీఘా జమీన్'లో సూచనప్రాయంగా కనబడుతుంది. అది దర్శకుని చారిత్రక దృష్టికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

ఎలక్షన్ రాజకీయాలు ప్రజల్ని ఎలా విభజిస్తాయో, హింసను ఎలా ప్రయోగిస్తారో, డబ్బు మనుషుల్ని ఎలా దిగజారుస్తుందో, అలాగే దాని ప్రభావానికి లొంగని సామాన్యుల్లో అసామాన్యుల గురించి తీసిన గొప్ప వ్యంగ్య చిత్రం 'పరఖ్'.

అంటరానివారనే పేరుతో సాగుతున్న సామాజిక హింసను నిరసిస్తూ తీసిన గొప్ప సినిమా 'సుదాత్'. కథానాయకులు వివిధ సందర్భాలలో పడిన మానసిక క్షోభను చెట్లతోనూ, ఆకులతోనూ, గంగా నది నీటి అలలతోనూ, చిరుగాలులూ, పెనుగాలుల్నీ సంయమనం చేసి మొత్తం ప్రకృతిలోని ప్రతి అంశాన్ని అద్భుతంగా వినియోగించడం వలన ప్రేక్షకులు పూర్తిగా లీనమయిపోయారు. మంత్రించినట్లుగా అనుభవం పొందారు. ఈ సినిమా ప్రభావంతోనే కె. విశ్వనాథ్ 'కాలం మారింది' సినిమా తీశారు.

బిమల్ రాయ్ సినిమాల్లో ఇంకా హమ్‌రాహీ, పరిణీత, నౌఖరి, బిరాజ్‌బహు, దేవదాస్, మధుమతి, బందిని లాంటి అనేక ఆణిముత్యాలున్నాయి. ఆయన గొప్ప మానవతావాది. ఆయన సినిమాల్లో ఆశావాదం కొట్టొచ్చేటట్లుగా కనబడుతుంది. సామాజిక, రాజకీయ, ఆర్థిక, మతపరమైన ఆధిపత్యాన్ని తీవ్రంగా వ్యతిరేకించడం, మనుష్యుల జీవితాల్లో స్నేహం, ప్రేమ, నమ్మకం లాంటి గుణాలు పెంపొందాలనే తపన ఆయన సినిమాలన్నింటిలోనూ మనకు కనపడుతుంది.

ఆయన 1959లో మాస్కోలో జరిగిన అంతర్జాతీయ చలన చిత్రోత్సవ జ్యూరిలో చేసిన ప్రసంగం వింటే ఆయన జీవితాదర్శం మనకు అర్థమౌతుంది.

'ఎక్కడ మానవ హక్కుల కోసం పోరాటాలు జరిగినా మనం విస్మరించకూడదు. మనిషిపై జరిగే దోపిడీ అంతం కావాలనీ, ఏ రకమైన యుద్ధాన్నైనా రూపుమాపాలనీ, మనుష్యుల దుస్థితిని మార్చేందుకు ప్రతి మనిషి కృషి చేయాలని ప్రజలు ఇప్పుడు గ్రహిస్తున్నారు. నిజమైన అభివృద్ధి మానవుడి కనీస హక్కులను సాధించడం మీదే ఆధారపడి ఉంటుందనేది మనం గ్రహించాలి. ఈ భావాలు అన్నిచోట్లా వ్యాపించేందుకు సినిమా ఎంతో కృషి చేసిందని నిస్సందేహంగా చెప్పవచ్చు. అయినా మహోన్నతాదర్శాల్ని ప్రజలకందించే సినిమాల సంఖ్య పరిమితమే. ఈ చిత్రాల సంఖ్య అత్యల్పమైనా అవి ప్రేక్షకుల మీద వేసే ప్రభావం అపూర్వం.'

2007లో బిమల్‌రాయ్ కుమారుడు జొయ్ బిమల్ రాయ్ 'రిమంబరింగ్ బిమల్ రాయ్' అనే డాక్యుమెంటరీ తీశారు. 'మా నాన్నకు నదులన్నా, నీళ్లన్నా చాలా ఇష్టం. ఆయన ఢాకాలో ఉన్న పద్మా నది పక్కనే పెరిగారు. అందుకే నేను ఈ డాక్యుమెంటరీని సహజంగా నీటి ప్రవాహంలా ఉండేటట్లు తీశాను. ఇందులో నేనేమీ చెప్పలేదు. ఆయన సహచరులే అన్నీ విషయాలూ చెప్పారు' అని ఈ డాక్యుమెంటరీలో తపన్ సిన్హా, నాబేందుఘోష్, షమిన్ బంధోపాధ్యాయ్, అరబిందో ముఖర్జీ, దిలీప్ సర్కార్ (న్యూ థియేటర్స్ డైరెక్టర్) మనోబ్జి రాయ్ (భార్య), అపరాజితా సిన్హా (కూతురు), భారతీ దేవి (నటి), జావేద్ అఖ్తర్, గుల్జార్, అషుతోష్ గోల్వాల్కర్, మైథిలిరావు, దిలీప్ కుమార్, వైజయంతీమాల, కామినీ కౌశల్, ధర్మేంద్ర, సులోచన, జగదీప్ లాంటి ప్రముఖులందరూ బిమల్ రాయ్ వ్యక్తిత్వంలోని అనేక కోణాలు వివరించారు. నివాసం కొరకు ఒక ఇంటిని కొనాలని కుటుంబ సభ్యులు ఆలోచించినపుడు ఆ విషయాన్ని బిమల్ రాయ్‌కు చెపితే 'నేను సినిమా తీసేది ఆస్తులు కొనటానికి కాదు' అన్న విషయాన్ని సినిమా వ్యాపార సలహాదారు అమృత్ షా గుర్తు చేయటం ద్వారా బిమల్ రాయ్ మహోన్నత వ్యక్తిత్వం మనకు అర్థమౌతుంది.

'నాకు బిమల్ రాయ్ అంటే గొప్ప ఆరాధ్య భావం ఉంది. ఆయన సినిమాలు గొప్పవి. కాని అంతకంటే మనిషిగా ఆయన చాలా గొప్ప వ్యక్తి' అంటారు రిత్విక్ ఘటక్.

'బొంబాయి నగరానికి బెంగాల్ ఇచ్చిన కానుక బిమల్ రాయ్. 'ఉదయేరీ ఫతే'తో ఆయన ప్రతిభ అందరికీ అర్థమయింది. ఇక 'దో బీఘా జమీన్'తో కేవలం భారతీయ సినిమాల్లోనే కాకుండా ప్రపంచ సినిమాల్లో కూడా స్థానం సంపాదించుకున్నారు' అంటారు ఖ్వాజా అహ్మద్ అబ్బాస్.


'మొదటి సినిమా 'ఉదయేరీ ఫతే'తోనే ఆయన సంప్రదాయ ధోరణుల్ని బద్దలుకొట్టి సినిమాకు అవసరమయ్యే అతి సహజమైన వాస్తవికతను ప్రవేశపెట్టారు. ఆయన నిజంగా గొప్ప దార్శనికుడు. 'దో బీఘా జమీన్'తో ఆయన కీర్తి అత్యున్నత శిఖరాలందుకొంది. భారతీయ సినిమా మైలురాళ్లలో అది ఒకటి అని నిస్సందేహంగా చెప్పవచ్చు' అంటారు సత్యజిత్ రే. వీ

### బిమల్ రాయ్ తీసిన సినిమాలు

| | | |
|---|---|---|
| **బెంగాలీ** | : | ఉదయేరీ ఫతే (1944); అంజన్ ఘర్ (1948); మంత్రముగ్ధ (1949) |
| **హిందీ** | : | హమ్‌రాహి (1945); అంజన్ ఘర్ (1948); పహేలా ఆద్మీ (1950); మా (1952); పరిణీత (1953); దో బీఘా జమీన్ (1953); నౌఖరి (1954); బిరాజ్ బహు (1954); బాప్‌బేటి (1954); దేవదాస్ (1955); మధుమతి (1958); యాహుది (1958); సుజాత (1959); పరఖ్ (1960); ప్రేమపత్ర (1962); బందినీ (1963) |
| **డాక్యుమెంటరీలు** | : | రౌడి యొగర్లీ (1929); బెంగాల్ ఫామిన్ (1943); స్వామి వివేకానంద (1964); బేనజీర్ (1964); గౌతమ్ ది బుద్ధ (1967) |

*గతంలో ఆంధ్రప్రదేశ్‌లో నేరస్త జాతులుగా పరిగణింప బడ్డ జాతుల గురించి వకుళాభరణం లలిత పరిశోధనాత్మక పుస్తకాన్ని పరిచయం చేస్తున్నారు* **విద్యాభూషణ్**

# సంస్కరణకు ఆచరణాత్మక ప్రతీక




**వ**ర్గసమాజంలో ఒక జాతిని మరో జాతి దోచుకోవడానికి, ఆధిపత్యాన్ని చెలాయించడానికి సవాలక్ష మార్గాలుండొచ్చు. కానీ అత్యంత దారుణమైన మరోకోణం ఒక జాతి యావత్తునీ (మహిళలు – పిల్లలతో సహా) నేరస్తులుగా, దొంగలుగా ముద్రవేసి తరతరాలుగా అణచిపెట్టిన వైనం మన దేశంలో అదీ మనరాష్ట్రంలోనే జరిగింది. ఈ చారిత్రక వాస్తవాన్ని సాధికారిక గణాంకాలతో పాఠకులకు అందించే ప్రయత్నం చేశారు వకుళాభరణం లలిత తన 'ఆంధ్రప్రదేశ్‌లో విముక్త జాతులు' అన్న పుస్తకంలో.

ఒక మనిషి నేరస్తునిగా మారడానికి దోహదపడే కారణాలను అధ్యయనం చేస్తే, కారణాలతో పాటు పరిష్కారాలు లభ్యమౌతాయి. అమాయక వెనుకబడ్డజాతుల వారిని కొన్నివర్గాలు తమ స్వప్రయోజనాల కోసం నేరస్తులుగా తయారు చేసి, వారి జాతుల్నే నేరస్తమయ జాతులుగా ముద్రవేసి వెలివేసిన వైనం – దానికి వంతపాడిన నాటి పాలకవర్గాల కుట్రలను విశదీకరిస్తూనే, సంస్కరణావాదంతో ఆ జాతులను విముక్తి చేసిన వైనాన్ని అక్షరీకరించారు వకుళాభరణం లలిత.

నేరస్త జాతులుగా వెలివేయబడిన వారిలో సుమారుగా అందరూ సంచార జాతుల వారే. నాటి బ్రిటిష్ వారి పాలనలో అడవినే నమ్ముకున్న ఆదివాసులు బ్రిటిష్‌వారి అటవీ చట్టాల ధాటికి భయపడి, మైదానాలకు తరలివచ్చి బతుకుతెరువు కోసం నేరస్తులుగా మారిన వైనం కనిపిస్తుంది. ఆకలి వీరిచే ఆ పనిని చేయిస్తే, ఆధిపత్యం (భూస్వామ్య పోలీసు వర్గాలు) నేరాన్నే వారి వృత్తిగా మార్చిన దుర్మార్గం కళ్లకు కట్టినట్టు కనిపిస్తుంది. ఆ తరువాతి పాలకులే షెడ్యూల్డ్ కులాలు – తెగల వారిని నేరస్త జాతులుగా ముద్రవేసి సమాజం నుంచి వెలివేసిన ధోరణి వ్యక్తమవుతూ వచ్చింది.

ఇలా దుర్మార్గానికి బలైన వాళ్లలో కొరచవాళ్లు, దండాగీలు, కొండదొరలు, దొమ్మెరవాళ్లు, లంబాడీలు, గూడుదాసర్లు, వంగనూరు మాలవాళ్లు, బోయలు, చెంచులు, యానాదులు మొదలైన జాతుల వారున్నారు. సుమారుగా వీరందరి జీవనశైలి సంచార జీవనమే అయినందున స్థిరమైన వృత్తి వ్యాపకాలు అలవడలేదు. నాటి రోజుల్లోనే దొమ్మరి తెగకు చెందిన కొంతమందిని, సంఘసంస్కర్త వెన్నెలకంటి రాఘవయ్య 'రాంపు' అనే గ్రామంలో పునరావాసం కల్పించారు.

నేరస్తులు – నేరస్తజాతిగా లంబాడీలను నాటి బ్రిటిష్‌వారే ముద్రవేసినా, అధికశాతం మైదానాల్లోనే నివసిస్తుంటారు. లంబాడీ స్త్రీలు ఎంబ్రాయిడరీ, అద్దాల పనుల్లో నిపుణులు. వీరి పనితనానికి కుటీర పరిశ్రమ హోదాను కల్పిస్తే వీరి మనుగడకు ఢోకాయే ఉండదు. వీరి సంస్కృతి – కళ తరతరాలకు నిలిచే వీలూ ఉంటుంది. ఈ తరహా ప్రజల ఆచార సంప్రదాయాలకనుగుణంగా ప్రభుత్వం పనిచేయాల్సి ఉంటుందన్న సూచన నేటికీ ఆమోదయోగ్యం.

ఒరిస్సా రాష్ట్రం నుంచి తూర్పు తీరానికి వలసవచ్చిన 'డోంబులు' జాతి వారిని పి.బి. థామస్ అనే పోలీస్ ఇనస్పెక్టర్ జనరల్ నేరస్తజాతి చట్ట పరిధిలోకి తీసుకొచ్చారు. మొదటి ప్రపంచయుద్ధ ప్రభావంతో వీరి నేరమయ జీవితం వ్యవస్థీకృతమయింది. జీవించేందుకనువైన మార్గంలేకనే నేరమయ ప్రవృత్తికి అలవాటు పడ్డట్టుగా ఈ పుస్తకం ద్వారా అవగతమౌతుంది.

'చెంచులు' కొండల్లో ఉంటూ సేద్యం చేస్తూ, అడవితేనె, జిగురును సేకరించి అమ్ముకుంటూ స్థిరనివాసానికి అలవాటు పడ్డారు. నాటి మద్రాసు ప్రభుత్వం శ్రద్ధ కనపరిచినా, బ్రిటిష్ పాలకులు విధించిన పరిమితులతో వీరి స్వేచ్ఛ సన్నగిల్లింది. 1919 నాటికే బతుకు తెరువుకు ప్రత్యామ్నాయంగా దొంగతనాలకు అలవాటు పడ్డారనీ వివరిస్తారు రచయిత.

ఇక యానాదుల విషయానికొస్తే మోసం, కపటం, నమ్మకద్రోహం వీరికి తెలియవు. అమాయకులు. సరళస్వభావం కల యానాదుల్లో నేరస్త జాతుల చట్టం శాంతిని పోగొట్టి – వీరి జీవితాలను నేరస్తమయం చేసేసింది అంటారు. ఇందుకు సహేతుకంగా నాటి సంయుక్త రాష్ట్రాల విద్యామంత్రి వ్యాఖ్యానాన్ని పేర్కొన్నారు. అదేంటంటే 'సంచార జాతుల దీనస్థితికి రెండు కారణాలు. ఒకటి హిందూ సమాజం. ఈ జాతులను అస్పృశ్యులనక పోయినా గ్రామాలకు దూరంగా ఉంచింది. నిందితులుగా అవమానించి అనేక బాధలకు గురిచేసింది. తక్కువ వారమనే భావనకు బీజం వేసింది. ఆ భావం, బతుకుతెరువు లేకపోవడం జతగలిసి అవినీతి పనులకు దారి తీయించాయి.'

సాటి మనుషులుగా గుర్తించినపుడు వీరిలో మార్పు అత్యంత చేరువలో ఉంటుంది. ఇదే విషయాన్ని పలు సెటిల్మెంట్లను ఏర్పర్చి, అక్కడి నేరస్తుల్లో ఆచరణాత్మకంగా, పెనుమార్పులను తీసుకొచ్చి రుజువుచేసిన స్వచ్ఛంద సేవా సంస్థల కృషిని ప్రతీ ఒక్కరూ చదివి తెలుసుకోవస్సిందే.

సంస్కరణకు ఆచరణాత్మక నిబద్ధతనిచ్చి 'నేరాన్ని ద్వేషించు – నేరస్తుడ్ని కాదు' అన్న గాంధీ సూక్తిని రుజువు చేసిన వైనాన్ని ఈ పుస్తకం వ్యక్తం చేస్తుంది.

**ఆంధ్రప్రదేశ్‌లో విముక్త జాతులు** – వకుళాభరణం లలిత – నేషనల్ బుక్ ట్రస్ట్ ప్రచురణ – 190 పేజీలు, 1/8 డెమీ, రు. 65, ప్రతులకు : సంచాలకులు, నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా, నెహ్రూ భవన్, 5 ఇన్‌స్టిట్యూషనల్ ఏరియా, ఫేజ్ – 2, వసంతకుంజ్, కొత్త ఢిల్లీ – 110 070

## మణిపూర్‌లో బూటకపు ఎన్‌కౌంటర్

జూలై 23న మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లో నిరాయుధుడైన ఇరవై ఏడేళ్ల మాజీ మిలిటెంట్ చౌంగ్‌ఖాం సంజీత్‌ని ఉదయం పదిన్నర ప్రాంతంలో జనసమ్మర్దంగా ఉన్న మార్కెట్‌లో పట్టుకుని ఒక మందుల షాపులోకి నెట్టివేసి మణిపూర్ పోలీస్ కమాండోలు కాల్చి చంపారు. వాస్తవాలకు భిన్నంగా ముఖ్యమంత్రి ఈ ఘటనపై స్పందిస్తూ సాయుధ మిలిటెంట్ సైన్యం చేతిలో చనిపోయినట్లు ప్రకటించారు. అయితే ఈ సంఘటనను గమనిస్తున్న ఒక వ్యక్తి తన సెల్‌ఫోన్‌లో ఈ ఉదంతాన్ని చిత్రీకరించి 'తెహల్కా' పత్రికకు రహస్యంగా అందజేసాడు. వాస్తవాలు గ్రహించిన ప్రజలు ఆగ్రహంతో పెద్ద ఎత్తున వీథుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనలు చేపట్టారు. స్త్రీలు, పురుషులు, యువతీ యువకులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## విద్యా హక్కు బిల్లు

పిల్లల ఉచిత, నిర్బంధ విద్యా హక్కు బిల్లు – 2008కు జూలై 20న ఆమోద ముద్ర లభించింది. ఆరు నుండి పధ్నాలుగేళ్ల వయసు గల పిల్లలకు ఉచిత, నిర్బంధ విద్యను ప్రాథమిక హక్కుగా సంక్రమింప జేయడానికి ఉద్దేశించిన ఈ బిల్లుకు అన్ని వర్గాల నుంచి విస్తృతమైన మద్దతు లభించింది. అయితే విద్యావేత్తలు, ప్రజాస్వామిక వాదుల నుంచి నిరసనలు వ్యక్తమయ్యాయి. ఈ బిల్లును సమూలంగా మార్చి, కామన్ స్కూల్ విధానానికి అనుకూలంగా బిల్లు పెట్టాలని వారు డిమాండ్ చేశారు.

## ఎస్‌సి, ఎస్‌టి రిజర్వేషన్‌ల పొడిగింపు

లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో ఎస్‌సి, ఎస్‌టిలకు రిజర్వేషన్‌లను మరో పది ఏళ్లు పొడిగించే రాజ్యాంగ సవరణ బిల్లును ఆగస్టు 4న పార్లమెంట్ ఆమోదించింది. ఈ బిల్లుకు 375 మంది సభ్యులు మద్దతు పలికారు. ఈ మేరకు 109వ రాజ్యాంగ సవరణను ఉద్దేశించిన బిల్లును న్యాయశాఖ మంత్రి వీరప్ప మొయిలీ రాజ్యసభలో ఆగస్టు 3న ప్రవేశపెట్టారు. చట్టసభల్లో రిజర్వేషన్ల కాలపరిమితి 2010 జనవరి 25తో ముగిసిపోతున్నందున తిరిగి మరో పది ఏళ్లపాటు రిజర్వేషన్ పొడిగించేందుకు సంబంధించిన బిల్లును ఆమోదించాలని మొయిలీ కోరారు.

## ప్రభుత్వాన్ని వివరణ కోరిన కమిషన్

ఆర్మ్‌డ్ రిజర్వు కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పి. మురళీనాథ్‌ను పోలీసు ఉన్నతాధికారి వివేక్ దూబె ఇంటిలో ఆర్డర్లీకి జూలై 20న హైదరాబాద్ నుంచి ఢిల్లీకి పంపారు. అనుమానాస్పద స్థితిలో మరణించిన కానిస్టేబుల్ సంఘటనపై ప్రభుత్వం సమర్పించిన నివేదికపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ తీవ్ర అభ్యంతరాన్ని వెలిబుచ్చింది. కానిస్టేబుల్ మురళీనాథ్ భార్య కాళేశ్వరి దాఖలు చేసిన ఫిర్యాదుపై మానవ హక్కుల కమిషన్ విచారణ జరిపింది. దీనిపై ఏర్పడిన కమిటీ నివేదిక సమర్పించడానికి గడువు కోరడంతో కమిషన్ విచారణను సెప్టెంబర్ 7కు వాయిదా వేసింది.

## మళ్లీ మొదలైన గుజ్జర్ల ఆందోళన

గుజ్జర్లను ఎస్టీలుగా గుర్తించాలని గత మూడేళ్లుగా పోరాడుతున్నారు. కరౌలీ జిల్లా హిందోన్ నగర సమీపంలోని పెంచ్లా మోడ్ మైదానంలో జూలై 26న దాదాపు నాలుగువేల మంది గుజ్జర్లతో మహాపంచాయతీ ప్రారంభమైంది. 24 గంటల దాకా అక్కడే కూర్చొని బిల్లు ఆమోదం కోసం రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని గుజ్జర్ల నేత కిరోరి సింగ్ భైంస్లా పిలుపునిచ్చారు. గత బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లు ప్రకారం ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ తమకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని భైంస్లా డిమాండ్ చేశారు.

## భోపాల్ దుర్ఘటనకు 25 ఏళ్లు

భోపాల్‌లో 1984 డిసెంబర్ 2న అర్ధరాత్రి యూనియన్ కార్బైడ్ ఎరువుల కంపెనీ నుంచి మిక్ (ఎం.ఐ.సి.) విషవాయువు వెలువడి అధికారిక లెక్కల ప్రకారమే 15 వేల మంది మరణించారు. లక్షలాది మంది క్యాన్సర్, ఊపిరితిత్తులు, కిడ్నీలు, కాలేయానికి సంబంధించిన వ్యాధులబారిన పడ్డారు. గత 25 ఏళ్ల కాలంలో ఎంతో మంది వ్యాధుల మూలంగా మరణించగా, అనేక మంది వ్యాధులతో బాధపడుతున్నారు. భోపాల్ గ్యాస్ బాధితుల పక్షాన రెండు స్వచ్ఛంద సంస్థలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. చీఫ్ జుడీషియల్ మెజిస్ట్రేట్ తాజాగా జూలై 22న యూనియన్ కార్బైడ్ ఎరువుల కంపెనీ అధికారి వారెన్ అండర్సన్‌కు నాన్ బెయిలెబుల్ వారంట్ జారీ చేశారు.

## ప్రైవేట్ స్కూళ్లకు ఫీజులు పెంచే హక్కులేదు

ప్రైవేట్ పాఠశాలలు ఎక్కువ మొత్తంలో పెంచుతున్న ఫీజులను నియంత్రిస్తూ సుప్రీంకోర్టు ఆగస్టు 7న తీర్పునిచ్చింది. ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలలకు ఫీజులు పెంచుకునే హక్కులేదని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ప్రైవేట్ స్కూళ్లు వసూలుచేసే ఫీజులను ప్రభుత్వం మాత్రమే క్రమబద్ధీకరించాలని పేర్కొంది. ఫీజులు పెంచే ముందు విద్యాశాఖ డైరెక్టర్ అనుమతి పొందాలని తేల్చిచెప్పింది. ఫీజుల విధానాన్ని పరిశీలించే అధికారం ప్రభుత్వానికి ఉందంటూ ఐదేళ్లకిందట సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. జస్టిస్ ఎస్.బి. సిన్హా, ఎస్.హెచ్. కపాడియా, సిరియాక్ జోసెఫ్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం దాఖలైన రివ్యూ పిటిషన్లపై స్పందిస్తూ పాత తీర్పునే పునరుద్ఘాటించింది.

## గంగూబాయ్ కన్నుమూత

మధురమైన గాత్రంతో ఆరు దశాబ్దాల పాటు లక్షలాదిమంది ప్రేక్షకులను ఓలలాడించిన హిందుస్థానీ గానకోకిల గంగూబాయ్ హంగల్ (97) జూలై 21 ఉదయం మరణించారు. ఆమె సంగీత ప్రపంచానికి భాయిజీగా సుపరిచితురాలు. 1913 మార్చ్ 5న ఆమె ఒక మత్స్యకారుల కుటుంబంలో జన్మించారు. భీమ్‌సేన్ జోషితో కలిసి ఆమె సంగీతం నేర్చుకున్నారు. పద్మవిభూషణ్, పద్మశ్రీ, తాన్‌సేన్ పురస్కారాలతో పాటు పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు ఆమె అందుకున్నారు.

## చైనాలో కార్మికుల తిరుగుబాటు

ప్రపంచంలో అతి పెద్ద ఉక్కు పరిశ్రమగా పేరుగాంచిన చైనా, ప్రపంచవ్యాప్తంగా ఎదురవుతున్న పోటీని తట్టుకునేలా ఉక్కు పరిశ్రమను తీర్చిదిద్దడం కోసం ప్రభుత్వం పలు కంపెనీలను విలీనం చేసే ప్రక్రియ చేపట్టింది. ఇందులో భాగంగా చైనాలోని ఈశాన్య నగరం టొంగువాలోని టొంగువా ఐరన్ అండ్ స్టీల్ గ్రూప్ అనే ఉక్కు కంపెనీని జియాన్‌లాంగ్ స్టీల్ కంపెనీతో విలీనం చేయాలన్న ప్రభుత్వ ప్రతిపాదన పట్ల కార్మికులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. దాదాపు ముప్పై వేల మంది కార్మికులు జూలై 24న జియాన్‌లాంగ్ జనరల్ మేనేజర్‌ను తీవ్రంగా గాయపరచడంతో అతను చనిపోయాడు. ఈ సందర్భంగా పోలీసులకు కార్మికులకు మధ్య జరిగిన ఘర్షణలో వందలాది మంది కార్మికులు గాయపడ్డారు.

## నైజీరియాలో నరమేధం

నైజీరియాలో ఇస్లామిక్ తీవ్రవాదులకు, భద్రతా దళాలకు మధ్య ఘర్షణలో 250 మందికి పైగా మరణించారు. దేశమంతటా షరియా పాలనను అమలు చేసే లక్ష్యంతో 2004లో బోకో హరామ్ అనే పేరుతో ఇస్లామిక్ తీవ్రవాద సంస్థ ఏర్పడింది. తీవ్రవాదులు ఉత్తర నైజీరియాలోని వివిధ నగరాల్లోని పోలీస్ స్టేషన్లు, జైళ్లు, చర్చిలు, ప్రభుత్వ కార్యాలయాలపై దాడులు చేసారు. ఈ సందర్భంగా భద్రతా దళాలకూ తీవ్రవాదులకూ మధ్య జరిగిన సాయుధ ఘర్షణలో 250 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. బోకో హరామ్ అంటే 'పాశ్చాత్య విద్య నిషిద్ధం'.

## జపాన్‌లో ఎన్నికలు

ఆగస్ట్ 30న జపాన్ పార్లమెంటుకు ఎన్నికలు జరుగుతాయి. అధికార లిబరల్ డెమోక్రటిక్ పార్టీ (ఎల్‌డిపి) అధ్యక్షుడు జపాన్ ప్రధాని తారో అసో పార్లమెంట్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. 1955 నుంచి అర్ధశతాబ్దం పాటు అధికారంలో ఉన్న ఎల్‌డిపి రెండవ ప్రపంచయుద్ధ విధ్వంసం నుంచి జపాన్‌ను అద్భుతమైన రీతిలో తీర్చిదిద్ది, అభివృద్ధి పథంలో నిలిపింది. ప్రధాన ప్రతిపక్షమైన డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ జపాన్ (డిపిజె) నేత యుకియో హటయోమో పార్లమెంట్ రద్దును స్వాగతించారు. జపాన్ పార్లమెంట్‌లో 480 సీట్లకు గాను పోటీ జరగనుంది.

## గుట్టు విప్పనున్న స్విస్

అమెరికా ప్రభుత్వానికీ, అతిపెద్ద స్విస్ బ్యాంక్ యుబిఎస్ మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం అమెరికా ప్రభుత్వానికి పన్నులు ఎగ్గొట్టి, స్విస్ బ్యాంక్ రహస్య ఖాతాల్లో భారీగా నిధులు దాచిపెట్టిన 52 వేల మంది అమెరికా పౌరుల గుట్టు స్విస్ బ్యాంక్ బయటపెట్టనుంది. రహస్య ఖాతాల్లో మొత్తం 1500 కోట్ల డాలర్ల వరకు దాచారని భావిస్తున్నారు. అమెరికా ప్రభుత్వపు ఇంటర్నల్ రెవెన్యూ సర్వీస్ ఈ వివరాలు కోరుతూ కేసు వేసింది. స్విట్జర్లాండ్ ప్రభుత్వం, బ్యాంకులు ఇలా తమ ఖాతాదారుల వివరాలు వెల్లడించడం తమ దేశం బ్యాంకింగ్ నిబంధనలకు విరుద్ధమని వాదించాయి. చివరకు అవి వివరాలు తెలపడానికి అనుమతించాయి.

## పద్మనాథన్ అరెస్ట్

ఎల్.టి.టి.ఇ. నూతన అధినేత సెల్వరాస పద్మనాథన్ కౌలాలంపూర్‌లో అరెస్ట్ అయ్యారు. ఎల్.టి.టి.ఇ. సంస్థకు విదేశీ వ్యవహారాల విభాగం అధినేతగా, వివిధ దేశాల నుంచి ఆయుధాలను సేకరించి పంపడంలో కీలకపాత్ర పోషించారు. ఎల్.టి.టి.ఇ. నూతన అధినేత అయ్యాక పద్మనాథన్ వ్యూహాన్ని మార్చుకుని కొత్త పద్ధతుల్లో స్వతంత్ర తమిళఈలం ఏర్పాటుకు కృషిచేస్తామని ప్రకటించారు. రక్షణ వర్గాలు అతడిని ఇంటరాగేట్ చేస్తున్నాయనీ, విచారణ పూర్తి అయిన తరువాత తదుపరి కార్యాచరణను అటార్నీ జనరల్ నిర్ణయిస్తారని శ్రీలంక ప్రభుత్వం తెలిపింది.

## విలేకరుల విడుదల

ఉత్తర కొరియాలో గత ఐదు నెలలుగా నిర్బంధంలో ఉన్న ఇద్దరు అమెరికా మహిళా విలేకరులు యూనా లీ, లారా లింగ్‌లు విడుదలయ్యారు. ఇద్దరూ చైనా సరిహద్దుల నుంచి జరుగుతున్న వ్యభిచార కార్యకలాపాలపై ఒక ప్రత్యేక కథనాన్ని రూపొందిస్తూ నిర్బంధానికి గురయ్యారు. చైనా నుంచి తమ దేశంలోకి చట్టవిరుద్ధంగా ప్రవేశించారన్న ఆరోపణపై వారికి ఉత్తర కొరియా పన్నెండేళ్ల కఠిన శ్రమతో కూడిన జైలు శిక్ష విధించింది. వారిద్దరినీ మానవతా దృష్టితో ప్రత్యేక క్షమాభిక్ష ప్రసాదించామని ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్‌జోంగ్ కోరారు.

## సూకీకి మళ్లీ నిర్బంధం

ప్రజాస్వామ్య నేత ఆంగ్‌సాన్ సూకీకి మయన్మార్ సైనిక ప్రభుత్వం మరో 18 నెలల పాటు నిర్బంధం విధించింది. గృహ నిర్బంధ నియమావళిని ఉల్లంఘించి ఒక అమెరికన్‌ను ఇంటిలోకి అనుమతించారంటూ ఆమెపై మోపిన అభియోగాన్ని న్యాయస్థానం నిర్ధారించి మూడేళ్ల జైలు శిక్ష విధించింది. దాన్ని సైనిక జుంటా ప్రభుత్వం 18 నెలల గృహనిర్బంధంగా తగ్గించింది. సూకీపై మయన్మార్ న్యాయస్థానం వెలువరించిన తీర్పుపై ప్రపంచవ్యాప్తంగా ప్రముఖులు నిరసన తెలిపారు. సూకీని వెంటనే గృహ నిర్బంధం నుంచి విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## సెలవు పెడితే కొలువు కట్!

ఆర్థిక మాంద్యం దెబ్బ ఉద్యోగుల సెలవులపైనా పడింది. ఎక్కువ సెలవులు పెడితే ఎక్కడ కొలువు ఊడిపోతుందో అనే భయంతో బ్రిటన్‌లో ఉద్యోగులు సాధ్యమైనంత మేరకు తమ సెలవులను తగ్గించేసుకుంటున్నారు. ఈ విషయం చార్టెడ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పర్సనల్ అండ్ డెవలప్‌మెంట్ అనే సంస్థ అధ్యయనంలో వెల్లడయింది. 2007లో ఏడాదికి ఎనిమిది రోజులుగా ఉన్న ఉద్యోగుల సగటు సెలవుల సంఖ్య గత ఏడాది 7.4 కు పడిపోయిందని ఆ అధ్యయనంలో తేలింది. 19 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్న సంస్థలకు చెందిన 642 మంది యజమానుల నుంచి సేకరించిన ఉద్యోగాలు సెలవుల వివరాలను విశ్లేషించి ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. వీ

# అసహజ మరణాల సూచి


సంకలనం : రాంకి, వై. రామచంద్రం

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్థాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషులకోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

**(21 జూలై 2009 నుండి 20 ఆగస్ట్ 2009 వరకు అసహజ మరణాల పాలైన వారి సంఖ్య – 1967)**

| జిల్లా | ఆత్మహత్యలు | | | హత్యలు | | | | గుర్తు తెలియని | ఆకలి | ప్రమాదాలు | | | చికిత్స అందక, అనారోగ్యం | పోలీసు కాల్పుల్లో | | పోలీసులు, సైన్యం | మిస్సింగ్/ లాకప్ మరణాలు | ప్రకృతి వైపరీత్యాలు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | వ్యవసాయ రంగం | చేనేత రంగం | ఇతరాలు | ఫ్యాక్షన్ | కులం | మతం | తగాదాలు | | | పనిచేసే స్థలంలో | రహదారి | ఇతరాలు | | ఉద్యమ కారులు | ఇతరులు | | | |
| (1) | (2) | (3) | (4) | (5) | (6) | (7) | (8) | (9) | (10) | (11) | (12) | (13) | (14) | (15) | (16) | (17) | (18) | (19) |
| ఆదిలాబాద్ | 24 | – | 44 | – | – | – | 4 | 11 | – | 2 | 17 | 28 | 33 | – | – | – | 4 | – |
| హైదరాబాద్ | – | – | 24 | – | – | – | 14 | 11 | – | – | 42 | 27 | 3 | – | – | – | 15 | – |
| కరీంనగర్ | 11 | 2 | 64 | – | – | – | 6 | 16 | 2 | 7 | 34 | 35 | 35 | – | – | – | 8 | – |
| ఖమ్మం | 6 | – | 30 | – | – | – | 8 | 11 | – | – | 33 | 23 | 39 | – | 1 | – | – | – |
| మెదక్ | 3 | – | 24 | – | – | – | 3 | 5 | – | 4 | 34 | 27 | 17 | – | – | – | – | 4 |
| నిజామాబాద్ | – | – | 27 | – | – | – | – | – | – | 7 | 15 | 18 | 18 | – | – | – | – | – |
| రంగారెడ్డి | 12 | – | 25 | – | – | – | 9 | 7 | – | 3 | 33 | 25 | 23 | – | – | – | 9 | – |
| వరంగల్ | 7 | 1 | 56 | – | – | – | 5 | 16 | 2 | – | 28 | 26 | 20 | – | – | – | – | 3 |
| అనంతపురం | వివరాలు అందలేదు | | | | | | | | | | | | | | | | | |
| చిత్తూరు | 2 | – | 15 | – | – | – | – | – | – | 13 | 21 | 9 | 15 | – | – | – | – | – |
| కడప | 8 | 2 | 7 | – | – | – | 4 | 5 | – | 4 | 11 | 8 | 5 | – | – | – | – | 3 |
| కర్నూలు | 13 | – | 49 | – | – | – | 5 | 21 | – | 4 | 49 | 49 | 24 | – | – | – | – | – |
| తూర్పు గోదావరి | వివరాలు అందలేదు | | | | | | | | | | | | | | | | | |
| గుంటూరు | – | – | 22 | – | – | – | 15 | 10 | – | 8 | 35 | 19 | 8 | – | – | – | 4 | – |
| కృష్ణా | 2 | – | 18 | – | – | – | 14 | 2 | – | 2 | 14 | 17 | 2 | – | – | – | – | 2 |
| ప్రకాశం | – | – | 8 | – | – | – | 3 | 3 | – | 7 | 18 | 16 | 4 | – | – | – | – | – |
| శ్రీకాకుళం | – | – | 8 | – | – | – | 7 | 2 | – | 1 | 12 | 7 | 16 | – | – | – | – | – |
| విశాఖపట్నం | – | – | 12 | – | – | – | – | 5 | – | 6 | 18 | 10 | 3 | – | – | – | 1 | 3 |
| విజయనగరం | – | – | 20 | – | – | – | 2 | 2 | – | 8 | 11 | 16 | 5 | 3 | – | – | – | – |
| **మొత్తం** | **88** | **5** | **453** | **–** | **–** | **–** | **99** | **127** | **4** | **76** | **425** | **360** | **270** | **3** | **1** | **–** | **41** | **15** |

అందిస్తున్నవారు : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; హైదరాబాద్ – డి. విజయభాస్కర్; కరీంనగర్ – ఎల్. సంతోష్; ఖమ్మం – సి.ఎచ్. కృష్ణ; మెదక్ – ఎన్. భగవాన్‌రెడ్డి; నిజామాబాద్ – ఎం. నర్సయ్య; రంగారెడ్డి – శంకరయ్య, వరంగల్ – ఎ.కుమార్; అనంతపురం – ఎం. ఆదిశేషయ్య; చిత్తూరు – పలమనేరు బాలాజీ; కడప – బి. దస్తగిరి; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; తూర్పు గోదావరి – మహమ్మద్ ఇబ్రహీమ్ సాహెబ్; గుంటూరు – బి. అంజమ్మ ; కృష్ణా – బి. రమేష్‌బాబు; ప్రకాశం – కె. మల్లికార్జున్; శ్రీకాకుళం – జి. సుధీర్; విశాఖపట్నం – కె.వి. రమణ; విజయనగరం – డి. సుధాకర్





వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగం,
ఆర్థిక వ్యవహారాలు, ఉపాధి, పాలన,
ప్రాంతీయ అసమానతలు, ప్రజా ఉద్యమాలు,
తదితర అంశాలపై

**వి. హనుమంతరావు**

వ్యాసాల సంకలనం

## మీరు - నేను - ఆర్థికం

**రు. 60**




110 ఏళ్లలో 14 దేశాలపై
అమెరికా దురాక్రమణల చరిత్ర

**స్టీఫెన్ కింజర్**

రచన 'ఓవర్ త్రో' కు

**కొణతం దిలీప్**

తెలుగు అనువాదం

## కుట్రాజకీయం

అమెరికా దుర్మార్గాల శతాబ్ది

**రు. 40**

ప్రతులకు, వివరాలకు:

## వీక్షణం

మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3 హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495,
ఇమెయిల్ : veekshanam2003@gmail.com, reachcdrc@yahoo.com
సర్క్యులేషన్ మేనేజర్ : 9949391028

• RNI Regn.No.APTEL/2003/11482• Published on 29/8/2009 • Postal Regn. No. LII/RNP/HD/1100/2008-10

# ఆశలు సజీవం...
# లక్ష్య సాధనలో మన ప్రభుత్వం

అభివృద్ధి పయనానికి ఇక ఏ అంతరాయమూ లేదు. గత ఐదేళ్ళుగా శరవేగంతో సాగిన ఈ పయనం మరో ఐదేళ్ళపాటు మరింత వేగంగా కొనసాగబోతోంది. తమ ఉజ్వల భవితకు బాటలు వేయగలదని ఏ ప్రభుత్వాన్ని ప్రజలు విశ్వసించారో ఆ ప్రభుత్వపాలనే రాష్ట్రాన్ని అన్నింటా అగ్రస్థానంలో నిలిపే కృషికి పునరంకితమయింది. అందరికీ సంక్షేమ వెలుగులు పంచుతూ వచ్చిన పథకాలన్నీ ఇక అప్రతిహతంగా, చిట్టచివరి లబ్ధిదారుని దశమార్చే వరకూ నిరాటంకంగా అమలవుతాయి. ప్రజల ఆశలు సజీవం... లక్ష్యసాధన దిశగా మన ప్రభుత్వ పయనమిక నిరంతరం. ఇప్పటిదాకా సమాజంలోని అన్నివర్గాలకూ ప్రయోజనం చేకూరుస్తూ, అందరి ప్రశంసలను అందుకుంటూ ప్రభుత్వ విజయానికి కారణమైన పథకాలు.. ఇక ముందు కూడా అదే ప్రయోజనంతో దిగ్విజయంగా కొనసాగనున్న పథకాలు ఇవే...



## రైతులకు ఉచిత విద్యుత్

- ఉచితవిద్యుత్ సరఫరా సమయం
  రోజుకు 7 గంటల నుండి 9 గంటలకు పెంపు-ఖరీఫ్ నుండి అమలు
- ఏటా రూ.1,536 కోట్ల అదనపు వ్యయం
- వ్యవసాయానికి ఏటా 2,200 కోట్ల
  యూనిట్ల ఉచిత విద్యుత్



## జలయజ్ఞం

- కోటి ఇరవై లక్షల ఎకరాలకు సాగునీరు లక్ష్యం
- నేటికి 19లక్షల ఎకరాలకు సాగునీరు లక్ష్యం పూర్తి
- చేపట్టిన 88 ప్రాజెక్టులలో 12 పూర్తి
  13 ప్రాజెక్టులు పాక్షికంగా పూర్తి, నీటివిడుదల
- రానున్న ఐదేళ్ళలో 59 ప్రాజెక్టుల పూర్తి లక్ష్యం
- ఆరు ప్రాజెక్టుల జాతీయ హోదాకు ప్రయత్నం



## రాజీవ్ ఆరోగ్య శ్రీ

- తెల్లకార్డే అర్హత - 942 వ్యాధులకు వర్తింపు
- ఇప్పటి వరకు 17,89,075 మందికి వైద్యపరీక్షలు,
  3,00,015 మందికి శస్త్ర చికిత్సలు
- గత ఆర్థిక సంవత్సరంలో రూ.689.05 కోట్ల వ్యయం
- 196 కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్సలు





## అభయహస్తం
## (ఐ.కె.పి. జీవిత బీమా పథకం)

- రూ.500ల నుండి రూ.2,200ల వరకు
  నెలవారీ పింఛను
- కోటి 25 లక్షల మహిళలకు ప్రయోజనం
- కోటి మందికి నవంబరు 1వ తేది నుండి
  బీమా బాండ్ల పంపిణీ



## ఇందిరమ్మ ఇళ్ళు

- మొదటి విడత 19,74,749,
- రెండవ విడత 25,71,000 ఇళ్ళ నిర్మాణం పూర్తి
- మూడవ విడత 25 లక్షల ఇళ్ళ నిర్మాణం లక్ష్యం
- మొత్తం 80 లక్షల ఇళ్ళ నిర్మాణం లక్ష్యం



## కిలో రెండురూపాయల బియ్యం

- బియ్యంకోటా 20 నుంచి
  30 కిలోలకు పెంపు- అక్టోబర్ నుంచి అమలు
- 2 కోట్ల కుటుంబాలకు లబ్ధి
- నెలకు 3.92 లక్షల టన్నుల బియ్యం పంపిణీ
- ఏటా రూ.5,400 కోట్ల సబ్సిడీ



## పావలావడ్డీ

- ఇప్పటిదాకా 7.30 లక్షల మహిళా సంఘాలకు
  13వేల కోట్ల రూపాయల రుణాలు
- 90 లక్షల సభ్యులకు లబ్ధి
- రాష్ట్రంలోని ప్రతి మహిళనూ లక్షాధికారిని
  చేయడం లక్ష్యం



## ఇందిరమ్మ పింఛన్లు

- రాష్ట్రవ్యాప్తంగా 71,80,000 మందికి
  పింఛన్లు
- ఈ ఆర్థిక సంవత్సరం రూ.2004 కోట్ల
  కేటాయింపు



## గ్రామీణ ఉపాధి హామీ

- రోజు కూలీ రూ. 80ల నుండి
  రూ.100లకు పెంపు
- ఇప్పటివరకూ రూ.5595.99 కోట్ల
  వేతన చెల్లింపులు
- 131.08 లక్షల మందికి ప్రయోజనం

జారీ చేసినవారు: సమాచార, పౌర సంబంధాల శాఖ

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Charitha Impressions, 1-9-1126/B, Azamabad, Hyderabad - 500 020 and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao